గురువారం 27-4-2023



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 222

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




కోల్‌కతా గెలుపు బాట..

బెంగళూరుపై 21 పరుగుల తేడాతో విజయం.. మెరిసిన రాయ్ - 12లో



మారుతీ లాభం జూమ్

క్యూ4లో రూ.2,671 కోట్లు.. 42 శాతం హైజంప్ - 13లో



భారత సంతతి వ్యక్తికి ఉరి

డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో సింగపూర్‌లో భారత సంతతికి చెందిన తంగరాజు సుప్పయ్య(46)కు ఉరిశిక్ష అమలు చేశారు.

వివరాలు 6లో ►



మళ్లీ ఢిల్లీ మేయర్‌గా ఆప్ నేత షెల్లీ

బీజేపీ అభ్యర్థి శిఖా రాయ్ నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో ఆప్ నేత షెల్లీ ఒబెరాయ్ మళ్లీ మేయర్‌గా ఎంపికయ్యారు.

వివరాలు 6లో ►



పార్లమెంటుకు వదిలేయండి

స్వలింగ వివాహాల అంశాన్ని పార్లమెంటుకు వదిలేసే విషయాన్ని పరిశీలించాలని కేంద్రం సుప్రీంకోర్టును కోరింది.

వివరాలు 6లో ►



మా 'మన్‌కీ బాత్' వినండి

తమకు న్యాయం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని భారత రెజ్లర్లు కోరారు. రోడ్డుపైనే ప్రాక్టీసు చేసి నిరసన తెలిపారు.

వివరాలు 12లో ►



అనంతపురం జిల్లా నార్పలలో జరిగిన సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



చదువే దివ్యాస్త్రం

అనంతపురం జిల్లా నార్పల సభలో సీఎం జగన్

- మన చదువులు మంచి ఉద్యోగాలే కాదు.. లీడర్లుగానూ తీర్చిదిద్దాలి
- ప్రతి విద్యార్థీ సత్య నాదెళ్ల మాదిరిగా ఎదగాలన్నదే నా తపన
- పేద పిల్లలు పెద్ద చదువులు చదివేలా అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నాం.. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలతో ప్రైవేట్ స్కూళ్లు పోటీ పడాల్సిన పరిస్థితి తెచ్చాం
- కాలేజీ డ్రాపౌట్స్ గణనీయంగా తగ్గిపోయాయి
- విద్యా దీవెన ఒక్కటే సరిపోదని వసతి దీవెన కూడా ఇస్తున్నాం
- రూ.912.71 కోట్లు జగనన్న వసతి దీవెన నిధులను తల్లుల ఖాతాల్లోకి జమ చేసిన సీఎం వైఎస్ జగన్

2లో

ముసలి పులి.. మాయమాటలు

'ఓ అడవిలో క్రమం తప్పకుండా నరమాంసం తినే పులి ఉండేది. అది ముసలిది కావడంతో వేటాడే శక్తి పోయింది. దీంతో ఉన్న చోటే కూర్చుని నాలుగు నక్కలను తోడేసుకుంది. బంగారు కడియం ఆశచూపి మడుగులోకి మనుషులను దింపి చంపి తినేది. దీంతో ఎవరూ నమ్మకపోవడంతో ఈ అడవిలో సీనియర్ మోస్ట్ పులిని, నేను 40 ఏళ్ల ఇండస్ట్రీ అని మాయమాటలు చెప్పేది. గతంలో నరమాంసం తినేవాడ్ని.. ఇప్పుడు తినదలుచుకోలేదు.. మంచివాడిని అయిపోయా.. మంచి కార్యక్రమాలు చేస్తున్నానంటూ నమ్మించేది. పులి ముసలిది అయిపోయింది కదా అని నమ్మి బంగారు కడియాల కోసం మడుగులోకి వెళ్తే బురదలో కూరుకుపోయిన వారిని చంపి తినేసేది. పులి–బంగారు కడియం ఈ కథ వింటే మోసపూరిత వాగ్దానాలు, కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పే ఓ ముసలాయన గుర్తొస్తారు. ఆయన ఎవరో కాదు.. నారా చంద్రబాబు నాయుడు' అని సీఎం జగన్ పేర్కొన్నారు. వంచకులను, వెన్నుపోటు పొడిచే వారిని, మాయమాటలు చెప్పేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకూడదన్నదే ఈ కథలో నీతి అని చెప్పారు.

నరహంతక ముసలిపులి.. నమ్మితే అంతే 2లో



ఇక ఎండలు మండవు

- వారం రోజులు ఓ మోస్తరు వర్షాలు.. ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదయ్యే అవకాశం
- అల్పపీడన ద్రోణులు, పశ్చిమ గాలుల ప్రభావం
- మే రెండోవారంలో అండమాన్‌లో అల్పపీడనం ఏర్పడే అవకాశం

సాక్షి, అమరావతి/కర్నూలు (అగ్రికల్చర్): గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ వేసవిలో వాతావరణం అనూహ్యంగా మారిపోయింది. తీవ్రమైన ఎండలు తగ్గిపోయి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రాష్ట్రవ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. మే మొదటి వారం వరకు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. అప్పటివరకు మోస్తరు వర్షాలతోపాటు అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని చెబుతున్నారు. ఉపరితల ఆవర్తనాలు ఏర్పడడం, ఆగ్నేయ/నైరుతి గాలుల వల్ల వాతావరణంలో మార్పులు జరిగి వర్షాలు కురుస్తున్నాయి. గత మూడేళ్లుగా

మిగతా 3వ పేజీలో ►

న్యూస్‌రీల్

సత్వరమే కొత్త వ్యవసాయ కనెక్షన్లు



'ఈనాడు' మరోసారి కట్టుకథ అల్లింది. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా విద్యుత్ పంపిణీ సంస్థలు రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై పరిమితిని ఎత్తివేసింది. ఈ నిజాన్ని దాచి పెట్టి 'కొత్త కనెక్షన్లు గగనమే' అంటూ తప్పుడు వార్తను ప్రచురించింది.

వివరాలు 14లో ►

సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు



రాష్ట్రంలోని పలు తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గుంటూరు జిల్లా మేడికొండూరు తహసీల్దార్ కారులో అనధికారికంగా ఉన్న రూ.లక్షకు పైగా నగదును, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.

వివరాలు 5లో ►

వైఎస్సార్‌సీపీ హయాంలో బీసీలకు పెద్దపీట



రాష్ట్రంలో బీసీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వారి సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. పార్లమెంట్‌లో మొదటిసారి బీసీ బిల్లు పెట్టిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు.

వివరాలు 14లో ►

అడ్డంకులున్నా ముందడుగే..

దేశంలో వేర్వేరు భాషలు, యాసలు, కళలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ వైవిధ్యం మన మధ్య అనుబంధాన్ని, సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందని హర్షం వ్యక్తం చేశారు. - 6లో

ఇంతంజోక్



ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

ఓవరాల్‌గా ఫస్టియర్‌లో 61%

- సెకండ్ ఇయర్‌లో 72% ఉత్తీర్ణత
- ప్రథమ స్థానంలో కృష్ణా జిల్లా
- ఫలితాలను ప్రకటించిన మంత్రి బొత్స సత్యనారాయణ
- 24 నుంచి జూన్ 1 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు



విజయవాడలో ఇంటర్ పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న మంత్రి బొత్స, అధికారులు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. ఫస్టియర్‌లో 65 శాతం, సెకండియర్‌లో 75 శాతం ఉత్తీర్ణతతో ప్రభంజనం సృష్టించారు. ఇక బాలురు ఫస్టియర్‌లో 58 శాతం , సెకండియర్‌లో 68 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈ మేరకు ఇంటర్ ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం విజయవాడలో విడుదల చేశారు. ఈ ఏడాది మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 8,13,033 మంది విద్యార్థులు హాజరుకాగా 5,38,327 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో ద్వితీయ సంవత్సర విద్యార్థులు 3,79,758 మంది పరీక్షలు రాయగా 72 శాతం (2,72,001) మంది ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా మొదటి సంవత్సరం 4,33,275 మంది పరీక్షలకు హాజరవగా 61 శాతం (2,66,3266) మంది ఉత్తీర్ణులయ్యారు. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత పెరిగింది. 2022లో ఫస్టియర్‌లో 54 శాతం, సెకండియర్‌లో 61 శాతం ఉత్తీర్ణత నమోదైన సంగతి తెలిసిందే. ఈ లెక్కన ఈ ఏడాది ఫస్టియర్‌లో ఏడు శాతం, సెకండియర్‌లో 11 శాతం ఉత్తీర్ణత పెరిగింది. ఈ నెల 1 నుంచి 18 వరకు పరీక్ష పత్రాల మూల్యాంకనం చేపట్టి కేవలం 8 రోజుల రికార్డు సమయంలోనే

మిగతా 2వ పేజీలో ►


6 వరకు రీకౌంటింగ్‌కు అవకాశం

ఇంటర్ ఫలితాలకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఇంటర్ బోర్డుకు తెలియజేయాలని మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు. ఏప్రిల్ 27 నుంచి మే 6 వరకు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మే 24 నుంచి జూన్ 1 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు త్వరలో విడుదల చేస్తుందని తెలిపారు. అదే విధంగా జూన్ 5 నుంచి జూన్ 9 వరకు సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

కామాంధుడికి కఠిన శిక్ష

టీడీపీ నేత వినోద్‌జైన్‌కు జీవిత ఖైదు విధించిన పోక్సో కోర్టు

- 13 ఏళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించి.. ఆమె ఆత్మహత్యకు కారణమైన వినోద్‌జైన్
- వినోద్ జైన్ వేధింపులను సూసైడ్ నోట్‌లో రాసి ఐదంతస్తుల భవనం నుంచి దూకిన బాలిక
- 15 నెలల్లోనే తీర్పు వెలువరించిన విజయవాడ పోక్సో కోర్టు



వినోద్ జైన్

విజయవాడ స్పోర్ట్స్: బాలికను లైంగికంగా వేధించి.. ఆమె ఆత్మహత్యకు కారణమైన టీడీపీ నాయకుడు వినోద్‌జైన్(58)కు జీవిత ఖైదు విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి డాక్టర్ ఎస్.రజని తీర్పు చెప్పారు. విజయవాడ భవానీ పురంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో తల్లిదండ్రులు, సోదరుడితో కలిసి ఉంటున్న 13 ఏళ్ల బాలిక అదే ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అదే అపార్ట్‌మెంట్‌లో నాలుగో ఫ్లోర్‌లో ఉండే వినోద్‌జైన్ లైంగిక వేధింపులను తాళలేక ఆ బాలిక 2022 జనవరి 29వ తేదీ ఐదంతస్తుల అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్మకు పాల్పడింది. కేసు విచారణ చేపట్టిన భవానీపురం పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి బాలిక మృతికి కారణమైన

మిగతా 10వ పేజీలో ►

రక్తసిక్తమైన రెడ్ కారిడార్ 11 మంది మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో ఘాతుకం

భద్రతా దళాల బస్సును పేల్చేసిన మావోయిస్టులు

ఐఈడీ పేలుడు తీవ్రతకు తునాతునకలైన వాహనం

మృత్యువాతపడిన 10 మంది పోలీసులు, మరో డ్రైవర్



పేలుడు ధాటికి ఘటనా స్థలిలో రహదారిపై ఏర్పడిన భారీ గుంత

నడి వేసవిలో రెడ్ కారిడార్ రక్తసిక్తమైంది. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో మావోయిస్టుల బాంబు దాడిలో 11 మంది మరణించారు. మృతుల్లో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) దళానికి చెందిన 10 మంది పోలీసులు, ఒక డ్రైవరు ఉన్నారు. రాజధాని రాయ్‌పూర్‌కు 450 కిలోమీటర్ల దూరంలో దంతెవాడ జిల్లా అరన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం ఈ ఘాతుకం చోటుచేసుకుంది. రాష్ట్రంలో గత రెండేళ్లలో ఇదే అతిపెద్ద దాడి కావడం గమనార్హం.

- వివరాలు 6లో

రామోజీ డబుల్ రోల్

- హెచ్‌యూఎఫ్ కర్తగా మార్గదర్శి డిపాజిట్ల స్వీకరణ
- ప్రొప్రయిటర్‌గా డిపాజిట్‌దారులకు చెల్లింపులు
- రామోజీరావు రెండు పాత్రలనూ బట్టబయలు చేసిన ఉండవల్లి
- అదనపు డాక్యుమెంట్‌లో సుప్రీంకోర్టుకు వివరాలు
- మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ది పూర్తిగా చట్ట విరుద్ధ వ్యాపారం
- ఆర్‌బీఐలో, ఏపీ ప్రభుత్వంలో, దేశంలో ఎక్కడా రిజిస్టర్ కాలేదు
- డిపాజిట్లు స్వీకరించకుండా 1997 నుంచి నిషేధం కూడా ఉంది
- దానిని ఉల్లంఘించి డిపాజిట్లు స్వీకరించారు.. ఇందుకు రెండేళ్ల వరకు జైలు శిక్షకు అర్హులు
- రామోజీ అక్రమాలను కోర్టుకు వివరించిన మాజీ ఎంపీ
- తన తల్లి డిపాజిట్, చెల్లింపు పత్రాలు కూడా కోర్టుకు సమర్పణ



సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి ఫైనాన్షియర్స్ అధినేత రామోజీరావు ద్విపాత్రాభినయాన్ని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. డిపాజిట్‌దారుల నుంచి సేకరించిన మొత్తాన్ని వేర్వేరు సంస్థలకు మళ్లించే క్రమంలో రామోజీ పోషించిన కీలక పాత్రను బహిర్గతం చేశారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో మాజీ ఎంపీ ఉండవల్లి సుప్రీం కోర్టులో తాజాగా అదనపు డాక్యుమెంట్‌ను దాఖలు చేశారు. డిపాజిట్లు స్వీకరించే క్రమంలో కర్త ఆఫ్ హెచ్‌యూఎఫ్ కర్తగా, చెల్లించే సమయంలో మార్గదర్శి ఫైనాన్షియర్స్ ప్రొప్రయిటర్‌గా సంతకాలు చేసిన పత్రాలను కోర్టుకు సమర్పించారు. గత విచారణ సమయంలో న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేబీ పార్దీవాలాలతో కూడిన ధర్మాసనం.. ఒక చోట హెచ్‌యూఎఫ్‌గా, మరో చోట ప్రొప్రయిటర్‌గా క్లెయిమ్ చేసుకున్నారేమిటి అని

మిగతా 3వ పేజీలో ►

మార్గదర్శి అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధం

టీడీపీ నేత జీవీ రెడ్డి సవాల్‌పై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



- రామోజీ ఫిలింసిటీలో రామోజీరావు సమక్షంలో చర్చ జరగాలి
- లేదంటే తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలోనైనా చర్చ నిర్వహించాలి
- అప్పుడే ఆ చర్చకు జాతీయ స్థాయిలో విలువ పెరుగుతుంది
- టీడీపీ ముసుగు తొలిగింది.. జనసేన పార్టీ కూడా మార్గదర్శికే మద్దతిస్తోంది

- వివరాలు 3లో

చదువే దివ్యాస్త్రం

అనంతపురం జిల్లా నార్పల సభలో సీఎం జగన్



జగనన్న వసతి దీవెన చెక్కును విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'మనం చదువుకునేది ఉద్యోగం కోసం మాత్రమే కాదు.. ప్రపంచంతో పోటీపడే అత్యుత్తమ చదువులే మన లక్ష్యం. విద్య ఒక కుటుంబం స్థితిగతులను, సామాజిక అసమానతలను రూపుమాపుతుంది. పేదరికం సంకెళ్లను తెంచాలంటే చదువే పెద్ద అస్త్రం. అందుకే అధికారంలోకి వచ్చాక విద్యా విధానంలో సమూల సంస్కరణలకు శ్రీకారం చుట్టాం. మన చదువులు బతకడానికి మాత్రమే కాదు.. లీడర్లుగా ఎదగడానికి కూడా ఉపయోగపడాలి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో గత నాలుగేళ్లలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని, పేదలెవరూ పెద్ద చదువులకు దూరం కాకూడదని పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు విద్యార్థులు ఉండటానికి, తినటానికి అవసరమయ్యే వసతి ఖర్చులకు కూడా డబ్బులు చెల్లిస్తున్నామని తెలిపారు. ఐటీఐ నుంచి ఇంజనీరింగ్ చదివే ప్రతి ఒక్కరికీ ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. బుధవారం అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం నార్పలలో 'జగనన్న వసతి దీవెన' కింద రూ.912.71 కోట్లను తల్లుల ఖాతాల్లోకి జమ చేసిన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడారు. ఆ వివరాలు ఇవీ..

నాలుగేళ్లలో రూ.14,223.60 కోట్లు

ఈరోజు విడుదల చేస్తున్న జగనన్న వసతి దీవెన నిధులతో రాష్ట్రవ్యాప్తంగా 9,55,662 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతోంది. 8,61,138 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.912.71 కోట్లు బటన్ నొక్కి జమ చేస్తున్నాం. మన పిల్లలు గొప్ప గొప్ప చదువులు చదివేందుకు ఎక్కడా అడ్డంకులు రాకూడదనే విద్యాదీవెనతో పాటు వసతి దీవెన నిధులు ఇస్తున్నాం. ఇప్పటివరకూ జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన కింద నాలుగేళ్లలో రూ.14,223.60 కోట్లు అందచేశాం.

సత్య నాదెళ్ల స్థాయికి అందరూ ఎదగాలి

మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల గురించి మనమంతా చెప్పుకుంటున్నాం. కానీ ఆయన ఒక్కరే కాకుండా రాష్ట్రంలో ప్రభుత్వ అండతో చదువుకునే ప్రతి విద్యార్థీ ఆ స్థాయికి వెళ్లాలన్నదే నా తపన. భవిష్యత్తు తరాలకు మేలు జరగాలని పిల్లలను చక్కగా చదివించే బాధ్యతను ఈ ప్రభుత్వం తీసుకుంది. మనమంతా గత ప్రభుత్వాలను చూశాం. అరకొర ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చేది. భోజన వసతి లేక పేద పిల్లలు ఎంతో ఇబ్బంది పడేవారు. గత పాలకులు 2017–18, 2018–19కి సంబంధించి రూ.1,778 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టి వెళ్లిపోయారు. ఇప్పుడు మనం ప్రతి మూడు నెలలకు ఒకసారి నిధులు విడుదల చేస్తూ ఎలాంటి అవినీతికి తావులేకుండా నేరుగా తల్లుల ఖాతాల్లోనే జమ చేస్తున్నాం. ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యార్థులకు రూ.20 వేలు చొప్పున వసతి దీవెన కింద ఇస్తున్నాం.

రెట్టింపు దాటిన జీఈఆర్

గతంలో ఇంటర్ పూర్తయ్యాక చాలామంది విద్యార్థులు కాలేజీలకు వెళ్లలేకపోయేవారు. ఇప్పుడు అలాంటి డ్రాపౌట్స్ తగ్గిపోయాయి. జీఈఆర్ (స్థూల చేరికల నిష్పత్తి) గతంలో 32.4 శాతం ఉండగా ఈ ప్రభుత్వం వచ్చాక 70 నుంచి 80 శాతానికి పెంచేలా చర్యలు తీసుకున్నాం. ప్రైవేట్ స్కూళ్లతో ప్రభుత్వ స్కూళ్లు పోటీ పడటం కాకుండా ప్రభుత్వ పాఠశాలలతో ప్రైవేట్ స్కూళ్లే పోటీ పడాల్సిన స్థాయికి తెచ్చాం. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చాం. 6వ తరగతి నుంచి 30,230 క్లాస్ రూమ్స్‌లో డిజిటల్ బోధన తెచ్చాం. సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్ ప్రవేశపెట్టాం. 2018–19 నాటికి ప్రభుత్వ స్కూళ్లలో 37 లక్షల మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది 40 లక్షల మందికి పెరిగారు. వారికి వాళ్ల అన్న ఉన్నాడనే నమ్మకంతోనే ప్రభుత్వ స్కూళ్లలో చేరుతున్నారు. గతంలో 87 వేల మంది ఇంజనీరింగ్ చదువుతుంటే ఈ ప్రభుత్వం వచ్చాక రూ.1.20 లక్షల మంది ఇంజనీరింగ్ చదువుతున్నారు.


మా నమ్మకం నువ్వే జగనన్నా.. అంటూ యువత ఉత్సాహం


సభాప్రాంగణం నిండిపోవడంతో బయటే నుంచుని సీఎం ప్రసంగాన్ని ఆలకిస్తున్న జన సందోహం



'ఉన్నత' మార్పులతో ఉత్తమ ఉద్యోగాలు

అధికారంలోకి రాగానే ఉద్యోగాలకు అనుకూలంగా ఉన్నతవిద్య కరిక్యులమ్‌లో మార్పులు తీసుకొచ్చాం. 30 శాతం స్కిల్, జాబ్ ఓరియెంటెడ్‌గా మార్పులు తేవడంతో పాటు 25 మార్కెట్ ఓరియెంటెడ్ కోర్సులు, 67 బిజినెస్ ఒకేషనల్ కోర్సులను కరిక్యులమ్‌లో భాగం చేశాం. దేశంలోనే తొలిసారిగా నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు కూడా ప్రవేశపెట్టాం. పిల్లల నైపుణ్యం పెంపొందించేలా అప్ స్కిల్లింగ్ కార్యక్రమాల కోసం దేశంలో తొలిసారిగా ఆన్‌లైన్ కోర్సులను కరిక్యులమ్‌లో భాగం చేశాం. ఆన్‌లైన్ క్రెడిట్స్ కూడా అందుబాటులోకి తీసుకొస్తూ సంపూర్ణ మార్పులు చేపట్టాం. 1.60 లక్షల మందికి సైబర్ సెక్యూరిటీ, అజూర్ వెబ్ సర్వీసెస్, డైనమిక్ 365 లాంటి కోర్సుల్లో మైక్రోసాఫ్ట్ ద్వారా ఉచితంగా శిక్షణ, సర్టిఫికెట్స్ ఇప్పించి మెరుగైన ఉద్యోగాలు లభించేలా చర్యలు తీసుకున్నాం. మైక్రోసాఫ్ట్ ఒక్కటే కాకుండా అమెజాన్ వెబ్ సర్వీసెస్, సేల్స్‌ఫోర్స్ లాంటి దిగ్గజ సంస్థల సేవలను అనుసంధానం చేశాం. మన విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా మాస్టర్స్ ప్రోగ్రాంపై జర్మనీకి చెందిన యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నాం. బీఎస్సీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌కు సంబంధించి మెల్‌బోర్న్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకుని అడుగులు ముందుకు వేస్తున్నాం.

గత సర్కారు పెత్తందారీ పోకడ

పేద పిల్లలు ఎప్పటికీ పేదలుగానే మిగిలిపోవాలన్న పెత్తందారీ మనస్తత్వం గత ప్రభుత్వానిది. ప్రతి పేదవాడూ పెద్ద చదువులు చదువుకోవాలి.. కుటుంబ పరిస్థితులు మారాలన్నది మన ప్రభుత్వ సంకల్పం. ఆ ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఎంత తేడా ఉందో చూడండి. రెండు ప్రభుత్వాలనూ బేరీజు వేయండి. ఈ ప్రభుత్వం వల్ల మీ ఇంట్లో మంచి జరిగిందంటే మీరే జగనన్నకు సైనికులుగా నిలబడండి. అబద్ధాలు, మోసాలు లాంటివి రానున్న రోజుల్లో మరిన్ని చూస్తారు. అవేమీ నమ్మకండి. నాకు ఉన్న ధైర్యమల్లా దేవుడి దయ, మీ ఆశీస్సులే.

హాజరైన మంత్రులు, ప్రజా ప్రతినిధులు

మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున, ఉషశ్రీ చరణ్ తదితరులతోపాటు అనంతపురం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

విదేశీ విద్యకు ఆర్థిక సాయం..

ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ యూనివర్సిటీల్లో చదివే మన విద్యార్థుల కోసం 'జగనన్న విదేశీ విద్యాదీవెన' పథకాన్ని ప్రవేశపెట్టాం. టాప్ 50 యూనివర్సిటీల్లో సీటొస్తే రూ.1.25 కోట్ల వరకూ ప్రభుత్వమే భరించి వారిని చదివిస్తుంది. ఇప్పటికే 200 మంది విద్యార్థులను జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా విదేశాల్లో చదివిస్తున్నాం. 'నాలెడ్జ్ ఈజ్ పవర్' అన్నది నిజమే కానీ.. 'ఎడ్యుకేషన్ ఈజ్ నాలెడ్జ్' అన్నది సత్యం. మన చదువులు బతకడానికి మాత్రమే కాదు.. లీడర్లుగా ఎదగడానికీ ఉపయోగపడాలి. మనలో ఎదగాలన్న తపన, ఆత్మవిశ్వాసం, సమయస్ఫూర్తి ఉంటే ప్రపంచమే మనచుట్టూ తిరుగుతుంది.

నరహంతక ముసలిపులి
నమ్మితే..అంతే సంగతి


జగనన్న వసతి దీవెన లబ్ధిదారులతో సీఎం వైఎస్ జగన్

అది నరమాంసం రుచి మరిగిన ముసలి పులి

- పంచతంత్రం కథ వింటే ఓ ముసలాయన గుర్తొస్తారు
- వంచకులను, వెన్నుపోటుదారులను నమ్మొద్దని కోరుతున్నా
- నార్పల సభలో చంద్రబాబుపై ధ్వజమెత్తిన సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రతిపక్ష నేత చంద్రబాబు వచ్చీరాని ఇంగ్లీషులో రిపబ్లిక్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూను చూస్తుంటే పంచతంత్ర కథ గుర్తుకొస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'పులి – బంగారు కడియం' కథలోని ముసలి పులి తరహాలోనే చంద్రబాబు తీరు ఉందన్నారు. బుధవారం అనంతపురం జిల్లా నార్పలలో నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు వ్యవహార శైలిని ఎండగడుతూ సీఎం జగన్ పంచతంత్ర నీతి కథను ప్రస్తావించారు.

మళ్లీ టేప్ రికార్డర్ ఆన్.. అవే డైలాగులు

'జాబు రావాలంటే.. బాబు రావాలని లక్షల మంది నిరుద్యోగులను నాడు చంద్రబాబు నట్టేట ముంచాడు. ఇప్పుడు మళ్లీ అదే చెబుతున్నారు. ఈ మనిషికి ఇక ఎప్పుడూ బుద్ధి రాదు. ఒక్కసారి గతాన్ని గుర్తు చేసుకోవాలని ప్రజలను కోరుతున్నా. బ్యాంకుల్లో ఉన్న బంగారం తిరిగి రావాలంటే.. బాబు దరావాలి, పిల్లలకు ఉద్యోగాలు రావాలంటే.. బాబు రావాలని ప్రకటనలు ఇచ్చారు. ప్రతి ఇంటికీ చంద్రబాబు సంతకాలతో లేఖలు పంపారు. ఉద్యోగం రాకుంటే నెలానెలా నిరుద్యోగ భృతి ఇస్తానన్నారు. రైతులకు రూ.87,612 కోట్ల రుణమాఫీ చేస్తానని చెప్పి నట్టేట ముంచారు. రుణమాఫీ సంగతి దేవుడెరుగు.. బ్యాంకుల్లో బంగారాన్ని వేలం వేశారు. రూ.14,200 కోట్ల డ్వాక్రా రుణాలను మాఫీ చేయలేదు సరికదా.. వారికి సున్నావడ్డీ పథకాన్ని కూడా రద్దు చేశాడు. జగన్‌ను తట్టుకోలేమని తెలిసి ఎన్నికలకు రెండు నెలల ముందు రూ.2 వేలకు పింఛన్ పెంచి మూడు లక్షల మందికి ఇచ్చి చేతులు దులుపుకొన్నాడు. ఇదే పెద్ద మనిషి మళ్లీ టేప్ రికార్డర్ ఆన్ చేశాడు. అవే డైలాగులు చెబుతున్నారు'

ఇవన్నీ నాడు ఎందుకు లేవు?

'గతానికి ఇప్పటికీ తేడా చూడమని ప్రజలను కోరుతున్నా. అప్పుడూ, ఇప్పుడూ అదే బడ్జెట్. మారిందల్లా ముఖ్యమంత్రి ఒక్కరే. ఈ ప్రభుత్వం రూ.2.08 లక్షల కోట్లను నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి బటన్ నొక్కి జమ చేసింది. ఒక్క శింగనమల నియోజకవర్గంలోనే రూ.1,400 కోట్లు జమ చేశాం. ఇవన్నీ గత ప్రభుత్వ హయాంలో ఎందుకు జరగలేదని ప్రశ్నిస్తున్నా. చంద్రబాబు, ఆయనతో పాటు ఒక గజదొంగల ముఠా ఉండేది. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడు.. వీరంతా కలసి దోచుకో.. పంచుకో.. తినుకో అన్నట్లు పరిస్థితి ఉండేది. ఇవాళ లంచాలు లేవు. వివక్ష లేదు. ఎవరి చుట్టూ తిరగాల్సిన పనిలేదు. పారదర్శకంగా అర్హులందరికీ మేలు చేస్తున్నాం. జగనన్న ప్రభుత్వం వల్ల మీకు మేలు జరిగిందా, లేదా అన్నది ఒక్కటే కొలమానంగా తీసుకోవాలని ప్రజలను కోరుతున్నా'.

సాంకేతిక లోపంతో మొరాయించిన సీఎం హెలికాప్టర్

రోడ్డు మార్గంలో పుట్టపర్తి వెళ్లిన ముఖ్యమంత్రి


సాంకేతిక లోపంతో నిలిచిపోయిన హెలికాప్టర్

నార్పల: అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రంలో సీఎం హెలికాప్టర్ సాంకేతిక లోపంతో బుధవారం కొద్దిసేపు మొరాయించింది. జగనన్న వసతి దీవెన కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పుట్టపర్తి విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో నార్పలకు వచ్చారు. సభ ముగిసిన తర్వాత తిరిగి వెళ్లేందుకు ముఖ్యమంత్రి హెలిప్యాడ్ వద్దకు మధ్యాహ్నం 1.32 గంటలకు చేరుకున్నారు. అక్కడ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్థానిక నేతలతో 3.15 గంటల వరకు మాట్లాడారు. అనంతరం హెలికాప్టర్ ఎక్కగా.. సాంకేతిక లోపం వల్ల అది పైకి ఎగరలేదు. దీంతో రోడ్డు మార్గంలో పుట్టపర్తి విమానాశ్రయానికి వెళ్లారు. సాంకేతిక లోపాన్ని సరిదిద్దిన తర్వాత హెలికాప్టర్ పుట్టపర్తికి వెళ్లిపోయింది.

మా జగనన్న చదివిస్తున్నారు.. అని గర్వంగా చెబుతా



మాది ధర్మవరం. మా నాన్న టైలరింగ్ చేస్తారు. అమ్మ గృహిణి. చదువుల దీపాలను వెలిగించే యాగానికి మీరు శ్రీకారం చుట్టారు. మీరు వెలిగించే దీపాలు ఏపీ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపబోతున్నాయి. 2021లో ఇంటర్ పూర్తవగానే జేఎన్‌టీయూ అనంతపురంలో ఇంజనీరింగ్ సీటు సాధించా. విద్యాదీవెన ద్వారా ఉచితంగా చదువుకుంటున్నా. మా తల్లిదండ్రులకు భారం కాకుండా వసతిదీవెన ద్వారా హాస్టల్ ఫీజు కూడా చెల్లిస్తున్నారు. ఇప్పుడు నేను గర్వంగా చెబుతున్నా.. మా జగనన్న నన్ను చదివిస్తున్నారని. మా ఇంటికి ఇప్పటివరకు అక్షరాలా రూ.3,06,000 సాయం చేశారు. మా సొంతింటి కల నెరవేరింది.

– దివ్యదీపిక, బీటెక్ సెకండియర్, జేఎన్‌టీయూ అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల

మీరే సీఎంగా ఉండాలని కోరుకుంటున్నాం



మాది తిరుపతి జిల్లా చెన్నూరు. నిరుపేద కుటుంబం. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితుల్లో ఉన్న నేను ఈ రోజు ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నానంటే మీ నవరత్న పథకాలే కారణం. విద్యాదీవెన, వసతిదీవెన లేకపోతే నేను చదువుకు దూరమయ్యేవాడిని. నాలాంటి ఎంతోమంది మీకు రుణపడి ఉంటాం. ప్రతి నెలా మా ఇంట్లో పథకాలు అందుతున్నాయి. మా ఒక్క కుటుంబానికే మీరు రూ.4,59,976 అందజేశారు. మీరే ఎప్పుడూ సీఎంగా ఉండాలని కోరుకుంటున్నాం. నేను ప్రయోజకుడిని అయి పదిమంది విద్యార్థులకు తోడ్పాటు అందిస్తానని ప్రమాణం చేస్తున్నా.

– గోవింద్ చంద్రశేఖర్, బీటెక్ ఫైనలియర్, ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల

లోకేశ్.. శింగనమల చెరువు వద్దకు వెళ్లి సెల్ఫీ చాలెంజ్ ఎందుకు చేయలేదు?

గతంలో శింగనమల నియోజకవర్గంలో కరువు ఉండేది. కానీ ఇప్పుడు జగనన్న ప్రభుత్వంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు నిండాయి. లాభసాటి వ్యవసాయం చూస్తున్నాం. ఇవన్నీ కేవలం నాలుగేళ్ల పాలనలోనే సాధ్యమయ్యాయి. ఒక్క శింగనమల నియోజకవర్గానికే వివిధ పథకాల ద్వారా రూ.1,400 కోట్ల ఆర్థిక ప్రయోజనాలు కల్పించారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.320 కోట్లు కేటాయించారు. ఇటీవల శింగనమలలో లోకేశ్ యువగళం కాదు.. గందరగోళం పాదయాత్ర జరిగింది. మీ బాబు హయాంలో ఒక్కసారైనా శింగనమల చెరువు నిండిందా? ఇప్పుడు నాలుగేళ్లుగా నిండే ఉంది. సెల్ఫీ చాలెంజ్ అంటున్న లోకేశ్.. ఆ చెరువు పక్కన సెల్ఫీ ఎందుకు తీసుకోలేదు?

– జొన్నలగడ్డ పద్మావతి, శింగనమల ఎమ్మెల్యే


సీఎం జగన్‌పై పూలవర్షం కురిపిస్తున్న ప్రజలు

ఏలూరు మెడికల్ కాలేజీకి 150 సీట్లు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాలకు 150 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు అయ్యాయి. నేషనల్ మెడికల్ కమిషన్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తూ 2023–24 విద్యా సంవత్సరం నుంచి ఏలూరు మెడికల్ కళాశాలలో వైద్య విద్య ప్రారంభించాలని సూచించింది. ఏలూరులోని డీఎం హెచ్‌వో ప్రాంగణంలో ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణ పనులు శరవేగంగా సాగి తుదిదశకు చేరుకున్నాయి. ఫిబ్రవరిలో నేషనల్ మెడికల్ కమిషన్‌లోని మెడికల్ అసెస్‌మెంట్ బోర్డు ఏలూరు వైద్య కళాశాల పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది.

రాష్ట్రంలో కొత్తగా 3 నర్సింగ్ కళాశాలలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పిడుగురాళ్ల, మచిలీపట్నం, పాడేరుల్లో కొత్తగా నర్సింగ్ కాలేజీల ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. దేశంలో నర్సింగ్ నిపుణుల సంఖ్యను పెంచేందుకు 157 కొత్త నర్సింగ్ కళాశాలలు నెలకొల్పాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో ఏపీకి మూడు కళాశాలలను కేటాయించింది. ఈ మూడుచోట్ల రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తోంది.

జేఎన్‌టీయూ అనంతపురం పరీక్షలు యథాతథం

ఈనాడు నిరాధార కథనం: రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఎంటెక్, ఎం ఫార్మసీ, ఎమ్మెస్సీ పరీక్షలు వాయిదా పడలేదని, బుధవారం యథాతథంగా నిర్వహించామని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ తెలిపారు. సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో పరీక్షలు వాయిదా వేశారనే ప్రచారం పూర్తిగా నిరాధారమన్నారు. 'ఈనాడు'లో తప్పుడు కథనం ప్రచురించడం దారుణమన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జేఎన్‌టీయూ అనంతపురం నిర్వహించే ఏ పరీక్షనూ బుధవారం రద్దు చేయటం కానీ, వాయిదా వేయడం కానీ చేయలేదన్నారు. అటానమస్ కళాశాలల్లో పరీక్షల సర్దుబాటుకు సంబంధించిన అంశం వర్సిటీ పరిధిలో లేదన్నారు. ఈనాడు కథనంలో ప్రస్తావించినట్లు ఇంజనీరింగ్ నాల్గో సంవత్సరం సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయలేదని చెప్పారు. జేఎన్‌టీయూఏ ప్రతిష్టను కించపరిచేలా ఈనాడు కథనం ఉందన్నారు. ఓ కళాశాలలో జరిగిన అంతర్గత పరీక్షల సర్దుబాటును యూనివర్సిటీకి ఆపాదించడం తగదన్నారు. సీఎం కార్యక్రమానికి హాజరు కావాలని ఏ ఒక్క విద్యార్థినీ బలవంతం చేయలేదని స్పష్టం చేశారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

▶ మొదటి పేజీ తరువాయి

ఫలితాలను ప్రకటించడం విశేషం. కాగా, ఫలితాల కోసం https://examresults. ap.nic.in, www.bie.ap.gov.in చూడొచ్చు.

ఫలితాల్లో ఉమ్మడి కృష్ణా టాప్

ఈ విద్యా సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. పశ్చిమ గోదావరి (ఫస్టియర్) రెండో స్థానం, గుంటూరు (ఫస్టియర్) మూడో స్థానంలో నిలిచాయి. ఇక ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో గుంటూరు రెండో స్థానం, పశ్చిమ గోదావరి మూడో స్థానం దక్కించుకున్నాయి.

ఒకేషనల్‌లోనూ బాలికలదే పైచేయి..

ఇంటర్ ఒకేషనల్ విభాగంలోనూ బాలికలే పైచేయి సాధించారు. బాలికలు ఫస్టియర్‌లో 58 శాతం, సెకండియర్‌లో 73 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇక బాలురు ఫస్టియర్‌లో 37 శాతం, సెకండియర్‌లో 50 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా ఒకేషనల్ విభాగంలో ఫస్టియర్ పరీక్షలకు 36,031 మంది హాజరుకాగా 17,507 మంది (49 శాతం) ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ పరీక్షలకు 31,293 మంది హాజరవగా 19,430 మంది (62 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ ఫలితాల్లో ప్రకాశం జిల్లా 72 శాతంతో ప్రథమస్థానంలో నిలవగా, కర్నూలు 50 శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో ఉంది.

విద్యకు అధిక ప్రాధాన్యం: మంత్రి బొత్స

ఇంటర్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడమే కాకుండా ఫలితాలను సైతం రికార్డు స్థాయిలో వెల్లడించడం పట్ల సంతోషంగా ఉందని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. అందుకే విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తున్నామన్నారు. దీంతో ప్రైవేటు పాఠశాలల్లో కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల సంఖ్య అధికంగా ఉందని తెలిపారు. విద్యపై పెట్టిన ప్రతి పైసా పెట్టుబడితో సమానమని తమ ప్రభుత్వం నమ్ముతోందన్నారు. ఫలితాల వెల్లడి కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, ఇంటర్ విద్య కార్యదర్శి ఎం.వి శేషగిరిబాబు, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్, సర్వశిక్ష ఎస్‌బీడీ శ్రీనివాస్, ఎండీఎం డైరెక్టర్ నిధి మీనన్, పాఠ్యపుస్తకాల ముద్రణా సంస్థ డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, ఇంటర్ బోర్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా ఇంటర్ ఫస్టియర్ ఉత్తీర్ణత శాతం ఇలా..

జిల్లా	మొదటి ఏడాది
కృష్ణా	77
పశ్చిమ గోదావరి	70
గుంటూరు	68
నెల్లూరు	67
విశాఖపట్నం	63
తూర్పు గోదావరి	59
అనంతపురం	57
కర్నూలు	56
చిత్తూరు	56
ప్రకాశం	51
శ్రీకాకుళం	51
విజయనగరం	47
వైఎస్సార్	46

ఇంటర్ సెకండియర్ ఉత్తీర్ణత శాతం ఇలా..

కృష్ణా	83	తూర్పుగోదావరి	69
గుంటూరు	78	అనంతపురం	67
పశ్చిమ గోదావరి	77	కర్నూలు	66
నెల్లూరు	77	శ్రీకాకుళం	64
చిత్తూరు	72	వైఎస్సార్	60
విశాఖపట్నం	70	విజయనగరం	57

పీడీఎఫ్ రూపంలో పాఠ్యపుస్తకాలు

- ఒకటి నుంచి 10వ తరగతి వరకు 371 పాఠ్యపుస్తకాలు
- ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం
- వెబ్‌సైట్‌లో ఆవిష్కరించిన మంత్రి బొత్స సత్యనారాయణ


వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల కొరత లేకుండా చూసేందుకు అన్నివేళలా అందుబాటులో ఉండేలా పీడీఎఫ్ విధానంలో ఆన్‌లైన్‌లో ఉంచుతున్నట్టు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు అన్ని సబ్జెక్టులు కలిపి మొత్తం 371 రకాల పుస్తకాలను ఆన్‌లైన్‌లో ఉచితంగా అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. విజయవాడలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పుస్తకాల వెబ్‌సైట్‌ను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్, పాఠశాలవిద్య కమిషనర్ సురేష్‌కుమార్, పాఠ్యపుస్తకాల ముద్రణసంస్థ డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 353 పుస్తకాలను అందుబాటులో ఉంచామని, కొద్దిరోజుల్లో మరో 18 పుస్తకాలను ఆన్‌లైన్‌లో ఉంచుతామని చెప్పారు. ఈ పాఠ్య పుస్తకాలను విద్యార్థులు వ్యక్తిగతంగానే ఉపయోగించుకోవాలని, వీటిని ముద్రించి, బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 42 లక్షల మందికి ఉచితంగాను, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న సుమారు 28 లక్షల మందికి విక్రయ పద్ధతిన పాఠ్యపుస్తకాలను సమకూరుస్తున్నామని చెప్పారు. ఇకపై ఈ పుస్తకాలన్నీ ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంటాయన్నారు. రాష్ట్ర విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తూ విద్యార్థులను గ్లోబల్ సిటిజన్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా కృషి చేస్తున్నామన్నారు. ఆన్‌లైన్ పుస్తకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

పాఠశాలవిద్య కమిషనర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఆన్‌లైన్ పుస్తకాల ద్వారా బోధనలో డిజిటల్ ప్రక్రియను కొనసాగించడంతో పాటు పుస్తకాల కొరత అనే సమస్య ఉండదని చెప్పారు. ద్విభాషా పాఠ్య పుస్తకాలను రూపొందించి నూతన జాతీయ విద్యావిధాన స్ఫూర్తికి అనుగుణంగా చర్యలు తీసుకున్న రాష్ట్రంగా దేశంలో ఏపీ నిలిచిందని, ఈ ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని చెప్పారు. పాఠ్యపుస్తకాలను https://cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. 195 ద్విభాషా పుస్తకాలు, 176 భాషా పుస్తకాలు రాష్ట్ర ప్రభుత్వం 2020–2021 విద్యాసంవత్సరం నుంచి సెమిస్టర్ విధానంతో ద్విభాషా పద్ధతిలో ఒకటి నుంచి 9 తరగతుల వరకు పాఠ్యపుస్తకాలను అందిస్తోంది. ఇప్పుడు కొత్తగా ఆన్‌లైన్‌లో ఒకటి నుంచి 10 తరగతుల వరకు 371 పుస్తకాలను అందుబాటులోకి తెస్తోంది. వీటిలో 195 ద్విభాషా పుస్తకాలు, 176 భాషా పుస్తకాలు ఉన్నాయి.

వివేకా హత్య విషయంలో చంద్రబాబు అసత్య ప్రచారం

- వివేకా హత్యతో వైఎస్ కుటుంబానికి సంబంధం లేదు
- ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



కడప కార్పొరేషన్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైఎస్ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. బుధవారం కడపలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబు కావాలనే వైఎస్ వివేకా హత్య విషయంలో అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ కుటుంబాన్ని ఇరికించాలని కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఆ హత్య కేసులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంబంధం ఉందని ఎవరైనా మాట్లాడితే నాలుక కోస్తామని హెచ్చరించారు. వైఎస్ వివేకాను చంపితే జగన్‌కు వచ్చే లాభమేంటని ప్రశ్నించారు. వైఎస్ అవినాష్‌రెడ్డి హింసను ప్రేరేపించే వ్యక్తికాదని మనస్ఫూర్తిగా నమ్ముతున్నానన్నారు. హత్య కేసులో నిందితుడిగా చేర్చినంత మాత్రాన నేరం చేసినట్లు కాదని, కోర్టు ఆయన్ను దోషిగా తేల్చితే జిల్లాలోని 10 మంది ఎమ్మెల్యేలం రాజీనామా చేస్తామన్నారు. వివేకా హత్య కేసులో వైఎస్ అవినాష్‌రెడ్డి క్లీన్‌చిట్‌తో బయటికి వస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఎప్పుడు చూసినా బాబాయ్ గొడ్డలి.. అని తప్ప మరోమాట మాట్లాడటం లేదన్నారు. వైఎస్ సునీత రాజకీయాల్లోకి వచ్చేది లేదని.. ప్రొద్దుటూరులో వెలసిన సునీత పోస్టర్లకు తమకు సంబంధం లేదన్నారు.

రాష్ట్రంలో ఇసుక మాఫియా ఎక్కువైంది

సీఎస్ జవహర్ రెడ్డికి చంద్రబాబు లేఖ

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఇసుక మాఫియా ఎక్కువైందని ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కేఎస్ జవహర్ రెడ్డికి బుధవారం లేఖ రాశారు. అక్రమ ఇసుక తవ్వకాలపై పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం పెన్నా నదిలో వైఎస్సార్‌సీపీ నేతలతో ఓ వర్గం అధికారులు కుమ్మక్కై ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అనుమతించిన దానికి మించి జయప్రకాష్ వెంచర్స్ ఇసుక తవ్వకాలు చేస్తోందని, ఇక్కడ అక్రమ తవ్వకాలపై హైకోర్టులో కూడా విచారణ జరిగిందని తెలిపారు. ఇసుక అక్రమాలను అరికట్టడంలో ప్రభుత్వ శాఖలు, అధికారులు విఫలమవుతున్నారన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలను తక్షణమే అరికట్టి, సహజ వనరులను కాపాడాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

మిల్లెట్ల సాగులో ఉత్తరకోస్తా, రాయలసీమ ముందంజ

నీతి ఆయోగ్ నివేదిక వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరకోస్తా, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో గిరిజనుల ద్వారా మిల్లెట్స్ సాగు సమగ్ర పునరుద్ధరణ జరుగుతోందని నీతి ఆయోగ్ తెలిపింది. ఆహారంలో మిల్లెట్లను ప్రోత్సహించేందుకు రాష్ట్రాలు అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులు అనే పేరుతో రూపొందించిన నివేదికను నీతి ఆయోగ్ బుధవారం విడుదల చేసింది. ఇందులో మిల్లెట్ల ఉత్పత్తి, ప్రాసెసింగ్, వినియోగానికి సంబంధించి రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను వివరించింది. ఆ నివేదిక మేరకు.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2016లో ఉత్తరకోస్తా, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల గిరిజనులతో మిల్లెట్స్ సాగు సమగ్ర పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గిరిజన, వర్షాధార ప్రాంతాలను మిల్లెట్ హబ్‌లుగా అభివృద్ధి చేయాలని భావిస్తోంది. గిరిజన ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పు కారణంగా రెండు దశాబ్దాలుగా మినుము సాగు విస్తీర్ణం 70 శాతం తగ్గింది. ఉత్తరకోస్తా, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల గిరిజనులతో మినుము సాగును పునరుద్ధరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక సమగ్ర ప్రాజెక్టును అమలు చేసింది. రాగి బిస్కెట్లు, ఇడ్లీ, దోసెలు తయారు చేయడం ద్వారా ఉత్పాదకత, గృహ వినియోగం, విలువ జోడింపు, మార్కెటింగ్ మద్దతు, ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటు, విత్తనోత్పత్తి కేంద్రాల ఏర్పాటు ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఇది అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ద్వారా అమలవుతోంది. మిల్లెట్ ఫుడ్ సంప్రదాయాన్ని అన్ని స్థాయిలలో ప్రచారం చేయడం, పవర్-ప్యాక్డ్ మిల్లెట్‌లను డైట్‌లో చేర్చుకోవడం వల్ల కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాల సందేశాన్ని ప్రజలకు వివరించడం దీని లక్ష్యం. రాష్ట్రంలో మిల్లెట్ ప్రమోషన్ బోర్డు ఏర్పాటుతోపాటు జొన్నలకు ఎంఎస్పీని ప్రకటించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేశారు. మినుము ఉత్పత్తి, మినుములకు సంబంధించిన ఇతర అంశాల కోసం సాంకేతిక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ ఏడు జిల్లాల్లోని 44 మండలాలు, 35 స్వచ్ఛంద సంస్థలు మిల్లెట్ల కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమం 28 వేల ఎకరాల్లో మినుము సాగును, నాలుగువేల ఎకరాల్లో మినుములు ఇంటెన్సిఫికేషన్ వ్యవస్థను ప్రోత్సహించడానికి సహాయపడింది. అనేకమంది పారిశ్రామిక వేత్తలు సైతం మిల్లెట్ విలువ పెంచడానికి ఉపయోగపడ్డారు. కోవెల్ ఫౌండేషన్ ప్రత్యేకంగా అనంతగిరి మండలంలో 10 పంచాయతీల్లోని 64 ఆవాసాలను కవర్ చేస్తూ మిల్లెట్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ ప్రాజెక్టు అమలయ్యే ప్రాంతంలో మినుము సాగు విస్తీర్ణం 44 శాతం పెరిగిందని పేర్కొంది.

●నారా వారి మాట..

ఒకటో‌స్సారి.. రెండో‌స్సారి

నాడు మోదీ హార్డ్‌కోర్ టెర్రరిస్ట్ అన్న చంద్రబాబు

- పెళ్లాన్ని చూసుకోలేని వాడే దేశాన్ని ఏం చూసుకుంటాడంటూ అప్పట్లో సెటైర్లు
- నోట్ల రద్దుతో బ్యాంకులన్నీ దివాళా తీశాయన్న బాబు
- బోఫోర్స్ కంటే అతిపెద్ద కుంభకోణం రాఫెల్ అని అప్పట్లో విమర్శ
- సిగ్గు.. లజ్జ.. గౌరవం లేని వ్యక్తి మోదీ అంటూ విసుర్లు
- తాజాగా 'మోదీ వల్లే దేశానికి గుర్తింపు.. ఆయనకే నా సంపూర్ణ మద్దతు' అంటూ నాలుక మడతేసిన బాబు

సాక్షి, అమరావతి: ప్రధాని నరేంద్రమోదీ అంత దుర్మార్గమైన రాజకీయ నాయకుణ్ణి చరిత్రలో చూడలేదని గతంలో నిప్పులు చెరిగిన చంద్రబాబు.. ఇప్పుడు హఠాత్తుగా నాలుక మడతపెట్టి మోదీ అంత గొప్ప నాయకుడు లేరని.. మోదీ వల్లే దేశానికి గుర్తింపు వచ్చిందని, ఆయనకే తన సంపూర్ణ మద్దతు అని చంద్రబాబు పేర్కొనటంపై సామాజిక మాధ్యమాల్లో సెటైర్లు వైరల్ అవుతున్నాయి. రోజుకో వేషం.. పూటకో మాటతో ప్రజలను మభ్యపెట్టడం చంద్రబాబుకు అలవాటేనని పలువురు పేర్కొంటున్నారు. మాట మార్చటం .. ప్రజలను ఏమార్చటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని పేర్కొంటున్నారు. గతంలో ప్రధాని మోదీపై చేసిన విమర్శలు.. తాజాగా రిపబ్లిక్ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటల్ని చూసి నవ్వుకుంటున్నారు.

నాడు మోదీని ఉద్దేశించి చంద్రబాబు ఏమన్నారంటే..

మోదీ హార్డ్‌కోర్ టెర్రరిస్ట్

'ప్రధాని నరేంద్రమోదీ హార్డ్‌కోర్ టెర్రరిస్ట్. ఆయన మంచి వ్యక్తి కాదు. 2002లో గుజరాత్ అల్లర్లు జరిగినప్పుడు మోదీ రాజీనామా చేయాలని మొదట నేనే డిమాండ్ చేశా. ఆ తర్వాత చాలా దేశాలు ఆయనను తమ దేశంలోకి రావడంపై నిషేధం విధించాయి. ప్రధాని అయ్యాక మైనారిటీలపై మరోసారి దాడి చేసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారు.'

(ఏప్రిల్ 3, 2019న చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగిన మైనారిటీల సభలో చంద్రబాబు)

పెళ్లాన్ని చూసుకోలేని వాడు.. దేశాన్ని ఏం చూసుకుంటాడు

'నువ్వు భార్యను వదిలేశావు. కుటుంబ వ్యవస్థపై నమ్మకం ఉందా? ప్రధానికి కుటుంబం లేదు. కొడుకు లేడు. దేశంలోని అన్ని వ్యవస్థలను నాశనం చేశాడు. పెళ్లాన్ని చూసుకోలేని వాడు దేశాన్ని ఏం చూసుకుంటాడు?'

(ఫిబ్రవరి 10, 2019న గుంటూరు సభలో..)

ఇడ్లీ తిన్నా పన్ను కట్టించుకుంటున్నారు

'దేశానికి ఏం చేశారో చెప్పే దమ్ము కేంద్రానికి ఉందా? నల్లధనం నియంత్రణ కోసం నోట్ల రద్దు అని చెప్పి ప్రజల డబ్బును బ్యాంకు నుంచి తీసుకోవడానికి ఇబ్బందులు పెడుతున్నారు. జీఎస్టీ అని కొత్త చట్టాన్ని తెచ్చారు. ఇడ్లీ తిన్నా పన్ను కట్టించుకుంటున్నారు. దేశంలో రైతులు దివాళా తీసే పరిస్థితి తీసుకువచ్చారు.'

(జూన్ 19, 2018న కర్నూలు జిల్లా నాయుడుపేట మహాసంకల్ప సభలో..)

బోఫోర్స్ కంటే అతిపెద్ద కుంభకోణం రాఫెల్

'కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అన్నివిధాలా ఘోరంగా విఫలమైంది. నోట్ల రద్దుతో కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు చేశారు. ఈ చర్యతో బ్యాంకులన్నీ దివాళా తీశాయి. అభివృద్ధి ఆగిపోయింది. ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. రూపాయి విలువ పడిపోయింది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు కుదేలయ్యాయి. రక్షణ శాఖలో భారీ అవినీతి జరిగింది. బోఫోర్స్ కంటే అతిపెద్ద కుంభకోణం రాఫెల్ డీల్. దీనిపై సమగ్ర విచారణ చేయాలి.'


(అక్టోబర్ 11, 2018న కళ్యాణదుర్గం బహిరంగ సభలో..)

మోదీవన్నీ విఫల కార్యక్రమాలు

'ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వానికి, బ్రిటిష్ వాళ్లకి తేడా ఏమీ లేదు. అమిత్‌షాకు నాయకుడికి ఉండాల్సిన లక్షణాలేమీ లేవు. బీజేపీ నేతల్ని కృష్ణా నదిలో ముంచితే వారి పాపపు ఆలోచనలన్నీ పోతాయి. ప్రధాని నరేంద్ర మోదీవన్నీ విఫల కార్యక్రమాలు. నోట్ల రద్దు, జీఎస్టీ వంటి వాటిని సరైన పరిష్కారం చూపకుండానే తీసుకువచ్చారు. దీనివల్ల దేశంలో అభివృద్ధి రేటు తగ్గిపోయింది. అదృష్టం కలిసి వచ్చి నరేంద్ర మోదీ ప్రధాని అయ్యారు. ఆయన కంటే నేనే సీనియర్.'

(సెప్టెంబర్ 12, 2018న అసెంబ్లీలో..)





మోదీ వచ్చాక అభివృద్ధి ఆగిపోయింది

'ప్రధాని మోదీ రాష్ట్రానికి నమ్మక ద్రోహం చేశారు. మోదీ వచ్చాక దేశంలో అభివృద్ధి ఆగిపోయింది. రూపాయి విలువ పడిపోయింది. పెట్రోల్, డీజిల్ రేట్లు పెరిగిపోయాయి. నోట్ల రద్దుతో ప్రజలంతా ఇబ్బందులు పడ్డారు.'

(సెప్టెంబర్ 21, 2018న విజయవాడ జ్ఞాన భేరి సభలో..)

సిగ్గు, లజ్జ, గౌరవం లేని వ్యక్తి మోదీ

'ప్రధాని నరేంద్ర మోదీకి సిగ్గు కూడా లేదు. సిగ్గు, లజ్జ, ఒక గౌరవం లేని వ్యక్తి. నా జీవితంలో చాలామంది వ్యక్తుల్ని చూశాను. ఇలాంటి వ్యక్తిని చూడలేదు. గ్రామాల్లో ఉండే చిన్న కార్యకర్త నరేంద్ర మోదీ కంటే వెయ్యి రెట్లు బెటర్. అది ఆయన స్తోమత.'

(ఏప్రిల్, 2, 2019వ తేదీన)

నేడు రిపబ్లిక్ టీవీ చర్చా వేదికలో..

'మోదీ వల్లే దేశానికి గుర్తింపు.. ఆయనకే నా సంపూర్ణ మద్దతు

ప్రధాని నరేంద్ర మోదీ వల్లే ప్రపంచంలో భారతదేశానికి గుర్తింపు వచ్చిందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. రిపబ్లిక్ టీవీ మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన చర్చా వేదికలో మంగళగిరి నుంచి ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఎన్డీఏ విధానాలు, కార్యక్రమాలను తాను పూర్తిగా సమర్థిస్తున్నట్టు చెప్పారు. ఆయన చెప్పిన 'విజన్ 2047'తో తాను సంపూర్ణంగా ఏకీభవిస్తున్నట్టు తెలిపారు. దాన్ని అమలు చేసేందుకు తాను, తన ప్రజలు ఆయనతో కలిసి పనిచేస్తామన్నారు. మోదీ వల్లే భారతదేశ శక్తి సామర్థ్యాలు ప్రపంచానికి తెలిశాయన్నారు. గతంలో కూడా తాను ఎప్పుడూ మోదీ విధానాలను వ్యతిరేకించలేదన్నారు. కేవలం ప్రత్యేక హోదా, విభజన అంశాలు వంటి రాష్ట్ర ప్రజల మనోభావాల అంశాలపైనే కేంద్రంపై పోరాడాను తప్ప వారి విధానాలను విమర్శించ లేదన్నారు. మోదీ ప్రపంచంలోని అన్ని దేశాలు తిరిగి భారత్‌ను బ్రాండింగ్ చేస్తున్నారని, ప్రస్తుతం అది చాలా అవసరమని చంద్రబాబు పేర్కొన్నారు. ఇందుకు ఆయన్ను తాను పూర్తిగా అభినందిస్తున్నట్టు తెలిపారు. ఆయనకు పూర్తిగా మద్దతు ఇస్తానన్నారు. మోదీ నెట్‌వర్కింగ్ ద్వారా ప్రపంచ స్థాయిలో దేశానికి గుర్తింపు తెచ్చారని, ఆయన విజన్‌తో పూర్తిగా ఏకీభవిస్తున్నానని తెలిపారు. అభివృద్ధి విషయంలో ప్రధాని ఆలోచనే తన ఆలోచన కూడానన్నారు. ఎన్డీఏకు మద్దతిచ్చే విషయంపై సమయానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రధాని చేసే పనులకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.

మార్గదర్శి అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధం

మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: మార్గదర్శి అక్రమాలపై చర్చించేందుకు టీడీపీ అధికార ప్రతినిధి జీవీ రెడ్డి చేసిన సవాల్‌కు తాను సిద్ధమేనని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను మార్గదర్శి అక్రమాలపై పోరాడుతుంటే.. టీడీపీ నేతలు మార్గదర్శి అక్రమాలను వెనకేసుకొస్తూ చర్చకు సవాల్ విసురుతున్నారని చెప్పారు. తాను బహిరంగ చర్చకు సిద్ధమేనని ప్రకటించారు. ఈ చర్చ రామోజీరావు సమక్షంలో రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించాలని కోరారు. ఇందుకోసం చంద్రబాబు ద్వారా జీవీ రెడ్డి ప్రయత్నించాలని సూచించారు. తద్వారా దీనికి జాతీయ స్థాయిలో విలువ పెరుగుతుందని చెప్పారు. ఈ చర్చలో రామోజీ పాల్గొన్నా, పాల్గొనకపోయినా ఫర్వాలేదన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీలో అవకాశం లేని పక్షంలో.. టీడీపీ ప్రధాన కార్యాలయంలోనైనా ఏర్పాటు చేయాలన్నారు. జనసేన కూడా మార్గదర్శికే అనుకూలంగా వ్యవహరిస్తోందని చెప్పారు. మే 14న మార్గదర్శి అక్రమాలపై చర్చ జరిగే అవకాశం ఉందని చెప్పారు.

ఇక ఎండలు మండవు

▶ మొదటి పేజీ తరువాయి

ఏప్రిల్‌లో ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీల వరకు నమోదైనా మధ్యలో 2, 3 రోజులు అకాల వర్షాలు పడ్డాయి. ఆ తర్వాత మే నాటికి ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలలోపే నమోదయ్యాయి. ఈ సంవత్సరం కూడా ఏప్రిల్ మూడోవారం వరకు తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మూడోవారం చివర్లో వర్షాలు మొదలవడంతో వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులతో పిడుగులు పడుతున్నాయి. అన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. మే మొదటి వారం వరకు ఇదే రకరమైన వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఆ తర్వాత కూడా ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండే అవకాశాలు తక్కువేనని అధికారులు చెబుతున్నారు. మే 9, 12 తేదీల మధ్య బంగాళాఖాతంలో అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఇది మయన్మార్ వైపు వెళ్లినా ఇక్కడి ఉష్ణోగ్రతలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీన్నిబట్టి మే రెండోవారం కూడా వాతావరణం ఇలాగే ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మధ్యలో ఒకటి, రెండు రోజులు ఎండలు పెరిగినా వర్షాలు మాత్రం కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతోంది.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో భారీవర్షం



నంద్యాల జిల్లా యాగంటి క్షేత్రంలో కొండ పైనుంచి పారుతున్న వర్షంనీరు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో బుధవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు భారీవర్షం కురిసింది. సగటున కర్నూలు జిల్లాలో 27 మిల్లీమీటర్లు, నంద్యాల జిల్లాలో 20.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, కల్లూరు, కర్నూలు, గోనెగండ్ల తదితర మండలాలు, నంద్యాల జిల్లాలోని బనగానపల్లి, బేతంచెర్ల, పాణ్యం, పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలాల్లో ఒక్కరోజు కురిసిన వర్షాలకే వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఆస్పరి, కొత్తపల్లి, పెద్దకడుబూరు మండలాల్లో పిడుగులు పడ్డాయి. కర్నూలు జిల్లా ఆస్పరి మండలం బైలుపత్తికొండ గ్రామంలో పిడుగుపడటంతో 13 జీవాలు మరణించాయి. ఎమ్మిగనూరు మండలంలో 108.2 మిల్లీమీటర్లు, బనగానపల్లిలో 88, బేతంచెర్లలో 75.2, కల్లూరులో 70.4, గోనెగండ్లలో 65, పాణ్యంలో 62.4, పగిడ్యాలలో 60.8, కర్నూలు అర్బన్‌లో 54.6, కర్నూలు రూరల్‌లో 53.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ముగ్గురు క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

అక్కిరెడ్డిపాలెం(గాజువాక): క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు కథనం ప్రకారం... పిలకవానిపాలెం వద్ద ఉన్న అజంతా కాలనీకి చెందిన శ్రీనుబాబు, ఎస్.శ్రీను, అప్పల రెడ్డి ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.18,400 నగదు, ఒక టీవీ, ల్యాప్ టాప్, రెండు బైక్‌లు, ఎనిమిది సెల్ ఫోన్లు, ఒక నోట్ బుక్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను గాజువాక పోలీసులకు అప్పగించారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణా తీరాన ఫుడ్ ఫెస్టివల్

29 నుంచి మే 7వ వరకు నిర్వహణ



ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

పటమట (విజయవాడ తూర్పు):విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కృష్ణా నది ఒడ్డున భవానీపురం పున్నమి ఘాట్‌లో ఈ నెల 29 నుంచి మే 7వ తేదీ వరకు 'ఫ్లేవర్స్ ఆఫ్ ఇండియా' పేరిట ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి బుధవారం తెలిపారు. నగర పౌరుల ఆహ్లాదం కోసం దీనిని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భారతీయ ఆహార సంస్కృతిని నగరవాసులకు పరిచయం చేస్తామన్నారు. పంజాబీ, రాజస్థానీ, ఢిల్లీ, కేరళ తందూరీలు, తెలుగు రాష్ట్రాల రుచికరమైన వంటకాలను ఇందులో ఆస్వాదించవచ్చని పేర్కొన్నారు. ఫెస్టివల్‌లో సుమారు 20 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారని, అందులో కొన్ని స్టాల్స్‌ను విజయవాడలోని ప్రసిద్ధి చెందిన హోటళ్లు ఏర్పాటు చేయనున్నాయని వివరించారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు ఫుడ్ ఫెస్టివల్ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా స్టాండ్ అప్ కామెడీ, లైవ్ రాక్ బ్యాండ్, డ్యాన్స్ ఈవెంట్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

రామోజీ డబుల్ రోల్

▶ మొదటి పేజీ తరువాయి

రామోజీరావు తరపు న్యాయవాదుల్ని ప్రశ్నించిన విషయం విదితమే.

ఉండవల్లి అఫిడవిట్‌లో పేర్కొన్న విషయాలు ఇలా..

1990 తొలినాళ్లలో నా కుటుంబ సభ్యులు, దగ్గర బంధువులు, స్నేహితులు వారు సంపాదించిన సొమ్మును మార్గదర్శి ఫైనాన్షియర్స్‌లో పెట్టుబడి పెట్టారు. బలమైన కాంగ్రెస్ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ నా కుటుంబ సభ్యులు రామోజీరావుకు చెందిన మార్గదర్శిలో ఇన్వెస్ట్ చేశారు. మీడియా, వ్యాపారం అనుసంధానం చేయబోరని భావించనందువల్లే ఇలా చేశారు. 16 సంవత్సరాలుగా మా కుటుంబ సభ్యులు డిపాజిట్లు రెన్యువల్ చేస్తూనే ఉన్నారు. అయితే, 2006లో మెచ్యూరిటీ తర్వాత డిపాజిట్లు రూ.లక్ష కన్నా తక్కువ ఉన్నాయని రెన్యువల్ చేయలేదు. దీనికి సంబంధించి మార్గదర్శి ఫైనాన్షియర్స్ జారీ చేసిన డిపాజిట్ బాండ్‌లలో హెచ్‌యూఎఫ్ కర్త హోదాలో, చెక్‌పైన మార్గదర్శి ఫైనాన్షియర్స్ తరపున ప్రొప్రయిటర్‌గా రామోజీరావు సంతకం చేయడం గమనించాను. ఇదే విషయాన్ని సహచర న్యాయవాద స్నేహితులు, ఆడిటర్లతో చర్చించా. ఆర్‌బీఐ యాక్టు, 1934 సెక్షన్ 45ఎస్ ప్రకారం 1997 తర్వాత ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించడం చట్ట ప్రకారం శిక్షార్హమైనదని, మార్గదర్శి ఫైనాన్షియర్స్ నిబంధనలు ఉల్లంఘించిందని వారు తెలిపారు. రామోజీరావు లాంటి వ్యక్తి అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నారంటే నమ్మలేకపోయా. ఆంధ్రప్రదేశ్‌లోని అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుల అక్రమాలను బహిర్గతం చేయడంలో ఈనాడు సహా పలు పత్రికలు కీలకపాత్ర పోషించాయి. అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్‌లో రిజిస్టర్ అయ్యేవి. బ్యాంకింగ్ వ్యాపారానికి ఆర్‌బీఐ నుంచి లైసెన్సు పొందేవి. వాటిలో అక్రమాలపై ఈనాడు సహా పలుపత్రికలు కథనాలు ప్రచురించి, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి. 45 అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుల మొత్తం డిపాజిట్ల విలువ రూ.630 కోట్లు. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ది పూర్తిగా చట్ట విరుద్ధమైన వ్యాపారం. ఆర్‌బీఐలో రిజిస్టర్ కాలేదు. ఏపీ ప్రభుత్వంలో రిజిస్టర్ కాలేదు. దేశంలో ఎక్కడా రిజిస్టర్ కాలేదు. అన్ ఇన్‌కార్పొరేటెడ్ బాడీగా మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై 1997 నుంచి ఎవరి నుంచి డిపాజిట్లు స్వీకరించకుండా నిషేధం కూడా ఉంది. ఆ నిబంధనలు ఉల్లంఘించి డిపాజిట్లు స్వీకరించినందున రెండేళ్ల వరకు జైలు శిక్షకు అర్హులు. 45 అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుల డిపాజిట్లు మొత్తం రూ.630 కోట్లు అయితే మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఒక్కటే చట్ట విరుద్ధంగా సుమారు 2.75 లక్షల మంది నుంచి రూ. 2,600 కోట్లు సేకరించింది. 2006 మార్చి 31 నాటికి రూ.1,400 కోట్లు నష్టం కాగా, ఏడాది తర్వాత రామోజీరావు హెచ్‌యూఎఫ్ మొత్తం నష్టం రూ.1,800 కోట్లకు చేరుకుంది. ఈ నష్టాలు కేవలం సాంకేతిక నష్టాలు మాత్రమేనని రామోజీరావు వివరించడానికి ప్రయత్నించారు. అయితే, చాలా మంది ఆర్థిక నిపుణులు సాంకేతిక నష్టాలు అంటే అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఆర్థిక స్థితి ఏ వార్తాపత్రికలోనూ ప్రచురించలేదు. లేదా డిపాజిటర్లు ఎవరికీ పంపిణీ చేయలేదు. వ్యాపారమంతా గుట్టుగా సాగిపోయింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరు వెబ్‌సైట్‌లో ఎప్పుడూ కనిపించలేదు. ఆశ్చర్యకరంగా మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు ఉద్దేశపూర్వకంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ లిమిటెడ్ విభాగం ద్వారా డిపాజిట్లు సేకరిస్తున్నారనే అభిప్రాయం కలిగించడానికి కనీసం సైన్ బోర్డులు కూడా ఉంచలేదు. ఈ విషయంపై 2006 నవంబరు 6న ఆర్థిక మంత్రికి ఫిర్యాదు చేశాను. డిపాజిటర్ల ప్రయోజనాల రీత్యా తగిన చర్యల కోసం ఆ కాపీని అప్పటి ఏపీ సీఎంకు పంపించాను. అయితే, రామోజీరావు తాను చేస్తున్న భారీ అక్రమ వ్యాపారానికి క్షమాపణ చెప్పడానికి బదులు పత్రికా స్వేచ్ఛ ముసుగులో బయట పడటానికి తీవ్రంగా ప్రయత్నించారు. కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించే రాజకీయ నాయకులందరూ వాస్తవాలు, గణాంకాలు ధ్రువీకరించకుండానే రామోజీరావుకు మద్దతు తెలిపారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నారంటూ అసలు విషయం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు యత్నించారు. చట్టం నుంచి తప్పించుకొనేందుకు ఒకరికి సహకరిస్తున్నామని వారందరూ మర్చిపోయారు. నా ఫిర్యాదు స్వీకరించిన రాష్ట్ర ప్రభుత్వం 2006 నవంబరు 6న ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని నియమించింది. ఆ కమిటీకి రామోజీరావు సమాచారం ఇవ్వలేదు. పైగా, కమిటీ నియామకాన్ని సవాల్ చేశారు. హైకోర్టు మధ్యంతర స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కమిటీకి సహకరించడానికి రామోజీరావు నిరాకరిస్తున్నందున జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నిర్దిష్ట ఆదేశాలతో మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఆవరణలో ప్రభుత్వం సోదాలు నిర్వహించింది. దురదృష్టవశాత్తు ఎల్‌కే అద్వాణీ, నరేంద్రమోదీ, జయలలిత, ములాయం సింగ్ యాదవ్, కులదీప్ నయ్యర్, ఎడిటర్ ఎన్. రామ్ వంటి పెద్దలంతా ప్రభుత్వం చేస్తున్న సోదాలకు వ్యతిరేకంగా ప్రకటనలు ఇచ్చారు. పత్రికల్లో ఎడిటోరియల్స్ కూడా రాశారు. పార్లమెంటులో, ఇతర ప్రాంతాల్లో నా సహచరులతో మాట్లాడుతున్నప్పుడు సమస్యపై విస్తృత ప్రచారం జరిగినా సమాజంలో ఇంకా గందరగోళంగానే ఉన్న విషయాన్ని గ్రహించాను. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించడానికి వీలుగా అన్ని పత్రాలు కోర్టుకు సమర్పిస్తున్నాను'' అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అదనపు డాక్యుమెంటులో పేర్కొన్నారు.

కోర్టుకు పలు పత్రాలు సమర్పించిన ఉండవల్లి

తన తల్లి వి. లక్ష్మి సుబ్బారావు చేసిన డిపాజిట్లు, చెల్లింపు నిమిత్తం అందించిన చెక్కులను కూడా ఉండవల్లి అరుణ్‌కుమార్ పొందుపరిచారు. మార్గదర్శి రిజిస్టర్ హోల్డర్లయిన వి.లక్ష్మి సుబ్బారావు.. మీ నుంచి రూ.84,324 డిపాజిట్‌గా స్వీకరిస్తున్నామని 2006 మార్చి 23న కర్త ఆఫ్ హెచ్‌యూఎఫ్‌గా రామోజీరావు సంతకం చేసిన పత్రం, వి.లక్ష్మి సుబ్బారావు పేరిట 2006 నవంబర్ 3న మార్గదర్శి ఫైనాన్షియర్స్ ప్రొప్రయిటర్‌గా రామోజీరావు సంతకం చేసిన హెచ్‌డీఎఫ్‌సీ చెక్కును కూడా అదనపు డాక్యుమెంటుతో పొందుపరిచారు. నాటి ఆర్థిక మంత్రి చిదంబరానికి రాసిన లేఖ, మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఏర్పాటు, వ్యాపారం తదితర వివరాలు, బ్యాలెన్స్ షీట్లు, డిపాజిట్లు సేకరించొద్దని మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఆర్‌బీఐ ఆదేశించిన పత్రాలు కూడా కోర్టుకు సమర్పించారు.

అడ్వాన్స్‌డ్‌నూ అధిగమించొచ్చు!

- జేఈఈ మెయిన్స్‌కు పడిన కష్టం దీనికీ కలిసొస్తుంది
- విద్యార్థులు కాస్త శ్రద్ధ పెడితే చాలు
- స్పష్టం చేస్తున్న సబ్జెక్టు నిపుణులు

సాక్షి, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు వస్తే ప్రతిష్టాత్మక ఐఐటీల్లో సీటు వస్తుందని తెలిసీ, చాలామంది పోటీ పడలేకపోతున్నారు. మెయిన్స్ పేపర్ కష్టంగా ఉందని, అడ్వాన్స్‌డ్ మరింత కష్టంగా ఉంటుందనే భావన వారిలో ఉండటమే దీనికి ప్రధాన కారణం. దీంతో చాలా మంది జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకుతో సరిపెట్టుకుంటున్నారు. ఈ ర్యాంకుతో జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో, ట్రిపుల్ ఐటీల్లో సీటు కోసం పోటీ పడుతున్నారు. నిజానికి మెయిన్స్‌కు పడే కష్టం, అడ్వాన్స్‌డ్‌కు సైతం కలిసి వస్తుందని సబ్జెక్టు నిపుణులు అంటున్నారు. మెయిన్స్‌లో ఓ మోస్తరు ర్యాంకు సాధించిన ప్రతి వ్యక్తీ కాస్తా శ్రద్ధ పెడితే అడ్వాన్స్‌డ్‌లో రాణించడం తేలికే అని చెబుతున్నారు.

తగ్గుతున్న హాజరు.. ఉత్తీర్ణత

జేఈఈ మెయిన్స్ పరీక్ష దేశవ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది వరకు రాస్తున్నారు. వీరిలో 2.50 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేస్తారు. అయితే వీరిలో పరీక్ష రాస్తున్న వారు 60 శాతానికి మించి ఉండటం లేదు. ఇలా రాసేవాళ్ళల్లోనూ అడ్వాన్స్‌లో ఉత్తీర్ణులయ్యేవారు 30 శాతం కూడా ఉండటం లేదు. కోవిడ్ తర్వాత పరిస్థితి మరీ దిగజారినట్టుగా ఉంటోంది. అర్హత సాధించాం కాబట్టి అడ్వాన్స్‌డ్‌కు హాజరవుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. 2022 జేఈఈ ఫలితాలను పరిశీలిస్తే అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణత 26.17 శాతమే ఉంది. 2021లో ఇది 29.54 శాతంగా ఉండటం గమనార్హం. 2022లో అడ్వాన్స్‌డ్ పరీక్షకు 2.5 లక్షల మంది అర్హత సాధిస్తే.. 1,55,538 మంది మాత్రమే పరీక్ష రాయగా, 40,712 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

కోవిడ్ ప్రభావమూ కారణమే

జేఈఈ పరీక్షను గత రెండేళ్ళుగా కోవిడ్ వెంటాడుతోంది. 2019 నుంచి 2021 మధ్య కోచింగ్‌కు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఆన్‌లైన్ కోచింగ్ పెరిగింది. కానీ గ్రామీణ, ఒక స్థాయి పట్టణ కేంద్రాల్లో చదువుకున్న విద్యార్థులు స్థానికేతరులు చెప్పే ఆన్‌లైన్ కోచింగ్‌ను అర్థం చేసుకోలేకపోతున్నారు. 2022లో కోచింగ్ కేంద్రాలు తెరుచుకున్నా, చాలాచోట్ల నాణ్యతలేని ఫ్యాకల్టీ ఉందనే వాదన విన్పిస్తోంది. మరోవైపు కోవిడ్ కారణంగా రెండేళ్ళుగా చదువులో వెనుకబడటం కూడా జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌పై ప్రభావం చూపించిందని నిపుణులు చెబుతున్నారు.

కొన్నేళ్ళుగా అడ్వాన్స్‌డ్‌కు హాజరవుతున్న, అర్హత సాధిస్తున్న వారి సంఖ్య

సంవత్సరం	అడ్వాన్స్‌డ్‌కు హాజరు	అర్హులు
2022	2,10,251	1,55,538
2021	2,50,597	1,41,699
2020	2,50,681	1,50,838
2019	2,45,194	1,74,432
2018	2,31,024	1,65,656
2017	2,21,834	1,71,000


ప్రత్యేక శిక్షణతో ప్రయోజనం

మెయిన్స్‌లో అర్హత సాధించిన ప్రతిఒక్కరూ అడ్వాన్స్‌డ్‌పై దృష్టి పెట్టాలి. దీనికోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకోవాలి. మెయిన్స్‌లో పడిన కష్టం అడ్వాన్స్‌డ్‌లో చాలావరకు కలిసి వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. గత కొంత కాలంగా అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణత, కటాఫ్ తగ్గుతున్నాయి. మరోవైపు ఐఐటీల్లో సీట్లు పెరిగాయి. ఇవన్నీ కలిసి వచ్చే అంశాలు.

– ఎంఎస్ రావు, (జేఈఈ పరీక్షల నిపుణులు)

కొన్నేళ్ళుగా అడ్వాన్స్‌డ్‌లో అర్హత మార్కుల తీరు ఇలా ఉంది

కేటగిరీ	2022	2021	2020	2019	2018	2017
జనరల్	55	63	69	93	90	128
ఈడబ్ల్యూఎస్	50	56	62	83	81	115
ఓబీసీ	50	56	62	83	45	64
ఎస్సీ	28	31	34	46	45	64
ఎస్టీ	28	31	34	46	45	64
పీడబ్ల్యూడీ	28	31	34	46	45	64





ఏకాంతం మంచిదే. కానీ ఆ ఏకాంతం మంచిదని చెప్పడానికి నీకు ఒకరుండాలి.

– హానొరే డె బాల్జాక్

సాక్షి

గురువారం, 27 ఏప్రిల్ 2023

న్యాయం కావాలి!

చట్టం ముందు అందరూ సమానులే అంటాం. కానీ, డబ్బు, పలుకుబడి ఉన్న వ్యక్తులు కొంచెం ఎక్కువ సమానమని పదేపదే రుజువవుతుంటే ఏమనాలి? వ్యవస్థపై ఇక నమ్మకమేం మిగుల్తుంది? లైంగిక వేధింపులకూ, బెదిరింపులకూ పాల్పడ్డాడంటూ భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడూ, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌పై మహిళా రెజ్లర్లు నెలలుగా మొత్తుకుంటున్నా క్రీడాశాఖకూ, పాలకులకూ పట్టనితనం చూస్తే ఇలాంటి ప్రశ్నలెన్నో వస్తాయి. అంతర్జాతీయ పతకాలు తెచ్చిన ఆడపిల్లలు తమ గోడు వెళ్ళబోసుకుంటూ, బ్రిజ్ భూషణ్‌పై చర్య తీసుకోవాలంటూ జనవరిలో వీధికెక్కిన దృశ్యాలు దేశమంతా చూసినవే. మూడు నెలలు గడిచినా అతీగతీ లేక చివరకు మళ్ళీ ఆ అగ్రశ్రేణి మహిళా మల్లయోధులు మరోసారి నిరసనకు దిగాల్సి రావడం శోచనీయం. తాజాగా ఏప్రిల్ 21న పోలీసులకు ఫిర్యాదు చేసినా, కనీసం ఎఫ్ఐఆర్ కూడా దాఖలు కాని పరిస్థితుల్లో అసహాయులైన అమ్మాయిలు ఆఖరికి దేశ సర్వోన్నత న్యాయస్థానం తలుపులు తట్టాల్సి రావడం మనం ఏ కాలంలో, ఎలాంటి రాజకీయ వ్యవస్థలో ఉన్నామో నగ్నంగా నిరూపిస్తున్నాయి.

అన్నిటికీ అత్యుత్సాహంతో కేసులు కట్టే పోలీసులు తాజా ఫిర్యాదు తర్వాత 5 రోజులైనా ఎఫ్ఐఆర్ దాఖలు చేయలేదు. ఆదివారం నుంచి 4 రోజులుగా జంతర్ మంతర్ వద్ద రెండోసారి నిరసన దీక్ష కొనసాగిస్తున్నా బాధిత మహిళా రెజ్లర్లను సంబంధిత అధికారులెవరూ పలకరించనైనా లేదు. మహిళా సంక్షేమం కోసమే ఉన్నామని చెప్పుకొనే జాతీయ మహిళా కమిషన్ సైతం అయిపూ అజా లేదు. ఇక దేశంలో సగటు స్త్రీకి మనం ఏం భరోసా కల్పిస్తున్నట్టు? అసలైతే మహిళలెవరైనా లైంగిక వేధింపుల ఫిర్యాదు చేస్తే – తక్షణమే కేసు పెట్టి, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని చట్టం. ఢిల్లీ పోలీసులు మాత్రం ఏడుగురు మహిళలు లిఖిత పూర్వక ఫిర్యాదులిచ్చినా ప్రాథమిక విచారణ చేశాక ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని మీనమేషాలు లెక్కిస్తుండడం దారుణం. 'పోక్సో' చట్టం సైతం వర్తించే మైనర్ బాలికపై వేధింపుల తీవ్రాతితీవ్ర అంశమున్నా, సోకాల్డ్ విచారణేదో ఇన్నిరోజులుగా పూర్తి కాకపోవడం మరీ విడ్డూరం. పైపెచ్చు, లైంగిక బాధితులమంటూ ఫిర్యాదు చేసిన స్త్రీల పేర్లను పోలీసులే లీకు చేయడం ఘోరం, నేరం. నిందితుడు అధికార పార్టీకీ, అందునా సీట్లు, ఓట్లలో కీలక యూపీకీ చెందిన వ్యక్తి గనక చట్టాలన్నీ చుట్టాలయ్యాయంటే తప్పు పట్టగలమా?

జనవరిలో బాధితులు నిరసన దీక్షకు దిగినప్పుడే ఈ కేసును నిర్వీర్యం చేసేందుకు శతవిధాల ప్రయత్నాలు జరిగాయి. వినేశ్ ఫోగట్, సాక్షీ మలిక్ లాంటి తోటి క్రీడాకారిణులకు టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత భజరంగ్ పునియా లాంటి పురుషులూ తోడుగా నిలిచి, విషయం మీడియాలో పెద్దదయ్యే సరికి తప్పక క్రీడాశాఖ రంగంలోకి దిగింది. నిందితుడైన బీజేపీ ఎంపీని తాత్కాలికంగా సమాఖ్యకు దూరం జరిపింది. విచారణకు కంటితుడుపు కమిటీ వేసింది. బాక్సర్ మేరీ కోమ్ సారథ్యంలో ఆరుగురు సభ్యుల కమిటీ 4 వారాల్లో నివేదిక ఇవ్వాలి. ఇప్పటికి 3 నెలలైనా ఆ కమిటీ, దాని నివేదిక అతీగతీ దేవరహస్యమే. నివేదికను బయటపెట్టాలనీ, నిందితుణ్ణి అరెస్ట్ చేయాలనీ కోరుతూ రెజ్లర్లు ఇప్పుడు ఢిల్లీ నడిబొడ్డున, నేపథ్యంలో హనుమాన్ చాలీసా వినిపిస్తూ, దీక్షకు కూర్చున్నారు. రోడ్ల మీదే రెజ్లింగ్ సాధన చేస్తున్నారు. పతకాలు తెచ్చినప్పుడల్లా వారితో ఫోటోలకు పోజులిచ్చి, న్యాయం కోసం రోడ్డెక్కినప్పుడు మౌనం పాటిస్తున్న కమలనాథులకు మాత్రం కనికరం కలగట్లేదు.

భారత ఒలింపిక్ అసోసియేషన్ పక్షాన మరో కమిటీ వేస్తున్నట్టు క్రీడా శాఖ ప్రకటించింది కానీ, మరోసారి కమిటీల పేర మోసపోవడానికి రెజ్లర్లు సిద్ధంగా లేరు. బాధిత మహిళలతో పాటు పౌర సమాజం డిమాండ్ చేస్తున్నట్టు... ఆరుసార్లు ఎంపీ, ఒకప్పుడు తీవ్రవాద కేసులో నిందితుడూ, స్థానిక డాన్‌గా అపరిమిత పలుకుబడి గల వ్యక్తి అయిన బ్రిజ్‌భూషణ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలి. ఎఫ్ఐఆర్ దాఖలుకు నిరాకరించిన పోలీసులపై కేసు నమోదు చేయాలి. పతకాలు పండిస్తున్న భారత రెజ్లింగ్ ఇప్పటికే ఈ వివాదాలతో కుదేలైంది. నిరసనగా గత నెల అంతర్జాతీయ శిక్షణ శిబిరాల నుంచి పునియా, ఫోగట్ పక్కకు తప్పుకున్నారు. వచ్చే ఏటి ప్యారిస్ ఒలింపిక్స్‌లో విజయాలకూ ఇది గండి కొట్టే ప్రమాదం ఉంది. సుప్రీంలో కేసు ఈ 28న తదుపరి విచారణకు రానున్న నేపథ్యంలో ఇప్పటికే పరువు పోయిన క్రీడాశాఖ కళ్ళకూ, చెవులకూ గంతలు తొలగించుకోవాలి.

నిజానికి, మన క్రీడా వ్యవస్థ అనేక లోపాల పుట్ట. క్రీడాసంస్థలు కొందరి జేబుసంస్థలుగా కొనసాగడం, రాజకీయ ప్రాబల్యానికి అడ్డా కావడం దశాబ్దాలుగా ఉన్నదే. కోరింది ఇస్తేనే ఆటలో అవకాశాలొస్తాయనే వాతావరణం కల్పించడం, అర్హుల కన్నా అయినవాళ్ళను అందలం ఎక్కించడం పదే పదే చూస్తున్నదే. అందుకే, అప్రతిష్ఠ మూటగట్టుకున్న రెజ్లింగ్ సమాఖ్య, దాన్ని సొంత జాగీరులా నడుపుతున్న బ్రిజ్‌భూషణ్‌ల వ్యవహారం ఆశ్చర్యం కాకపోవచ్చు కానీ, ఇన్ని ఆరోపణల తర్వాతైనా కళ్ళు తెరిచి, చర్యలు తీసుకోవాల్సిన అంశం. కేసు ఇప్పుడు సుప్రీం దాకా వచ్చింది గనక బాధితులకు న్యాయం జరగవచ్చు. కానీ దేశప్రతిష్ఠను పెంచిన క్రీడాకారులు, అందులోనూ ఆడపిల్లలు ఆరోపణలు చేస్తుంటే అధికార, పాలనా వ్యవస్థలు సరిగ్గా స్పందించకపోవడమే దుర్మార్గం. ఇకనైనా స్వపర భేదాలు వదిలి, క్రీడా వ్యవస్థలను సమూలంగా ప్రక్షాళించాలి. బ్రిజ్ భూషణ్ కథ అందుకు నాంది కావాలి. సాధారణ న్యాయం సైతం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తేనే సాధ్యమన్న సంకేతాలు ప్రజల్లోకి వెళితే, అది పాలకులకు కాదు... మొత్తం వ్యవస్థకే తలవంపులు.

మనం చూసిన సాంకేతిక విప్లవం

సందర్భం



దినేష్ సి. శర్మ

ప్రపంచంలో మొబైల్ ఫోన్లు మొదలై యాభై ఏళ్లయ్యింది. అవి ఇండియాలోకి ప్రవేశించి నలభై ఏళ్లయ్యింది. అప్పట్లో ఆ ఫోన్లు అడుగు పరిమాణంలో ఉండేవి. వాటితో కేవలం మాట్లాడగలం. మెసేజులు, ఫొటోలు పంపలేము. 1990లలో ఇండియాలో మొబైల్ సేవలు ఊపందుకున్నాయి. అప్పుడు కూడా 'టాక్ టైమ్' ఖరీదైన వ్యవహారం. కానీ తర్వాతి రెండు దశాబ్దాల్లో అనేక మలుపులు తిరిగాయి. పాలసీ మార్పులు, ప్రీ–పెయిడ్ సర్వీస్, ఛోటా రీచార్జ్, సర్వీస్ నెట్‌వర్క్‌ల విస్తరణ, స్థానిక తయారీ వంటివన్నీ కలిసి మొబైల్ ఫోన్ సేవలను సరసమైన ధరలకే అందుబాటులోకి తెచ్చాయి. ఆధునిక మానవ చరిత్రలో అనేకమంది ప్రజల జీవితాలను స్పృశించిన అతి గొప్ప సాంకేతిక సాధనం మొబైల్ ఫోన్!

ఆధునిక మానవ చరిత్రలో అనేకమంది ప్రజల జీవితాలను స్పృశించిన అతి గొప్ప సాంకేతిక సాధనం మొబైల్ ఫోన్. భారతదేశం స్వాతంత్ర్యం పొందిన పలు దశాబ్దాల తర్వాత సగటు కుటుంబాలకు అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతికతలు సైకిల్, చేతి గడియారం, లేదా ట్రాన్సిస్టర్ రేడియో మాత్రమే. 1960లు, 1970లలో నాలాగా భారత్‌లో పుట్టి పెరిగినవారు అప్పట్లో ఫోన్ కలిగి ఉండటం ఒక విలాసంగా ఉండేదని మీకు చెబుతారు. టెలిఫోన్ కనెక్షన్ కోసం వేచి ఉండే సమయం అయిదు నుంచి ఏడేళ్ల వరకు ఉండేది. ఫోన్ ఉన్న కుటుంబాలకు ఇరుగుపొరుగు వద్ద చాలా డిమాండ్ ఉండేది. తమ సంబంధీకుల కాల్స్ అందుకోవడానికి వారు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకునేవారు. వారు ఆ నంబర్‌ను పీపీ (ప్రైవేట్ పార్టీ) అని పంచుకునేవారు. అనధికారికంగా తమ ఫోన్లను ఇతరులు వాడకుండా యజమానులు వాటిని లాక్ చేసేవారు. (ఇప్పుడు స్మార్ట్ ఫోన్లకు స్క్రీన్ లాక్ లాగా అప్పుడు ఫోన్ డయలర్‌ని లాక్ చేసేవారు.)

నా తరం వారు నిజంగానే తమ జీవితకాలంలో ల్యాండ్‌లైన్ ఫోన్ల నుంచి సర్వవ్యాపి అయిన స్మార్ట్ ఫోన్ల వరకు సంభవించిన సాంకేతిక విప్లవానికి సాక్షీభూతులయ్యారు. మొబైల్ ఫోన్‌ను 50 సంవత్సరాల క్రితమే ఆవిష్కరించారు. న్యూయార్క్‌లోని దాని ఆవిష్కర్త మార్టిన్ కూపర్ ప్రపంచంలోనే మొట్టమొదటి మొబైల్ కాల్‌ను 1973 ఏప్రిల్ 3న చేశారు. పాశ్చాత్య ప్రపంచంలో కూడా మొబైల్ ఫోన్



వినియోగదారీ వస్తువుగా మారటానికి దాదాపు రెండు దశాబ్దాలు పట్టింది.

ల్యాండ్‌లైన్ లాగే, మొబైల్ ఫోన్ కూడా ప్రారంభంలో విలాసంగానే ఉండేది. 1980లలో దాని ధర అమెరికాలో 4,000 డాలర్లు. వాటి పరిమాణం పెద్దదిగా ఒక అడుగు ఉండేది. దాన్ని 'ఇటుక ఫోన్' అనేవారు. 1990ల మధ్యలో నేను ఉపయోగించిన తొలి మొబైల్ ఇటుక సైజు కంటే కాస్త చిన్నదిగా ఉండేది. అప్పటికీ అది ఏ జేబులోనూ పట్టేది కాదు. ధర సుమారు యాభై వేలు. నేను పని చేస్తుండిన టెలివిజన్ ప్రొడక్షన్ కంపెనీ, ఫీల్డ్ అసైన్‌మెంట్ల కోసం వెళ్లే విలేఖరుల కోసం కొన్ని హ్యాండ్ సెట్లను అద్దెకు తీసుకుంది. అవి ఒక డయలింగ్ ప్యాడ్‌తో కూడిన భారీ పరికరం, పొడుచుకువచ్చిన యాంటెన్నా, మందమైన రింగ్‌టోన్‌తో ఉండేవి. గుర్తుంచుకోండి, దాంతో కేవలం మాట్లాడగలరు. మెసేజ్ చేయలేరు, ఫొటోలు పంపలేరు.

మొబైల్ టెలిఫోన్ యుగంలోకి భారత్ 1987 జనవరి 1న ప్రవేశించిందని కొద్దిమందికే తెలుసు. మహానగర్ టెలిఫోన్ నిగమ్ తన 'మొబైల్ రేడియో ఫోన్ సర్వీస్'ను ఢిల్లీలో ప్రారంభించడం ద్వారా ఇది మొదలైంది. అది కారులో అమర్చిన ఫోన్ యూనిట్‌ని ఉపయోగించి ప్రయాణిస్తున్నప్పుడు మాట్లాడటానికి వీలయ్యే ఒక ప్రాథమికమైన కార్ ఫోన్ సర్వీస్. కొన్ని డజన్ల ఫోన్లను మాత్రమే అప్పట్లో వ్యవస్థాపించారు.

1992లో దేశంలోని నాలుగు మెట్రో నగరాల్లో సెల్యూలార్ టెలిఫోన్ సేవలను అందించడానికి ప్రైవేట్ కంపెనీలకు లైసెన్స్ ఇచ్చారు. మొట్టమొదటి వాణిజ్యపరమైన సెల్యూలార్ మొబైల్ కాల్‌ను 1995 జూలై 31న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు కలకత్తా నుంచి న్యూఢిల్లీలో ఉన్న సమాచార మంత్రి సుఖ్‌రామ్‌కు చేశారు. కలకత్తాలో మొబైల్ కాల్ సర్వీస్‌ను మోడీ–టెల్‌స్ట్రా (బీకే మోడీ గ్రూప్, ఆస్ట్రేలియాకు చెందిన టెల్‌స్ట్రా జాయింట్ వెంచర్) అందించాయి. కొన్ని నెలల తర్వాత ఢిల్లీలో 'భారతి' సెల్యూలార్ సేవలు ఆరంభించింది.

ఆ రోజుల్లో మొబైల్ ఫోన్‌లో మాట్లాడటం ఖరీదైన వ్యవహారంగా ఉండేది – ఒక కాల్ చేయాలంటే నిమిషానికి రూ. 16.80, కాల్ రిసీవ్ చేసుకోవాలంటే రూ. 8.40 చెల్లించాల్సి వచ్చేది. ఫస్ట్ జనరేషన్ (1జి) డేటా టెక్నాలజీ అయిన జనరల్ పాకెట్ రేడియో సర్వీస్ (జీఆర్‌పీఎస్) అందించడానికి ఫోన్ కంపెనీలకు మరి కొన్నేళ్లు పట్టింది.

తర్వాతి రెండు దశాబ్దాల్లో అనేక మలుపులు తిరిగాయి. పాలసీ మార్పులు, ప్రీ–పెయిడ్ సర్వీస్, ఛోటా రీఛార్జ్, కొత్త ప్రాసెసింగ్ టెక్నాలజీలు, దూకుడైన రోలవుట్ ప్లాన్స్, సర్వీస్ నెట్‌వర్క్‌ల విస్తరణ, లోకల్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటివన్నీ కలిసి భారతీయులకు మొబైల్ ఫోన్లను సరసమైన ధరలకే అందుబాటులోకి తెచ్చాయి. అధిక కాల్ ఛార్జీలు పాతకథ అయిపోయాయి. జీఆర్‌పీఎస్ నుంచి, సూపర్ ఫాస్ట్ డేటా స్పీడ్ వరకు పయనించాం. మొబైల్ ఫోన్లు అంటే గతంలోలా ఎమర్జెన్సీ కాల్స్ చేసుకోవడానికి మాత్రమే కాదు, వినోదం నుంచి బ్యాంకింగ్ వరకు ప్రతి అవసరానికీ ఉపయోగపడుతున్నాయి. పిల్లలుగా ఉన్నప్పుడు, ల్యాండ్ లైన్ ఫోన్‌లో మనం సమాధానం ఇస్తుండగా మనకు కాల్ చేస్తున్న వ్యక్తి చిత్రాన్ని చూడటం సరదాగా ఉంటుందని జోక్ చేయడం నాకు గుర్తుంది. వీడియో కాల్స్ నిజంగానే ఇప్పుడు చిన్నపిల్లలాట అయిపోయింది!

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

భారతీయ సెల్‌ఫోన్ విప్లవంలో మలుపులు

టాక్ టైమ్‌కు ఎక్కువ ఖర్చు అవుతుండటం మొబైల్ ఫోన్లను సృజనాత్మకంగా ఉపయోగించడానికి దారితీసింది. సాధారణంగా, మీరు ఒక నంబరుకు కాల్ చేస్తున్నప్పుడు, ఆ వ్యక్తి కాల్ తీసుకోలేనప్పుడు దాన్ని మిస్డ్ కాల్ అంటారు. టాక్ టైమ్ ఆదా చేయడానికి, జనం మిస్డ్ కాల్స్ చేయడం ప్రారంభించారు. ఉద్దేశపూర్వకంగా 'కాల్ మి బ్యాక్', 'నేను చేరుకున్నాను' వంటి ముందస్తుగా నిర్దేశించిన సందేశాలను తెలియచేయడానికి మిస్డ్ కాల్స్ ఇస్తుంటారు. యజమానులకూ, డ్రైవర్లు, ఇంటి పనిమనుషులు వంటి పరిమితమైన టాక్ టైమ్ ఉన్న వారికీ మధ్య సమాచారానికి ఇది అనుకూలమైన సాధనం. కంపెనీలు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వ విభాగాలు తరచుగా వాడే మార్కెటింగ్ సాధనమే మిస్డ్ కాల్.

సామాన్య ప్రజలకు మొబైల్ ఫోన్‌ని రోజువారీ సాధనంగా చేసే ప్రయాణంలో ప్రీ–పెయిడ్ సర్వీస్ ఒక కీలక మలుపు. నెల చివరలో బిల్‌ని చెల్లించడానికి బదులుగా వినియోగదారులు టాక్ టైమ్‌ని కొని, దాన్ని నిర్దిష్ట కాలంలో తమ అవసరాల కోసం ఉపయోగిస్తారు. మరొక వినూత్న ఆవిష్కరణ 'ఛోటా రీఛార్జ్' లేదా మైక్రో రీఛార్జ్ కూపన్లు. నెలకు 200 లేదా 300 రీఛార్జ్‌కి బదులుగా కేవలం ఐదు రూపాయలకే చోటా రీఛార్జ్ చేసుకోవచ్చు. ఇది కూరగాయల వ్యాపారి, వ్యవసాయ కూలీ వంటివారికి కూడా మొబైల్ సేవలను సరసమైన ధరకు అందించే గేమ్ ఛేంజర్ అయ్యింది.

ఎఫ్ఎమ్‌సీజీ సిమ్ కార్డులు, రీఛార్జ్ సేవల రూపంలో ఫోన్ సర్వీస్‌ని స్థానిక పచారీ కొట్లు, ఫార్మసీలు, పాన్ షాపుల్లో విస్తృతంగా అందుబాటులో ఉంచడం జరిగింది. టెలికామ్ సంస్థల కోసం 'పాయింట్ ఆఫ్ ప్రెజెన్స్' లాగా సేవ చేయడమే కాకుండా, ఈ ఫ్రాంచైజీలు కంపెనీ స్టోర్లలోని కస్టమర్ రిలేషన్స్ ఉద్యోగుల లాగా చందాదారుల సమస్యలను లాంఛనప్రాయంగా పరిష్కరిస్తాయి. ఫోన్లు, వాటి సేవలు వేగంగా అమ్ముడయ్యే వినియోగ సరుకులు (ఎఫ్ఎమ్‌సీజీ)గా మారిపోయాయి.

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మనవే నయం



కెనడీ విమానాశ్రయం (అమెరికా)లో ఇమ్మిగ్రేషన్ క్లియరింగ్ కోసం 3 గంటలు గడిపాను. అదీ విమానంలో 16 గంటల ప్రయాణం తర్వాత. వీటితో పోల్చితే భారతీయ విమానాశ్రయాలు అత్యాధునికంగా ఉన్నాయి. అమెరికాకు వచ్చేప్పుడు ప్రవేశం నుంచి నిష్క్రమణ గేటుకి అరగంటలోపే పట్టింది.

– బర్ఖా దత్, జర్నలిస్ట్

పిరికి చర్య



ఛత్తీస్‌గఢ్, దంతెవాడలో చాలా మంది పోలీసుల మరణానికి కారణమైన నక్సలైట్ల పిరికి ఐఈడీ పేల్చివేత చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాను. తమ జీవితాలను త్యాగం చేసిన ధైర్యశాలురకు సెల్యూట్!

– నవీన్ పట్నాయక్, ఒడిషా ముఖ్యమంత్రి

శుభాకాంక్షలు



ఇజ్రాయిల్ ప్రజలకు, కెనడా వ్యాప్తంగా ఉన్న యూదు సమాజానికి, ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయిల్ దేశ స్థాపన 75వ వార్షికోత్సవం జరుపుకొంటున్న వారికి: హేపీ ఇండిపెండెన్స్ డే!

– జస్టిన్ ట్రూడో, కెనడా ప్రధాని

ఇదా పద్ధతి?



నిరసనలో ఉన్న భారత రెజ్లర్లు జంతర్ మంతర్ దగ్గర వ్యాయామం చేస్తున్నారు. తన క్రీడాకారులను వీధులకెక్కేలా చేసేది ఎప్పటికీ మేటి ఒలింపిక్ దేశం కాలేదు.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

మూల కారణం




విద్యావంతురాలైన అఫ్గాన్ మహిళ తాలిబన్ సేనను పెంచదు. తాలిబన్ స్త్రీద్వేషికి భార్యగా ఉండదు. తనను కేవలం ఒక వస్తువుతో సమానంగా చూసే తాలిబన్ల పితృస్వామిక ఇస్లామీయ వ్యాఖ్యానాన్ని అంగీకరించదు. ఇంట్లోనే తాలిబన్లకు నిరోధకమవుతుంది. అందుకే స్త్రీల విద్యను తాలిబన్లు నిషేధించారు.

– అమ్రుల్లా సలేహ్, అఫ్గాన్ మాజీ ఆపద్ధర్మ అధ్యక్షుడు

పశువైద్యం కత్తి మీద సాము!

సందర్భం



డా॥ మల్లంపల్లి సాయి బుచ్చారావు

ప్రపంచంలోని అన్ని దేశాల సంస్కృతుల్లోనేకాక, ఆర్థిక వ్యవస్థల్లోనూ పశు సంపద కీలక పాత్ర వహిస్తుంది. పశు సంపద ద్వారా ఆర్థికాభివృద్ధి, సమాజ ఆరోగ్యం, ఆహార భద్రత, జీవనోపాధి కలుగుతున్నాయి. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) 2009 అంచనాల ప్రకారం ప్రపంచ జనాభాకు 15 శాతం శక్తి నిచ్చే పోషకాలు, 25 మాంసకృత్తులు పశు సంపద ద్వారా లభిస్తున్నాయి. మారుతున్న జీవనశైలి, వాతావరణ మార్పుల్లో ప్రపంచ ఆహార భద్రతకు పశు సంపద మాత్రమే ప్రత్యామ్నాయంగా కనిపిస్తుంది. ప్రపంచంలో 60–65 శాతం వ్యవసాయం పశువుల శక్తితోనే చేస్తున్నారు. ఇదే సమయములో పశువుల వలన మీథేన్ విడుదల ద్వారా ప్రపంచ ఉష్ణోగ్రత (గ్లోబల్ వార్మింగ్) 14 శాతం పెరుగుతోందనీ పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పశు వైద్య రంగానికి ఇదొక సవాల్. పశు వైద్య రంగం... పశువుల ఆరోగ్యం, ఉత్పత్తి, అభివృద్ధి మాత్రమే కాకుండా అవి విడుదల చేసే మీథేన్, వాటి ద్వారా సంక్రమించే సంక్రమిత వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కొనే విధంగా ఎప్పటికప్పుడు నవీనీకరణ చెందాలి.



1990 మధ్య కాలంలో మానవ, పశు ఆరోగ్యాలు, పర్యావరణం వంటి బహుముఖ పరిస్థితులను అధ్యయనం చేసే శాస్త్రం ఆవిర్భవించింది. దీనిని 'కన్సర్వేషన్ మెడిసిన్' లేదా 'ఎన్విరాన్మెంటల్ మెడిసిన్' అంటారు. పర్యావరణ మార్పుల వలన పశువులు, మనుషుల్లో కలిగే వ్యాధులు గురించి సరైన అధ్యయనాలు లేవు. ఫలితంగా కరోనా లాంటి మహమ్మారి ప్రపంచాన్ని గడగడ లాడించింది.

పశు వైద్య రంగం... మానవ సంస్కృతి, ఆరోగ్యం, ఆనందం, అభివృద్ధిల్లో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కీలక పాత్ర వహిస్తుంది. వైద్యంలో విచక్షణను అనుసరించకపోతే అది పశువులకే కాదు వాటిని ఆధారం చేసుకున్న మానవులకూ, అవి జీవిస్తున్న పరిసరాలకూ ముప్పు సంభవిస్తుంది. ఉదాహరణకు పశువులలో నొప్పులను నివారించటానికి 'డైక్లో ఫెనాక్ సోడియం' అనే ఇంజెక్షన్స్ వాడుతారు. ఒక వేళ ఇంజక్షన్ చేసిన పశువు మరణిస్తే ఆ కళేబరాన్ని తిన్న రాబందులు 'గౌట్' వచ్చి మరణిస్తాయి. రాబందులు మృత కళేబరాలను ఇతర వ్యర్థ పదార్థాలను తినటం ద్వారా ప్రకృతిని శుభ్రంగా ఉంచటంతో పాటు అంటు వ్యాధులు ప్రబలకుండా కాపాడుతున్నాయి.

మరొక ఉదాహరణ, ఆహారంగా తీసుకునే పశుపక్ష్యాదులకు వైద్యం చేయడం. ఇది కత్తి మీద సాము లాంటిది. పాలు ఇచ్చే పశువులకు 'ఆక్సీ టెట్రా సైక్లిన్' లాంటి ఏంటీబయోటిక్స్ ఇవ్వడం వలన వాటి అవశేషాలు పాలలో 21 రోజులు కనిపిస్తాయి. ఇండియా లాంటి దేశాలలో ఆ పాలను పారబోసే పరిస్థితులు లేవు. ఒక పక్క పశువు ఆరోగ్యం కాపాడాలి... మరోపక్క వాడిన మందుల అవశేషాల వలన మనుష్యులలో ఎటువంటి దుష్ఫలితాలు లేకుండా చూడాలి. ఇది పశు వైద్యుని నైపుణ్యంపై ఆధారపడి ఉంటుంది.

ఇంత ప్రాముఖ్యత ఉన్న పశు వైద్య రంగం గుర్తింపు కోసం ప్రతి ఏడాది ఏప్రిల్ నెలలో నాల్గవ శనివారం ఒక థీమ్‌తో అంతర్జాతీయ పశు వైద్య దినోత్సవం జరుపుతారు. పశు వైద్యవృత్తిలో వైవిధ్యం, ఈక్విటీ సమగ్రతను ప్రోత్సహించడం ఈ ఏడాది థీమ్.

వ్యాసకర్త అసిస్టెంట్ డైరెక్టర్ (ఏహెచ్); ఏవీహెచ్ జీలుగుమిల్లి, ఏలూరు జిల్లా
(ఏప్రిల్ 29న ప్రపంచ పశువైద్య దినోత్సవం)

ప్రజా పాలనా వ్యవస్థలో మైలురాయి

సందర్భం



డా॥ సత్తు లింగమూర్తి

స్వాతంత్ర్యానంతరం ఇన్నేళ్ల కాలంలో న్యూ ఢిల్లీనీ, పీఎంఓనూ ప్రజలకు దగ్గర చేసిన వారు ప్రధాని నరేంద్ర మోదీ. 2014లో మోదీ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన తర్వాత పాలనా వ్యవస్థను ప్రజల మధ్యకు నేరుగా తీసుకురావడానికి 'మన్ కీ బాత్' ప్రారంభించారు. ఏప్రిల్ 30న ఈ కార్యక్రమం 100వ ఎపిసోడ్ పూర్తి చేసుకోబోతోంది. ఇది మోదీ సుపరిపాలన వ్యవస్థ అభివృద్ధి క్రమంలో ఒక సువర్ణాధ్యాయాన్ని సృష్టించిన కార్యక్రమం అనడంలో అతిశయోక్తి లేదు. ఈ కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రి ప్రజలతో నేరుగా సంబంధాలను ఏర్పరుచుకోవడమే కాకుండా వారిలో ఒకరిగా కలిసిపోయారు. అందరికీ అందుబాటులో ఉండే 'రేడియో'ను దీని ప్రసారానికి ఎంచుకోవడం వల్ల ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లింది. 'మన్ కీ బాత్' భారతీయుల మనసుల్లోకి ఎంతగా చొచ్చుకుపోయిందో తెలిపే వివరాలను పరిశీలిస్తే.. దాని ప్రాముఖ్యం మరింత స్పష్టంగా అర్థమవుతుంది.

ఐఐఎం–రోహ్‌తక్ అధ్యయనం... ఈ కార్యక్రమాన్ని కులాలకు, మతాలకు అతీతంగా దేశం మొత్తంలో 100 కోట్ల మంది కనీసం ఒక్కసారైనా విన్నారనీ, 23 కోట్ల మంది ప్రతి 'మన్ కీ బాత్' కార్యక్రమాన్నీ విన్నారనీ, అదేవిధంగా దేశంలో 96 శాతం మందికి దీని గురించి అవగాహన ఉందనీ పేర్కొంది. ఈ కార్యక్రమం పౌరుల బాధ్యతలనూ, దేశం పట్ల వారి ప్రవర్తననూ, సుహృద్భావపూరిత ఆశావహ దృక్పథాన్నీ ఏర్పరిచిందని సర్వే పేర్కొంది. ఈ సర్వే ప్రకారం 60 శాతం ప్రజలను 'మన్ కీ బాత్' దేశ నిర్మాణం విషయంలో ఉత్తేజితులను చేసింది. 55 శాతం ప్రజల్లో దేశం పట్ల వారి ప్రవర్తన ప్రభావితమయ్యింది. 63 శాతం ప్రజలు ప్రభుత్వ కార్యక్రమాల గురించి విన్నారు. 59 శాతం ప్రజలకు ప్రభుత్వం పట్ల నమ్మకం పెరిగింది. 73 శాతం ప్రజలకు కేంద్ర ప్రభుత్వంపై సకారాత్మకమైన ఆశలు పెరిగాయి.

'మన్ కీ బాత్' కార్యక్రమం 11 విదేశీ భాషలలో తర్జుమా జరిగింది. 'భేటీ బచావో–



భేటీ పఢావో', 'స్వచ్ఛ్ భారత్ అభియాన్', 'నగదు బదిలీ' వంటి అనేక ప్రభుత్వ కార్యక్రమాలు ఈ కార్యక్రమం ద్వారా ప్రజల మధ్యకు నేరుగా చేరడంవల్ల అనేకమంది లబ్ధిదారులయ్యారు. అంతే కాకుండా ప్రజలను ఉత్తేజ పరచడానికి దేశంలోని నలుమూలలా జరిగిన అభివృద్ధినీ, అందుకు కారణమైన వ్యక్తులు, సంస్థల విజయ గాథలను ప్రధాని ప్రజలకు చెప్పడం ఈ కార్యక్రమంలో ఆకర్షించే ప్రధాన అంశం.

దేశ ప్రజలకు తమ జీవితాల పట్ల ఒక ఆశావాహ దృక్పథం నెలకొనడానికి 'మన్ కీ బాత్' ఎంతగానో తోడ్పడింది. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా దేశ ప్రజలను ఏకం చేయడానికి ప్రధాని దీనిని బాగా ఉపయోగించుకున్నారు. ముఖ్యంగా యువతరాన్ని ఉత్తేజితులను చేసి దేశ నిర్మాణానికి వారిని ఒక్క తాటిపై నడిపించడానికి ప్రధాని ఎంచుకున్న మార్గాలలో ప్రముఖమైనది ఈ కార్యక్రమం.

ప్రతి నెల చివరి ఆదివారం రోజు జరిగే ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ప్రజల నుండి సూచనలు, సలహాలు తీసుకుంటారు. ప్రజల నుండి రకరకాల సమస్యలను తెలుసుకోవడానికీ, ప్రభుత్వ కార్యక్రమాలు, వాటి అమలుతీరుపై సమాచారాన్ని సేకరించడానికీ ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా మోదీ ఉపయోగించుకుంటున్నారు. సామాజిక, అభివృద్ధి కార్య క్రమాలను ప్రకటించడానికి దీనిని వాడుకున్నారు. 'స్వచ్ఛ్ భారత్ అభి యాన్', 'భేటీ బచావో – భేటీ పఢావో', 'స్కిల్ ఇండియా' వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను ఈ కార్యక్రమం ద్వారా ప్రకటించడం ఈ సందర్భంగా గమనార్హం. కోవిడ్–19 సమయంలో ప్రజలకు ప్రధానమంత్రి తగిన ధైర్యాన్నీ, దాన్ని ఎదుర్కోవడానికి కావలసిన అవగాహననూ కల్పించడానికి దీనిని వాడుకున్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 30న జరుగబోయే 100వ 'మన్ కీ బాత్' కార్యక్రమం కోసం దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తు న్నారు.

వ్యాసకర్త అర్థశాస్త్ర సహాయకాచార్యులు, కర్ణాటక కేంద్రీయ విశ్వవిద్యాలయం
ఇ–మెయిల్ : sathulingamurthy@gmail.com
('మన్ కీ బాత్' 100వ ఎపిసోడ్ సందర్భంగా)

అతితెలివి అనర్థం

'మేల్వడసియు, బుద్ధిచాలని యభాగ్యులు తత్ఫలమంద నేర్తురే?' (మంచన, కేయూరబాహు చరిత్రము, ద్వితీయాశ్వాసం, 33వ పద్యంలో భాగం). ఏదో పూర్వ సుకృతం వలన కొంత మేలు జరుగుతుంది. అయితే దాని ఫలం పొందే సమయం వచ్చే సరికి అకస్మాత్తుగా బుద్ధిలో పొడసూపే అతి తెలివి దానిని చేజారుస్తుంది.

పూర్వం ఒకడు తపస్సుచేసి వరంగా మృత్యుంజయత్వాన్ని దేవీప్రసాదంగా (ఎప్పటికీ వాడిపోని ఆకుల నుండి పిండ గలిగే) ఆకు పసరు రూపంలో పొందాడు. అడవి నుండి ఇంటికి వెళ్ళే దారిలో ఒక మృతజీవి కళేబరం కనబడింది. దానిని చూసిన వాడికి, దేవి నుండి ప్రసాదంగా పొందిన ఆకుపసరు మహత్యాన్ని పరీక్షించాలన్న పెడబుద్ధి పుట్టింది. వెంటనే చేతిలోని ఆకుల పసరును ఆ కళేబరంపై పిండాడు. వాడి కర్మకు ఆ కళేబరం నుండి ఒక పులి జీవం పోసుకుని లేచి నిలబడింది. అలా జీవం పోసుకున్న ఆ పులి కళ్ళకు ఎదురుగానే కనబడింది ఆహారం. మరింక ఆలస్యం ఎందుకు చేస్తుంది? అలా ముగిసింది వాని కథ.



మృత్యుంజయత్వం చేతిలో ఉండడం గొప్ప వరం అనుకోవడం ఒక భ్రమ. తన చేతలకు తానే అబ్బురపడే ఒక తెలివి లేని వ్యక్తి చేతిలో అదే ఒక్కొక్కప్పుడు వాని మృత్యువుకు కారణం కూడా అవుతుందన్నది ఇందులో సారాంశం. ఒక్కొక సందర్భంలో వరం పొందడం అన్నది సమస్యగా కనపడదు. ఆ వరం పొందిన ఆనందంలో, ఉన్న మతిని పోగొట్టుకుని, దానిని ఉపయోగించుకొని చేసే పనే అసలైన సమస్యగా పరిణమించి పాతం నేర్పుతుంది. శివుని శరీరంపై ఉండే భస్మం నుండి పుట్టినవాడు భస్మాసురుడు. భక్తికి మెచ్చి వరం కోరుకొమ్మంటే తాను 'నెత్తిన చెయ్యి పెడితే బూడిదై మిగలాలని' కోరతాడు. ఇవ్వటమే తెలిసిన దేవుడు పరమశివుడు. కనుక అడిగినదే ఇచ్చేశాడు. అయితే ఆ వరమే చివరికి ఆ అసురుడికి మృత్యుకారణమైన వైనం 'మోహినీ భస్మాసుర' కథగా అందరూ ఎరిగినదే. అందుచేతనే 'మతి లేనివాడు విద్యాన్వితు డయ్యును మేలు వడయ నేరడు' అని మంచన మరో చోట చెప్పిన మాటలు కూడా విలువైనవి.

– వెంకట్ భట్టు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.సప్తమి ప.12.56 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** పునర్వసు ఉ.6.35 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ప.3.26 నుండి 5.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.50 నుండి 10.42 వరకు తిరిగి ప.2.53 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** రా.2.04 నుండి 3.50 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.41, **సూర్యాస్తమయం:** 6.13.

క్లుప్తంగా...

డిఫెన్స్ సెక్రటరీ గిరిధర్ తూర్పు నౌకాదళం సందర్శన



తీర భద్రత వ్యూహాల గురించి అడిగి తెలుసుకుంటున్న రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ అర్మణే

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర రక్షణశాఖ కార్యదర్శి గిరిధర్ అర్మణే బుధవారం మధ్యాహ్నం విశాఖపట్నం వచ్చారు. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రానికి చేరుకున్న గిరిధర్‌కు ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్ గుప్తా స్వాగతం పలికారు. అనంతరం ఈస్టర్న్ నేవల్ కమాండ్‌లోని పలు ప్రాంతాలను గిరిధర్ సందర్శించారు. ఈ సందర్భంగా తూర్పు నౌకాదళ పరిధిలో జరుగుతున్న ఆపరేషనల్ యాక్టివిటీస్, తీర భద్రతకు అనుసరిస్తున్న వ్యూహాల గురించి ఆయనకు ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ బిస్వజిత్ వివరించారు. అనంతరం విశాఖ కేంద్రంలో జరుగుతున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించి సెక్రటరీ గిరిధర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తూర్పు నౌకాదళ అధికారులు, ఉద్యోగులు, సెయిలర్స్, నేవీ కుటుంబ సభ్యులతో డిఫెన్స్ సెక్రటరీ గిరిధర్ సమావేశమై పలు అంశాలపై మాట్లాడారు.

త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న శ్రీ సద్గురు సంగీత సభ బాధ్యులు ప్రకాష్,గౌరీనాథ్, గాయత్రీ గౌరీనాథ్, సుధాకర్

విజయవాడ కల్చరల్: ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని శృంగేరీ పీఠపాలిత శివరామ కృష్ణ క్షేత్రంలో సద్గురు త్యాగరాజ స్వామి 256వ జయంతి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలుత శ్రీసద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి విగ్రహానికి పూజలు నిర్వహించి సంగీత ఉత్సవాలను ఆరంభించారు. అంబటిపూడి రామలక్ష్మి, ఓరుగంటి లక్ష్మి, సింగరాజు లావణ్య, వాడ్రేవు రాజేశ్వరి, ఎన్.వనమాలి, కుప్పా ప్రద్యుమ్న, భమిడిపాటి శ్రీలక్ష్మి, సీనియర్ సంగీత విద్వాంసులు వేమూరి విశ్వనాథ్, పోవూరి గౌరీనాథ్ త్యాగరాజ కృతులను గానం చేశారు. టి.కె.వి.రామానుజాచార్యులు వయోలిన్, కొండా శశిధర్ వీణ, కుమార్‌బాబు వేణువుపై త్యాగరాజ స్వామి సంకీర్తనలను పలికించారు. శ్రీ సద్గురు సంగీత సభ అధ్యక్షుడు బి.వి.ఎస్.ప్రకాష్ మాట్లాడుతూ నాదోపాసన ద్వారా ముక్తిని సాధించవచ్చునని త్యాగరాజ స్వామి రుజువు చేశారన్నారు. ఉపాధ్యక్షుడు జె.ప్రభాకరశాస్త్రి, బి.హరిప్రసాద్, సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్ పాల్గొన్నారు.

బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్ మృతి

- పూరీ జగన్నాథ స్వామి దర్శనం అనంతరం కుప్పకూలిన దివాకర్



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్ (55) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఒడిశాలోని పూరీ జగన్నాథ్ స్వామి దర్శనం అనంతరం గుండె నొప్పితో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు, స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యంలో ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఒడిశా ప్రభుత్వంతో టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడారు. మృతదేహం గురువారం ఉదయం విశాఖకు వచ్చే అవకాశం ఉంది. ఆయన మృతి పట్ల డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, వైఎస్సార్ సీపీ నేతలు, అభిమానులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా, కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు మహానేత వైఎస్సార్‌తో సన్నిహితంగా ఉన్న ఆయన తరువాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటూ ఉత్తరాంధ్రలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేశారు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ బీసీ అధ్యయన కమిటీ అధ్యక్షుడిగా పనిచేస్తూ బీసీలను వైఎస్సార్ సీపీకి చేరువ చేయడంలో కీలకపాత్ర పోషించారు.



పార్వతీపురం మన్యం జిల్లా వెంకటిగూడలో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే కళావతి



తిరుపతి జిల్లా ఎర్రగుడిపాడులో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



గుంటూరు నగరంలోని కోబాల్డ్‌పేటలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దాళిగిరి, పార్టీ నాయకులు

తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో

ఏసీబీ తనిఖీలు

గుంటూరు జిల్లా మేడికొండూరు తహసీల్దార్ నుంచి రూ.లక్షకు పైగా స్వాధీనం

- గతంలో ఇదే కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ హోదాలో ఏసీబీకి చిక్కిన కరుణకుమార్
- పలు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనూ తనిఖీలు.. భారీగా నగదు స్వాధీనం
- ఇళ్ల బిల్లుల మంజూరుకు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విజయనగరం జిల్లా తెర్లాం ఏఈ



తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అనధికార వ్యక్తులను విచారిస్తున్న ఏసీబీ డీఎస్పీ

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: రాష్ట్రంలో డీజీపీ ఆదేశాల మేరకు ఏసీబీ అధికారులు 9 తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఏసీబీ విభాగం టోల్‌ఫ్రీ నంబర్ 14400, ఏసీబీ యాప్ 14400లకు వచ్చిన ఫిర్యాదులపై స్పందించి ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు. బద్వేల్(వైఎస్సార్ జిల్లా), తిరుపతి రూరల్, అనంతపురం రూరల్, విశాఖపట్నం జగదాంబ, తుని(కాకినాడ జిల్లా), నర్సాపురం, ఏలూరు, కందుకూరు (నెల్లూరు జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, మేడికొండూరు(గుంటూరు), జలుమూరు(శ్రీకాకుళం) తహశీల్దార్ కార్యాలయాల్లో దాదాపు 35 మంది అధికారుల బృందాలు ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. కాగా, గుంటూరు జిల్లా మేడికొండూరు తహసీల్దార్ కరుణకుమార్ కారులో అనధికారికంగా ఉన్న రూ.లక్షా, 4 వేల, 7 వందలు నగదును, కారు డ్యాష్ బోర్డులో ఉన్న పలు రికార్డులు, సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టుబడ్డ నగదుపై పూర్తి స్థాయి వివరాలు చెప్పకపోవడంతో తహసీల్దార్‌ను కార్యాలయానికి తీసుకొచ్చి కంప్యూటర్ డేటాను తనిఖీ చేశారు. ఇదే తహసీల్దార్ కరుణకుమార్ మేడికొండూరు కార్యాలయం లోనే సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సమయం (2009)లో లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ వీరవెంకటప్రతాప్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ మేడికొండూరు తహసీల్దార్‌పై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ప్రత్యేక నిఘా పెట్టినట్టు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయాల్లో పలు రికార్డుల్లో అక్రమాలను గుర్తించినట్టు తెలిసింది. నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాల్సిన అర్జీలను కూడా ఉద్దేశపూర్వకంగా పక్కనబెడుతున్నట్టు గుర్తించారు. తనిఖీలు గురువారం కొనసాగనున్నాయి. అనంతరం వివరాలను మీడియాకు వెల్లడించనున్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో లెక్కల్లో చూపని నగదు స్వాధీనం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ దాడులు చేసి లెక్కల్లో చూపని నగదు భారీగా స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం రూరల్ (రుద్రంపేట) సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై జరిగిన సోదాల్లో రిజిస్ట్రేషన్ చలానాల పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ మహమ్మద్ అలీ స్వయాన అల్లుడు, ఆయన వాహన డ్రైవరుగానూ ఉన్న షేక్ ఇస్మాయిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద అక్రమంగా దాచుకున్న రూ.2.27 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. విశాఖ జగదాంబ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన సోదాల్లో ఇటీవల కాలంలో జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించిన దస్త్రాలను ఏసీబీ పరిశీలించారు. బుధవారం జరిగిన రిజిస్ట్రేషన్ లావాదేవీలకు మించి అధికంగా నగదు, అలాగే అనధికార వ్యక్తులు కార్యాలయంలో ఉండటంపైనా ఆరా తీశారు. తిరుపతి రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై జరిగిన సోదాల్లో లెక్కల్లో చూపకుండా ఉన్న మొత్తం రూ.1,53,410 నగదును సీజ్ చేశారు.

'నవరత్నాలు–పేదలు అందరికీ ఇళ్ల' పథకం కింద ఇంటి బిల్లులను మంజూరు చేసేందుకు ఓ లబ్ధిదారు నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటూ గృహనిర్మాణ శాఖ ఏఈ బుధవారం ఏసీబీకి చిక్కారు. విజయనగరం జిల్లా తెర్లాం మండలం గృహనిర్మాణ శాఖ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు బిల్లు మంజూరు చేసేందుకు రూ.20వేలు లంచం డిమాండ్ చేశారు. దీనిపై లబ్ధిదారుడు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 14400కు ఫిర్యాదు చేశారు. దాంతో రంగంలోకి దిగిన లబ్ధిదారు నుంచి లంచం తీసుకుంటుండగా ఏఈ వెంకటేశ్వరరావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన్ని విశాఖపట్నం ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు.



రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన తెర్లాం హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు

నర్సాపూర్-బెంగళూరు మధ్య వేసవి ప్రత్యేక వారాంతపు రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): వేసవిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విజయవాడ మీదుగా నర్సాపూర్–బెంగళూరు మధ్య 8 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. - నర్సాపూర్–బెంగళూరు ప్రత్యేక రైలు (07153) మే 5 నుంచి 26 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3.50 గంటలకు నర్సాపూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07154) మే 6 నుంచి 27 వరకు ప్రతి శనివారం ఉదయం 10.50 గంటలకు బెంగళూరులో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 6 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది. రెండు మార్గాలలో ఈ రైలు పాలకొల్లు, వీరవాసరం, భీమవరం జంక్షన్, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలర్‌పట్టాయ్, బంగార్‌పేట్, కృష్ణార్జునపురం స్టేషన్లలో ఆగుతుంది.

మంత్రి వేణు సంతకం ఫోర్జరీ చేసి టోకరా

- ఉద్యోగాలు ఇప్పిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకుడి మోసం

రామచంద్రపురం: రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలక్రిష్ణ లెటర్ హెడ్ తయారు చేసి..ఆయన సంతకాన్ని ఫోర్జరీ చేసి డబ్బులు వసూలు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుడి మోసం వెలుగులోకి వచ్చింది. బాధితులు, రామచంద్రపురం ఎస్‌ఐ డి.సురేష్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామచంద్రపురం పట్టణానికి చెందిన ఇసుకపట్ల సతీష్‌కుమార్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆయన 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం ఇంద్రపాలెంకు చెందిన మామిడాల ఈశ్వర మాధవ్‌కుమార్ అన్నకుమార్తెకు, ఆయన మేనకోడలికి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేశాడు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి వేణుగోపాలకృష్ణ లెటర్‌హెడ్ తయారు చేసి, సంతకాన్ని ఫోర్జరీ చేసి ఓ లెటర్‌ను వారికి ఇచ్చాడు. అయితే అది నకిలీ లెటర్‌హెడ్ అని తేలడంతో.. ఉద్యోగాల నిమిత్తం తమ వద్ద సతీష్‌కుమార్ రూ.7లక్షలు వసూలు చేశాడని మామిడాల ఈశ్వర మాధవ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇసుకపట్ల సతీష్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్‌బాబుతెలిపారు.

ముక్కంటి సేవలో శ్రీలంక సుప్రీంకోర్టు న్యాయమూర్తి



శ్రీకాళహస్తి ఆలయ ధ్వజస్తంభం వద్ద జస్టిస్ తురైరాజా

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం శ్రీలంక సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్. తురై రాజా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనమిచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక తీర్థప్రసాదాలు అందజేశారు.

గుండెపోటుతో రష్యన్ శాస్త్రవేత్త మృతి

సాక్షి, చెన్నై: తిరునల్వేలి జిల్లా కూడంకులం అణు విద్యుత్ కేంద్రంలో రష్యన్ శాస్త్రవేత్త గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. భారత్, రష్యాలు సంయుక్తంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాయి. ఇక్కడ ప్రస్తుతం 3, 4 యూనిట్లు ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. రష్యా నుంచి వచ్చిన శాస్త్రవేత్తల బృందం ఈ పనులను పరిశీలిస్తోంది. ఈ బృందంలోని రష్యాకు చెందిన గ్లినిన్ గోబ్లిన్(61) అనే శాస్త్రవేత్త ఉదయం విధుల్లో ఉండగా గుండెపోటుకు గురయ్యారు. ఆయన్ను ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్టు నిర్ధారించారు. ఈ సమాచారాన్ని చెన్నైలోని రష్యన్ రాయబార కార్యాలయ అధికారులకు కూడంకులం అధికారులు అందించారు. ఆయన మృతదేహాన్ని రష్యాకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

గుడ్డు తిని చిన్నారి మరణంపై హెచ్ఆర్‌సీ ఆదేశాలు సరైనవే

సాక్షి, అమరావతి : చిత్తూరు జిల్లా కుప్పంలోని గల్లేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో 2022 ఫిబ్రవరిలో గుడ్డు తిని ఓ చిన్నారి మరణించిన ఘటనలో బాధిత కుటుంబానికి రూ.8 లక్షల పరిహారం చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్, అధికారులను ఆదేశిస్తూ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్‌సీ) ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు సమర్థించింది. ఈ ఆదేశాల్లో జోక్యానికి నిరాకరించింది. హెచ్ఆర్‌సీ ఆదేశాలను సవాలు చేస్తూ టీచర్, అధికారులు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని కొట్టేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అధికారులు ఈ వ్యాజ్యం దాఖలు చేసి ఉండాల్సింది కాదంది. ఇలాంటి వ్యాజ్యం ద్వారా ప్రభుత్వ ప్రతిష్ట మసకబారుతుందని వ్యాఖ్యానించింది. రూ.8 లక్షల పరిహారం తక్కువని, నాలుగేళ్ల కిందట కుక్క కాటు కేసులో తాను రూ.10 లక్షల పరిహారానికి ఆదేశాలు ఇచ్చానని ప్రధాన న్యాయమూర్తి గుర్తు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ఈ ఘటనకు అంగన్‌వాడీ టీచర్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులే బాధ్యత వహించాలని ధర్మాసనం చెప్పింది. చిన్నారి మరణించిన వెంటనే పోస్టుమార్టం చేసి ఉంటే వాస్తవాలు వెలుగులోకి వచ్చేవని, ఇప్పుడు చేయడం వల్ల ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించింది.

టీటీడీ అధికారులు, సిబ్బంది పారిశుద్ధ్య విధుల్లో పాల్గొనాలి

- పారిశుద్ధ్య కార్మికుల సమ్మెను సమర్థంగా ఎదుర్కొందాం
- భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు
- టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుమల: సులభ్ సంస్థలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు మెరుపు సమ్మెకు వెళ్లిన నేపథ్యంలో టీటీడీలో పనిచేస్తున్న అన్ని విభాగాల అధికారులు, రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా దీన్ని ఒక యుద్ధంగా భావించి విజయం సాధించాలని టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. ఆయన బుధవారం రాత్రి తిరుమలలో జిల్లా అధికారులు, అన్ని విభాగాల అధిపతులు, ఉద్యోగసంఘాల నాయకులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీలో ఎనిమిది వేల మంది రెగ్యులర్, నాలుగు వేల మంది కార్పొరేషన్ ఉద్యోగులు ఉన్నారని, ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ఎదుర్కోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని చెప్పారు. విభాగాధిపతుల ఆధ్వర్యంలో టీటీడీ ఉద్యోగులంతా సెక్టార్లవారీగా పారిశుద్ధ్య విధులు నిర్వర్తించాలని కోరారు. శ్రమదానానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, తిరుమల బాలాజీనగర్‌లో అధికారులు, ఉద్యోగులు కలిసి పరిశుభ్రంగా మార్చామని చెప్పారు. ఆసక్తిగల శ్రీవారి సేవకులను కూడా పారిశుద్ధ్య విధులు నిర్వర్తించడానికి ఆహ్వానించాలని పీఆర్వోను ఆదేశించారు. దాదాపు 25 రోజులపాటు పారిశుద్ధ్య విధులు నిర్వర్తించాలని, తర్వాత కొత్త ఏజెన్సీని ఏర్పాటు చేసుకుని పారిశుద్ధ్య విధులు అప్పగిస్తామని చెప్పారు. మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకుని ఉద్యోగులు పారిశుద్ధ్య విధులు నిర్వర్తించాలని కోరారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఈ సంస్థలో భవిష్యత్తులో సమ్మెలు జరగకుండా కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. మూడు రోజులపాటు తిరుపతి జిల్లాలోని పంచాయతీల సిబ్బందిని పారిశుద్ధ్య విధులకు రప్పిస్తున్నట్టు తెలిపారు. తిరుపతి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సమ్మె వెనుక కొన్ని శక్తుల కుట్ర ఉందని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ పారిశుద్ధ్య విధుల్లో పాల్గొంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఎస్‌వీబీసీ సీఈవో షణ్ముఖకుమార్, ఎఫ్ఏసీఏవో బాలాజీ, లా ఆఫీసర్ రెడ్డెప్పరెడ్డి, చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బహుజనుల జోలికొస్తే ఖబడ్దార్

941వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: బహుజనుల జోలికొస్తే చంద్రబాబు అండ్‌కోకు రాజకీయ సమాధి కడతామంటూ బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 941వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. రాష్ట్రంలో మరే సమస్యలు లేనట్లు బాబు రాజధానిలో కులవాదులను అడ్డుపెట్టుకుని పేదల ఇళ్లస్థలాలను అడ్డుకునేందుకు అన్ని వ్యవస్థలను వాడుకోవడం దుర్మార్గమని, ఈ ప్రాంతం బాబు.. ఆయన కులవాదుల జాగీరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బహుజనులు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తే తమ సామాజిక వర్గాన్ని మించి ఎక్కడ దాటిపోతారో అనే భయంతో తమ హక్కులకు అడ్డుతగులుతూ ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. పేదలకు స్థలాలివ్వకుండా బాబు అడ్డుకుంటుంటే వామపక్షాలు మౌనం దాల్చి చూస్తూ.. పార్టీ సిద్ధాంతాలను తుంగలో తొక్కి అమ్ముడుపోతున్న వారికి రాష్ట్రంలో తిరిగే అర్హత లేదన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, పులి దాసు, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రంగ అభివృద్ధిపై ప్రభుత్వానికి ప్రత్యేక శ్రద్ధ

రాజ్య సభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



వీరవాసరం రొయ్యల రైతుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతునున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, చిత్రంలో వడ్డే రఘురాం

వీరవాసరం: ఆక్వా రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం గ్రామంలో తులసి కన్వెన్షన్ సెంటర్లో బుధవారం రొయ్యల రైతుల సంక్షేమ సంఘం- వీరవాసరం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా రొయ్య రైతుల సంక్షేమం కోసం నిరంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని చెప్పారు. ఫీడ్ విషయంలో ముఖ్యమంత్రి సూచనల మేరకు రొయ్య రైతుల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని తక్కువ రేటులో మేతను కూడా సరఫరా చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. అప్సడా వైస్ చైర్మన్ వడ్డే రఘురాం మాట్లాడుతూ రొయ్య రైతుల కష్టాలను సీఎం వైఎస్ జగన్‌కు వివరించగానే తక్షణం స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. కరోనా సమయంలో రొయ్యల రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా చూశారని గుర్తు చేశారు. సీడ్ ఫీడ్ విషయంలో కచ్చితంగా రొయ్య రైతులకు మంచి జరిగేలా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని వివరించారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆక్వా రంగం మీద లక్షలాది మంది ఉపాధి పొందుతున్నారని, దేశానికి అధిక ఆదాయం ఆక్వా రంగం ద్వారానే వస్తుందని చెప్పారు. జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ మాట్లాడారు.

బాలల అక్రమ రవాణాకు చెక్

- బిహార్‌కు చెందిన 18 మంది బాలలను సంరక్షించిన ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ
- విజయవాడ ఎస్‌కేసీవీ చిల్డ్రన్స్ ట్రస్ట్ వసతి గృహానికి తరలింపు



విజయవాడ స్టేషన్‌లో.. పోలీసులు రక్షించిన బాలలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): బిహార్ రాష్ట్రం నుంచి విజయవాడ మీదుగా బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు తరలిస్తున్న మైనర్‌ల అక్రమ రవాణాను విజయవాడ ఆర్‌పీఎఫ్ పోలీసులు అడ్డుకుని వారిని రక్షించారు. విజయవాడ డివిజన్ సీనియర్ డీఎస్‌సీ(డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్) వల్లేశ్వర బీటీ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన మైనర్ (బాలురు)లను ఎక్స్‌ప్రెస్ రైల్లో ముజఫర్‌పూర్ స్టేషన్ నుంచి బెంగళూరు, చెన్నైలకు తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం అందింది. దీనిపై జీఆర్‌పీ పోలీసులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, బచ్‌పన్ బచావో ఆందోళన్(బీబీఏ) సంస్థ, చైల్డ్‌లైన్ ప్రతినిధుల సహకారంతో మంగళవారం రాత్రి రైలు విజయవాడ చేరుకోగానే రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి సుమారు 12 నుంచి 17 ఏళ్ల వయస్సు ఉన్న 18 మంది బాలలను గుర్తించి సంరక్షించారు. అనంతరం వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచి, వారి ఆదేశాల మేరకు తాత్కాలిక వసతి కోసం ఎస్‌కేసీవీ చిల్డ్రన్స్ ట్రస్ట్ వసతి గృహానికి తరలించారు. బాలల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి తగిన ఆధారాలతో వచ్చిన తల్లిదండ్రులకు వారిని అప్పగిస్తామని తెలిపారు. బాలల అక్రమ రవాణా చట్ట వ్యతిరేకమని, దీనికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్‌లో ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ మకతలాల్‌నాయక్, జీఆర్‌పీ ఎస్‌ఐ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్నేహితుల దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు
- కారు చెట్టును ఢీకొట్టడంతో ప్రమాదం
- చిత్తూరు జిల్లా పుంగనూరులో ఘటన



ప్రమాదంలో ధ్వంసమైన కారు



భాగ్యరాజ్(ఫైల్)



ఎస్.కుమార్ (ఫైల్)



రవి (ఫైల్)

పుంగనూరు(చిత్తూరు జిల్లా): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలైన ఘటన స్థానికంగా విషాదం నింపింది. పుంగనూరులో బుధవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటనలో మృతులంతా స్నేహితులే కావడం విశేషం. మంగళం గ్రామానికి చెందిన ఎస్.కుమార్(37) ప్రైవేటు టీచర్, ఎం.భాగ్యరాజ్(37) మెకానిక్, చదళ్ల గ్రామానికి చెందిన చెన్నకేశవులు(32) మెకానిక్, పట్టణంలోని కొత్తయిండ్లుకు చెందిన ఎస్.రవి (37) డ్రైవర్. వీరు నలుగురు మంచి స్నేహితులు. మంగళవారం రాత్రి నలుగురు కలిసి భాగ్యరాజుకు చెందిన కారులో కర్ణాటక వెళ్లారు. బుధవారం వేకువజామున తిరిగొస్తుండగా.. పుంగనూరు సమీపంలోని అరవపల్లె క్రాస్ వద్ద కారు చెట్టును ఢీకొట్టడంతో భాగ్యరాజ్, కుమార్, రవి అక్కడికక్కడే మృతి చెందారు. చెన్నకేశవులు మాత్రం తీవ్ర గాయాలపాలై కారులో పడి ఉండగా.. అటుగా వెళుతున్న ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ మధుసూదన్‌రెడ్డి, ఎస్‌ఐ మోహన్‌కుమార్‌లు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని చెన్నకేశవులను ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. ఇదిలా ఉండగా, మృతుల కుటుంబాలకు మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంతాపం తెలిపారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషాలు మృతుల కుటుంబాలను పరామర్శించి మంత్రి తరఫున ఆర్థిక సాయం అందించారు. అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్టు చెప్పారు.

సింహాద్రిలో విద్యుదుత్పత్తికి అంతరాయం

పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీలో మొదటి యూనిట్ నుంచి సరఫరా జరుగుతున్న విద్యుదుత్పత్తికి బుధవారం అంతరాయం ఏర్పడింది. సంస్థలో 'అండర్ రిజర్వ్ షట్ డౌన్' కారణంగా బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేశారు. యూనిట్ నుంచి విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించడానికి కొంత సమయం పడుతుందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సంస్థలో 2, 3, 4 యూనిట్ల నుంచి 1500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని ఎన్టీపీసీ అధికార వర్గాలు వెల్లడించాయి.

క్లుప్తంగా

157 నర్సింగ్ కాలేజీలు

న్యూఢిల్లీ: ఇప్పటికే ఉన్న వైద్య కళాశాలలకు అనుబంధంగా రూ.1,570 కోట్ల వ్యయంతో నూతనంగా 157 నర్సింగ్ కళాశాలల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. సంబంధిత కేబినెట్ భేటీ నిర్ణయాలను ఆ తర్వాత మీడియాకు కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఢిల్లీలో చెప్పారు. 'కొత్త కాలేజీల రాకతో ఏటా దాదాపు 15,700 కొత్త నర్సింగ్ గ్రాడ్యుయేట్ సీట్లు అందుబాటులో ఉంటాయి. ప్రతీ కాలేజీలు 100 బీఎస్సీ(నర్సింగ్) సీట్లు ఉంటాయి. మొత్తం 157కుగాను యూపీలో 27, రాజస్తాన్‌లో 23, మధ్యప్రదేశ్‌లో 14, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో చెరో 11 , కర్ణాటకలో నాలుగు కాలేజీలు నెలకొల్పుతాం' అని మాండవీయ చెప్పారు. బ్రిటన్‌లో 26 వేల మంది, అమెరికాలో 16వేల మంది, ఆస్ట్రేలియాలో 12వేల మంది, గల్ఫ్ దేశాల్లో 20వేల మంది భారతీయ నర్సులు సేవలందిస్తున్నారు.

చంద్రునిపై కూలిన జపాన్ వ్యోమనౌక!



టోక్యో: జపాన్‌కు చెందిన ప్రైవేట్ సంస్థ ఐస్పేస్ ప్రయోగించిన ల్యాండర్ మంగళవారం చంద్రునిపై దిగే క్రమంలో కుప్పకూలినట్టు సమాచారం. చంద్రుని ఉపరితలానికి కేవలం 10 మీటర్ల దూరంలో ఉండగా దానితో సంబంధాలు తెగిపోయాయి. 6 గంటలకు పైగా విఫలయత్నం చేసిన అనంతరం, చివరి అంకంలో ల్యాండర్ చంద్రున్ని ఢీకొట్టి కుప్పకూలిందని ఐస్పేస్ ప్రకటించింది. ఈ ప్రయోగం విజయవంతమైతే చంద్రునిపై ల్యాండర్‌ను దించిన తొలి ప్రైవేట్ కంపెనీగా అది చరిత్రకెక్కేది. ఇంతటితో కుంగిపోకుండా మళ్లీ ప్రయత్నిస్తామని దాని సీఈఓ హకమడ ప్రకటించారు.

భారత సంతతి వ్యక్తికి సింగపూర్‌లో ఉరి

సింగపూర్: మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యవహారంలో నేరం రుజువు కావడంతో సింగపూర్‌లో భారత సంతతికి చెందిన తంగరాజు సుప్పయ్య(46)కు ఉరిశిక్ష అమలు చేశారు. ఉరిశిక్ష ఆపాలని ఆయన కుటుంబ సభ్యులతో పాటు అంతర్జాతీయ మానవ హక్కుల కార్యకర్తలు, ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తి చేసినప్పటికీ సింగపూర్ ప్రభుత్వం పట్టించుకోలేదు. క్షమాభిక్ష పిటిషన్‌ను మంగళవారం న్యాయస్థానం తిరస్కరించడంతో చాంగీ జైలులో బుధవారం తెల్లవారుజామున శిక్షను అమలు చేశారు. ఈ విషయాన్ని సింగపూర్ ప్రిజన్ సర్వీసు ప్రతినిధి వెల్లడించారు. తంగరాజు డెత్ సర్టిఫికెట్‌ను అధికారులు తమకు అందజేశారని అతని సోదరి చెప్పారు. సింగపూర్ జాతీయుడైన తంగరాజు 2014లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణల కింద అరెస్టయ్యాడు.

రెడ్ కారిడార్ రక్తసిక్తం

భద్రతా దళాల బస్సును పేల్చేసిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో ఘాతుకం	ఐఈడీ పేలుడు తీవ్రతకు తునాతునకలైన పోలీసు వాహనం	10 మంది పోలీసులు, డ్రైవర్ దుర్మరణం



ఘటనాస్థలి నుంచి భద్రతా బలగాల మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టులు మరో ఘాతుకానికి పాల్పడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో 10 మంది పోలీసులను బలి తీసుకున్నారు. పల్నార్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారని ఇంటెలిజెన్స్ విభాగానికి సమాచారం అందింది. దీంతో డీఆర్‌జీ సిబ్బంది మినీ బస్సులో ఆ ప్రాంతానికి మంగళవారం బయలుదేరి వెళ్లారు. గాలింపు చర్యలు పూర్తిచేసి బుధవారం దంతెవాడకు తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం సమయంలో పల్నార్–అరన్‌పూర్ మధ్యలో ఉన్న అటవీ ప్రాంతానికి మినీ బస్సు చేరుకోగానే రోడ్డు మధ్యలో అమర్చిన ఐఈడీ బాంబును మావోయిస్టులు పేల్చారు. పేలుడు ధాటికి మినీ బస్సు గాల్లోకి లేచి పక్కన చెట్లలో పడిపోయింది. బస్సు భాగాలు తునాతునకలు అయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న 10 మంది డీఆర్‌జీ సిబ్బంది, డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భగేల్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ విపత్కర పరిస్థితిని సమర్థంగా ఎదుర్కోవడానికి తగిన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే కేంద్ర బలగాలను ఛత్తీస్‌గఢ్‌కు పంపిస్తామని చెప్పారు. రాష్ట్రంలో నక్సలిజాన్ని అంతం చేస్తామని భగేల్ అన్నారు.

11 మంది బలి

మావోయిస్టుల దాడిలో చనిపోయిన వారిలో హెడ్ కానిస్టేబుళ్లు జోగా సోధి, మున్నా రామ్ కడాతి, సంతోష్ తామో, కానిస్టేబుళ్లు దుల్గో మాండవి, లఖ్ము మార్కం, జోగా కవాసి, హరిరామ్ మాండవి, రాజారామ్ కర్టమ్, జైరాం పొడియం, జగదీష్ కవాసీలతో పాటు డ్రైవర్ ధనిరామ్ యాదవ్ ఉన్నారు.

టీసీఓసీ ఉచ్చులో..

వేసవికి ముందు అడవుల్లో పచ్చదనం పలచబడుతుంది. ఈ సమయంలో మావోయిస్టులు అడవి లోపలికి వెళ్లిపోతుంటారు. పోలీసులు మరింత ఉధృతంగా వారి కోసం గాలిస్తుంటారు. ప్రతి వేసవిలో సాయుధ భద్రతా దళాల దూకుడుతో మావోయిస్టులు చిక్కుల్లో పడుతున్నారు. దీంతో భద్రతా దళాల వేగానికి అడ్డుకట్ట వేసేందుకు కొంత కాలంగా టాక్టికల్ కౌంటర్ అఫెన్సివ్ క్యాంపెన్ (టీసీఓసీ) పేరుతో సరికొత్త వ్యూహాన్ని మావోయిస్టులు అమలు చేస్తున్నారు. భావజాల వ్యాప్తి, కొత్త రిక్రూట్‌మెంట్, భద్రతా దళాలపై మెరుపుదాడులు చేయడం టీసీఓసీలో వ్యూహంలో భాగంగా ఉన్నాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో టీసీఓసీని మావోయిస్టులు అమలు చేస్తున్నారు. అందులో భాగంగానే పల్నార్ అటవీ ప్రాంతంలో మావోయిస్టు దళాలు సంచారిస్తున్నాయంటూ భద్రతా దళాలకు సమాచారం చేరవేసి తమ ఉచ్చులో పడేసినట్టు తెలుస్తోంది.

తొందరపాటు వల్లే...

పేలుడు జరిగిన తీరును చూస్తే కూంబింగ్‌లో పోలీసులు స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొటోకాల్ (ఎస్‌ఓపీ) పాటించలేదని తెలుస్తోంది. ప్రొటోకాల్ ప్రకారం నిఘా సమాచారాన్ని పక్కాగా ధ్రువీకరించుకోవాలి. తర్వాత భద్రతా దళాలు ప్రయాణించే మార్గంలో ప్రమాదం జరగకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలి . అవసరమైతే భద్రతా దళాల కంటే ముందు రోడ్ ఆపరేటింగ్ పార్టీని పంపించాలి. మినీ బస్సులో బయలుదేరిన డీఆర్‌జీ బృందం వీటిని పాటించలేదని తెలుస్తోంది. దాంతో తిరుగు ప్రయాణంలో మావోయిస్టుల ఉచ్చులో చిక్కారు. 2021 ఏప్రిల్ 3న బీజాపూర్ జిల్లా తెర్రం పోలీస్ స్టేషన్ పరిధిలో టేకుల్‌గూడా సమీపంలో సైతం ఇదే తరహాలో మావోయిస్టులు పన్నిన ట్రాప్‌లో భద్రతా దళాలు చిక్కుకున్నాయి. ఆ ఘటనలో 22 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది బలయ్యారు.



పేలుడు ధాటికి తునాతునకలైన పోలీసు వాహనం

వారి త్యాగాన్ని మరువం: మోదీ

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల దుశ్చర్యను ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. బాంబు దాడిలో మృతి చెందిన పోలీసులకు నివాళులర్పించారు. వారి త్యాగం సదా స్మరణీయమని ట్వీట్ చేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. పోలీసు సిబ్బంది మృతి పట్ల కేంద్ర మంత్రివర్గం సంతాపం తెలిపింది. బాధితులకు నివాళిగా సమావేశంలో మంత్రులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సంతాపం తెలిపారు.

మావోయిస్టులది పిరికిపంద చర్య: కాంగ్రెస్

ఛత్తీస్‌గఢ్ ఘటనపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ నేత రాహుల్ గాంధీ స్పందించారు. మావోయిస్టులది పిరికిపంద చర్య అని పేర్కొన్నారు. మృతులకు సంతాపం ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నక్సలిజంపై పోరాడుతోందని, కచ్చితంగా విజయం సాధిస్తుందని ఖర్గే చెప్పారు. ఆయన సీఎం భూపేశ్ భగేల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మావోయిస్టుల దాడిలో 11 మంది మరణించడం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని రాహుల్ గాంధీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

కేజ్రీవాల్ 'ఇంటి' ఖర్చు రూ.45 కోట్లు: బీజేపీ

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన అధికార నివాస సుందరీకరణ కోసం రూ.45 కోట్లకుపైగా ఖర్చుచేశారని బీజేపీ, కాంగ్రెస్ దుమ్మెత్తిపోశాయి. 'నిజాయితీ, నిరాడంబరతకు మారుపేరుగా నిలుస్తాననే కేజ్రీవాల్ ఇప్పుడు మహారాజుగా మారారు. ఆయన ఇంట్లోని విలాసవంత, అత్యంత సౌకర్యవంత వస్తువులను చూస్తే రాజులు కూడా కేజ్రీవాల్‌కు సలామ్ చేస్తారు. రూ.7.94కు ఒక కర్టెన్ కొన్నారు. వియత్నాం నుంచి తెప్పించిన రూ.1.15 కోట్ల మార్బుళ్లను వాడారు. ప్రీ–ఫ్యాబ్రికేటెడ్ గోడలకే రూ.4 కోట్లు పెట్టారు. దీన్ని కప్పిపుచ్చేందుకు మీడియా సంస్థలకు రూ.20–50 కోట్లు ముట్టజెప్పేందుకు కేజ్రీవాల్ సిద్ధపడ్డారు'' అని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా ఆరోపించారు. వీటిపై మీడియాముఖంగా బదులివ్వాలని సవాల్ చేశారు. తక్షణం రాజీనామా చేయాలన్నారు.

సీఎంగా ఉండే హక్కుందా ?: కాంగ్రెస్


ఇంతటి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాక కేజ్రీవాల్‌కు సీఎంగా నైతిక అర్హత ఉందా అంటూ కాంగ్రెస్ నిలదీసింది. ఎర్ర బుగ్గ కారును వాడబోనని, అదనపు భద్రతా సిబ్బంది, పెద్ద బంగ్లా వద్దని ప్రకటించి చివరికిలా మారారని కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ ఆరోపించారు

పాత భవనం కనుకే: ఆప్

ఈ ఆరోపణలను ఆప్ ఖండించింది. 'అది 1942లో కట్టిన ఇల్లు. ఇప్పటికి మూడుసార్లు పైకప్పు కూలింది. కేజ్రీవాల్ తల్లిదండ్రులుండే గది, కేజ్రీవాల్ గది, ప్రజా సమావేశ గది పైకప్పులు కూలాయి. దాంతో ప్రజాపనుల విభాగమే రూ.30 కోట్లతో కొత్తగా కట్టింది'' అని పార్టీ నేత సంజయ్ సింగ్ అన్నారు. పెచ్చులూడిన ఫొటోలు షేర్ చేశారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఇంటికి చిన్న రిపేర్లకే రూ.15 కోట్లు వెచ్చించారని ఆరోపించారు.

ప్రజల గొంతు నొక్కేయగలరా?

సోనియా వ్యాసంపై ధన్‌ఖడ్ ఆక్షేపణ • 'మన్ కీ బాత్' దేశానికి ఆశాదీపమని ప్రశంస



మన్ కీ బాత్ కాఫీ టేబుల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న ధన్‌ఖడ్, కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్

న్యూఢిల్లీ: భారతదేశంలో ఉన్నంత భావ ప్రకటన స్వేచ్ఛ ప్రపంచంలో ఇంకెక్కడా లేదని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. దేశంలో బీజేపీ పాలనలో ప్రజల గొంతు నొక్కేస్తున్నారంటూ కాంగ్రెస్ నేత సోనియా గాంధీ ఇటీవల ఓ పత్రిక వ్యాసంలో చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అవి తనకు బాధ కలిగించాయన్నారు. ప్రజల గొంతును ఎవరూ నొక్కేయలేరని చెప్పారు. బుధవారం 'మన్‌కీ బాత్ 100 జాతీయ సదస్సు' ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతినెలా నిర్వహించే ఈ రేడియో కార్యక్రమం దేశానికి ఒక ఆశాదీపమన్నారు. దీనిద్వారా రాజకీయాలకు అతీతంగా మోదీ దేశానికి సందేశమిస్తున్నారని ప్రశంసించారు. కొందరు నాయకులు విదేశాలకు వెళ్లి, మన దేశాన్ని తూలనాడుతున్నారని మండిపడ్డారు. మోదీ హయాంలో ఎంతో అభివృద్ధి జరుగుతోందంటూ ప్రశంసల వర్షం కురిపించారు. మన్ కీ బాత్ 100 కాఫీ టేబుల్ బుక్ తదితరాలను ధన్‌ఖడ్ విడుదల చేశారు.

ముఖ్యమైన భావప్రసారం: ఆమిర్ ఖాన్


మన్ కీ బాత్ చాలా ముఖ్యమైన భావప్రసార కార్యక్రమమని బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ ప్రశంసించారు. మన్ కీ బాత్ ద్వారా మోదీ దేశ ప్రజలతో అనుసంధానం అవుతున్నారని తెలిపారు. అత్యంత కీలకమైన అంశాలపై చర్చిస్తున్నారని, తన ఆలోచనలు పంచుకుంటూ చక్కటి సలహాలు, సూచనలు ఇస్తున్నారని అమీర్ ఖాన్ ప్రశంసించారు.

పార్లమెంటుకు వదిలేయండి

స్వలింగ వివాహాలపై సుప్రీంకోర్టుకు కేంద్రం విజ్ఞప్తి



న్యూఢిల్లీ: ''స్వలింగ వివాహాల అంశం అత్యంత సంక్లిష్టమైనది. సమాజంపై ఇది పెను ప్రభావం చూపుతుంది'' అని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కాబట్టి దీన్ని పూర్తిగా పార్లమెంటు పరిశీలనకు వదిలేసే అంశాన్ని పరిశీలించాల్సిందిగా సుప్రీంకోర్టును కోరింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కోరుతూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ముందు వాదనలు బుధవారం ఐదో రోజూ కొనసాగాయి. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు కొనసాగించారు. వివాహమంటే ఏమిటి, ఎవరి మధ్య జరుగుతుందన్న కీలకాంశాలపై నిర్ణయం తీసుకోవాల్సింది ఎవరన్నదే కీలక ప్రశ్న అని ఆయనన్నారు. ''నిజానికి పార్లమెంటుకు స్థాయికి కూడా ఇదెంతో విస్తృతమైన కసరత్తు. స్వలింగ వివాహాలపై తీసుకోబోయే నిర్ణయం పలు చట్టాలకు సంబంధించి ఏకంగా 160 నిబంధనలను ప్రభావితం చేస్తుంది. దీనిపై కసరత్తు చేసేందుకు కావాల్సిన వనరులు న్యాయవ్యవస్థ వద్ద లేవు. పెళ్లి ఒక సామాజిక, చట్టపరమైన వ్యవస్థ. దానికి గుర్తింపు పూర్తిగా శాసనవ్యవస్థ విధాన నిర్ణయాల పరిధిలోని అంశం. ఆ అధికారాన్ని న్యాయవ్యవస్థ లాక్కోజాలదు'' అన్నారు. తన వాదనకు మద్దతుగా అబార్షన్‌కు రాజ్యాంగపరమైన హక్కు కల్పించేందుకు నిరాకరిస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉటంకించారు. దీన్ని ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. ''మీ వాదనను అర్థం చేసుకున్నాం. న్యాయమూర్తులు చట్టాలు చేయరనేది అందరికీ తెలిసిన విషయమే. మహిళల హక్కుల పరిరక్షణలో అమెరికా కంటే భారత్ ఎంతో ముందుకు వెళ్లింది. కనుక అక్కడి తీర్పులను ప్రస్తావించొద్దు'' అని సీజేఐ స్పష్టం చేశారు.



కర్ణాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మైసూరులో ఓ హోటల్‌లో మసాలా దోసె వేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక


నక్షత్రాలు పేలితే భూమికి ముప్పు!

సూపర్‌నోవాల విస్ఫోటంతో యూవీ రేడియేషన్

గ్రహాలపై జీవజాలం అంతరించిపోయే ప్రమాదం

యూనివర్సిటీ ఆఫ్ ఇలినాయి ఖగోళ శాస్త్రవేత్తల అధ్యయనం

భూగోళంపై కోట్లాది జీవులు ఉన్నాయి. లక్షల సంవత్సరాల పరిణామ క్రమంలో జీవజాలం పుట్టుకొచ్చింది. ఇందుకు ఎన్నో సంఘటనలు దోహదం చేశాయి. భూమిపై జీవుల ఆవిర్భావం, మనుగడకు ఇక్కడి అనుకూల వాతావరణమే కారణం. ధరణిపై వాతావరణం విషతుల్యంగా మారితే జీవులకు ముప్పు తప్పదు. పూర్తిగా అంతరించిపోయినా ఆశ్చర్యం లేదు. అలాంటి ప్రమాదమే తలెత్తే అవకాశం ఉందని ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సుదూరంలోని అంతరిక్షంలో ఉన్న సూపర్‌నోవాల పేలుడు నుంచి గ్రహాలకు కొత్త ముప్పు పొంచి ఉందని, ఈ విపత్తు నుంచి తప్పించుకోవడం మన చేతుల్లో లేదని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్‌కు చెందిన ఖగోళ శాస్త్రవేత్తలు గుర్తించారు.



అంతరిక్షంలో అనంతమైన నక్షత్రాలు ఉన్నాయి. కొన్ని సూపర్‌నోవాగా మారి పేలిపోతుంటాయి. బ్లాస్ట్ వేవ్ సంభవిస్తుంది. ఇలాంటి సందర్భాల్లో ప్రమాదకరమైన ఎక్స్–కిరణాలు అధిక మోతాదులో వెలువడుతాయి. ఇవి సమీపంలోని గ్రహాలను చేరుతాయి. ఇందుకు నెలలు, సంవత్సరాలు, దశాబ్దాలు కూడా పట్టొచ్చు. సూర్యుడు కూడా ఒక నక్షత్రమే. సూర్యుడి నుంచి వెలువడే అల్ట్రావయొలెట్(యూవీ) రేడియేషన్ నుంచి దాని పరిధిలోని భూగ్రహాన్ని రక్షించడానికి ఓజోన్ పొర ఆవరించి ఉంది.

ఏమిటీ ముప్పు?

సూపర్‌నోవా పేలుడుతో ఉద్గారమయ్యే ఎక్స్–కిరణాలు భూమిని చుట్టూ ఉన్న ఓజోన్ పొరను విచ్ఛిన్నం చేస్తాయి. ఓజోన్ పొర చాలావరకు తుడిచిపెట్టుకుపోతోంది. దాంతో యూవీ రేడియేషన్ నేరుగా భూగ్రహం ఉపరితలాన్ని ఢీకొడుతుంది. ఫలితంగా నైట్రోజన్ డయాక్సైడ్ అనే విషవాయువు భూమిపై ఉత్పత్తి అవుతుంది. అది విషపూరితమైన గోధుమ రంగు పొరను భూమి చుట్టూ ఏర్పరుస్తుంది. అప్పుడు వాతావరణం లుప్తమైపోతుంది. జీవులు అంతరించిపోతాయి.

ఎలా గుర్తించారు?

యూనివర్సిటీ ఆఫ్ ఇలినాయి శాస్త్రవేత్తలు చంద్ర ఎక్స్–రే అబ్జర్వేటరీతోపాటు ఇతర అత్యాధునిక టెలిస్కోప్‌లతో సూపర్‌నోవాలపై అధ్యయనం చేశారు. పేలిపోయే తారల నుంచి ఎక్స్–కిరణాలు వెలువడి, భూమి, ఇతర గ్రహాలను ప్రభావితం చేసే దశ రాబోతుందని, ఈ పరిణామం 100 కాంతి సంవత్సల దూరంలో చోటుచేసుకుంటుందని కనిపెట్టారు. పేలిపోయే నక్షత్రాల నుంచి వాటిల్లే ముప్పు గతంలో పోలిస్తే ఇప్పుడు మరింత పెరిగినట్లు గుర్తించారు. 160 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న సూపర్‌నోవాలు పేలిపోతే భూమిలాంటి గ్రహాలకు రేడియేషన్ ముప్పు ఉంటుందని తేల్చారు. 1979సీ, ఎస్ఎన్ 1987ఏ, ఎస్ఎన్ 2010జేఎల్, ఎస్ఎన్ 1994ఐ అనే సూపర్‌నోవాలను నిశితంగా పరిశీలించారు. అవి ఇప్పట్లో పేలే అవకాశం ఉందా? దానిపై ఓ అంచనాకొచ్చారు.



ఇప్పటికిప్పుడు ప్రమాదం లేనట్లే

భూమికి ఇప్పటికిప్పుడు ముంచుకొచ్చిన ప్రమాదం ఏమీ లేదని శాస్త్రవేత్త కానర్ ఓమహోనీ వెల్లడించారు. ఎక్స్–రే డేంజర్ జోన్‌లో బలమైన సూపర్‌నోవా ఏదీ లేదని తెలిపారు. భూమికి సమీపంలో గతంలో తారలు పేలిపోయిన దాఖలాలు ఉన్నాయని వెల్లడించారు. 20 లక్షల నుంచి 80 లక్షల సంవత్సరాల క్రితం భూమి నుంచి 65 నుంచి 500 కాంతి సంవత్సరాల దూరంలో సూపర్‌నోవా ఒకటి పేలిపోయింది. దానికి సంబంధించిన రేడియేషన్ ఇప్పటికీ భూమి వైపునకు దూసుకొస్తోందని పరిశోధకులు గుర్తించారు. సూపర్‌నోవా నుంచి వెలువడే ఎక్స్–కిరణాలపై మరిన్ని పరిశోధనలు చేయడం నక్షత్రాల జీవితకాలం గురించి అర్థం చేసుకోవడానికే కాదు, ఆస్ట్రోబయాలజీ, పాలియోంటాలజీ, ప్లానెటరీ సైన్సెస్ తదితర రంగాల్లో చిక్కుముడులు విప్పడానికి ఉపయోగపడతాయని యూనివర్సిటీ ఆఫ్ ఇలినాయి శాస్త్రవేత్త బ్రియాన్ ఫీల్డ్స్ తెలిపారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

బాదల్‌కు నేతల ఘన నివాళి



చండీగఢ్: పంజాబ్ రాజకీయ కురువృద్ధుడు, ఐదుసార్లు పంజాబ్ సీఎంగా సేవలందించిన ప్రకాశ్ సింగ్ బాదల్‌ను కడసారి చూసేందుకు పార్టీలు, ప్రాంతాలకతీతంగా వందలాది మంది నేతలు, స్థానికులు చండీగఢ్‌కు తరలివచ్చారు. ఆయన పార్థివదేహం వద్ద ఘన నివాళులర్పించారు. తీవ్ర అనారోగ్యంతో బుధవారం తుదిశ్వాస విడిచిన తమ అభిమాననేతను చివరిసారి చూసేందుకు చండీగఢ్‌లోని శిరోమణి అకాలీదళ్ పార్టీ ప్రధాన కార్యాలయానికి ఆయన అభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. గురువారం మధ్యాహ్నం బాదల్ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మళ్లీ ఢిల్లీ మేయర్‌గా ఆప్ నేత షెల్లీ



న్యూఢిల్లీ: ప్రత్యర్థి పార్టీ బీజేపీ మహిళా అభ్యర్థి శిఖా రాయ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా నేత, ప్రస్తుత ఢిల్లీ మున్సిపాలిటీ(ఎంసీడీ) మేయర్ షెల్లీ ఒబెరాయ్ ఈ ఆర్థిక సంవత్సరానికీ మరోమారు మేయర్‌గా ఎంపికయ్యారు. ఎంసీడీ నిర్ణాయక మండలి అయిన స్టాండింగ్ కమిటీకి ఇంతవరకు ఎన్నికలు నిర్వహించనందుకు నిరసనగా తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు శిఖా రాయ్ చెప్పారు. డెప్యూటీ మేయర్ పదవికి బీజేపీ మహిళా అభ్యర్థిగా సోనీ పాల్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో ప్రస్తుత డెప్యూటీ మేయర్ ఆలీ మొహమ్మద్ ఇక్బాల్‌కు మరోసారి పదవి దక్కింది. ఓటింగ్‌లో ఓటమి భయాలతోనే వీరిద్దరూ పోటీ నుంచి తప్పుకున్నారని ఆప్ ఎద్దేవాచేసింది. ' కనీసం పోటీచేసే సత్తాలేక బీజేపీ కౌన్సిలర్లు ఆప్ నేతృత్వంలోని కేజ్రీవాల్ ఎదుట సరెండర్ అయ్యారు' అని పార్టీ ఎమ్మెల్యే, పార్టీ ఎంసీడీ ఇన్‌చార్జ్ దుర్గేశ్ పాఠక్ వ్యాఖ్యానించారు. కాగా, స్టాండింగ్ కమిటీలు, వార్డ్ కమిటీలను ఏర్పాటుచేయకుండా ఎంసీడీని ఆప్ నిర్వీర్యం చేస్తోందని ఢిల్లీ బీజేపీ విభాగం ఆరోపించింది. ఎంసీడీ మేయర్ పదవీకాలం ఏడాది. ఎంసీడీ ఎన్నికలయ్యాక ఐదేళ్ల కోసం ప్రతిఏటా మేయర్‌ను రిజర్వేషనల పరంగా రొటేషన్ పద్ధతిలో ఎన్నుకుంటారు. మొదటి సంవత్సరం మహిళలకు, రెండో ఏడాది జనరల్ కేటగిరీ, మూడో ఏడాది రిజర్వ్‌డ్ కేటగిరీ, చివరి రెండేళ్లు ఓపెన్ కేటగిరీకి కేటాయిస్తారు. ఆర్థిక సంవత్సరం ముగియగానే కొత్త మేయర్‌ను ఎన్నుకుంటారు. గత ఆర్థిక సంవత్సరానికి ఓటింగ్ పలుమార్లు వాయిదాపడ్డాక చివరకు ఆప్ అభ్యర్థి గెలవడం తెల్సిందే.

అడ్డంకులున్నా ముందడుగే..


'సౌరాష్ట్ర–తమిళ సంగమం'లో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు



సోమనాథ్: మన దేశం వైవిధ్యానికి మారుపేరు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. విశ్వాసం నుంచి ఆధ్యాత్మిక దాకా.. అన్ని చోట్లా వైవిధ్యం ఉందని తెలిపారు. దేశంలో వేర్వేరు భాషలు, యాసలు, కళలు ఉన్నాయని గుర్తుచేశారు. ఈ వైవిధ్యం మనల్ని విడదీయడం లేదని, మన మధ్య అనుబంధాన్ని, సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందని హర్షం వ్యక్తం చేశారు. బుధవారం 'సౌరాష్ట్ర–తమిళ సంగమం' వేడుక ముగింపు కార్యక్రమంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ ఏదైనా కొత్త విజయం సాధించే శక్తి సామర్థ్యాలు మన దేశానికి ఉన్నాయని ఉద్ఘాటించారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలన్నదే మన ఆశయమని వివరించారు. ఈ లక్ష్య సాధనలో ఎన్నో అడ్డంకులు ఉన్నాయని, మనల్ని అటంకపరిచే శక్తులకు కొదవలేదని చెప్పారు. అయినప్పటికీ లక్ష్యాన్ని చేరుకోవడం తథ్యమని స్పష్టం చేశారు. స్వాతంత్య్రం వచ్చి 7 దశాబ్దాలు పూర్తయినా దేశంలో ఇంకా బానిస మనస్తత్వం ఇంకా కొనసాగుతుండడం ఒక సవాలేనని అన్నారు. బానిస మనస్తత్వం నుంచి మనకి మనమే విముక్తి పొందాలని, అప్పుడు మనల్ని మనం చక్కగా అర్థం చేసుకోగలమని, మన ఘనమైన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లగమని ఉద్బోధించారు. అన్ని అడ్డంకులను అధిగమించి, మనమంతా కలిసి దేశాన్ని ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు.

ఆరోగ్య సమస్యలను సరిహద్దులు ఆపలేవు

న్యూఢిల్లీ: ఆరోగ్య రంగంలో మన ముందున్న సవాళ్లను దీటుగా ఎదిరించడానికి ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేయాలని మోదీ పిలుపునిచ్చారు. 'వన్ ఎర్త్, వన్ హెల్త్–అడ్వాంటేజ్ హెల్త్‌కేర్ ఇండియా 2023' సదస్సులో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. ఆరోగ్య సంరక్షణ విషయంలో సమీకృత కృషిపై ప్రత్యేకంగా దృష్టి సారించామని చెప్పారు. మెరుగైన, చౌకైన వైద్య సేవలు అందరికీ అందాలన్నారు.



బుధవారం టిబెటన్ల ఆధ్యాత్మిక గురువు దలైలామాకు రామన్ మెగసెసె అవార్డును అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి. 1959లో ప్రకటించిన అవార్డును 64 ఏళ్ల తర్వాత ఇవ్వడం విశేషం!

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం । 27 । ఏప్రిల్ । 2023

దోసె వేసిన ప్రియాంకగాంధీ

మైసూరు: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ బుధవారం ఉదయం మైసూరులోని మైలారీ హోటల్‌కు వెళ్లారు. ఇక్కడి స్పెషల్ ఏంటని హోటల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెస్టారెంట్ కిచెన్‌లోకి వెళ్లారు. స్వయంగా మూడు దోసెలు వేసి ఆరగించారు. దోసెతో పాటు ఇడ్లీ కూడా తిన్నారు. దోసె వేయడం ఇంట్లో ఒకసారి ట్రై చేస్తానని ప్రియాంక గాంధీ తెలిపారు.



న్యూస్‌రీల్

ఎమ్మెల్యే భార్య కారు ధ్వంసం



కృష్ణరాజపురం: హొసకోటె ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ భార్య కారును దుండగులు ధ్వంసం చేశారు. ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన ఆమె కారును నిలిపిన సమయంలో దుండగులు కారు అద్దాలను పగులగొట్టారు. ఈ ఘటన హొసకోటె నగరం పార్వతీపురంలో జరిగింది. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి శరత్‌బచ్చేగౌడ భార్య ప్రతిభ నగరంలో తన భర్త కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం కూడా ప్రచారం కోసం రాగా, గుర్తు తెలియని దుండగులు ఈ ఘటనకు పాల్పడ్డారు. హొసకోటె పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

మతాలను అడ్డు పెట్టుకొని కాంగ్రెస్ రాజకీయం

- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్‌సింగ్



బనశంకరి: హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాలను అడ్డు పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని, దేశంలో ఇప్పటివరకు మతం ఆధారంగా అధికారంలోకి వచ్చింది ఒక్క కాంగ్రెస్ పార్టీనేనని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్‌సింగ్ ధ్వజమెత్తారు. బెళగావి జిల్లా కాగవాడ బీజేపీ అభ్యర్థి శ్రీమంత పాటిల్ తరఫున బుధవారం ఆయన ఎన్నికల ప్రచార సభలో పాల్గొని మాట్లాడారు. కేవలం ముస్లింలను మచ్చిక చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ 4 శాతం రిజర్వేషన్ ఇచ్చిందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ముస్లిం, లేదా క్రిస్టియన్లు రిజర్వేషన్ ప్రయోజనాలు పొంది ఉంటే తాము స్వాగతిస్తామన్నారు. బీజేపీ ఎప్పటికీ కులం, మతం పేరుతో రాజకీయం చేయదన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

బెళగావిలో అతిరథ మహారథులు



సాంబ్రా విమానాశ్రయంలో ఒకరినొకరు పలకరించుకుంటున్న బొమ్మై, సిద్ధు

శివాజీనగర: బెళగావి సాంబ్రా విమానాశ్రయంలో కాంగ్రెస్–బీజేపీ నేతలు ముఖాముఖి అయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, విధానసభ ప్రతిపక్ష నాయకుడు సిద్ధరామయ్య, ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై ఒకేచోట చేరారు. పరస్పరం ఒకరినొకరు కరచాలనం చేసి మాట్లాడుకొన్నారు. బెంగళూరు నుంచి బెళగావిలో దిగిన మల్లికార్జున ఖర్గే చిక్కోడి వైపు, బసవరాజ బొమ్మై హుక్కేరి తాలూకా యమకనమరడి వైపు తరలారు. మాజీ మంత్రి డీ.బీ.ఇనామదార అంతిమ దర్శనం చేసుకొని నేగినహాళ నుంచి వచ్చిన సిద్దరామయ్య బెంగళూరు వైపు ప్రయాణం చేశారు.

బెదిరింపులకు భయపడను

యశవంతపుర: తాను ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మైకి ఇచ్చిన మాట ప్రకారం బీజేపీ తరఫున ఎన్నికల ప్రచారం చేయటానికి సిద్ధంగా ఉన్నట్లు నటుడు కిచ్చ సుదీప్ తెలిపారు. బుధవారం ఆయన బెంగళూరులో విలేకర్లతో మాట్లాడారు. తనకు నిత్యం బెదిరింపులు వస్తున్నాయని, ఇలాంటి పట్టించుకోనన్నారు. ఎన్ని ఆకాశ రామన్న ఉత్తరాలు రాసిన తాను కేర్ చేయనన్నారు. బీజేపీ తరఫున ఎన్నికల ప్రచారానికి వెళ్తున్నట్లు సుదీప్ వివరించారు.

మాజీ మంత్రి ఆల్కోడ్ జేడీఎస్‌లో చేరిక

- కాంగ్రెస్‌కు భారీ షాక్



ఆల్కోడ్ హనుమంతప్పను పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

శివాజీనగర: మాజీ మంత్రి ఆల్కోడ్ హనుమంతప్ప బుధవారం మాజీ సీఎం హెచ్.డీ.కుమారస్వామి, జేడీఎస్ రాష్ట్రాధ్యక్షుడు సీఎం ఇబ్రహీం సమక్షంలో జేడీఎస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి ఆల్కోడ్ హనుమంతప్పకు ఆహ్వానం పలికారు. కుమారస్వామి మాట్లాడుతూ తమ పార్టీ సీనియర్ నాయకుడు మళ్లీ సొంతగూటికి చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. తుమకూరులోని 11 నియోజకవర్గాల్లో జేడీఎస్ గెలుపొందే అవకాశం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 123 స్థానాల్లో విజయ కేతనం ఎగురవేస్తామన్నారు. కాగా జేడీఎస్ కార్యాధ్యక్షుడిగా ఆల్కోడ్ హనుమంతప్పను నియమించినట్లు రాష్ట్రాధ్యక్షుడు సీఎం ఇబ్రహీం ప్రకటించారు.

హెలికాప్టర్లకు డిమాండ్

- ఎన్నికల ప్రచారంలో విరివిగా వినియోగిస్తున్న రాజకీయ పార్టీల నేతలు
- రాష్ట్రంలో వందకు పైగా లోహ విహంగాల సంచారం



ఇటీవల బళ్లారిలో ఎన్నికల ప్రచారానికి హెలికాప్టర్‌లో వచ్చిన కేంద్ర మంత్రి మన్సుక్ మాండవీయ(ఫైల్)

సాక్షి,బళ్లారి: విధానసభ ఎన్నికలకు నామినేషన్ల ఉపసంహరణ పర్వం ముగియడంతో బరిలో ఉన్నదెవరో తేలిపోయింది. ఇక ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. పోలింగ్‌కు మరో 12 రోజులే గడువు ఉంది. దీంతో అన్ని ప్రాంతాల్లోనూ బహిరంగ సభలు నిర్వహించి ప్రముఖులతో ప్రచారం చేయిస్తున్నారు. రాష్ట్రంలోని 224 నియోజకవర్గాల్లో పర్యటించేందుకు బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్ అగ్రనాయకులు హెలికాప్టర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో వాటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. గతానికంటే ఈ సారి ఎన్నికలు విభిన్నంగా జరగనున్నాయి. అనేక మంది సీనియర్‌నేతలు పార్టీలు మారారు. దీంతో ఏ పార్టీకి కూడా గెలుపు అంత ఈజీ కాదనే పరిస్థితులు నెలకొన్నాయి. ఈక్రమంలో బీజేపీ తరఫున ప్రధాన మంత్రి మోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షాతో పాటు కేంద్ర మంత్రివర్గం మొత్తం రాష్ట్రంలో తిష్ట వేసి ప్రచారాన్ని తారాస్థాయికి తీసుకెళ్లనున్నారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో పాటు ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు కూడా పాల్గొంటున్నారు. కాంగ్రెస్ తరఫున రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిద్ధరామయ్య, డీకేశి, జేడీఎస్ తరఫున దేవెగౌడ, కుమారస్వామి కూడా ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. వీరందరూ కూడా దాదాపు హెలికాప్టర్లు వాడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈసారి రెట్టింపు సంఖ్యలో హెలికాప్టర్లు రాష్ట్రంలో చక్కర్లు కొడుతున్నాయని హెలిప్యాడ్ సంస్థ సంబంధిత అధికారి తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల అతిరథ మహారథులు దాదాపు 100 హెలికాప్టర్లను వినియోగిస్తున్నట్లు అంచనా. రాష్ట్రంలో తగినన్ని హెలికాప్టర్లు లేనందున ముంబై, పుణే, పనాజీ, హైదరాబాద్ తదితర ప్రముఖ నగరాల్లో ప్రైవేటు వ్యక్తుల నుంచి బాడుగకు తీసుకువచ్చి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు.

భారీగా పెరిగిన హెలికాప్టర్ బాడుగ

బెంగళూరు, మంగళూరు, హుబ్లీ, బెళగావి, మైసూరు తదితర ప్రాంతాల్లో హెలిప్యాడ్‌లో ప్రముఖులు హెలికాప్టర్లను ఉంచి చుట్టుపక్కల నియోజకవర్గాలకు కార్లలో వెళ్లి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు వెళ్లేటప్పుడు హెలికాప్టర్‌ను బయటకు తీస్తారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈ సంవత్సరం హెలికాప్టర్ బాడుగ కూడా భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. రెండు సీట్ల కెపాసిటీ ఉన్న హెలికాప్టర్ బాడుగ గంటకు రూ. లక్ష ఉండేది. ప్రస్తుతం రూ.2 లక్షలకు చేరింది. నాలుగు సీట్ల హెలికాప్టర్ బాడుగ రూ.2.5 లక్షలు, 8 సీట్ల హెలికాప్టర్ బాడుగ రూ.3.5 లక్షలు, 15 సీట్ల హెలికాప్టర్ బాడుగ రూ.5 లక్షల అద్దె వసూలు చేస్తున్నారు. హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్లను ఉంచేందుకు 8 గంటలకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు బాడుగ తీసుకుంటారు.

ఆధారాలతో మాట్లాడాలి : సీఎం

యశవంతపుర: తమ ప్రభుత్వం కాంట్రాక్టర్ల నుంచి 40 శాతం కమీషన్లు తీసుకుందని ఆరోపిస్తున్న వారు ఆధారాలతో రావాలని ప్రతిపక్షాలకు ముఖ్యమంత్రి బొమ్మై సూచించారు. తాము అధికారంలోకి వస్తే 40 శాతం కమీషన్‌పై విచారణ చేయిస్తామని మాజీ డీసీఎం లక్ష్మణ సవది చేసిన వ్యాఖ్యలపై సీఎం బుధవారం బెళగావి విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. గాలిమాటలతో కాలక్షేపం చేయడం ప్రయోజనం ఉండదని, బీజేపీలో ఉన్నప్పుడే సవది ఈ వ్యాఖ్యలు చేసి ఉంటే ఎంతో ప్రయోజనమన్నారు. బయటకు వెళ్లిన తరువాత ఎందుకు ఈ వ్యాఖ్యలు చేశారని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని మండిపడ్డారు. బీజేపీ ఇమేజీని దెబ్బతియ్యటానికి సీఎల్‌పీ నేత సిద్దరామయ్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ నాయకులే అవినీతి పరులని సీఎం ఎదురుదాడి చేశారు.

జైలుశిక్షలో వృద్ధుడికి వెసులుబాటు

శివాజీనగర: ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేసి ఏడాది జైలుశిక్షకు గురైన 80 ఏళ్ల వృద్ధుడికి శిక్షలో మినహాయింపు ఇస్తూ కోర్టు తీర్పు చెప్పింది. మైసూరుకు చెందిన హనుమంతరావు తన జైలుశిక్షను ప్రశ్నిస్తూ కోర్టులో పిటిషన్ వేశారు. విచారణ చేసిన న్యాయమూర్తి విశ్వజిత్ శెట్టి... పిటిషన్ దారుడికి వయసు మళ్లింది, దుర్వినియోగం చేసిన సొమ్ము ప్రభుత్వం వసూలు చేసిందని చెబుతూ శిక్షలో వెసులుబాటు ఇచ్చారు. కోర్టు కార్యకలాపాలు ముగిసే వరకు కూర్చొని ఉండాలని తీర్పు చెప్పారు.

80 వేల మందికిపైగా ఇంటి నుంచే ఓటు

- రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 5,30,85,566 మంది
- రాష్ట్ర ప్రధాన ఎన్నికలాధికారి మనోజ్‌కుమార్ మీనా



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికలాధికారి మనోజ్‌కుమార్ మీనా

శివాజీనగర: విధానసభ ఎన్నికల్లో 80 వేల మందికి పైగా వృద్ధులకు అవకాశం కల్పించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికలాధికారి మనోజ్ కుమార్ మీనా తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 5,30,85,566 మంది ఓటర్లు ఉండగా, పురుష ఓటర్లు 2,66,82,156, మహిళా ఓటర్ల సంఖ్య 2,63,98,483గా ఉన్నట్లు తెలిపారు. 16,04,285 మంది కొత్తగా పేర్లు నమోదు చేయించుకున్నారన్నారు. వీరిలో 11,71,558 మంది 18–19 సంవత్సరాల వయస్సున్నవారన్నారు. 2022 సెప్టెంబర్ 1 నుంచి 38 లక్షల మందికి ఓటర్ గుర్తింపు కార్డులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో 58,545 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1,15,709 ఇవీఎం, 89379 వీవీప్యాట్ యంత్రాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. 47,488 మంది సైనికులకు పోస్టల బ్యాలెట్‌ను పంపించినట్లు తెలిపారు. 80 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులైన 80,250 మంది ఇంటివద్దనే ఓటు హక్కు వినియోగించుకోవటానికి నమోదు చేసుకున్నారన్నారు. ఇప్పటివరకు జరిగిన దాడుల్లో రూ.265 కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విద్వేష పూరిత ప్రసంగాలకు సంబంధించి 15మందిపై, గ్రూపు గొడవలకు సంబంధించి మొత్తం 673 ఎఫ్‌ఐఆర్ నమోదైందని రాష్ట్ర ప్రధాన ఎన్నికలాధికారి మనోజ్ కుమార్ మీనా తెలిపారు.



ఓటింగ్‌కు తరలిరండి

ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని బుధవారం మైసూరులో స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో బెలూన్లు ఎగురవేసి బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా ఎన్నికల అధికారులు

రిజర్వేషన్ల పెంపు ఎన్నికల గిమ్మిక్కు

- బీజేపీపై ధ్వజమెత్తిన కాంగ్రెస్‌నేత రణదీప్ సుర్జేవాలా

మైసూరు: రిజర్వేషన్ పెంపు ఆదేశాలను సమర్థించుకుంటూ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడంలో సీఎం బసవరాజు బొమ్మై ప్రభుత్వం విఫలం చెందిందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్ సింగ్ సుర్జేవాలా ఆరోపించారు. బుధవారం మైసూరులో ఆయన ఒక హోటల్‌లో మీడియాతో మాట్లాడుతూ... ముస్లింలకు ఉన్న 4 శాతం రిజర్వేషన్లను రద్దుచేసిన బీజేపీ ప్రభుత్వం ఒక్కలిగలకు 2, లింగాయత్‌లకు 2 శాతం రిజర్వేషన్ అమలుచేసిందని అన్నారు. ఎన్నికల వేళ లబ్ధి కోసం ఈ నిర్ణయం తీసుకుందని మండిపడ్డారు.

బీజేపీ 40 సీట్లు గెలవడమే కష్టం

బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ చెడిపోయిందని, ఈ ఎన్నికల్లో బీజేపీ 40 కంటే ఎక్కువ సీట్లు గెలుపొందలేదని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ జోస్యం చెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జనసంఖ్య ఆధారంగా మైనార్టీలకున్న రిజర్వేషన్‌ను తొలగించి లింగాయత్, ఒక్కలిగలకు ఇవ్వడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి బొమ్మై, ప్రధాని మోదీ, అమిత్ షా, యడియూరప్పలు ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తుందని రక్తంతో రాసిస్తానని యడియూరప్ప చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ తాము 150 సీట్లు గెలుస్తామని రక్తంతో రాసిఇస్తానని ధీమా వ్యక్తం చేశారు.

మోదీ పేరు ప్రస్తావిస్తే తప్పేంటి?

- లింగాయత్‌లపై మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు
- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ మండిపాటు



మాట్లాడుతున్న నిర్మలా సీతారామన్

సాక్షి,బళ్లారి: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ పేరును బీజేపీ పదే పదే ఉపయోగించడంలో తప్పేముందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశ్నించారు. ఆమె బుధవారం కలబుర్గిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు విచ్చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి బీజేపీ గెలవడం ఖాయమన్నారు. ప్రధాని మోదీ రాత్రింబవళ్లు దేశ సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించడానికి ఎంతో శ్రమిస్తున్నారన్నారు. ఇక లింగాయత్‌ల గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. వీరేంద్ర పాటిల్‌ను సీఎం కుర్చీ నుంచి దించి లింగాయత్‌లను ఎంతో అవమానించిందన్నారు. ఒకే కుటుంబానికి బానిసలుగా పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి బీజేపీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. యడియూరప్పను బీజేపీ ఎంతో గౌరవిస్తుందని, ఆయన రాష్ట్రాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, జేడీఎస్, ఇతర పార్టీలు ఎన్ని కుయుక్తులు పన్నినా బీజేపీ గెలవడం ఖాయమన్నారు.

ఎన్నికల బరిలో 2,613 మంది

సాక్షి బెంగళూరు: రాష్ట్ర విధానసభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ఉపసంహరణకు గడువు సోమవారంతో ముగిసింది. ఎన్నికల బరిలో మొత్తం 2,613 మంది నిలిచారు మొత్తం 5,067 మంది నామినేషన్లు సమర్పించగా, వారిలో 4,027 మంది నామినేషన్లను ఎన్నికల సంఘం ఆమోదించింది. 531 మంది నామినేషన్లను తిరస్కరించింది. మరో 517 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 2,613 మంది బరిలో నిలిచారు. బళ్లారి నగరం నియోజకవర్గంలో అత్యంత ఎక్కువగా 24 మంది ఈసారి బరిలో నిలుస్తున్నారు. బెళగావి జిల్లాలో యమకనమరడి నియోజకవర్గంతో పాటు మరో ఏడు నియోజకవర్గాల్లో ఐదు కంటే తక్కువ మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 14 నియోజకవర్గాల్లో అధికంగా మహిళ అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

మహిళా అభ్యర్థులకు కేటాయించిన సీట్ల సంఖ్య

బీజేపీ	కాంగ్రెస్‌పార్టీ	జేడీఎస్ పార్టీ
12	11	13

పోటీలో ఉన్న ఐదుగురు మాజీ ఉప ముఖ్యమంత్రులు

గోవింద కారజోళ, లక్ష్మణ సవది, డాక్టర్ సీఎన్ అశ్వత్థ నారాయణ, ఆర్. అశోక్, డాక్టర్ జి.పరమేశ్వర

మొత్తం అభ్యర్థుల వివరాలు..	
పురుషుల	2,427
మహిళలు	184
ఇతరులు	02
బీజేపీ	224
కాంగ్రెస్	223
జేడీఎస్	207
ఇండిపెండెంట్	918
ఇతర పార్టీలు	1,041
మొత్తం	2,613

అభ్యర్థుల గుండెల్లో రెబెల్స్

- మూడు ప్రధాన పార్టీల్లోనూ తిరుగుబాటుదారులు
- బుజ్జగించినా ససేమిరా అన్న 38 మంది రెబల్స్

సాక్షి బెంగళూరు: విధానసభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు రెబల్స్ బెడద తీవ్రంగా ఉంది. దీంతో అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. టికెట్ దక్కక తిరుగుబావుట ఎగురవేసి నామినేషన్స్ దాఖలు చేసిన రెబల్స్‌లో చాలా మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకోలేదు. 38 స్థానాల్లో రాజకీయ పార్టీలకు రెబల్స్ బెడద ఉంది. బీజేపీ నుంచి 16 మంది, కాంగ్రెస్ పార్టీలో 18 మంది, జేడీఎస్‌లో నలుగురు తిరుగుబావుట ఎగురవేశారు. ఈ రెబల్స్ వల్ల ఓటు బ్యాంకు చీలే అవకాశం ఉందని పార్టీలు భయపడుతున్నాయి. అధికారిక బీజేపీకి తుమకూరు, పుత్తూరు, చెన్నగిరి, బైలహొంగల, హొసదుర్గ, బాగలకోటె, నాగమంగల, గాంధీనగర తదితర 16 చోట్ల రెబల్స్ బరిలో ఉన్నారు. హిందూ సామాజికవర్గం బలంగా ఉన్న పుత్తూరులో అరుణ్ కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. తుమకూరులో సొగడు శివణ్ణను బుజ్జగించినా ఫలితం లేకుండా పోయింది. చెన్నగిరిలో మాడాళు విరూపాక్ష కుమారుడు మాడాళు మల్లికార్జున కూడా నామినేషన్ ఉపసంహరించుకునేందుకు ససేమిరా అనేశారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి శికారిపురలో నాగరాజ గౌడ, జమఖండిలో సుశీల కుమార్, హరపనహళ్లిలో ఎంపీ లత, శిరహట్టిలో మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ దొడ్డమని, చిత్రదుర్గలో సౌభాగ్య బసవరాజన్, తేరదాళలో డాక్టర్ పద్మరాజ నాడగౌడ పాటిల్ రెబల్స్‌గా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో టికెట్ రాకపోవడంతో అఖండ శ్రీనివాసమూర్తి బీఎస్పీలో చేరి పులకేశీనగర నుంచి పోటీలో నిలిచారు. రాణిబెన్నూరు నుంచి బీజేపీకి రెబల్‌గా మాజీ మంత్రి ఆర్.శంకర్ తాజాగా ఎన్‌సీపీలో చేరారు. ఈ ఇద్దరు ప్రధాన రెబల్ నేతలుగా ఉండటం చర్చనీయాంశమైంది. జేడీఎస్‌కు నాలుగు చోట్ల తిరుగుబావుటా కనిపించింది. యాదగిరిలో హనుమేగౌడ బీరనకల్, తుమకూరులో నరసీగౌడ, శ్రీరంగపట్టణ నుంచి చంద్రశేఖర్, మండ్యలో కేఎస్ విజయ్ రెబల్స్‌గా ఉన్నారు.



ధార్వాడ తాలూకా కోటబాగి గ్రామంలో భద్ర జాతర ఉత్సవం బుధవారం ఘనంగా జరిగింది. గ్రామదేవతలు ద్యామవ్వ దేవి, దుర్గమ్మదేవి ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి ఊరేగిస్తున్న దృశ్యం



మండ్యలో బీజేపీ అభ్యర్థి తరఫున రోడ్‌షో నిర్వహిస్తున్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

శెట్టర్ రీఎంట్రీకి ఛాన్సే లేదు



మాట్లాడుతున్న యడియూరప్ప

హుబ్లీ: మాజీ సీఎం జగదీష్ శెట్టర్ బీజేపీకి ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన తిరిగి పార్టీలో చేరే ప్రసక్తే తలెత్తదని మాజీ సీఎం బీఎస్.యడియూరప్ప తెలిపారు. నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నమ్మకం, విశ్వాస ద్రోహం చేసిన వారిని ప్రజలు క్షమించబోరన్నారు. శెట్టర్‌కు పార్టీ ఎటువంటి అన్యాయం చేయలేదన్నారు. అన్ని పదవులను ఆయనకు కట్టబెట్టిందన్నారు. అయినా పార్టీకి ద్రోహం చేసి వెళ్లినందుకు తగిన గుణపాఠం తప్పదన్నారు. గతంలో తాను బీజేపీని వీడి కేజేపీని పెట్టి పెద్ద తప్పు చేశానన్నారు. అయితే శెట్టర్ మాదిరిగా కాంగ్రెస్‌లో చేరలేదన్నారు.

‘కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది’



ఎన్నికల ప్రచార సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ

శివాజీనగర: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ బుధవారం చిక్కమగళూరు జిల్లా శృంగేరి శ్రీశారదా పీఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గురుభవన్‌కు వెళ్లి విధుశేఖర్ భారతీ స్వామిని కలిశారు. స్వామీజీ ఆమెను ఆశీర్వదించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం ప్రియాంకగాంధీ బాళెహొన్నూరు శ్రీరంభాపురి మఠాన్ని సందర్శించి గజరాజు ఆశీర్వాదం పొందారు. శృంగేరితోపాటు హరియూరులో జరిగిన సభల్లో మాట్లాడారు. ప్రజలు బీజేపీ ప్రభుత్వ అవినీతి పాలనతో విసుగెత్తారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావటం తథ్యమన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేసిన పథకాలను ప్రజలు మరచిపోలేదని, ఈసారి కాంగ్రెస్‌కు మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థి శాలం తదితరులు

రాయచూరు రూరల్: నగరంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కేపీసీసీ ప్రచార కార్యదర్శి రవి బోసురాజు పేర్కొన్నారు. ఆయన బుధవారం మంగళవారపేట, నగరేశ్వర కాలనీ, చేపల బజారులో పార్టీ అభ్యర్థి మహ్మద్ శాలం తరపున ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా జిందప్ప, శాంతప్ప, జయన్న, రుద్రప్ప, ప్రవీణ్ ప్రభు శెట్టర్, రాము, తాయన్న నాయక్‌లున్నారు.

స్లంవాసుల ఇళ్ల నిధులు స్వాహా



ప్రచారంలో మాట్లాడుతున్న జేడీఎస్ నాయకులు

రాయచూరు రూరల్: మురికివాడల్లో నివసించే పేదలకు స్లం బోర్డు ద్వారా ఇళ్ల నిర్మాణానికి మంజూరైన నిధులను ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి శివరాజ్ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ శాలం దిగమింగారని జేడీఎస్ అభ్యర్థి, నగరసభ మాజీ అధ్యక్షుడు వినయ్ కుమార్ ఆరోపించారు. ఆయన బుధవారం సిద్రాంపుర, మలియాబాద్, దేవసపల్లి, తుంటాపుర, మిట్టి మల్కాపూర్‌లో ప్రచారసభలో మాట్లాడారు. నగర క్షేత్రంలో 5000 ఇళ్లకు మంజూరైన నిధులను కాజేసిన వారికి ఓటు వేయవద్దన్నారు. ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకొనే జేడీఎస్‌కు ఓటు వేయాలని కోరారు. జేడీఎస్ జిల్లాధ్యక్షుడు విరుపాక్షి, శివశంకర్, ఆంజినేయ, నరసప్ప, బుగ్గారెడ్డి, వీరేష్,హనుమంతు, ఫాతిమా, యూసఫ్‌ఖాన్‌లున్నారు.

బీజేపీలోకి వలస



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన కార్యకర్తలు

రాయచూరు రూరల్: నగరంలో పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. బుధవారం మహిళా సమాజ్‌లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో వంద మందికి పైగా కార్యకర్తలు రాజీనామా చేసి ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ సమక్షంలో పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మలియాబాద్, దేవసపల్లి, తుంటాపుర, మిట్టిమల్కాపూర్‌ల్లో ప్రచారం చేపట్టారు.

నాకు మరో అవకాశం ఇవ్వండి



గ్రామాల్లో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి తదితరులు

గంగావతి: ఈ ఎన్నికల్లో తనకు మరోసారి అవకాశం కల్పించాలని సిట్టింగ్ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి పరణ్ణ మునవళ్లి విజ్ఞప్తి చేశారు. ఆయన నియోజకవర్గంలోని అబ్బిగేరి, కెంచనదోణి, లేబగేరి, సంగాపుర, భీమనూరు, కామనూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. తన అధికార అవధిలో ఎంతో అభివృద్ధిని చేపట్టానని, అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలను దరిచేర్చానన్నారు. ఈసందర్భంగా పార్టీ నేతలు నెక్కంటి సూరిబాబు, చెన్నప్ప మళిగి, ఆయా గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న పవన్‌కుమార్

గుత్తి: గుత్తి రైల్వే స్టేషన్‌లో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన పవన్ కుమార్ అనే వ్యక్తి రైలు ఇంజిన్‌కు ఉన్న విద్యుత్ వైర్‌ను పట్టుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. యూపీకి చెందిన పవన్ కుమార్ తన భార్య బెంగళూరులో ఉండటంతో ఆమెను కలవడానికి వెళ్లాడు. అయితే ఆమె అతనితో రావడానికి నిరాకరించింది. దీంతో మనస్తాపం చెందిన పవన్ కుమార్ యలహంక నుంచి కాచిగూడ వెళ్లే రైల్లో తిరుగు ప్రయాణమయ్యాడు. అయితే గుత్తి రైల్వే స్టేషన్‌లో రైలు ఆగిన సమయంలో ఇంజిన్‌కు ఉన్న విద్యుత్ వైరు పట్టుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రమాదంలో పవన్‌కుమార్ శరీరం సుమారు 40 శాతం దాకా కాలిపోయింది. జీఆర్‌పీ ఎస్‌ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు తదితరులు పవన్‌కుమార్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రాయచూరు గ్రామీణం.. పోటీ ముక్కోణం

- మహిళా ఓటర్ల సంఖ్యే అధికం
- గెలుపుపై సిట్టింగ్, మాజీ ఎమ్మెల్యేల గురి



గ్రామీణ నియోజకవర్గం పరిధిలోని శక్తినగర్‌లోని రాయచూరు థర్మల్ విద్యుత్ కేంద్రం



తిప్పరాజ్ హవల్దార్ (బీజేపీ)



బసనగౌడ దద్దల్ (కాంగ్రెస్)



నరసింహ నాయక్ (జేడీఎస్)

రాయచూరు రూరల్: గ్రామీణ నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్ పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. మాజీ ఎమ్మెల్యే తిప్పరాజ్ బీజేపీ నుంచి, ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ కాంగ్రెస్ నుంచి, జెడ్పీ మాజీ సభ్యుడు నరసింహ నాయక్ జేడీఎస్ నుంచి పోటీపడుతున్నారు. 2008లో బీజేపీ నుంచి పోటీ చేసిన బసనగౌడ దద్దల్ కాంగ్రెస్ అభ్యర్థి రాజారాయప్ప నాయక్ చేతిలో ఓటమి పాలయ్యారు. 2013లో బీజేపీ నుంచి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి తిప్పరాజ్ విజయం సాధించారు. 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బసనగౌడ దద్దల్ బీజేపీ అభ్యర్థి తిప్పరాజ్‌ను ఓడించారు. 2023లో జరిగే ఎన్నికల్లో తిప్పరాజ్(బీజేపీ), బసనగౌడ దద్దల్(కాంగ్రెస్), నరసింహ నాయక్(జేడీఎస్) తలపడ్డారు. బీజేపీ అభ్యర్థి తిప్పరాజ్ రెండోసారి పోటీకి సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బసనగౌడ రెండోసారి గెలుపొందాలని ఆరాటపడుతున్నారు. జేడీఎస్ అభ్యర్థి నరసింహ నాయక్ మొదటిసారి స్థానికుడనే అభిమానంతో బరిలో నిలిచారు. ఆప్ అభ్యర్థి సుభాష్‌చంద్ర శంభోజీ ఇంజినీర్‌గా పని చేసిన అనుభవం ఉంది.

అభివృద్ధే ప్రచారాస్త్రం

బీజేపీ అభ్యర్థి తిప్పరాజ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ ఐదేళ్ల పాలనలో తాను చేసిన అభివృద్ధి పనులను వివరిస్తున్నారు. జేడీఎస్ అభ్యర్థి నరసింహ నాయక్ మాజీ సీఎం కుమారస్వామి చేసిన అభివృద్ధి పనులపై ప్రచారం చేయనున్నారు. ఆప్ అభ్యర్థి శంభోజీ పంజాబ్, ఢిల్లీల్లో కేజ్రీవాల్ అమలు చేసిన పథకాలను గురించి ప్రచారం చేస్తున్నారు. కాగా రాయచూరు గ్రామీణ నియోజకవర్గంలో 2,27,891 మంది ఓటర్లుండగా మహిళలు 1,15,727 మంది, పురుషులు 1,12,109 మంది, ఇతరులు 55 మంది ఉన్నారు. గ్రామీణ నియోజకవర్గానికి ఒక వైపు ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని కర్నూలు జిల్లా మాధవరం, మంత్రాలయం, మరో వైపున తెలంగాణలోని నారాయణపేట జిల్లా మక్తల్, కృష్ణా, గద్వాల జిల్లా ఐజ, బలిగేర మండలాలు ఆనుకుని ఉన్నాయి.

కమలానికి ఓటు.. నగరాభివృద్ధికి చోటు



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి

సాక్షి బళ్లారి: నగర సర్వతోముఖాభివృద్ధికి బీజేపీకి ఓటు వేయాలని ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం నాలుగో వార్డులోని పలు కాలనీల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఎవరి హయాంలో నగరంలో అభివృద్ధి పనులు జరిగాయో ప్రజలు గుర్తించాలన్నారు. ఎన్నికలప్పుడే ప్రజల వద్దకు వచ్చే వారికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ పథకాలను చూసి తనను గెలిపించాలన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు మురారిగౌడ, కార్పొరేటర్లు కోనంకి తిలక్, మోత్కూర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం



ఎమ్మెల్యే బసవరాజుకు పూలమాలతో అభినందన

గంగావతి: కనకగిరి నియోజకవర్గంలోని చిక్కమాదినాళ, బంకాపుర తదితర గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి బసవరాజు ధడేసూగూరు ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. తాను నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి కరపత్రాలను ఇంటింటికీ అందిస్తూ మళ్లీ తనకు ఓటు వేసి, వేయించి గెలిపించాలని ఓటర్లను కోరారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ప్రతిపక్ష నేత సిద్ధరామయ్య



మాట్లాడుతున్న మాజీ సీఎం సిద్ధరామయ్య

హొసపేటె: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవాలని మాజీ సీఎం సిద్ధరామయ్య తెలిపారు. బుధవారం జిల్లాలోని హడగలి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పీటీ.పరమేశ్వర్‌నాయక్ తరపున ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు అన్ని విధాలుగా ఎంతో మేలు చేశామన్నారు. కానీ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలు నిరంతరంగా కష్టాలకు గురయ్యారన్నారు. కమీషన్ల ప్రభుత్వంగా ప్రజల్లో ముద్ర వేసుకొన్నారని ఆరోపించారు. తాను సీఎంగా ఉన్నప్పుడు హడగలికి కోట్లాది రూపాయలను అందించానన్నారు. నియోజకవర్గ మరింత అభివృద్ధికి కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అభ్యర్థి పీటీ.పరమేశ్వర్‌నాయక్, వందలాది మంది కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

గణేష్‌కు ఓటేస్తే అది నాకు వేసినట్లే

కంప్లి: ఈసారి ఎన్నికల్లో గణేష్‌కు ఓటు వేస్తే అది తనకు వేసినట్లేనని ప్రతిపక్ష నేత సిద్ధరామయ్య తెలిపారు. బుధవారం కురుగోడు పట్టణంలో ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ మంత్రి శ్రీరాములు, బీజేపీ అభ్యర్థి సురేష్‌బాబుపై విరుచుకుపడ్డారు. కంప్లి షుగర్ ఫ్యాక్టరీని మంత్రి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు బినామీ పేరుతో ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఖర్చుల కోసం చట్టానికి వ్యతిరేకంగా కబ్జా చేశారన్నారు. ఈ ఎన్నికల్లో నూటికి నూరు శాతం బీజేపీకి ఓటమి తప్పదన్నారు. తాను ముఖ్యమంత్రిగా ఐదేళ్ల పాటు మచ్చలేని పాలన అందించానన్నారు. ప్రతిపక్షంలో ఉంటూ కూడా గణేష్ రూ.వెయ్యి కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేశాడన్నారు. కాంగ్రెస్ పాలన రాగానే ఇదే గణేష్‌కు రూ.5 వేల కోట్ల నిధులు ఇస్తానన్నారు. కార్యక్రమంలో అల్లం వీరభద్రప్ప, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ఎల్ స్వామి, చొక్క బసవనగౌడ, బీఎం.పాటిల్, కేపీ.అంజిని, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేను బీజేపీకి అన్యాయం చేయలేదు

- మాజీ సీఎం జగదీష్ శెట్టర్

హుబ్లీ: తాను బీజేపీకి ఎలాంటి అన్యాయం చేయలేదని, అయినా జగదీష్ శెట్టర్ అనే పేదవాడిపై ఎందుకు విరుచుకు పడుతున్నారో తెలియదని హుబ్లీ–ధార్వాడ సెంట్రల్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి జగదీష్ శెట్టర్ తెలిపారు. నగరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన ఓటమే లక్ష్యంగా బీజేపీ వ్యూహాలు రచిస్తోందన్నారు. అయితే మే 10న జనతా కోర్టులో గెలుపోటములు నిర్ణయం అవుతాయన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హుబ్లీలో జగదీష్ శెట్టర్‌ను ఓడించాలని ప్రకటించారన్నారు. అంతేగాక యడియూరప్ప కూడా మంగళవారం ప్రముఖుల సమావేశంలో తనపైన, తన ఓటమిపైనా దృష్టి సారించారన్నారు. పేదోడిపై వీరికి ఎందుకు అంత కోపమన్నారు. తానొక్కడినే బీజేపీని వీడలేదని, తనలానే ఆయనూరు మంజునాథ, లక్ష్మణ సవధి, యల్లాపురలో మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్.సంతోష్ తదితరులు బీజేపీ నుంచి వైదొలిగి కాంగ్రెస్‌లో చేరారన్నారు. అయితే తనను మాత్రమే పెద్ద తప్పు చేసిన వాడిలా నిలదీస్తున్నారన్నారు. గతంలో ఆపరేషన్ కమల చేపట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడే తత్వ సిద్ధాంతాలన్నీ మట్టిలో కొట్టుకు పోయాయన్నారు. వారికి తన గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ఆయన విమర్శించారు.

ఆరు చోట్ల కాంగ్రెస్‌దే విజయం



మాట్లాడుతున్న రవి బోసురాజు

రాయచూరు రూరల్: జిల్లాలో ఆరు చోట్ల కాంగ్రెస్ విజయం తథ్యమని కేపీసీసీ ప్రచార కార్యదర్శి రవి బోసురాజు అన్నారు. ఆయన బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా అవినీతి, అక్రమాలు, కమీషన్ దందాలకు పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని, పార్టీ కార్యకర్తలంతా అభ్యర్థి విజయానికి శ్రమించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి ,మహ్మద్ శాలం, సత్యనారాయణ, రుద్రప్ప అంగడి, ప్రవీణ్ ప్రభుశెట్టర్, అరుణ్, రమేష్, బషీరుద్దీన్‌లున్నారు.

క్షేత్ర అభివృద్ధి నా కల



ప్రచారం చేస్తున్న సురేష్‌బాబు, శాంత తదితరులు

కంప్లి: క్షేత్ర అభివృద్ధి తన కల అని, తనను గెలిపిస్తే రెట్టింపు అభివృద్ధి చేసి చూపుతానని బీజేపీ అభ్యర్థి టీహెచ్.సురేష్‌బాబు తెలిపారు. ఆయన బుధవారం గుత్తిగనూరు, మారుతీక్యాంప్, పట్టణసెరుగు తదితర గ్రామాల్లో మాజీ ఎంపీ జే.శాంతతో కలిసి పర్యటించి ప్రచారం చేపట్టారు. మీ ఆశీర్వాదమే తనకు ముఖ్యమని, మీరందరూ కమలం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. పార్టీ నేత గుత్తిగనూరు విరుపాక్షిగౌడ పలువురు కాంగ్రెస్ కార్యకర్తలను సురేష్‌బాబు సమక్షంలో బీజేపీలో చేర్పించారు.

ఈసారి నన్ను గెలిపించండి



చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులను కలుసుకున్న గాలి లక్ష్మీ అరుణ

సాక్షి,బళ్లారి: ఈసారి ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చి గెలిపిస్తే మీ సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కేఆర్‌పీపీ అభ్యర్థి గాలి లక్ష్మీ అరుణ పేర్కొన్నారు. ఆమె బుధవారం నగరంలో జిల్లా చాంబర్ కామర్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యవర్గాన్ని కలిసి మాట్లాడారు. వేలాది మంది వ్యాపార, పారిశ్రామిక ప్రతినిధులందరూ పెద్ద మనస్సుతో తనను దీవించి గెలిపించాలని కోరారు. గతంలో తన భర్త గాలి జనార్దనరెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యాపారుల సంక్షేమం, పరిశ్రమల స్థాపన కోసం శ్రమించారని గుర్తు చేశారు. నగరంలో పార్టీని గెలిపిస్తే మరింత ఉత్సాహంగా ఈ ప్రాంత అభివృద్ధికి శ్రమిస్తారన్నారు. ఓఎంసీ డైరెక్టర్ బీ.వీ.శ్రీనివాసరెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి యశ్వంత్‌రాజ్, ఉపాధ్యక్షుడు మంజునాథ్, ప్రముఖులు రమేష్‌బుజ్జి, దొడ్డనగౌడ, సొంతా గిరిధర్, పాలన్న, పార్టీ ప్రముఖులు వెంకటరమణ, సూరిబాబు, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కప్పగల్ రోడ్డులో ఇంటింటా ప్రచారం చేసి ఫుట్‌బాల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పార్టీ మహిళా నాయకులు హంపీ రమణ, లీలా శ్రీనివాసరెడ్డి, పద్మ, వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

రోడ్‌షోలతో ప్రచార హోరు

సాక్షి,బళ్లారి: ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు విచ్చేసిన కేంద్ర మంత్రి మంగళవారం సాయంత్రం నగరంలో ఇంటింటా ప్రచారంతో పాటు సభలు, సమావేశాల్లో పాల్గొన్న అనంతరం తాళూరు రోడ్డు, నాగప్ప కట్టె తదితర ప్రముఖ వీధుల్లో రోడ్‌షోలతో ప్రచారాన్ని హోరెత్తించారు. టాప్ లేని వాహనంపై కేంద్ర మంత్రి కిషన్ పాల్ గుర్జార్, పార్టీ అభ్యర్థి గాలి సోమశేఖరరెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు మురారిగౌడ తదితరులు వెళుతూ పార్టీ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఈసారి మళ్లీ బీజేపీని గెలిపించాలని కోరారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు వీరశేఖరరెడ్డి, కార్పొరేటర్లు కోనంకి తిలక్, మోత్కర్ శ్రీనివాసరెడ్డి, హనుమంతు, పార్టీ నాయకులు మల్లనగౌడ, రామాంజిని, తొగరి రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రాయచూరు, యాదగిరిల్లో కూడా..

రాయచూరు రూరల్: రాయచూరు, యాదగిరి జిల్లాల్లో కూడా మంగళవారం సాయంత్రం బీజేపీ నాయకులు రోడ్‌షోలు నిర్వహించారు. రాయచూరులో కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండా, నగర ఎమ్మెల్యే, అభ్యర్థి శివరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో, యాదగిరిలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, నగర బీజేపీ అభ్యర్థి వెంకటరెడ్డి ముద్నాళ్, రాయచూరు ఎంపీ రాజా అమరేశ్వర నాయక్ పాల్గొని కమలం గుర్తుకు ఓట్లు వేయమని ప్రజలను అభ్యర్థించారు.

ప్రజాసేవా భాగ్యం కల్పించండి



ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థి దివాకర్

హొసపేటె: సండూరు నియోజకవర్గ కేఆర్‌పీపీ అభ్యర్థి కే.ఎస్.దివాకర్ బుధవారం జోరుగా ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. నియోజక వర్గంలోని మత్తాజనహళ్లి, శౌలియప్పనహళ్లి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించి ఈసారి ఎన్నికల్లో ఫుట్‌బాల్ గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించి ప్రజాసేవ చేసే భాగ్యం కల్పించాలని ఓటర్లను కోరారు. ఈసందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు, ప్రజలు పాల్గొన్నారు.

ముళబాగిలులో గెలుపు నాదే



మాట్లాడుతున్న అభ్యర్థి ఆదినారాయణ

శ్రీనివాసపురం: ముళబాగిలులో ఈసారి తన విజయం ఖాయమని కాంగ్రెస్ అభ్యర్థి వి.ఆదినారాయణ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం నంగలిలో ప్రచారంలో పాల్గొన్న సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ముళబాగిలులో కాంగ్రెస్ పటిష్టంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ ఆశీస్సులకు తోడు ప్రచార సమయంలో ప్రజల నుంచి తనకు అనూహ్య మద్దతు లభిస్తోందన్నారు. అన్ని వర్గాల అండదండలతో తాను ఈసారి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగుర వేస్తానన్నారు. యూత్ కాంగ్రెస్ కార్యదర్శి మహమ్మద్ శఫీఉల్లా, నాయకులు అక్రం మహమ్మద్, ఆశ్రఫ్, నందకుమార్, రాజేంద్ర పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

శ్రీనివాసపురం.. పోరు రసవత్తరం

- నాలుగు దశాబ్దాలుగా సుదీర్ఘ పోరాటం
- రాజకీయ ప్రత్యర్థుల మధ్యే మళ్లీ పోటీ



జీకే వెంకట శివారెడ్డి



కెఆర్ రమేష్‌కుమార్



గుంజూరు శ్రీనివాసరెడ్డి

శ్రీనివాసపురం: నియోజకవర్గంలో సాంప్రదాయ రాజకీయ బద్ధశత్రువుల మధ్యే రసవత్తర పోరు నెలకొంది. నియోజకవర్గంలో గత 40 ఏళ్లుగా రమేష్‌కుమార్, వెంకటశివారెడ్డిల మధ్య రాజకీయ ఎక్కువగా ఉంటోంది, పార్టీ ప్రతిష్ట కంటే వ్యక్తిగత ప్రతిష్టకే ప్రాధాన్యత అధికంగా ఉంటుంది. ఇక్కడ బీజేపీ అభ్యర్థిది నామమాత్రపు పోటీనే. 1983 నుంచి ఇద్దరి మధ్యన పోటీ ప్రారంభమైంది. నియోజకవర్గ ప్రజలు ఒకసారి జీకే వెంకటశివారెడ్డిని, మరోసారి కేఆర్ రమేష్‌కుమార్‌ను గెలిపిస్తూ వచ్చారు. ఒకసారి గెలిచిన వారు రెండోసారి గెలవడం అనుమానమే. అయితే ఇందుకు భిన్నంగా 2013, 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కె ఆర్ రమేష్‌కుమార్ వరుసగా రెండు సార్లు విజయం సాధించి రికార్డు సృష్టించారు. మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించాలని తహతహలాడుతున్నారు. నియోజకవర్గంలో ఒక్కలిగులు, దళితులు, ముస్లింలు అధికంగా ఉన్నారు. ఎమ్మెల్యే రమేష్‌కుమార్ తనకు ఇవే చివరి ఎన్నికలని ప్రకటించారు. డాక్టర్ వెంకటాచల ఆప్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఉండడం వల్ల అధికంగా ఉన్న తెలుగు మాట్లాడేవారి ఓట్లే ఎన్నికల్లో కీలకం కానున్నాయి.

30న ప్రధాని మోదీ పర్యటనకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పార్టీ నాయకులు

కోలారు: నగరానికి ఈ నెల 30న ప్రధాని నరేంద్ర మోదీ రాక నేపథ్యంలో ఏర్పాట్లను బుధవారం ఎంపీ ఎస్ మునిస్వామి తదితర బీజేపీ నాయకులు పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కోలారుకు ప్రధాని రాక ప్రత్యర్థుల్లో భయం పుట్టిస్తోందన్నారు. ప్రధాని రాక కార్యకర్తల్లో మరింత ఉత్సాహం నింపుతోందన్నారు. ఈసారి పాత మైసూరు ప్రాంతంలో కూడా బీజేపీ అభ్యర్థులు భారీ సంఖ్యలో గెలుపొందుతారన్నారు. పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే అభ్యర్థుల విజయానికి దోహదపడతాయన్నారు. ఆరోజు ఉదయం 9.30 గంటలకు ప్రధాని వస్తున్నారని, కార్యక్రమానికి ఉభయ జిల్లాల నుంచి దాదాపు 2.5 లక్షల మంది హాజరవుతున్నారన్నారు. ప్రధాని రాక కోసం 3 హెలిప్యాడ్‌లను సిద్ధం చేశామన్నారు. ప్రధాని కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కేపీడీఏ మాజీ అధ్యక్షుడు ఓం శక్తి చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాగృతికి శ్రీకారం

కోలారు: నగరంలోని బంగారుపేట సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిత్యం సంచరించే ఆటో రిక్షాలకు ఓటరు అవగాహన స్టిక్కర్లను జెడ్పీ సీఈఓ యుకేష్‌కుమార్ అతికించడం ద్వారా ఓటు హక్కుపై ఓటర్లను జాగృతం చేశారు. ఎస్పీ ఎం.నారాయణ ఆటోలో స్వయంగా ప్రయాణించి ప్రజలకు అవగాహన కల్గించారు. నగర ప్రజలకు కరపత్రాలను పంచి పెట్టారు. సమర్థులను ఎన్నుకోవడం ద్వారా దేశ ప్రగతికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రొబెషనరి ఐఏఎస్ అధికారి వినాయక్, రవాణా శాఖ అధికారి వ్యోమకేశప్ప తదితరులు పాల్గొన్నారు.

స్థానికుడినే ఆదరించండి

కోలారు: స్థానికుడినైన తనను గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని జేడీఎస్ అభ్యర్థి సీఎంఆర్ శ్రీనాథ్ విన్నవించారు. బుధవారం వేమగల్ ఫిర్కాలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు స్థానికేతరులని, కానీ తాను నగరంలోనే నివాసం ఉంటున్నానన్నారు. ఎన్నికలప్పుడు కనిపించి తరువాత మాయమయ్యే వారిని విశ్వసించ వద్దన్నారు. సదా ప్రజలకు అందుబాటులో ఉంటున్న తనను గెలిపించి ప్రజా సేవకు అవకాశం కల్పించాలన్నారు. జెడ్పీ సభ్యుడు బాలాజీ చెన్నయ్య, ఒక్కలిగ సంఘం డైరెక్టర్ డాక్టర్ రమేష్, వక్కలేరి రాము పాల్గొన్నారు.

నేత్రపర్వం.. ఉజ్జయిని మరుళ సిద్ధేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

హొసపేటె: విజయనగర జిల్లా కొట్టూరులో వెలసిన ప్రసిద్ధ ఉజ్జయిని మరుళ సిద్ధేశ్వర రథోత్సవం మంగళవారం సాయంత్రం అశేష భక్తజనవాహిని మధ్య నేత్రపర్వంగా నెరవేరింది. ఉదయం ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, అర్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రథోత్సవంలో జిల్లాలోని వివిధ తాలూకాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని తమ మొక్కులను తీర్చుకొన్నారు.

బీఎల్.సంతోష్‌పై నిందలు తగదు



మాట్లాడుతున్న నళిన్ కుమార్

హుబ్లీ: శెట్టర్ అధికారంలో ఉండగా ఎంత మందికి టికెట్లు ఇప్పించారో చెప్పాలని బీజేపీ రాష్ట్ర చీఫ్ నళిన్‌కుమార్ కటీల్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం నగరంలో విలేకరులతో మాట్లాడారు. టికెట్లపై నిర్ణయం ఏ ఒక్క వ్యక్తి తీసుకోరని, పార్టీ పెద్దలే నిర్ణయం తీసుకుంటారన్న విషయం తమ కన్నా శెట్టర్‌కు బాగా తెలుసన్నారు. అనవసరంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్.సంతోష్‌పై నిందలు వేయడం తగదన్నారు. పార్టీపై ఉన్న సహజమైన వ్యతిరేకతను శెట్టర్ ఈవిధంగా ఉపయోగించుకొన్నారన్నారు. పార్టీలో సామూహిక నిర్ణయాలు తీసుకుంటామన్నారు. పార్టీలో ఆయన అన్ని పదవులను చేపట్టారన్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు అందరికీ టికెట్లు ఇప్పించారా? అని నిలదీశారు. శెట్టర్ బరిలో ఉన్న స్థానంలో ప్రచారానికి సాధారణంగానే ప్రధానితో సహా పార్టీ అగ్రనేతలందరూ వస్తున్నారన్నారు. 224 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా మోదీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తారన్నారు. కేవలం ఓ వర్గాన్ని సముదాయించడానికి బీజేపీ ప్రయత్నించబోదన్నారు. తామే తిరిగి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి 75 మంది కొత్తవారికి, సాధారణ కార్యకర్తలకు కూడా టికెట్ ఇచ్చామన్నారు. యడియూరప్ప మార్గదర్శకత్వంలో, సీఎం బొమ్మై నేతృత్వంలో పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

జోరుగా కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం



మాట్లాడుతున్న నారా భరత్‌రెడ్డి

సాక్షి బళ్లారి: విద్యానగర్‌లో బుధవారం కాంగ్రెస్ అభ్యర్థి నారా భరత్‌రెడ్డి జోరుగా ప్రచారం నిర్వహించారు. ఆయన నగర మాజీ మేయర్ మోదుపల్లి రాజేశ్వరి, కార్పొరేటర్లు విక్కీ తదితరులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి భరత్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. సిద్దరామయ్య సీఎంగా ఉన్నప్పుడు చేపట్టిన సంక్షేమ పథకాలను, మళ్లీ కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ పథకాలను చూసి హస్తం గుర్తుకు ఓటు వేయాలని సూచించారు. నగరాభివృద్ధికి తాను ప్రత్యేక ప్రణాళికలను రూపొందించుకొన్నానని, క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మారుస్తానన్నారు.

కేసీ వ్యాలీ నీరు రైతులకు వరం



మాట్లాడుతున్న కె ఆర్ రమేష్‌కుమార్

శ్రీనివాసపురం: తాలూకా రైతులకు కేసీ వ్యాలీ నీరు వరంగా మారిందని కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కేఆర్ రమేష్ కుమార్ అన్నారు. బుధవారం ఈతరాసనహళ్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. కేసీ వ్యాలీ నీటి ద్వారా చెరువులు నిండి అంతర్జలాల స్థాయి పెరిగిందన్నారు. డీసీసీ బ్యాంకు నుంచి మహిళలకు వడ్డీలేని రుణాలు అందించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రుణ పరిమితిని పెంచుతామన్నారు. ప్రజలు తాను చేసిన అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఎన్‌జీ బ్యాటప్ప, ఎం.గోవిందగౌడ, సాణ్ణేగౌడ, వి.వెంకటస్వామి, ఎన్.మోహన్, వి.బాబు పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే మేలు



మాట్లాడుతున్న కేంద్రమంత్రి అర్జున్‌రాం మేఘవాల్

శ్రీనివాసపురం: ఎన్నికల్లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవడం ద్వారా ప్రధాని నరేంద్ర మోదికి శక్తిని నింపాలని కేంద్ర పార్లమెంటరీ, సంస్కృతి శాఖా మంత్రి అర్జున్ రాం మేఘవాల్ తెలిపారు. బుధవారం యల్దూరులో బీజేపీ అభ్యర్థి గుంజూరు శ్రీనివాసరెడ్డి తరపున రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఎమ్మెల్సీ వైఏ నారాయణస్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పార్టీల కతీతంగా సౌలభ్యాలను అందిస్తున్నాయి. రైతులు, వ్యవసాయ కార్మికులు ప్రతి ఒక్కరికీ మౌలిక సౌకర్యాలను అందిస్తోందన్నారు. రోడ్‌షోలో బీజేపీ అభ్యర్థి జి ఆర్ శ్రీనివాసరెడ్డి, జయచంద్ర, అశోక్‌రెడ్డి, ఎస్ రాజేంద్ర ప్రసాద్, రాజశేఖరరెడ్డి, శశికుమార్, ఆర్ నారాయణస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అధ్యక్షుడిగా కృష్ణప్ప



కృష్ణప్ప, పుష్ప శివరాజ్‌ను సన్మానించిన దృశ్యం

విజయపుర: విజయపుర హోబళి కోరమంగళ గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ మద్దతుదారు కృష్ణప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా పుష్ప శివరాజ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కృష్ణకుమార్ బుధవారం ప్రకటించారు. గత ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. అందులో పది సభ్యుల్లోకి ఎనిమిది మంది కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు గెలుపొందారు. ఇద్దరు జేడీఎస్ మద్దతుదారులు గెలిచారు.

పార్టీ కోసం పనిచేస్తా

మైసూరు: తనకు బీజేపీ, దేశమే ముఖ్యమని, ఈసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ దక్కనప్పటికీ పార్టీ అభ్యర్థుల విజయం కోసం శ్రమిస్తానని చిత్రనటుడు, బీజేపీ ముఖ్య నేత ఎస్.జయప్రకాశ్ తెలిపారు. బుధవారం మైసూరు వాణీవిలాస్‌లో బీజేపీ మైసూరు విభాగం మీడియా కేంద్రంలో మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో మైసూరు చామరాజ నియోజకవర్గానికి తనకు టికెట్ ఇచ్చేందుకు పార్టీ నాయకత్వం నిరాకరించిందని, అయినా తాను నిరాశ చెందలేదని, పార్టీ విజయం కోసం కృషి చేస్తానన్నారు.

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సస్పెండ్

బనశంకరి: పులకేశినగర నియోజకవర్గం నుంచి బీఎస్పీ తరఫున పోటీ చేస్తున్న అఖండ శ్రీనివాసమూర్తికి మద్దతు ప్రకటించిన డీజే.హళ్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ బరీద్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. బెంగళూరు ఉత్తర జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.రాజ్‌కుమార్ ఆదేశాల మేరకు అబ్దుల్ బరీద్‌పై సస్పెండ్ వేటు వేశారు.

ప్రదీప్ ఈశ్వర్‌ను గెలిపించండి



మాట్లాడుతున్న మాజీ మంత్రి సీతారామ్

చిక్కబళ్లాపురం: కాంగ్రెస్ అభ్యర్థి ప్రదీప్ ఈశ్వర్‌ను గెలిపించాలని కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి ఎంఆర్ సీతారామ్ అన్నారు. బుధవారం నగరంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2018 వరకు కాంగ్రెస్ పార్టీలో ఉన్న సుధాకర్, 2018 తరువాత బీజేపీలో చేరి పాఠాలు నేర్చుకుని కాంగ్రెస్‌ను, నేతలను దూషించడం తగదన్నారు. బలిజ సముదాయానికి చెందిన ప్రదీప్ ఈశ్వర్ మంచి మనిషిగా గుర్తింపు పొందారని, ఆయనకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అభ్యర్థి ప్రదీప్ మాట్లాడుతూ... ప్రజాసేవ చేయడానికి ప్రజలు అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ఎం మునియప్ప, కాంగ్రెస్ నాయకులు యలువహళ్లి రమేశ్, రామకృష్ణప్ప అజిత్ ప్రసాద్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి కూలీ మృతి

యశవంతపుర: ప్రమాదశాత్తు చెరువులో పడి కార్మికుడు మృతి చెందిన ఘటన దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళలో బుధవారం జరిగింది. వామదపదవు అజ్జిబెట్టు వద్ద పోళేదడి నివాసి వాసు పూజారి (52) చెరువులో పడి మృతి చెందారు. పోళేదడిలో తోటలో పని చేస్తుండగా కాలుజారి చెరువులో పడి మృతి చెందాడు. సహచర కూలీలు అక్కడికి చేరుకుని బయటకు తీసే ప్రయత్న చేశారు. అప్పటికే పూజారి మృతి చెందాడు. బంట్వాళ గ్రామాంతర పోలీసులు కేసు నమోదు చేశారు.

శివమొగ్గకు హస్తిన నేతలు

శివమొగ్గ: శివమొగ్గ జిల్లా ఏడు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో ఎవరికి వారు తమ పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం కోసం ఢిల్లీ నుంచి అధినేతలు రంగంలోకి దిగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంక గాంధీ 27న శివమొగ్గ నగరానికి వస్తున్నారు. హెలికాప్టర్ ద్వారా నగరానికి వచ్చిన తర్వాత పార్టీ అభ్యర్థులు, నేతలతో సమాలోచనలు జరపనున్నారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా ఉడుపికి వెళ్తారు. మరోవైపు మే నెలలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు శివమొగ్గ జిల్లాకు విచ్చేయనున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



బాగేపల్లి: బీజేపీకి చెందిన ముఖ్యనేతలు ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీలో క్రియాశీలకంగా ఉన్న మురళి, వెంకటేశ్, మంజునాథ్, మహేశ్, గంగిరెడ్డి దాదాపు 40 మంది బీజేపీ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బసవనగుడిలో నువ్వా నేనా !

- జీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీ
- నిర్ణాయకం కానున్న బ్రాహ్మణ, వక్కలిగుల ఓట్లు





అరమనె శంకర్ (జేడీఎస్ అభ్యర్థి)



యూబీ వెంకటేశ్ (కాంగ్రెస్)



రవి సుబ్రమణ్య (బీజేపీ అభ్యర్థి)

బనశంకరి: శనక్కాయల పరుష ద్వారా గ్రామీణ సంప్రదాయాన్ని ఆనవాయితీగా కొనసాగిస్తున్న బసవనగుడి నియోజకవర్గం 2023 శాసనసభ ఎన్నికల్లో బీజేపీ–కాంగ్రెస్ మధ్య నువ్వానేనా? అనే పోటీ నెలకొంది. బసవనగుడి నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్ అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ త్రిముఖ పోటీ నెలకొన్నా, ప్రధానంగా బీజేపీ–కాంగ్రెస్ మధ్య నువ్వా, నేనా అనే స్థాయిలో ఉంది. ఈ మూడు పార్టీల అభ్యర్థులు నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. 2008 నుంచి వరుసగా మూడుసార్లు బీజేపీ నుంచి ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన ఎమ్మెల్యే రవిసుబ్రమణ్యకు ఈసారి ఎన్నికల్లో గెలుపు అంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

రెండేళ్లుగా కాంగ్రెస్ అభ్యర్థి గ్రౌండ్ వర్క్: కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన యూబీ.వెంకటేశ్ బసవనగుడి నియోజకవర్గంలో రెండేళ్లుగా గ్రౌండ్‌వర్క్ చేస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఇద్దరు బ్రాహ్మణ సముదాయానికి చెందిన వారే. ప్రతిసారి కాంగ్రెస్ పార్టీ చివరి క్షణంలో అభ్యర్థిని ఎంపిక చేసేది. కానీ ఈసారి ముందుగానే యూబీ.వెంకటేశ్‌కు టికెట్ కేటాయించింది. టికెట్ రేసులో ఉన్న శంకర్ గుహను పార్టీ అధ్యక్షుడు డీకే శివకుమార్ సముదాయించి వెంకటేశ్ గెలుపునకు సహకరించాలని సూచించారు.

జేడీఎస్ అభ్యర్థికి సత్సంబంధాలు: ఇక జేడీఎస్ అభ్యర్థి కేవీ.శంకర్ (అరమనె శంకర్) ఏడాది కాలంగా నియోజకవర్గ ప్రజలతో సంబంధాలు పెంచుకున్నారు. బెంగళూరు–నాగమంగల మధ్య ఉచిత బస్ సంచారం ఏర్పాటుచేసి ప్రజల్లో విశ్వాసం పొందారు. బసవనగుడి నియోజకవర్గంలో ఈసారి ఎన్నికల్లో శ్రీ గురురాఘవేంద్ర కుంభకోణ ఫలితాన్ని అభ్యర్థులు ఎదుర్కోవలసి వస్తుంది.

బ్రాహ్మణులు వక్కలిగలే కీలకం

బసవనగుడి నియోజకవర్గంలో మొత్తం 2.29 లక్షల ఓటర్లు ఉండగా బ్రాహ్మణ, వక్కలిగ ఓటర్లు అత్యధికంగా ఉండగా ఈ రెండు సామాజికవర్గాల ఓట్లు అభ్యర్థుల గెలుపు ఓటముల్లో కీలక పాత్ర పోషిస్తాయి. కానీ బ్రాహ్మణుల ఓట్లు బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి, వక్కలిగ ఓట్లు కాంగ్రెస్, జేడీఎస్ పార్టీకి పడే అవకాశం ఉంది. మిగిలిన ఇతర సామాజికవర్గాల ఓటర్లు అభ్యర్థుల గెలుపు ఓటముల్లో కీలకం కానున్నారు.

తాగునీటి విషయంలో గొడవ

- మనస్థాపంతో మహిళ ఆత్మహత్య

బనశంకరి: తాగునీటి విషయంలో ఇరుగుపొరుగు వారితో గొడవకారణంగా మనస్థాపానికి గురైన మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. యలహంక కోగిలు మెయిన్‌రోడ్డు శ్రీనివాసపుర ప్రభుత్వ వసతి సముదాయంలో నాగరాజ్, సరస్వతి(35) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. నాగరాజ్ సినిమాల్లో అసిస్టెంట్ కెమెరా మెన్‌గా పనిచేస్తున్నారు. వసతి సముదాయంలో కింది అంతస్తులో నివాసం ఉంటున్న శ్రీనివాస్, భవాని దంపతులు ప్రత్యేకంగా ట్యాంక్ ఏర్పాటు చేసుకున్నారు. దీంతో నీటి సరఫరాలో ఇబ్బంది ఏర్పడి ఇరుకుటుంబాలవారి మధ్య గొడవ జరిగింది. పోలీసులను ఆశ్రయించగా సర్దిచెప్పి పంపారు. కాగా నాగరాజ్ ఈనెల 21 తేదీన సినిమా షూటింగ్ నిమిత్తం ధార్వాడ వెళ్లాడు. ఈ సమయంలో మరోమారు నీటి విషయంపై గొడవ జరిగింది. శ్రీనివాస్, భవానీ దంపతులు శిల్పా అనే మహిళతో కలిసి సరస్వతిపై దాడిచేశారు. దీన్ని అవమానంగా భావించిన సరస్వతి తన భర్త నాగరాజ్‌కు ఫోన్‌చేసి నేను ఇక్కడ ఉండటం సాధ్యం కాదని, మరోచోట ఇల్లు అద్దెకు చూడాలని చెప్పింది. లేని పక్షంలో ఆత్మహత్యకు పాల్పడుతా అని చెప్పింది. ఆందోళనకు గురైన నాగరాజ్ పక్కింటి వారికి ఫోన్ చేసి విషయం తెలియజేశారు. వారు వెళ్లి చూడగా అప్పటికే సరస్వతి ఆత్మహత్యకు పాల్పడింది. నాగరాజ్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు శ్రీనివాస్, భవాని, శిల్పాపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సిలిండర్ పేలి ఆటోలు, కార్లు ధ్వంసం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



కాలిబూడిదైన కార్లు,ఆటోలు

దొడ్డబళ్లాపురం: గ్యాస్ కట్టర్ సిలిండర్ పేలి ఇల్లు, కార్లు,ఆటోలు,బైక్‌లు కాలిబూడిదయ్యాయి. ఈ సంఘటన బుధవారం తెల్లవారుజామున దొడ్డ పట్టణంలో జరిగింది. గాంధీ సర్కిల్‌లో భారత్ గ్యారేజ్ ఉంది. తెల్లవారుజామున గ్యాస్ కట్టర్ సిలిండర్ పెద్ద శబ్దంతో పేలింది. భయభ్రాంతులకు గురైన చుట్టుపక్కల ఇళ్లలోని జనం పరుగులుతీసి రోడ్లపైకి వచ్చారు. సిలిండర్ పేలిన క్షణాల్లోనే మంటలు ఎగసిపడ్డాయి. గ్యారేజ్‌లో ఉన్న ఆటోలు,కార్లు,బైక్‌లు కాలిబూడిదయ్యాయి. మంటలు పక్కనే ఉన్న పరుపుల దుకాణం, ఇంటికి వ్యాపించాయి. అగ్నిమాపక దళం సిబ్బంది వచ్చి మంటలు పక్కన దుకాణాలకు వ్యాపించకుండా నియంత్రించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బెంగళూరు దక్షిణలో జేడీఎస్‌కు షాక్

- కాంగ్రెస్‌లో చేరిన ప్రభాకర్‌రెడ్డి



పార్టీలో చేరిన ఆర్.ప్రభాకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ డీకే.సురేశ్ తదితరులు

బనశంకరి: బెంగళూరు దక్షిణ నియోజకవర్గంలో జేడీఎస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఇక్కడి నుంచి జేడీఎస్ తరఫున గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన ఆర్.ప్రభాకర్‌రెడ్డి బుధవారం బెంగళూరు గ్రామీణ ఎంపీ డీకే.సురేశ్, బెంగళూరు దక్షిణ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఆర్‌కే.రమేశ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆర్.ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పార్టీకి మరింత బలం చేకూరినట్లయింది. ఈ సందర్భంగా ఎంపీ డీకే.సురేశ్ మాట్లాడుతూ... బెంగళూరు దక్షిణలో ఈసారి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని తెలిపారు. జేడీఎస్ పార్టీకి చెందిన ప్రభాకర్‌రెడ్డి చేరికతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైందని ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకుని పార్టీ గెలుపు కోసం అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆర్‌కే.రమేశ్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

శెట్టర్, సవదిలను ఓడించాలి

బనశంకరి: జగదీష్ శెట్టర్‌ను ఓడించే జవాబుదారి నేను తీసుకుంటాను, లక్ష్మణ సవది ఓడించే బాధ్యత అథణిలో మీరు తీసుకోవాలని లక్ష్మణ సవది మనల్ని మోసం చేసి వెళ్లారని మాజీ సీఎం యడియూరప్ప అన్నారు. బుధవారం అథణిలో బీజేపీ అభ్యర్థి మహేశ్ కుమటళ్లి తరఫున ఎన్నికల ప్రచారంలో కార్యకర్తలను ఉద్దేశించి యడియూరప్ప మాట్లాడుతూ... కాంగ్రెస్‌పార్టీ మునిగిపోయే పడవ లాంటిది, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కనుమరుగైంది. రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షాతో సమానం కావడం సాధ్యమా అన్నారు. మాకు జగదీష్ శెట్టర్, లక్ష్మణసవది మోసం చేశారని, సవదిని ఎమ్మెల్సీని చేశామని ఇంకా అవధి ఉండగానే వెన్నుపోటు పొడిచారని యడియూరప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 130 స్థానాలకు పైగా గెలిచి అధికారంలోకి వస్తామని మహేశ్ కుమటళ్లిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

రాహుల్ ప్రచారంతో కమల వికాసం : సీఎం బొమ్మై

బనశంకరి: వివిధ పథకాల్లో 85 శాతం ఎవరైనా లూటీ చేశారంటే అది కాంగ్రెస్ పార్టీ అని ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై ధ్వజమెత్తారు. బుధవారం బెళగావి జిల్లా యమకనమరడి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బసవరాజహుంద్రి తరఫున నియోజకవర్గంలో బసవరాజ బొమ్మై రోడ్‌షోల పాల్గొని మాట్లాడారు. 23వ శాసనసభ ఎన్నికలు చారిత్రాత్మకం కానున్నాయని కర్ణాటక రాజకీయాల్లో ఒక నూతన రికార్డు తిరగరాస్తామని తెలిపారు. ఓ సాధారణ యువకుడు నిరుపేద కుటుంబం నుంచి వచ్చి స్వశక్తిపై ఎదిగి జీవనం సాగిస్తున్న బసవరాజహుంద్రి ఈ ఎన్నికల్లో చరిత్ర సృష్టిస్తారని తెలిపారు. కర్ణాటకలో రాహుల్ గాంధీ ఎంత ప్రచారంచేస్తే అంత బీజేపీకి మంచిదని, 2018లో రాహుల్ ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో కమలం వికసించిందని తెలిపారు.

అయోధ్య రామ మందిరం దర్శించండి : యూపీ సీఎం

మండ్య: ప్రపంచంలో ఎక్కడ హనుమంతుని దేవస్థానం ఉన్న అక్కడ శ్రీరాముని ఆలయం నిర్మాణం చేయడం ధర్మమని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. నగరంలోని సిల్వర్ జూబ్లీ పార్కులో బీజేపీ అభ్యర్థుల తరపున యోగి ఆదిత్యనాథ్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హనుమంతునికి, శ్రీరామునికి అవినాభావ సంబంధం ఉందని, అందుకే తాము మందిర నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు,

ఉత్తరప్రదేశ్ అయోధ్యలో నిర్మాణం అవుతున్న శ్రీరామ మందిరాన్ని 2024లో జనవరిలో తాము ప్రారంభించబోతున్నట్లు తెలిపారు, కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై అయోధ్యలో కర్ణాటక భవన నిర్మాణం కోసం స్థలాన్ని కోరగా, తాము కేటాయించినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ అక్కడికి వచ్చి రామమందిర ప్రారంభాన్ని వీక్షించాలని తెలిపారు. త్రేతా యుగంగా శ్రీరాముడు వనవాసానికి వచ్చినప్పుడు హనుమంతుడు కర్ణాటకలో ఉన్నారని తెలిపారు.

2న హుసేన్ షావలి ఉరుసు

బాగేపల్లి: పట్టణంలోని కొడికొండ రోడ్డులో కొలువైన హుసేన్ దాసయ్య స్వామి (హుసేన్ షా వలి) ఉరుసును మే 2నుంచి ప్రారంభమవుతుందని పట్టణ జామియా అధ్యక్షుడు జమీర్ అహ్మద్, పదాధికారులు తెలిపారు. ఆరోజు సాయంత్రం ఏడు గంటలకు ప్రముఖ వీధుల్లో గంధం ఊరేగింపు చేపడుతామన్నారు. అనంతరం దర్గాలో గంధోత్సవం నిర్వహిస్తామన్నారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా గ్రామ దేవత గంగమ్మ దేవాలయం ముందు గంధం ఊరేగింపు నిలిపి ప్రార్థన చేస్తామన్నారు.

సరదాగా ఆటపాట



గోలీలు ఆడుతున్న చిన్నారులు



మైసూరు: వేసవి సెలవులు కావడంతో పిల్లలంతా ఆటల్లో మునిగి తేలుతున్నారు. ఇక్కడి ఆర్టీ నగర నైపుణ్య స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల ఏర్పాటు చేసిన 'బేసిగే బండి' అనే శిబిరంలో బుధవారం పిల్లలు వేసవి ఆటల్లో నిమగ్నమయ్యారు. దశాబ్దాల కాలం నాటి గ్రామీణ క్రీడలను ఆడుకుని ఎంజాయ్ చేశారు. సమీపంలోని యడహళ్లి వద్ద మైదానంలో చెట్టు నీడన ఉయ్యాల ఊగారు. గుంపులుగా చేరుకుని సైకిల్ టైర్ నెడుతూ వేసవి సెలవులను సరదాగా గడుపుతున్నారు. గోలీలు, కర్రబిళ్ల, తొక్కుడు బిళ్ల వంటి ఆటలను ఉత్సాహంగా ఆడుతున్నారు.

మునియప్పకు ఏసీ శ్రీనివాస్ మద్దతు

విజయపుర: దేవనహళ్లి విధానసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశావహుడు ఏసీ శ్రీనివాస్‌కు పులకేశినగర కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా టికెట్ ఇచ్చారు. గడిచిన మూడేళ్లుగా దేవనహళ్లి నియోజకవర్గంలో వివిధ ప్రజా సేవ కార్యక్రమాలు చేసిన శ్రీనివాస్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ కేహెచ్ మునియప్ప లాంటి సీనియర్ నాయకుడికి తాను మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. మునియప్ప ద్వారా దేవనహళ్లి నియోజకవర్గం అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు.

కుక్కపిల్ల మృతి.. వ్యక్తిపై కేసు నమోదు

బనశంకరి: దత్తత తీసుకున్న కుక్కపిల్లకు వ్యాక్సినేషన్ వేయించకుండా దాని మృతికి కారణమైన వ్యక్తిపై పుట్టేనహళ్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రవిసింగ్ అనే వ్యక్తిపై పూర్ణిమా ప్రకాష్ అనే మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. జంతు ప్రేమికురాలైన పూర్ణిమా ప్రకాష్ నుంచి ఈ ఏడాది జనవరిలో కుక్కపిల్లను రవిసింగ్ దత్తత తీసుకున్నారు. మార్చిలో పూర్ణిమా ప్రకాష్ కుక్కపిల్ల గురించి ఆరా తీయగా ఆరోగ్యంగా, ఫ్రెండ్లీగా ఉందని వ్యాక్సినేషన్ చేయించానని రవి సింగ్ తెలిపారు. పూర్ణిమా ప్రకాష్ వ్యాక్సినేషన్ ఆధారాలు ఇవ్వాలని అడిగారు. రవిసింగ్ ఇవ్వలేదు. గుర్తుతెలియని వ్యక్తులు కుక్కపిల్లను ఎత్తుకెళ్లారని సమాధానమిచ్చారు. పూర్తి విషయాలు ఆరా తీయగా కుక్కపిల్ల మృతి చెందినట్లు తెలుసుకుని రవిసింగ్‌పై పూర్ణిమా ప్రకాష్ పుట్టేనహళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జేడీఎస్‌కు ఓటు వేయొద్దు

మండ్య: కేవలం ఒక్క కుటుంబం అభివృద్ధి కావాలా లేక అన్ని కుటుంబాల అభివృద్ధి కావాలా మీరే తీర్మానించుకోండి అంటూ ఎంపీ సుమలత అంబరీశ్ దళపతికి వ్యతిరేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు., నగరంలోని సిల్వర్ జూబ్లీ పార్కులో జరిగిన యోగి ఆదిత్యనాథ్‌తో పాటు బీజేపీ తరపున ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఆమె గతంలో ఏడుకు ఏడు సీట్లు జేడీఎస్‌కు ఇవ్వడం వల్ల జిల్లా అభివృద్ధి జరిగిందా అని ప్రశ్నించారు. జేడీఎస్ రెండేళ్ల ప్రభుత్వ పాలనలో మైషుగర్ ప్రారంభం కాలేదని గుర్తు చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ సహకారంతో మైషుగర్ ప్రారంభమైందన్నారు.

సిద్ధుపై పరువు నష్టం కేసు నమోదు

శివాజీనగర: మాజీ సీఎం సిద్దరామయ్యకు ఎన్నికల సమయంలోనే ఎదురుదెబ్బ తగలింది. ఆయనపై బెంగళూరు ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టులో శంకర్, మల్లయ్య హిరేమఠ్ అనే వ్యక్తులు పరువు నష్టం కేసు నమోదు చేయగా, ఈ నెల 29న విచారణకు రానుంది. లింగాయత్ ముఖ్యమంత్రులు అవినీతిపరులను ఆయన చేసిన వ్యాఖ్యలు పెను దుమారానికి దారితీశాయి.

చెక్‌పోస్టుల తనిఖీ

మైసూరు: విధానసభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా జిల్లాలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అధికారులు నిత్యం తనిఖీలు చేస్తున్నారు. బుధవారం జిల్లాధికారి డాక్టర్ కేవీ రాజేంద్ర, ఎస్పీ సీమా లాట్కర్ చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. అప్రమత్తంగా ఉండాలని, అవినీతికి తావివ్వకూడదని అధికారులకు సూచించారు.

హోసూరు వార్తలు..

తాలూకా ఉద్యోగుల ధర్నా



ఆందోళన నిర్వహిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

హోసూరు: తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టి గ్రామాధికారి దారుణ హత్యను ఖండిస్తూ గ్రామాధికారుల సంఘం రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపట్టింది. కోవిల్‌పట్టి గ్రామాధికారిగా లూర్డ్ ఫ్రాన్సిస్ గ్రామాధికారిగా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం కొంత మంది దుండగులు గ్రామాధికారి కార్యాలయానికి చొరబడి అతనిపై వేటకొడవళ్లతో నరికి హత్య చేశారు. ఈ ఘటనపై గ్రామాధికార్ల సంఘం రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చింది. జిల్లా కేంద్రం క్రిష్ణగిరి తాలూకా కార్యాలయం ముందు గ్రామాధికారులు నల్లజెండాలు పట్టుకొని నిరసన తెలిపారు. అదే విధంగా డెంకణీకోట తాలూకా కార్యాలయం ముందు తమిళనాడు గ్రామాధికారుల సంఘం, రెవెన్యూ అధికారుల సంఘం సంయుక్తంగా ఆందోళనకు దిగింది. ఈ ఆందోళనకు తహసీల్దార్ శరవణమూర్తి అధ్యక్షత వహించారు. రెవెన్యూ అధికారులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు.

ఘనంగా మారియమ్మ జాతర



గంజి కుండలతో ఆలయం వద్దకు చేరుకొన్న మహిళలు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని మారుపల్లి గ్రామంలో బుధవారం గ్రామదేవత మారియమ్మ జాతరను ఘనంగా జరుపుకొన్నారు. వన్నియర్ వర్గీయులచే ప్రతి ఏడాది మారియమ్మ, కాళియమ్మ జాతరలను నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా మంగళవారం మారుపల్లి, దాసయ్యనపట్టి, దిన్నూరు గ్రామస్థులచే అమ్మవారికి గంజి పోసే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అగ్నిగుండ మహోత్సవం జరిపించారు. ఉదయం గ్రామదేవతల ఉత్సవ మూర్తులను అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమం జరిగింది.

నేటి నుంచి కరగ మహోత్సవాలు

బాగేపల్లి: గ్రామ దేవత శ్రీ గంగమ్మ ట్రస్ట్, కరగ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని గంగమ్మ దేవాలయంలో ఈనెల 27 నుంచి 30 వరకు శ్రీ ధర్మరాయస్వామి కరగ మహోత్సవం చేపడుతున్నట్లు ట్రస్టు పదాధికారులు తెలిపారు.

బడిలో చేర్పించాలని జాగృతి ర్యాలీ



చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

హోసూరు: బడివయస్సు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ హోసూరు పారిశ్రామికవాడ బేడరపల్లి ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల యంత్రాంగం వాహన ర్యాలీ చేపట్టింది. హోసూరు పారిశ్రామిక ప్రాంతంలో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా నిర్వహిస్తున్న బేడరపల్లి ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో బడి వయస్సు పిల్లలను బడిలో చేర్పించాలని సూచిస్తూ స్థానికులకు కరపత్రాలు పంచి చైతన్యం కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పొన్‌నాగేష్ అధ్యక్షతన పారిశ్రామిక ప్రాంతంలోని బేడరపల్లి, అన్నానగర్, ఎంజీఆర్ నగర్, భారతీ నగర్ తదితర ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొని చైతన్యం కల్పించారు.

ఫైనాన్స్ సంస్థ నిర్వాహకుడు అరెస్ట్

హోసూరు: ఫైనాన్స్ సంస్థ పేరుతో రూ. కోట్లు వసూలు చేసుకుని ఉడాయించిన నిర్వాహకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... హోసూరుకు చెందిన అరుణ్‌కుమార్ గత 2021లో ఏ.కే.ట్రేడర్స్ పేరుతో ఫైనాన్స్ సంస్థను నిర్వహిస్తూ వచ్చాడు. ఈ సంస్థలో ఏజెంట్లుగా నందకుమార్, శ్రీనివాస్, శంకర్, వేలన్‌ను నియమించి తమిళనాడుతో పాటు కర్ణాటక, ఆంధ్ర, మహారాష్ట్రలలో ప్రజల వద్ద నిధులు సేకరిస్తూ రూ.7700 నుంచి రూ.15 లక్షల దాకా పెట్టుబడి పెడితే రెండింతలు అందజేస్తామని, ఖాతాదారులకు స్టార్ హోటళ్లలో పార్టీలు ఇప్పిస్తూ వారిని మెప్పిస్తూ రూ.37 కోట్ల నగదును స్వాహా చేశారు. కొద్ది రోజుల క్రితం అరుణ్‌కుమార్ నగదుతో పరారయ్యారు. ఖాతాదారులు ఏజెంట్లను నిలదీయగా నిర్వాహకుడు పరారయ్యాడని బదులివ్వడంతో వారు కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదులు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని ఏజెంట్లను అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం సంస్థ నిర్వాహకుడు వేపనపల్లిలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అతన్ని పట్టుకుని అతని వద్ద ఉన్న రూ.16 లక్షల నగదు, 12 పొన్ల నగలు, కారును స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక, హోసూరు, క్రిష్ణగిరి ప్రాంతాల్లో అతడి పేరుమీద ఉన్న రూ.3 కోట్ల విలువ చేసే ఆస్తులకు సంబంధించిన పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కాలిన స్థితిలో వ్యక్తి మృతదేహం

- హత్య చేసి నిప్పంటించినట్లు అనుమానం

క్రిష్ణగిరి: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కొండపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కాలిన స్థితిలో పడి ఉండగా గ్రామాధికారి గుప్త ఇచ్చిన సమాచారంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. ఇతన్ని దుండగులు హత్య చేసి ఆనవాళ్లు లేకుండా చేసేందుకు మృతదేహానికి నిప్పంటించినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. హతుడు ఎవరనేది తేలాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి

కెలమంగలం: ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో కార్మికుడు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రంగా గాయపడిన ఘటన కెలమంగలం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... కెలమంగలం సమీపంలోని బొమ్మతత్తనూరు పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన పచ్చియప్ప (28). అదే ప్రాంతానికి చెందిన శివతో కలిసి మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఆ మార్గంలో వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని ఆస్పత్రికి తరలిస్తుండగా పచ్చియప్ప మార్గంమధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బస్సు ఢీకొని మరొకరు..

క్రిష్ణగిరి: బస్సు ఢీకొని కార్మికుడు మృతి చెందిన ఘటన సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. అసోం రాష్ట్రానికి చెందిన కార్మికుడు లోకస్‌ఏబ్రాన్ (25) సూళగిరి ప్రాంతంలో నివాసముంటూ కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం హోసూరు–క్రిష్ణగిరి జాతీయ రహదారి కోనేరుపల్లి వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా ఆ దారిలో వచ్చిన ఓ ప్రైవేట్ బస్సు ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలతో లోకస్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్రిడ్జ్ పైనుంచి పడి...

హోసూరు: హోసూరు పారిశ్రామిక ప్రాంతంలో వంతెనపై నుంచి కిందపడి కార్మికుడు మృతి చెందిన ఘటన సిప్‌కాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... హోసూరు పారిశ్రామికవాడ బేగేపల్లి గ్రామానికి చెందిన క్రిష్ణప్ప (40) మంగళవారం సాయంత్రం అదే ప్రాంతంలోని బ్రిడ్జిపై పడుకున్నాడు. నిద్రమత్తులో కాల్వలో పడి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కెలమంగలం: కెలమంగలం సమితి జెక్కేరి పంచాయతీలో జెక్కేరి, ఒన్నుగురికి గ్రామాల్లో మురుగు కాల్వలు, ఓవర్ హెడ్ ట్యాంక్, చెరువుల శుద్ధీకరణ పనులకు అభివృద్ధి పనులకు బుధవారం పంచాయతీ అధ్యక్షులు రాజేష్‌కుమార్ భూమిపూజ చేశారు. రూ.66 లక్షలతో ఈ పనులు చేపట్టారు. ఉపాధ్యక్షులు రామక్రిష్ణన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



దళితులపై బాబు 'చిన్న' చూపు

టీడీపీలో విలువ లేని ఎస్సీలు

- ఎస్సీ నియోజకవర్గాల్లో దళితుల ఆధిపత్యం సున్నా
- పెత్తనమంతా బాబు వర్గీయులదే
- కమిటీల పేరుతో దళిత నేతలపై పెత్తనం
- బాబు వర్గీయులు చెప్పినట్లు చేయాల్సిందే
- మాజీ మంత్రులదీ ఇదే అవస్థ



నాగా వెంకటరెడ్డి, సాక్షి ప్రత్యేక ప్రతినిధి

'చెప్పేటందుకే నీతులు' అన్న మాట తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకి అతికినట్లు సరిపోతుంది. మైకు పట్టుకుంటే దళితులు, వారి అభ్యున్నతి అంటూ మాట్లాడే చంద్రబాబు.. పార్టీలో వారికి ఇస్తున్న ప్రాధాన్యత మాత్రం సున్నా. కొన్నిమార్లు దళితుల పట్ల చిన్న చూపును కూడా ఆయన వ్యక్తపరుస్తూ ఉంటారు. పార్టీ వ్యవహారాల్లోకొచ్చేసరికి అదే చిన్నచూపు చేతల్లోనూ కనిపిస్తూ ఉంటుంది. రాష్ట్రంలోని ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్‌చార్జిల నియామకం, వారిపై ఆధిపత్యం చెలాయించే బాబు బృందాలే ఇందుకు నిదర్శనం. పేరుకే ఎస్సీలను ఇన్‌చార్జిలుగా నియమించినప్పటికీ, ఆ నియోజకవర్గంలో పార్టీ నిర్మాణం, నిర్వహణ, కార్యక్రమాల అమలులో వారి పాత్ర శూన్యం. ఈ నియోజకవర్గాల్లో బాబు తన వర్గీయులతో వేసిన కమిటీలదే ఆధిపత్యం. వారేమి చెబితే ఇన్‌చార్జిలు, పార్టీ ఇతర నేతలు అది చేయాల్సిందే. దళితుల పట్ల వ్యతిరేకత, ఆ వర్గాలను చులకన చేసి మాట్లాడటం, పదవుల పంపిణీలో మోసగించడం, రాజకీయంగా ఎదగనీయకపోవడం, ఆ ప్రాంత ముఖ్య నేతల ద్వారా విభేదాలను రాజేయిస్తూ వర్గాలను ప్రోత్సహించడం, ఎన్నికలప్పుడు తమ వర్గీయుల సిఫార్సుల మేరకే అభ్యర్థిత్వాలను ఖరారు చేయడం తొలి నుంచి చంద్రబాబు సాగిస్తున్న తంతే. సీనియర్ దళిత నేతలకూ చుక్కలు చూపించడం బాబు బృందానికి రివాజే.

దళితులపై చిన్న చూపులో తండ్రిని మించిన లోకేశ్

దళితులను చిన్న చూపు చూడటంలో చంద్రబాబు కుమారుడు లోకేశ్ తండ్రిని మించిపోయాడన్న వ్యాఖ్యలు పార్టీలో వినిపిస్తున్నాయి. పాదయాత్రలో కొన్ని నియోజకవర్గాల్లో నాయకుల పేర్లను ప్రస్తావిస్తూ ఎన్నికల్లో గెలిపించండని లోకేశ్ చెబుతున్నారు. ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో మాత్రం ఆయన ఎవరి పేరూ చెప్పకపోవడం గమనార్హం. రానున్న ఎన్నికల్లో నగరిలో గాలి భానుప్రకాశ్, చంద్రగిరిలో పులివర్తి నానిలను గెలిపించాలని ఆయన చెప్పారు. వాటి పొరుగునే ఉన్న పూతలపట్టు, గంగాధర నెల్లూరు ఇన్‌ఛార్జిల ప్రస్తావనే లోకేశ్ నోటి వెంట రాలేదు.

ఆర్థికంగా బలవంతులైతే చాలు...

ఉమ్మడి కృష్ణా జిల్లా పార్టీ సీనియర్లు ఇటీవల చంద్రబాబుకు, లోకేశ్‌కు ఝలక్ ఇచ్చారు. గుడివాడ పార్టీ బాధ్యతలను నిర్వర్తిస్తున్న మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుకు ప్రత్యామ్నాయంగా తండ్రీకొడుకులిద్దరూ కలిసి ఎన్నారై వెనిగండ్ల రామును ప్రోత్సహిస్తున్నారు. చంద్రబాబు జిల్లా పర్యటన ఏర్పాట్లపై పలుసార్లు సమావేశమైన సీనియర్లు రాముకు ఆహ్వానం కాదు కదా కనీసం సమాచారాన్ని కూడా ఇవ్వలేదు. దీనిపై రాము అలకబూనారన్న సంగతి తెలియగానే బాబు సీరియస్ అయ్యారు. నియోజకవర్గాలలో ఎవరైనా పార్టీ కోసం పనిచేయవచ్చని, ఇందుకు ఎవరి అనుమతీ అవసరంలేదని ఫత్వా జారీ చేశారు. దీంతో బాధ్యతలు అప్పగించిన వారు మినహా మరెవరూ నియోజకవర్గ పార్టీ వ్యవహారాలలో జోక్యం చేసుకోకూడదని రాష్ట్ర అధ్యక్షుని హోదాలో అచ్చెన్నాయుడు గతంలో ఇచ్చిన సర్క్యులర్‌కు విలువలేకుండా పోయింది. స్థితిమంతులు, తన వర్గానికి చెందిన నేతల విషయంలో ఒకలా, ఇతర వర్గాల విషయంలో మరోలా బాబు వ్యవహారం ఉంటుందనే పార్టీ నేతల అభిప్రాయానికి గుడివాడ వ్యవహారం ఒక నిదర్శనం.

- కొవ్వూరు స్థానాన్ని మాజీ మంత్రి కేఎస్ జవహర్ ఆశిస్తున్నారు. గత ఎన్నికలప్పుడు ఆయన్ని కొవ్వూరు నుంచి తప్పించి తిరువూరుకు పంపగా అక్కడ ఓటమిపాలయ్యారు. ప్రస్తుతం కంఠమని రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరితో కూడిన ద్విసభ్య కమిటీ అక్కడ ఆధిపత్యం చెలాయిస్తోంది. వీరివురూ బాబు సామాజిక వర్గానికి చెందిన వారే. ఇక్కడ వీరిదే హవా. దళితుడైన మాజీ మంత్రి పార్టీ కార్యాలయానికి కూడా వచ్చే అవకాశం లేదు. సొంత కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని ఆయన కార్యక్రమాలేవో ఆయన చేసుకుంటున్నారు.
- చంద్రబాబు సొంత జిల్లా అయిన ఉమ్మడి చిత్తూరు పరిధిలోని గంగాధర నెల్లూరులో చిట్టిబాబు నాయుడుదే ఆధిపత్యం. పూతలపట్టులో యువరాజు నాయుడు, అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో కె.విశ్వనాథ నాయుడు, గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో మాకినేని పెద్దరత్తయ్యలే పార్టీ పెద్దలు. అనంతపురం జిల్లా సింగనమలలో బండారు శ్రావణితో పాటు పలుకుబడి కలిగిన వేర్వేరు సామాజికవర్గాల నేతలు అజమాయిషీ చలాయిస్తున్నారు. కోడుమూరు, నందికొట్కూరు, బద్వేలు స్థానాల్లోనూ ఇదే తంతు.
- డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం ఇన్‌ఛార్జిగా లోక్‌సభ మాజీ స్పీకర్ బాలయోగి కుమారుడు హరీష్ మాధుర్‌ను నియమించారు. హరీష్ అమలాపురం లోక్‌సభ నియోజకవర్గానికి కూడా ఇన్‌చార్జి. కానీ, ఆయన మాటకు ఇక్కడ విలువ లేదు. నామని రాంబాబు, డొక్కా నాథ్‌బాబు ఎలా చెబితే అలా ఆడాలి.
- విజయనగరం జిల్లా రాజాంలో మాజీ మంత్రి కొండ్రు మురళిమోహన్ ఇన్‌చార్జిగా ఉన్నప్పటికీ, అక్కడ రాష్ట్ర పార్టీ మాజీ అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావుదే ఆధిపత్యం. మాజీ సభాపతి కావలి ప్రతిభా భారతి, ఆమె కుమార్తె కావలి గ్రీష్మకూ పార్టీలో ఎటువంటి విలువా లేదు.
- చింతలపూడి నుంచి మాజీ మంత్రి పీతల సుజాత ప్రాతినిధ్యం వహించగా ప్రస్తుతం అక్కడ ఆమెకు ఇన్‌చార్జి బాధ్యతలు కూడా లేవు. నియోజకవర్గానికి చెందిన గంటా మురళీరామకృష్ణ, గంటా సుధీర్, పరిమి సత్తిపండు, గరిమెళ్ల చలపతి తదితరులదే పెత్తనం.
- ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఇన్‌ఛార్జిగా చావల దేవదత్తుని నియమించినప్పటికీ, ఆయనకు ఏ అధికారమూ లేదు. పార్టీలో హవా అంతా బాబు వర్గానికి చెందిన చెరుకూరి రాజేశ్వరరావు, సుంకర కృష్ణమోహన్‌రావు, నెక్కలపు వెంకట్రావులదే.

ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయకేతనం

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు ఆ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో విద్యార్థిని జి.భవ్య 470 మార్కులకుగాను అత్యధికంగా 467, బైపీసీ విభాగంలో సయ్యద్ అబ్దుల్ కరీం 440కి 437 మార్కులతో రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలిచారని వివరించారు. వీరితో పాటు ఎంపీసీ విభాగంలో వై.లక్ష్మీతులసి, ఎం.వింధ్యవైష్ణవి 465 సాధించినట్లు తెలిపారు. 511 మంది 460 మార్కులకుపైగా, 1,258 మంది 450 మార్కులకుపైగా, 2,230 మంది 440 మార్కులకుపైగా, 3,962 మంది 400 మార్కులకుపైగా సాధించారని వివరించారు. బైపీసీ విభాగంలో వి.అనన్య, ఎ.హిమజ, కె.గోపీనాథ్ 435 మార్కులు సాధించారని తెలిపారు. 180 మంది 430 మార్కులకుపైగా, 288 మంది 420 మార్కులకుపైగా, 527 మంది 400 మార్కులకుపైగా సాధించినట్లు చెప్పారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో కె.శివాని 991, కె.భవ్య 990 మార్కులు సాధించారని తెలిపారు. బైపీసీ విభాగంలో షేక్ ఆరిఫా 990, ఎస్.సాయిజాహ్నవి 989 మార్కులు సాధించారని తెలిపారు. 255 మంది 980 మార్కులకుపైగా, 568 మంది 970 మార్కులకుపైగా, 1,182 మంది 950 మార్కులకుపైగా, 2,852 మంది 900 మార్కులకుపైగా సాధించినట్లు వివరించారు. విద్యార్థులను డీన్‌లు కిషోర్‌కుమార్, చంద్రశేఖర్, కృష్ణ, ప్రిన్సిపల్స్ మోహనరావు, మునీర్‌బాషా, అధ్యాపకులు అభినందించారు.

విజ్ఞాన్ విజయభేరి

చేబ్రోలు: ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విజ్ఞాన్ విద్యాసంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ బుధవారం తెలిపారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జే.మోహనరావు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన రెండో సంవత్సరం విద్యార్థులు కె.వి.ఎల్.విష్ణువర్ధన్ 988 మార్కులు, జి.విష్ణువర్ధన్‌బాబు 987, కె.వెంకటశివప్రణయ్ 986, ఆర్.శివకుమార్, ఎం.వరుణ్, పి.బాలాజీ, జె.అజయ్‌కుమార్ 985 వంతున మార్కులు సాధించినట్లు వివరించారు. మొదటి సంవత్సరం విద్యార్థుల్లో టి.సంజయ్‌తేజ, ఎ.రోహన్, టి.సి.చంద్రశేఖర్ 463 మార్కుల వంతున, ఐ.హనీత్, కె.నాగసాయి, ఎస్.అరవింద్‌కుమార్, జి.డి.వి.జి.పుల్లారెడ్డి, ఎం.వివేక్‌పూజిత్‌కుమార్, బి.హేమంత్, సీహెచ్.వెంకట ఉదయ్ ఆదిత్య, బి.యోగవిజయ్‌కుమార్, జి.శశిధర్, పి.కౌశిక్‌సాయికుమార్, వై.లక్ష్మీపతి 462 మార్కుల వంతున సాధించినట్లు చెప్పారు. మొదటి సంవత్సరం విద్యార్థుల్లో 148 మంది 450కి పైగా మార్కులు, రెండో సంవత్సరం విద్యార్థుల్లో 133 మంది 950కి పైగా మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అభినందించారు. వడ్లమూడి, గుంటూరు జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ జె.మోహనరావు, వై.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భాష్యం విద్యార్థుల సత్తా

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు సత్తా చాటారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ చెప్పారు. గుంటూరు చంద్రమౌళీనగర్‌లోని భాష్యం ప్రధాన క్యాంపస్‌లో బుధవారం ఆయన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో భాష్యం జేఈఈ అకాడమీ విద్యార్థులు కె.మోహనగాయత్రి, సీహెచ్.కీర్తి, జి..చంద్రలేఖ్య, వి.భాస్కరపద్మావతి, ఎ.శశిస్తుతిక, సీహెచ్.కనకవర్షిణి, జి.ప్రీతికచౌదరి, కె.సుహాసినీదేవి, జి.ప్రణయి 470 మార్కులకు 465 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు వివరించారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో మొత్తం 116 మంది విద్యార్థులు 460కి పైగా మార్కులు సాధించారని తెలిపారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో ఎ.విష్ణువర్ధిని 991 మార్కులు, టి.హేమలత, సీహెచ్.లక్ష్మీసాహితి, జి.లిఖిత 990 మార్కుల వంతున సాధించారని చెప్పారు. మొత్తం 34 మంది విద్యార్థులు 980కి పైగా మార్కులు సాధించారన్నారు. జూనియర్ బైపీసీ విభాగంలో భాష్యం మెడెక్స్ విద్యార్థులు ఎం.త్రిష 440 మార్కులకుగాను 434, ఏహెచ్.లాలిత్య, ఎస్.రక్షిత, కె.సుమన్విత, జి.జ్ఞానలక్ష్మీచందన, టి.హర్షిత 433 మార్కుల వంతున సాధించారని చెప్పారు. మొత్తం 14 మంది విద్యార్థులు 430కి పైగా మార్కులు సాధించారన్నారు. సీనియర్ బైపీసీలో ఎ.చార్మిసంజన 981, పి.రూపేష్‌కుమార్ 980 మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల డైరెక్టర్ భాష్యం హనుమంతరావు అభినందించారు.

నారాయణ అత్యుత్తమ ప్రతిభ

సాక్షి, అమరావతి: ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూరనారాయణ, పి.శరణినారాయణ చెప్పారు. సీనియర్ ఇంటర్‌లో వెయ్యి మార్కులకుగాను 17 మంది 989 మార్కులు, 18 మంది 988 మార్కులు, 46 మంది 987 మార్కులు సాధించినట్లు వివరించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకుగాను ఏడుగురు విద్యార్థులు 466 ఆపైన, 26 మంది 465 ఆపైన మార్కులు సాధించారన్నారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకుగాను 436 మార్కులు సాధించారని చెప్పారు. విద్యార్థులను వారు అభినందించారు.

తిరుమల విద్యాసంస్థల ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటర్ ఫలితాల్లో తిరుమల జూనియర్ కాలేజ్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో పరీక్షకు హాజరైన 3,448 మందిలో 3,404 మంది (98.72 శాతం), బైపీసి విభాగంలో పరీక్షకు హాజరైన 678 మందిలో 672 మంది (99.11 శాతం) ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఎంపీసీ విభాగంలో కె.నవ్యశ్రీ 991 మార్కులు, ఎంహెచ్.యోగానందభారతి 990 మార్కులు సాధించగా.. 116 మంది 985 మార్కులపైన, 368 మంది 980 మార్కులపైన, 1,292 మంది 960 మార్కులపైన సాధించారని తెలిపారు. బైపీసీ విభాగంలో ఎం.గంగతల్లి 990 మార్కులు సాధించగా.. ఐదుగురు 989పైన, 74 మంది 980పైన, 166 మంది 970పైన, 250 మంది 960పైన మార్కులు సాధించారని చెప్పారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో పరీక్షకు హాజరైన 4,946 మందిలో 4,773 మంది (96.50 శాతం), బైపీసి గ్రూపులో పరీక్షకు హాజరైన 608 మందిలో 587 మంది (96.54 శాతం) ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఎంపీసీ విభాగంలో బి.ఎస్.డి.మహేష్, వి.వి.బి.ఎస్.మణికుమార్ 466 మార్కుల వంతున సాధించగా.. 27 మంది 465 మార్కులు, 667 మంది 460పైన, 1,868 మంది 450పైన, 3,657 మంది 400పైన సాధించారని చెప్పారు. బైపీసీ విభాగంలో ఒ.రితీక 440 మార్కులకుగాను 436 మార్కులతో ప్రథమ స్థానం సాధించిందని, తొమ్మిదిమంది 435పైన, 74 మంది 430పైన, 216 మంది 420పైన, 299 మంది 410పైన, 366 మంది 400పైన మార్కులు సాధించారని ఆయన వివరించారు.

వీఐటీఈఈఈ ఫలితాలు విడుదల

అమరావతి: ఏప్రిల్ 17 నుంచి 23 వరకు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జరిగిన వీఐటీఈఈఈ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. జార్ఖండ్‌కు చెందిన కుషాగ్రాబాషిత్‌కు ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. ఫలితాలను https://ugresults.vit.ac.in/viteee, www.vit.ac.inలో పొందుపరిచినట్లు వీఐటీ వర్గాలు తెలిపాయి. 1-20,000 ర్యాంకులకు ఏప్రిల్ 26-30 వరకు, 20,001-45,000 ర్యాంకులకు మే 9-11వరకు, 45,001-70,000 ర్యాంకులకు మే 20-22 వరకు, 70,001-1,00,000 ర్యాంకులకు మే 31-జూన్2 వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. లక్ష పైబడి ర్యాంకులు వచ్చిన వారు వీఐటీ-ఏపీ, భోపాల్ శాఖల్లో బీటెక్ చేయడానికి అర్హులు. వీరికి జూన్ 12-14 వరకు కౌన్సెలింగ్ ఉంటుంది. 1-10 ర్యాంకులు సాధించిన వారికి నాలుగేళ్లూ 100% ట్యూషన్ ఫీజు రాయితీ ఇస్తున్నట్లు పేర్కొంది. 11-50 ర్యాంకుల వారికి 75%, 51-100 ర్యాంకుల వారికి 50%, 101-500 ర్యాంకుల వారికి 25% రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపింది. తమిళనాడు, ఏపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలలో చదివి జిల్లాల్లో టాపర్లుగా నిలిచిన (ఒక విద్యార్థి, ఒక విద్యార్థిని) వారికి 100 శాతం ఫీజు రాయితీతో పాటు హాస్టల్, మెస్ ఫీజులను తామే భరించనున్నట్లు వెల్లడించింది.

విద్యుత్ ఉద్యోగుల పీఆర్సీపై చర్చ

- జేఏసీ ప్రతినిధులతో చర్చించిన చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి
- మన్మోహన్ సింగ్ కమిటీ రిపోర్ట్‌పై సమీక్ష

సాక్షి, అమరావతి: విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ)కు సంబంధించి విద్యుత్ ఉద్యోగుల సంఘాల నాయకులు, జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి చర్చించారు. ఏపీ సెక్రటేరియట్‌లోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశ మందిరంలో బుధవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మన్మోహన్ సింగ్ కమిటీ విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణపై ఇచ్చిన నివేదికను జేఏసీ ప్రతినిధులకు అధికారులు వివరించారు. కమిటీలోని అంశాలపై ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు. ఉద్యోగ సంఘాల నాయకుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని, అనంతరం మళ్లీ చర్చలకు జేఏసీ, యూనియన్ ప్రతినిధులను ఆహ్వానిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వారికి తెలిపారు. దీంతో పాటు విద్యుత్ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలను ఆయా సంఘాల ప్రతినిధులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై అధ్యయనం చేసి చర్యలు తీసుకుంటామని సీఎస్ హామీ ఇచ్చారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, జెన్‌కో ఎండీ కె.వి.ఎన్.చక్రధర్ బాబు, డిస్కంల సీఎండీలు పృథ్వీరాజ్, సంతోషరావు, పద్మాజనార్దన్‌రెడ్డి, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

కామాంధుడికి కఠిన శిక్ష

▶ మొదటి పేజీ తరువాయి

వినోద్‌జైన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. బాధితురాలి తరఫున పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుజ్జుల నాగిరెడ్డి వాదనలు వినిపించారు. సీఎంఎస్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు సమక్షంలో 20 మంది సాక్షులను విచారించిన న్యాయస్థానం వినోద్‌జైన్ నేరం చేసినట్టు గుర్తించింది. ఐపీసీ 305 సెక్షన్ కింద కఠిన కారాగార శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా, పోక్సో యాక్ట్ 9సీ, 10 కింద ఏడేళ్ల జైలు రూ.50 వేలు జరిమానా, పోక్సో యాక్ట్ 12 కింద మూడేళ్ల జైలు, రూ.50 వేల జరిమానా, ఐసీపీ 354 సెక్షన్ కింద ఐదేళ్ల జైలు, రూ.50 వేల జరిమానా, సెక్షన్ 589 కింద ఐదేళ్ల జైలు, రూ.50 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మొత్తం జరిమానా రూ.3 లక్షల్లో రూ.2.40 లక్షలను మృతురాలి తల్లికి అందజేయాలని, నిందితుడు జరిమానా చెల్లించకుంటే ఒక్కో సెక్షన్‌కు ఆరు నెలల చొప్పున అదనంగా జైలు శిక్ష అనుభవించాలని పేర్కొంది. ఘటన జరిగిన 15 నెలల్లో న్యాయస్థానం నుంచి తీర్పు వెలువడటంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కీలకంగా మారిన సూసైడ్ నోట్

నిందితుడు వినోద్‌జైన్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ తెలుగుదేశం పార్టీ విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలో కీలక నేతగా వ్యవహరిస్తున్నాడు. టీడీపీ అధినేత చంద్రబాబు, విజయవాడ ఎంపీ కేశినేని నాని, మాజీ మంత్రి దేవినేని ఉమాతో సత్సంబంధాలు కొనసాగిస్తూ.. వన్‌టౌన్ ప్రాంతంలో పెద్దమనిషిగా చెలామణి అవుతుండేవాడు. బాలిక మృతి ఘటన తరువాత వినోద్‌జైన్ బండారం బట్టబయలైంది. అప్పటికే రెండు నెలలుగా వినోద్‌జైన్ నుంచి లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న బాలిక ఈ విషయాన్ని ఎవరికీ చెప్పుకోలేకపోయింది. ఆమె ఆత్మహత్యకు పాల్పడిన తరువాత.. కారణాలు అన్వేషిస్తున్న క్రమంలో బాలిక గదిలోని మూడు పేజీల లేఖను ఆమె తాతయ్య గమనించాడు. రెండు నెలల ఆమె అనుభవించిన నరకం గురించి ఆ లేఖలో వివరించింది.

బాలిక ఎంత క్షోభ అనుభవించిందో!

స్కూల్‌కి వెళ్లేప్పుడు.. వచ్చేప్పుడు.. లిఫ్ట్‌లో.. బయట ఆడుకునేప్పుడు వినోద్‌జైన్ తనను ఏవిధంగా వేధించాడో ఆ లేఖలో బాలిక రాసింది. వినోద్‌జైన్ ఆ బాలిక ప్రైవేట్ పార్ట్స్‌ను చేతులతో తాకుతూ.. మాటలతో లైంగికంగా వినోద్‌జైన్ వేధించిన తీరును ఆ లేఖలో స్పష్టం చేసింది. ఓ రాజకీయ పార్టీ నాయకుడి హోదాలో ఉంటూ.. డబ్బు మదంతో ఉన్న అతన్ని ఏమీ చేయలేక చనిపోతు న్నట్టు లేఖలో వెల్లడించింది. ఆ బాలిక వాడిన మొబైల్ ఫోన్, ట్యాబ్‌లను పరిశీలించిన పోలీసులు వాటిలోనూ వినోద్‌జైన్ అకృత్యాలకు సంబంధించిన మెసేజ్‌లను గుర్తించారు. ఆ లేఖ బాలిక రాయలేదని, ఎవరో అప్పటికప్పుడు సృష్టించారని వినోద్‌జైన్ తరఫున వాదించారు. తనకు బెయిల్ ఇప్పించాలంటూ హైకోర్టును సైతం ముద్దాయి ఆశ్రయించాడు. అతడి వాదనల్ని తోసిపుచ్చిన హైకోర్టు విచారణ కొనసాగించాలంటూ పోక్సో కోర్టుకు ఆదేశాలిచ్చింది. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా పర్యవేక్షణలో వెస్ట్ జోన్ ఏసీపీ కె.హనుమంతరావు ఈ కేసు విచారణ అధికారిగా వ్యవహరించారు.

ముస్లింలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

- రాష్ట్ర సయ్యాదత్ సాదాత్ కౌన్సిల్ చైర్మన్ నూర్ బాబా

సాక్షి, అమరావతి: ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తామన్న బీజేపీతో పొత్తు కోసం టీడీపీ నేత చంద్రబాబు పాకులాడటం దారుణమని రాష్ట్ర సయ్యాదత్ సాదాత్ కౌన్సిల్ చైర్మన్ కేఎస్ఎస్ నూర్ బాబా మండిపడ్డారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కర్ణాటక, తెలంగాణలో ముస్లింలకు అమలవుతున్న రిజర్వేషన్లను బీజేపీ నేతలు తొలగిస్తామంటున్నారని.. చంద్రబాబు ముస్లిం రిజర్వేషన్లకు అనుకూలమా, వ్యతిరేకమా స్పష్టం చేయాలన్నారు. జాతీయ మీడియాలో నరేంద్ర మోదీని ప్రశంసిస్తూ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని చంద్రబాబును డిమాండ్ చేశారు. ముస్లింల మనోభావాలను కించపరిచినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. లేకపోతే చంద్రబాబు పర్యటనలను అడ్డుకుంటామని హెచ్చరించారు. బీజేపీతో పొత్తు పేరుతో.. ఆ పార్టీ అజెండాను అమలు చేయాలని చూస్తే తరిమికొడతామన్నారు.

రాయలసీమ రైతుల్ని దెబ్బతీసిన జగన్ ప్రభుత్వం

- టీడీపీ నేత లోకేశ్

కర్నూలు (అగ్రికల్చర్): రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు టీడీపీ హయాంలో రూ.11 వేల కోట్లు ఖర్చు చేశామని, జగన్ ప్రభుత్వం నాలుగేళ్లలో అందులో 10 శాతం నిధులు కూడా ఖర్చు చేయలేదని టీడీపీ నాయకుడు లోకేశ్ విమర్శించారు. డ్రిప్ ఇరిగేషన్‌ను రద్దుచేసి రాయలసీమ రైతాంగాన్ని జగన్ ప్రభుత్వం దెబ్బతీసిందని చెప్పారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోతే కనీసం పంటనష్టం అంచనా వేసే దిక్కులేదన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా లోకేశ్ బుధవారం కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గంలోని లచ్చుమర్రి వద్ద రైతులతో ముఖాముఖిలో మాట్లాడారు. పాదయాత్ర ద్వారా రైతుల కష్టాలు నేరుగా తెలుసుకుంటున్నానన్నారు. వ్యవసాయ పనులు లేక గుంటూరు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని చెప్పారు. రైతు ఆత్మహత్యల్లో ఏపీ దేశంలోనే 3వ స్థానంలో ఉందని, కౌలురైతుల ఆత్మహత్యల్లో 2వ స్థానంలో ఉందని చెప్పారు. మోటర్లకు మీటర్లు బిగిస్తే రైతులు పగులగొట్టాలని, టీడీపీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో ఒక్కో రైతుపై రూ.70 వేల అప్పు ఉంటే జగన్ పాలనలో అది రూ.2.50 లక్షలకు చేరిందని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాణ్యమైన పత్తి విత్తనాలు ఇస్తామన్నారు. ఆదోనిలో మిర్చి యార్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గోదావరి, కృష్ణా, పెన్నానదులను అనుసంధానం చేసి సీమ రైతులకు సాగునీరు అందిస్తామన్నారు.

తండ్రీకొడుకులకు సెల్ఫీల పిచ్చి

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రజిని



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రజలంతా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనకు జేజేలు పలుకుతుండటం చూసిన తర్వాత తండ్రీకొడుకులు చంద్రబాబు, లోకేశ్‌లకు సెల్ఫీల పిచ్చి పట్టుకుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని విమర్శించారు. ఆమె బుధవారం విశాఖపట్నం జిల్లా డీఆర్‌సీ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హోదాలో హాజరయ్యారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తండ్రీకొడుకులు సెల్ఫీలు తీసుకోవాలనుకుంటే రైతుభరోసా కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సచివాలయ భవనాల వద్ద తీసుకోవాలని సూచించారు. వారి పిచ్చి టీడీపీ నేతలకు కూడా అంటించారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పాలనపై లేనిపోని విమర్శలు చేసే టీడీపీ ఎమ్మెల్యేలు ప్రజాసమస్యలపై ఎందుకు శ్రద్ధ చూపడం లేదని ప్రశ్నించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా పాలన అందిస్తున్న కారణంగానే ఏం చేయాలో పాలుపోక.. టీడీపీ నేతలు ఇలా తయారయ్యారని ఆమె విమర్శించారు.

దళితులకు ఎవరేం చేశారో తేల్చుకుందాం.. రా!

- చంద్రబాబుకు మంత్రి మేరుగు నాగార్జున సవాల్

సాక్షి, అమరావతి: దళితులకు ఎవరేం చేశారనే అంశంపై దళిత ద్రోహి చంద్రబాబుతో తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. 'చంద్రబాబు సవాల్‌ను స్వీకరిస్తున్నా. ఒక్క చంద్రబాబుతోనే నేను చర్చకు సిద్ధంగా ఉన్నా. దళితులకు ఎవరేం చేశారో తేల్చుకుందాం.. రా. టైం, ప్లేస్ చెప్పు. నేను ఒక్కడినే వస్తా. చర్చిద్దాం' అని నాగార్జున సవాల్ చేశారు. 'చర్చించలేకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మా నాయకుడి పాదాల వద్ద రాజీనామా లేఖ పెట్టి వైఎస్సార్ సమాధి వద్ద కాపలా కాసుకుంటూ బతుకుతా. నువ్వు చర్చించలేకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటావా' చంద్రబాబూ అని ప్రశ్నించారు.

అన్ని అంశాలపై చర్చిద్దాం

'నీ హయాంలో దళితులపై దాడుల్లో ఏపీ ప్రథమ స్థానంలో ఉన్నట్టు ఎన్‌సీఆర్బీ ఇచ్చిన నివేదికపై చర్చిద్దాం. దళితుల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా అని నువ్వు అనలేదా?. దళితులు ఏం పీకుతారు అని నీ కొడుకు లోకేశ్ అనలేదా?. వీటన్నిటిపై చర్చించేందుకు నేను సిద్ధం. రాజకీయాల్లో నువ్వుండాలంటే మాతో చర్చించు' అని మంత్రి నాగార్జున అన్నారు. రాష్ట్రంలో రూ.2.08 లక్షల కోట్లు డీబీటీలో ఎస్సీలకే అగ్రతాంబూలం లభించిందన్నారు. అంబేడ్కర్ విగ్రహం పెట్టలేక పారిపోయిన పిరికిపంద చంద్రబాబు అని దుయ్యబట్టారు. విజయవాడ నడిబొడ్డున రూ.300 కోట్లతో విగ్రహం పెడుతున్న ధీరుడు సీఎం జగన్ అని కొనియాడారు. దళిత మంత్రి ఆదిమూలపు సురేష్‌పై దగ్గరుండి రాళ్లేయించింది చంద్రబాబేనని ధ్వజమెత్తారు. సీఎం జగన్‌పై ప్రజలకున్న విశ్వాసాన్ని చూసి చంద్రబాబుకు నిద్ర పట్టడం లేదని, చంద్రబాబు అనే క్షుద్ర రాక్షసి ఈ రాష్ట్ర రాజకీయాల్లో ఉండకూడదని అన్నారు. చంద్రబాబుకు అవసరం ఉన్నప్పుడు దళితుల కాళ్లు పట్టుకుంటారని, అవసరం తీరాక మోకాలితో తంతారని ఎద్దేవా చేశారు.

రాష్ట్ర ప్రజలకు దయ్యం పట్టింది

- శని దాపరించి నన్ను ఓడించారు
- 2047కి రాష్ట్రంలో పేదలందర్నీ ధనవంతుల్ని చేస్తా
- అమరావతికి గుంటూరు ప్రజలు సైతం కుల ముద్ర వేశారు
- టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు



సత్తెనపల్లిలో మాట్లాడుతున్న చంద్రబాబు

సాక్షి, నరసరావుపేట/సత్తెనపల్లి: రాష్ట్ర ప్రజలకు దయ్యం పట్టిందని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. వారికి శని దాపరించి, తనను ఓడించారని అన్నారు. ఆయన బుధవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. ప్రజలు తనను ఓడించినందువల్లే అమరావతి నిర్మాణం ఆగిపోయిందని చెప్పారు. 22 ఏళ్ల క్రితం హైదరాబాద్‌ను నిర్మించానని, అదే విధంగా అమరావతి నిర్మాణం మొదలు పెడితే మధ్యలోనే ఆగిపోయిందన్నారు. గుంటూరు ప్రజలు సైతం అమరావతికి కుల ముద్ర వేశారని అన్నారు. తన సూచనలతోనే వాజపేయి దేశంలో రోడ్లు వేశారన్నారు. 2047 నాటికి రాష్ట్రంలో పేదలందర్నీ ధనవంతులను చేయడమే టీడీపీ లక్ష్యమని చెప్పారు. పాసుపుస్తకం, భూసరిహద్దు రాళ్లపైనా జగన్ ఫొటోనేనా అని ప్రశ్నించారు. బాబాయిని చంపి తనపై నెపం మోపి నారాసుర రక్త చరిత్ర అంటూ వాళ్ల పేపర్‌లో అచ్చు వేసుకున్నారని ఆరోపించారు.

అంబులెన్స్‌కు దారివ్వని చంద్రబాబు కాన్వాయ్

చంద్రబాబు సత్తెనపల్లి పర్యటనలో అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోవడం పట్ల ప్రజల నుంచి నిరసన వ్యక్తమైంది. బుధవారం రాత్రి చంద్రబాబు ప్రత్యేక ప్రచార రథంపై పట్టణంలోకి ప్రవేశించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఓ అంబులెన్స్ వచ్చినప్పటికీ దానికి దారి ఇవ్వలేదు. అక్కడి నుంచి చంద్రబాబు కాన్వాయ్ ముందుకు వెళ్లే వరకు అంబులెన్స్ అక్కడే ఉండాల్సి వచ్చింది. కాగా, సత్తెనపల్లిలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ కార్యక్రమాల్లో మద్యం ఏరులై పారింది. జన సమీకరణ నిమిత్తం ఒక్కో మహిళకు రూ.300తో పాటు చీర, పురుషులకు ఒక్కొక్కరికి రూ.500, క్వార్టర్ మద్యం, బిరియానీ ప్యాకెట్, టీ షర్ట్ పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా 'గో బ్యాక్ చంద్రబాబూ..' అంటూ తాలూకా సెంటర్‌లో వెలిసిన ఫ్లెక్సీపై ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. 'ఆరోగ్యశ్రీని అనారోగ్య శ్రీగా మార్చిన మాట వాస్తవం కాదా? అంటూ ఆ ఫ్లెక్సీలో పలు ప్రశ్నలు సంధించారు.

'యువగళం'లో వాల్మీకులకు భంగపాటు

- పాదయాత్రలో పాల్గొనేందుకు లోకేశ్ ససేమిరా

మంత్రాలయం: యువగళం యాత్ర సాక్షిగా టీడీపీలో వర్గ విభేదాలు రచ్చకెక్కాయి. లోకేశ్ యువగళం యాత్ర మంగళవారం కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గంలో ప్రవేశించిన మొదటిరోజే తమ్ముళ్ల మధ్య విభేదాలు బయటపడ్డాయి. మంత్రాలయం ఇన్‌చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి, వాల్మీకి నేతలు ఉలిగయ్య, ముత్తురెడ్డి, రామిరెడ్డి వర్గీయుల మధ్య కోసిగి మండల కేంద్రంలో బాహాబాహీ జరిగింది. తిక్కారెడ్డి వర్గీయులు చిన్నభూంపల్లి నాయకులు, ముత్తురెడ్డి అనుచరులు కర్రలు, రాళ్లతో పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం యాత్రలో పాల్గొనేందుకు వాల్మీకి నేతలు, అనుచరులు వాహనాల్లో మంత్రాలయం మండలంలోని సుంకేశ్వరి రోడ్డు వరకు వచ్చారు. పాదయాత్ర ప్రశాంతంగా సాగాలంటే మీరు యాత్రకు దూరంగా ఉండాలని లోకేశ్ సూచించడంతో చేసేది లేక బీసీ నేతలు, అనుచరులు నిరాశతో వెనుదిరిగారు.

దళిత ద్రోహి చంద్రబాబు

- ఎస్సీ (మాల) కార్పొరేషన్ చైర్‌పర్సన్ అమ్మాజీ

సాక్షి, అమరావతి: చంద్రబాబు దళిత ద్రోహి అని, ద్రోహి అన్న పదానికి ఆయన బ్రాండ్ అంబాసిడర్ అని ఎస్సీ (మాల) కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ విమర్శించారు. తాడేపల్లిలో బుధవారం ఆమె మాట్లాడుతూ ఎస్సీలకు తీరని అన్యాయం చేసింది చంద్రబాబేనని చెప్పారు. ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అన్న పెద్దమనిషి చంద్రబాబు ఎస్సీలకు ఎవరు న్యాయం చేశారో చర్చకు సిద్ధం అని అనటం ఆశ్చర్యంగా ఉందని ఎద్దేవా చేశారు. పేదలైన ఎస్సీలను భక్షించడం తప్ప చంద్రబాబు చేసిన మేలు ఏమీ లేదన్నారు. కారంచేడు మొదలు అమరావతి వరకు ఎస్సీలకు చంద్రబాబు అన్యాయమే చేశారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అన్ని వర్గాల అభివృద్ధి జరిగిందన్నారు. దిగజారుడు రాజకీయాలు చేసే చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ఎస్సీలు మళ్లీ బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఎస్సీలకు ఎవరు ఏంచేశారో అనే అంశంపై చర్చకు తాము ఎప్పుడూ సిద్ధమేనని ఆమె సవాల్ చేశారు.


విత్తనాల ప్రదర్శనలో రైతు మహిళలు

విత్తనం పరిరక్షణకు 'చిరు'యత్నం

మహిళల ఘన విజయం

'ఇంటర్నేషనల్ సీడ్ డే'... ఇలాంటి ఓ రోజు ఉందా!
ఉంది... అయితే ప్రచారమే పెద్దగా ఉండదు.
ఇది గ్లామర్ మార్కెట్ వస్తువు కాకపోవడమే కారణం.
ఈ రోజును రైతు మహిళలు నిర్వహించారు.
'చిరు'సాగు చేసి కళ్లాల్లో రాశులు పోసిన చేతులవి.
విత్తనాన్ని కాపాడాలనే ముందుచూపున్న చేతలవి.

రాగి ముద్ద స్టార్ హోటల్ మెనూలో కనిపిస్తోంది. స్మార్ట్‌గా ఆర్డర్ చేస్తే అందమైన ప్యాక్‌తో ఇంటిముందు వాలుతోంది. అలాగే సజ్జ ఇడ్లీ, ఊదల దోసె, కొర్రల కర్డ్ మీల్, జొన్న రొట్టె, మిల్లెట్ చపాతీ, మిల్లెట్ పొంగలి... ఇలా బ్రేక్ ఫాస్ట్ సెంటర్‌లు కొత్త రూపుదిద్దుకున్నాయి. ఎక్కడో మారుమూల గ్రామాల్లో నీటి వసతి లేని నేలను నమ్ముకుని బతికే వాళ్ల ఆకలి తీర్చిన చిరుధాన్యాలు ఇప్పుడు బెంజ్‌కారులో బ్రేక్‌ఫాస్ట్‌కి వెళ్లే సంపన్నుల టేబుల్ మీదకు చేరాయి. ఒకప్పుడు చిన్న చూపుకు గురైన చిరుధాన్యాలు నేడు సిరిధాన్యాలుగా మన దైనందిన జీవితంలో ప్రధాన భూమికను పోషిస్తున్నాయి. వీటి వెనుక నిరుపేద మహిళల శ్రమ ఉంది. పాతికేళ్లుగా ఈ నిరుపేద మహిళలు చిరుధాన్యాలతోనే జీవించారు, చిరుధాన్యాల పరిరక్షణ కోసమే జీవించారు. సేంద్రియ సేద్యంతో చిరుధాన్యాల జీవాన్ని నిలిపారు. అంతర్జాతీయ విత్తన దినోత్సవం (ఏప్రిల్ 26) సందర్భంగా బుధవారం వీరంతా మెదక్ జిల్లా, జహీరాబాద్ మండలం, పస్తాపూర్‌లో తమ దగ్గరున్న పంటల విత్తనాలను సగర్వంగా ప్రదర్శించారు. హైబ్రీడ్ వంగడాల మాయలో పడకుండా మన విత్తనాలను మనం కాపాడుకోవాలని ఒట్టు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ బోర్డు సభ్యులు రుక్మిణీరావు సాక్షితో పంచుకున్న వివరాలివి.



చిరుధాన్యాలను పండించడంలో ముందడుగు వేసేశాం. ఇక మన ముందున్న బాధ్యత ఈ విత్తనాలను కాపాడుకోవడం. ఈ విత్తనాల మీద పూర్తి హక్కులు ఈ పేద రైతు మహిళలవే.
– రుక్మిణీరావు, బోర్డు సభ్యులు, దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ


తాము పరిరక్షించిన విత్తనాలతో రైతు మహిళలు

ఈ నేల... ఈ విత్తనం... మన సొంతం

''చిరుధాన్యాల పట్ల అవగాహన కోసం ఈ ఏడాదిని 'ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్' నిర్వహించుకుంటున్నాం. ఈ ఏడాది సీడ్ డే రోజున మేము చిరుధాన్యాల విత్తనాల పరిరక్షణ, ప్రదర్శన నిర్వహించాం. పస్తాపూర్ కేంద్రంగా జరిగిన ఈ కార్యక్రమంలో 26 పరిసర గ్రామాల నుంచి వందకు పైగా మహిళలు వారు పండించి, పరిరక్షించిన విత్తనాలను తీసుకు వచ్చారు. చిరుధాన్యాలతోపాటు పప్పుధాన్యాలు, నూనె గింజల విత్తనాలు మొత్తం యాభైకి పైగా పంటల విత్తనాలకు ఈ ప్రదర్శన వేదికైంది. ఇవన్నీ సేంద్రియ సేద్యంలో పండించినవే.

ఆహారం -ఆకలి!

ఆహారం మన ఆకలి తీర్చాలి, దేహానికి శక్తినివ్వాలి. 'వరి అన్నం తిని పొలానికి వెళ్తే పని మొదలు పెట్టిన గంట సేపటికే మళ్లీ ఆకలవుతుంది. రొట్టె తిని వెళ్తే ఎక్కువ సేపు పని చేసుకోగలుగుతున్నాం. అందుకే మేము కొర్రలు, జొన్నలు తింటున్నాం' అని ఈ మహిళలు చెప్పిన మాటలను తోసిపుచ్చలేదు సైంటిస్టులు. వారి అనుభవం నుంచి పరిశోధన మొదలు పెట్టారు. అందుకే మిల్లెట్స్‌లో దాగి ఉన్న శక్తిని ప్రపంచ వేదికల మీద ప్రదర్శించగలిగారు. అలాగే ఈ మహిళలు విదేశాల్లో రైతు సదస్సులకు హాజరై తమ అనుభవాలను వారితో పంచుకున్నారు. భూగోళం ఎదుర్కొంటున్న మరో విపత్తు క్లైమేట్ చేంజ్. ఈ పంటలైతే వాతావరణ ఒడిదొడుకులను ఎదుర్కొని పంటనిస్తాయి. పదిహేను రోజులు నీరు అందకపోయినప్పటికీ జీవాన్ని నిలుపుకుని ఉంటాయి. చిరుధాన్యాలకు గాను మన ముందున్న బాధ్యత ఈ విత్తనాలను కాపాడుకోవడం. ఎట్టి పరిస్థితుల్లోనూ వీటి మీద హక్కులను కార్పొరేట్ సంస్థలు తన్నుకుపోకుండా చూసుకోవాలి. అవసరమైతే ఉద్యమించాలి. ఇదే మనం డీడీఎస్ స్థాపకులు మిల్లెట్ మ్యాన్ పీవీ సతీశ్‌గారికి ఇచ్చే నివాళి'' అన్నారు రుక్మిణీరావు.

– వాకా మంజులారెడ్డి

కోపం వస్తే కొందరు ఏంచేస్తారు? దగ్గర్లో ఉన్న వస్తువును నేలకేసి బాదుతారు.
మరింత ముందుకు వెళ్లి తమకు తాము హాని చేసుకుంటారు.
ప్రతికూలత ప్రతిధ్వనించే కోపాన్ని శక్తిగా మలుచుకుంటే అద్భుతాలు సాధించలేమా!
'అప్నా క్లబ్' కో-ఫౌండర్, సీయీవో శ్రుతి విజయగాథ ఈ విషయాన్ని చెప్పకనే చెబుతోంది...

గెలుపు బాట

సంకల్ప బలమే సబల విజయం

శ్రుతికి చిన్నప్పటి నుంచి కోపం ఎక్కువ. అయితే అది అకారణ కోపం మాత్రం కాదు.

'నీకు ముగ్గురూ ఆడపిల్లలేనా. అయ్యో!' అని తన తండ్రి దగ్గర ఎవరో వాగినప్పుడు...

'ఈ అమ్మాయిలకు మ్యాథ్స్ బొత్తిగా రాదు'

'కాలేజీలో సైన్స్ జోలికి వెళ్లవద్దు. ఏదైనా తేలికపాటి సబ్జెక్ట్ తీసుకోండి' అని క్లాసు టీచర్ ఉచిత సలహాలు ఇచ్చినప్పుడు...

'అలా గట్టిగా నవ్వుతావేమిటీ? ఆడపిల్లను అనే విషయం మరిచావా' అని బంధువు ఒకరు అన్నప్పుడు...

ఆమెకు కట్టలు తెచ్చుకునేంత కోపం వచ్చేది. అయితే ఆ కోపాన్ని ఎలా అదుపులో పెట్టుకోవాలో తనకు తెలుసు.


శ్రుతి

'ఆడపిల్లలకు మ్యాథ్స్ రాదు' అని వెక్కిరింపు శ్రుతిలో పట్టుదలను పెంచి ఐఐటీ–ఢిల్లీ వరకు తీసుకెళ్లింది. అయితే అక్కడ కూడా లింగవివక్ష రకరకాల రూపాల్లో వెక్కిరించేది. ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు 'ఇక్కడ ఆడవాళ్లకు ఏం పని?' 'స్కోర్ జీరో బ్యాచ్' ఇలా ఎన్నో వెక్కిరింపులు వినిపించేవి.

తన స్నేహితులతో కలిసి ఎన్నో కప్పులు గెలుచుకొని ఆ వెక్కిరింపులకు గట్టి సమాధానం చెప్పింది శ్రుతి.

చదువు పూర్తయిన తరువాత ఉద్యోగప్రస్థానం మొదలైంది. అయితే అక్కడ కూడా ఏదో రకమైన వివక్షత కనిపించేది.

ఆ తరువాత కాలంలో...

ఉద్యోగం వద్దనుకొని ఒక స్వచ్ఛంద సంస్థలో చేరింది శ్రుతి. అక్కడ మనసు ప్రశాంతంగా అనిపించింది. తన గురించి తాను తీరిగ్గా ఆలోచించుకునే అవకాశం వచ్చింది. 'ప్రయాణించడానికి దారులు ఎన్నో ఉన్నాయి. సాధించాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయి' అనే ఎరుక ఆమెలో కలిగింది.

'నువ్వు ఎంబీఏ చేస్తే రాణించగలవు' అని అక్కడ ఒకరు సలహా ఇచ్చారు.

అలా హార్వర్డ్ బిజినెస్ స్కూల్ (హెచ్‌బీఎస్)లో చేరింది. ఇండియాకు తిరిగి వచ్చిన తరువాత 'సైర్' పేరుతో టూర్ అండ్ ట్రావెల్ స్టార్టప్‌ను ఆరంభించింది. ఈ స్టార్టప్ నష్టాలు మిగల్చడంతో పాటు విలువైన పాఠాలు నేర్పింది. ఆ పాఠాల వెలుగులో మరో ప్రయాణం మొదలుపెట్టింది శ్రుతి. చిన్న పట్టణాలలో ప్రజలు ఎఫ్ఎంసీజీ (ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్) ప్రొడక్ట్స్ కొనడానికి ఆసక్తిగా ఉన్నారనే విషయం అర్థమైన తరువాత మనీష్ కుమార్‌తో కలిసి 'అప్నాక్లబ్' అనే ఎఫ్ఎంసీజీ ప్లాట్‌ఫామ్‌ను బెంగళూరు కేంద్రంగా స్టార్ట్ చేసింది.

ఈ ప్లాట్‌ఫామ్ ఒక రేంజ్‌లో సక్సెస్ అయింది. శ్రుతిలో ఎంటర్‌ప్రెన్యూర్ స్కిల్స్ ప్రపంచానికి తెలిసాయి.

'అప్నాక్లబ్' బ్యాకర్స్ జాబితాలో టైగర్ గ్లోబల్, ట్రూ స్కేల్ క్యాపిటల్, వైట్‌బోర్డ్ క్యాపిటల్... మొదలైన సంస్థలు ఉన్నాయి.

'శ్రుతి గొప్ప సంకల్పబలం ఉన్న వ్యక్తి' అని ప్రశంసిస్తున్నారు వైట్‌బోర్డ్ క్యాపిటల్ పార్ట్‌నర్ అన్షు ప్రషర్.

నిజమే కదా...

'ఆడపిల్లలకు లెక్కలు రావు' అనే వెక్కిరింపును సవాలుగా తీసుకొని సంకల్పబలంతో గణితంలో ప్రతిభ ప్రదర్శించింది.

హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో చదువుకునే రోజుల్లో అదృశ్య వివక్షను ఖాతరు చేయకుండా ముందడుగు వేయడానికి ఆ సంకల్పబలమే ఉపయోగపడింది.

స్టార్టప్ యాత్రలో కూడా కామెంట్స్ రూపంలో లింగవివక్షత కనిపించినా, ధైర్యం కోల్పోకుండా ఉండడానికి ఆ సంకల్పబలమే ఉపయోగపడింది. ఎక్కడో మొదలైన సంకల్పబలం 'అప్నా క్లబ్' వరకు తనతోనే ఉంది. చీకటి కమ్ముతున్నప్పుడు వెలుగును ఆయుధంగా ఇచ్చింది. ఓటమి వెక్కిరించినప్పుడు గెలుపును ఆయుధంగా ఇచ్చింది.

'కోపం ఉన్న ఆడవాళ్లను జనాలు అసౌకర్యంగా చూస్తారు. మగవాళ్ల విషయానికి వస్తే యాంగ్రీ యంగ్‌మెన్ అని మురిసిపోతారు' అంటూ నవ్వుతుంది శ్రుతి.

తనను 'ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్'గా పిలిపించుకోవడం కంటే 'ఎంటర్‌ప్రెన్యూర్'గా పిలిపించుకోవడానికే శ్రుతి ఇష్టపడుతుంది.

చిన్నప్పుడు తండ్రి ఒకరోజు అడిగాడు...

'మ్యాథ్స్‌లో ఎన్ని మార్కులు స్కోర్ చేయాలో తెలుసా?'

'నన్ను నమ్మండి' అన్నది శ్రుతి.

అప్పటినుండి తనపై తనకు ఉన్న నమ్మకాన్ని, ఇతరులకు తనపై ఉన్న నమ్మకాన్ని ఎప్పుడూ కోల్పోలేదు శ్రుతి.

సైబర్ టాక్

లోన్ యాప్స్‌తో జాగ్రత్త!!

అదో విషవలయం

అస్తమానం ఫోన్‌తోనే కాలక్షేపం చేస్తున్న కొడుకు సుధీర్ (పేరుమార్చడమైనది)ను మందలించింది సుమ (పేరు మార్చడమైనది). తల్లి అరిచేసరికి బయటకు వెళ్లిపోయాడు. ఏంటో ఈ పిల్లలు ఎప్పుడూ ఫోన్‌లోనే ఉంటారు, ఎవరితోనూ ఏమీ మాట్లాడకుండా అనుకుంటూ తిరిగి తన పనిలో పడిపోయింది. కాలేజీ ఫీజు, బుక్స్ అని ఇటీవల డబ్బులు కూడా ఎక్కువే అడుగుతున్నాడు. కొడుకు ఫ్రెండ్‌ను కలిస్తే, ఇటీవల సుధీర్ ప్రవర్తన గురించి, పెరుగుతున్న ఖర్చుల గురించి మాట్లాడింది. సుధీర్ యాప్ లోన్స్ తీసుకొని, ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్నాడనే విషయం తెలిసి షాక్ అయ్యింది. వాటివల్ల జరిగే అనర్థాలు ఇటీవల వార్తల్లో విపరీతంగా వినిపిస్తున్నాయి. ఇలాంటప్పుడు ఏం చేయాలో తోచక తలపట్టుకుంది.

•••

విద్యార్థులను, గృహిణులను టార్గెట్ చేస్తూ నకిలీ లోన్ యాప్‌లు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. స్టూడెంట్స్ బలహీనతలను క్యాష్ చేసుకోవడానికి ఫోన్, ఆధార్ నెంబర్లు తీసుకొని ఆకర్షణీయమైన లోన్లతో అట్రాక్ట్ చేస్తూ, ఎక్కువ వడ్డీ రేట్లను వసూలు చేస్తున్నాయి. తీసుకున్నది వడ్డీతో సహా పూర్తిగా చెల్లించినా తిరిగి తాము కోరిన మొత్తం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. అదనపు మొత్తాన్ని గుంజడానికి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న లోన్ యాప్స్ నుంచి సేఫ్‌గా ఉండటం ఎలాగో ఈ నవతరానికి తప్పక తెలియాలి. కాలేజీ చదువులు చదువుతున్న పిల్లల ద్వారా వచ్చే ఈ లోన్ యాప్ సమస్యలతో తల్లిదండ్రులు విపరీతంగా ఇబ్బంది పడుతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి యేటా వందలాది నకిలీ లోన్ యాప్స్ పుట్టుకు రావడం, వాటి నుంచి అనాలోచితంగా డబ్బులు తీసుకుంటూ వేల రూపాయల నుంచి లక్షల రూపాయల దాకా మోసపోతున్నవారిలో యువతరమే కాదు గృహిణులు కూడా ఉంటున్నారు.

అధిక డబ్బు కోసం..

ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం అంటూ లోన్ యాప్ ద్వారా మనీని ఇస్తామనే ప్రకటనలు వస్తుంటాయి. ఉదాహరణకు.. రూ.5000 లోను తీసుకుంటే దానికి ఛార్జీలు, వడ్డీ కట్ చేసుకొని రూ.3000 ఇస్తారు. వీటికి ప్రతిరోజూ వడ్డీ కలిపి, పది రోజుల్లో అంతే మొత్తం కట్టమని బెదిరింపులు వస్తుంటాయి. ఆన్‌లైన్ బెట్టింగ్ లేదా గేమ్‌లో ఎక్కువ మొత్తం వస్తుందనో లేక ఫ్రెండ్స్‌కు పార్టీ ఇవ్వడానికనో అనాలోచితంగా యువతరం చేసే పని ఇలా ఉంటే, గృహిణులు ఇంట్లో ఉండి ఎక్కువ డబ్బు సంపాదించవచ్చు కదా అని ఆన్‌లైన్ సేవింగ్స్ అంటూ ఈ మార్గాన్ని ఎంచుకుంటూ ఉంటారు. పది రూపాయల నుంచి పది లక్షల వరకు పెట్టుబడిగా పెట్టి, మోసపోయినవారున్నారు.

అవగాహనే పరిష్కారం

సాధారణంగా యాప్ స్టోర్, ప్లే స్టోర్ నుంచి ఈ లోన్ యాప్స్ డౌన్‌లోడ్ చేయం. సోషల్ మీడియాలో, మెసేజ్‌ల ద్వారా వచ్చే షార్ట్ లింక్స్ ద్వారా వీటికి మన వివరాలను అందించడం, మోసపోవడం జరుగుతుంటుంది. సైబర్ క్రైమ్ దృష్టికి తీసుకెళ్లినా అధికారికంగా లేని ఈ యాప్స్‌పై ఎలా కేస్ వేయాలో కూడా తెలియదు. దీనికి అవగాహనే పరిష్కారం తప్ప మరో మార్గం లేదు. టాస్క్ బేస్డ్ ఫ్రాడ్ పేరుతో ఇటీవల సోషల్ మీడియా లైక్‌లకు, కామెంట్స్‌కు, షేర్ చేస్తే డబ్బులు ఇస్తామనే నకిలీ యాప్స్ కూడా పుట్టుకు వస్తున్నాయి. ఈ యాప్స్‌లో ముందస్తుగా కొంత డబ్బు కట్టమని చెబుతారు, సులువైన ప్రక్రియ కదా అని కొంత మొత్తం కట్టి, లాగిన్ అయ్యి మోసపోయేవారుంటున్నారు.


ప్రతీకాత్మక చిత్రం

లోన్ ఇచ్చే నెపంతో ఎర

మన దేశంలో చట్టబద్ధమైన మొబైల్ రుణాలు బాగా పెరుగుతున్నాయి. ఇది స్కామర్ల యాప్‌లకు ఒక వరంలా మారింది. ప్లే స్టోర్‌లో చేరిన 200 యాప్స్‌కి పైగా రెండేళ్ల క్రితమే తీసేశారు. కానీ, సోషల్ మీడియా, మెసేజ్ ప్లాట్‌ఫారమ్‌లలో అవే యాప్స్ పేరుతో కొత్తవి ప్రత్యక్షమవుతున్నాయి. లోన్ తీసుకున్నవారు షరతుల ప్రకారం తిరిగి చెల్లిస్తున్నప్పటికీ పరువు తీయడం, వేధింపులు కారణంగా 20కి పైగా ఆత్మహత్య కేసులను చూశాం.

ఇవి ఎలా ఉంటాయంటే..

- బాధితులు తమకు వచ్చిన మెసేజ్‌లు లేదా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో క్లిక్ చేసి, లోన్ కోసం అప్లై చేస్తారు.
- DMZ/APK ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసి, స్కామ్ లోన్‌యాప్‌లను ఇన్‌స్టాల్ చేస్తారు.
- ఈ స్కామ్ యాప్‌లు లోన్ ఇవ్వడానికి రుణగ్రహీత పరిచయాలు, గ్యాలరీ, జీపీఎస్ ప్లేస్ యాక్సెస్ అనుమతులను కోరుతాయి.
- యాక్సెస్ ఓకే చేసిన తర్వాత అన్ని వ్యక్తిగత వివరాలు వారి సర్వర్‌లో అప్‌లోడ్ చేయబడతాయి.
- బాధితులు డాక్యుమెంట్లతో సహా అన్ని వివరాలను అప్‌లోడ్ చేస్తారు. తమ స్మార్ట్ ఫోన్‌లకు యాక్సెస్ చేస్తారు. లోన్ రీ పేమెంట్ వ్యవధి ఏడు నుంచి 15 రోజుల మధ్య ఉంటుంది.
- ప్రాసెసింగ్, జీఎస్టీ, ఇతర ఛార్జీలతో సగానికి పైగా ముందస్తు కోతలు ఉంటాయి.
- నిర్ణీత సమయంలో రుణం చెల్లించకపోతే వేధింపులు, హెచ్చరికలు మొదలవుతాయి.
- ఫ్రెండ్స్, కుటుంబ సభ్యుల వాట్సప్ గ్రూపులకు పరువు నష్టం కలిగించే సందేశాలను పంపుతారు.
- నకిలీ పోలీసులు ఫోర్జరీ, కోర్టు సమన్లు లాంటివి వాట్సప్ ద్వారా పంపుతుంటారు.
- బాధితులు షరతులకు లోబడి లోను ఎమౌంట్ చెల్లిస్తారు.

లేదంటే స్కామర్లు ప్రత్యామ్నాయ స్కామ్ యాప్‌ల నుండి రుణం తీసుకునేలా ప్రోత్సహిస్తారు. దీంతో బాధితుడు తెలియకుండా ఒక విష వలయంలో చిక్కుకుంటాడు.

మోసాలను గుర్తించండి ఇలా..

- రుణదాతలుగా ఉన్న యాప్స్ ఆర్‌బిఐ వద్ద అధికారికంగా నమోదు చేసి ఉండవు.
- ఈ రుణదాతలు కేవలం రెండు క్లిక్‌లతో రుణాలను అందిస్తారు. మన క్రెడిట్ స్కోర్ కూడా చెక్ చేయరు.
- ఫోన్‌లో అందుబాటులో ఉన్న అన్ని వ్యక్తిగత వివరాలకు, సంప్రదింపు వివరాలకు యాక్సెస్ రిక్వెస్ట్‌పై దృష్టి పెడతారు.
- యాప్ లేదా వెబ్‌సైట్ చిరునామా లేదా సంప్రదించాల్సిన కాంటాక్స్ నంబర్ లాంటివి ఏమీ ఉండవు.
- కొంతమంది రుణదాతలు ప్రాసెసింగ్ ఫీజు లేదా జీఎస్టీ సాకుతో ముందస్తు చెల్లింపును కూడా డిమాండ్ చేస్తారు.
- రుణ ఆఫర్ త్వరలో ముగుస్తుందని, వెంటనే నిర్ణయం తీసుకోమని అప్లై చేసుకునే వ్యక్తిని తొందర పెడతారు.
- మీ సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా రుణాన్ని అందిస్తారు.

ఎలా రక్షించుకోవాలంటే..

- రుణం తీసుకునే సంస్థ చిరునామాను వెరిఫై చేయండి.
- రుణం కోసం అప్లై చేయడానికి ముందు వెబ్‌సైట్, యాప్ (యాప్ స్టోర్ / ప్లే స్టోర్) చెక్ చేయండి.
- వెబ్‌సైట్‌లు, సోషల్ మీడియా లేదా మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి DMZ లేదా APK ఫైల్స్ ను ఎప్పుడూ డౌన్‌లోడ్ చేయద్దు. యాప్ స్టోర్ లేదా ప్లే స్టోర్ నుండి మాత్రమే డౌన్ లోడ్ చేయాలి.
- సురక్షిత చెల్లింపు కోసం (https://URL with a Pad Lock Symbol) సింబల్‌తో కూడిన యుఆర్ఎల్ మాత్రమే చూడాలి.
- OTP/PIN నంబర్లను కొనుగోలుదారు లేదా విక్రేతతో ఏ రూపంలోనూ షేర్ చేయద్దు.
- ఫోన్ మాట్లాడుతున్నప్పుడు ఎలాంటి చెల్లింపు లావాదేవీని చేయకూడదు.
- స్కామర్ అందించిన గూగుల్ ఫారమ్ లింక్‌లను పూరించవద్దు.
- QR కోడ్‌ను ఎప్పుడూ స్కాన్ చేయవద్దు. స్కాన్ చేస్తే, మీ అకౌంట్ నుంచి డబ్బు డెబిట్ అవుతుంది.
- అధికారికంగా రుణం ఇచ్చేవారు ఎప్పుడూ ముందుస్తు ఫీజ్ వసూలు చేయరు. బదులుగా ప్రాసెసింగ్ ఫీ తీసుకుంటారు కానీ, అదీ లోన్ మొత్తం నుంచి బ్యాంకు నిబంధనల ప్రకారం ఛార్జ్ చేస్తారు.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

బ్యూటిప్స్



- రెండు టేబుల్ స్పూన్ల గోధుమ పిండి, టీ స్పూన్ అవకాడో గుజ్జు, రెండు టేబుల్ స్పూన్ల తేనె కలిపి మిశ్రమం తయారుచేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకోవాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో మర్దనా చేస్తూ, తర్వాత శుభ్రపరుచుకోవాలి.
- యాపిల్, ద్రాక్ష గుజ్జు రెండూ సమపాళ్లలో తీసుకొని కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేయాలి. మచ్చలు తగ్గి నిగారింపు పెరుగుతుంది.
- బాగా పండిన ఆపిల్ ఒకటి, ఒక టీ స్పూన్ తేనె, ఒక టీ స్పూన్ ఓట్ మీల్, అర టీ స్పూన్ దాల్చినచెక్క పొడి తీసుకోవాలి. ఆపిల్ గుజ్జులో మిగిలినవన్నీ కలుపుకోవాలి. అవసరమైతే మిక్సీలో బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు ప్యాక్ వేసి పది నిమిషాల తర్వాత చన్నీటితో కడగాలి. ఇది అన్ని రకాల చర్మతత్వాలకు పని చేస్తుంది.

మల్టీ టాలెంట్

బహుముఖ దృశ్యం

'మా తనిమాకు బోలెడు విద్యలు వచ్చు' అని మురిసిపోయేవారు తల్లిదండ్రులు.

చిన్నారి తనిమాకు మ్యూజిక్ నుంచి మ్యాజిక్ వరకు ఎన్నో విద్యల్లో ప్రవేశం ఉండేది.

అయితే ఆ బహుముఖ ప్రజ్ఞ బాల్య మధుర జ్ఞాపకంగానే మిగిలిపోలేదు.

ఫొటోగ్రాఫర్, క్రియేటివ్ డైరెక్టర్, రైటర్, ప్రొడ్యూసర్‌గా ఇప్పుడు మంచి పేరు తెచ్చుకుంది...


తనిమా మెహ్రోత్ర

చిన్న వయసులోనే తల్లిదండ్రులతో పాటు ఇండియా నుంచి ఫ్లోరిడాకు వెళ్లింది తనిమా మెహ్రోత్ర. ఆటపాటల్లోనే కాదు చదువుల్లోను చురుగ్గా ఉండేది. చదువులు పూర్తయిన తరువాత ఒక కార్పొరేట్ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగంలో చేరింది.

'గుడ్ శాలరీ. సేఫ్ జాబ్‌కు మించినది ఏం ఉంటుంది?' అని అనుకుంటాంగానీ తనిమ అనుకోలేదు.

'దీనికి మించి ఏదో ఉంది!' అని గట్టిగా అనుకొని ఉద్యోగానికి గుడ్‌బై చెప్పింది.

చేతిలో కెమెరా తీసుకుంది.

ఈ విశాల ప్రపంచాన్ని అందులో నుంచి చూసింది. తనదైన శైలిలో ఎన్నో ఫొటోలు తీసి ప్రశంసలు అందుకుంది.

ఎన్నో ప్రసిద్ధ పత్రికలను ఆమె తీసిన ఫొటోలు అలంకరించాయి.

''గుర్తింపు కోసం కార్పొరేట్ రంగాన్ని వదిలి క్రియేటివ్ ఫీల్డ్‌కి రాలేదు. 'నా ఆనందం ఎక్కడ ఉంది?' అని వెదుక్కుంటూ మాత్రమే వచ్చాను. సృజనాత్మకమైన పనులలో అలసట ఉండదు. అలుపెరుగని ఆనందం ఉంటుంది'' అంటుంది తనిమా మెహ్రోత్ర.



ప్రపంచకప్ ఫైనల్స్ టోర్నీకి జ్యోతి సురేఖ అర్హత

ఆర్చరీ సీజన్ ముగింపు టోర్నీ ప్రపంచకప్ ఫైనల్స్‌కు భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ అర్హత సాధించింది. ఈ మెగా టోర్నీ ఈ ఏడాది సెప్టెంబర్‌లో మెక్సికోలో జరుగుతుంది. తుర్కియేలో గతవారం జరిగిన ప్రపంచకప్ స్టేజ్–1 టోర్నీలో జ్యోతి సురేఖ మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో స్వర్ణ పతకాలు సాధించింది. ఈ ప్రదర్శనతో సురేఖకు మరో మూడు ప్రపంచకప్‌లు మిగిలి ఉండగానే ఫైనల్స్‌కు బెర్త్ దక్కింది. ప్రపంచకప్ స్టేజ్–2 టోర్నీ కొలంబియాలో జూన్ 13 నుంచి 18 వరకు జరుగుతుంది.

సూర్యకుమార్ 'టాప్' ర్యాంక్ పదిలం

భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ టి20 ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. గత ఏడాది నవంబర్ 2న సూర్య టాప్ ర్యాంక్‌లోకి దూసుకొచ్చాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సూర్య 906 రేటింగ్ పాయింట్లతో అగ్ర స్థానంలోనే ఉన్నాడు. రిజ్వాన్ (811 పాయింట్లు) రెండో ర్యాంక్‌లో, బాబర్ ఆజమ్ (756 పాయింట్లు) మూడో ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.



కోల్‌కతా గెలుపు బాట...

- నాలుగు పరాజయాల తర్వాత మళ్లీ విజయం
- బెంగళూరుపై 21 పరుగులతో గెలుపు
- మెరిసిన జేసన్ రాయ్, నితీశ్ రాణా
- రాణించిన వరుణ్ చక్రవర్తి, సుయశ్

బెంగళూరు: చిన్నస్వామి స్టేడియం కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు మరోసారి కలిసొచ్చింది. నాలుగు వరుస పరాజయాలతో డీలా పడిన జట్టుకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. సమష్టి ప్రదర్శనతో చెలరేగిన కోల్‌కతా మళ్లీ గెలుపు బాట పట్టింది. ఈ మైదానంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో జరిగిన గత 11 మ్యాచ్‌ల్లో ఏడుసార్లు నెగ్గిన కోల్‌కతా ఈసారీ తమ ఆధిపత్యాన్ని చాటుకొని 21 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన కోల్‌కతా 20 ఓవర్లలో 5 వికెట్లకు 200 పరుగులు సాధించింది. జేసన్ రాయ్ (29 బంతుల్లో 56; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), కెప్టెన్ నితీశ్ రాణా (21 బంతుల్లో 48; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అదరగొట్టారు. చివర్లో రింకూ సింగ్ (10 బంతుల్లో 18 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), డేవిడ్ వీస్ (3 బంతుల్లో 12 నాటౌట్; 2 సిక్స్‌లు) మెరిశారు. 201 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 8 వికెట్లకు 179 పరుగులు చేసి ఓడిపోయింది. డుప్లెసిస్ (17; 1 ఫోర్, 2 సిక్స్‌లు), మ్యాక్స్‌వెల్ (5; 1 ఫోర్) తక్కువ స్కోరుకే వెనుదిరగ్గా.. కోహ్లి (37 బంతుల్లో 54; 6 ఫోర్లు), మహిపాల్ (18 బంతుల్లో 34; 1 ఫోర్, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడినా కీలకదశలో అవుటవ్వడంతో బెంగళూరుకు ఓటమి తప్పలేదు. కోల్‌కతా బౌలర్లు వరుణ్ చక్రవర్తి (3/27), సుయశ్ శర్మ (2/30), రసెల్ (2/29) బెంగళూరును దెబ్బ కొట్టారు.



జేసన్ రాయ్



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వరుణ్ చక్రవర్తి

ధనాధన్ ఆరంభం...

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతాకు ఓపెనర్లు జేసన్ రాయ్, జగదీశన్ మెరుపు ఆరంభాన్నిచ్చారు. సిరాజ్ వేసిన తొలి ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన రాయ్.. షహబాజ్ వేసిన ఆరో ఓవర్లో ఏకంగా నాలుగు సిక్స్‌లతో అలరించాడు. తొమ్మిది ఓవర్లకు 82/0తో దూసుకుపోతున్న కోల్‌కతాకు వైశాక్ బ్రేక్ వేశాడు. పదో ఓవర్లో జగదీశన్ (29 బంతుల్లో 27; 4 ఫోర్లు), జేసన్ రాయ్‌లను వైశాక్ అవుట్ చేశాడు.

రెండు క్యాచ్‌లు వదిలేసి...

ఒకే ఓవర్లో రెండు వికెట్లు కోల్పోయినా కోల్‌కతా అదే దూకుడు కొనసాగించింది. కోల్‌కతాకు బెంగళూరు ఫీల్డర్ల నిర్లక్ష్యం కూడా కలిసొచ్చింది. నితీశ్ రాణా వ్యక్తిగత స్కోరు 5 వద్ద సిరాజ్.. నితీశ్ రాణా వ్యక్తిగత స్కోరు 19 వద్ద హర్షల్ పటేల్ క్యాచ్‌లు జారవిడిచారు. ఈ రెండు అవకాశాలను సద్వినియోగం చేసుకున్న రాణా కదంతొక్కాడు. హర్షల్ పటేల్ వేసిన 16వ ఓవర్‌లోని చివరి రెండు బంతులను సిక్స్‌లుగా మలిచిన రాణా... వైశాక్ వేసిన 17వ ఓవర్‌లోని చివరి మూడు బంతుల్లో 4,4,6తో మెరిశాడు. 17 ఓవర్లు ముగిసేసరికి కోల్‌కతా 167/2తో నిలిచింది. అయితే 18వ ఓవర్లో హసరంగ స్పిన్‌కు నితీశ్ రాణా, వెంకటేశ్ అయ్యర్ (26 బంతుల్లో 31; 3 ఫోర్లు) పెవిలియన్ చేరారు. ఈ ఓవర్లో హసరంగ 3 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. అయితే సిరాజ్ వేసిన 19వ ఓవర్ తొలి మూడు బంతుల్లో రింకూ సింగ్ 6,4,4 కొట్టగా... ఐదో బంతికి రసెల్‌ను సిరాజ్ బౌల్డ్ చేశాడు. హర్షల్ పటేల్ వేసిన చివరి ఓవర్లో వీస్ రెండు సిక్స్‌లు కొట్టడంతో కోల్‌కతా స్కోరు 200కు చేరింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
చెన్నై	7	5	2	10	0.662
గుజరాత్	7	5	2	10	0.580
రాజస్తాన్	7	4	3	8	0.844
లక్నో	7	4	3	8	0.547
బెంగళూరు	8	4	4	8	-0.139
పంజాబ్	7	4	3	8	-0.162
కోల్‌కతా	8	3	5	6	-0.027
ముంబై	7	3	4	6	-0.620
హైదరాబాద్	7	2	5	4	-0.725
ఢిల్లీ	7	2	5	4	-0.961

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ x చెన్నై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: జేసన్ రాయ్ (బి) వైశాక్ 56; జగదీశన్ (సి) విల్లీ (బి) వైశాక్ 27; వెంకటేశ్ అయ్యర్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) హసరంగ 31; నితీశ్ రాణా (సి) వైశాక్ (బి) హసరంగ 48; రసెల్ (బి) సిరాజ్ 1; రింకూ సింగ్ (నాటౌట్) 18; డేవిడ్ వీస్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం** (20 ఓవర్లలో 5 వికెట్లకు) 200. **వికెట్ల పతనం:** 1–83, 2–88, 3–168, 4–169, 5–185. **బౌలింగ్:** సిరాజ్ 4–0–33–1, విల్లీ 3–0–31–0, హసరంగ 4–0–24–2, షహబాజ్ అహ్మద్ 1–0–25–0, వైశాక్ 4–0–41–2, హర్షల్ పటేల్ 4–0–44–0.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) వెంకటేశ్ అయ్యర్ (బి) రసెల్ 54; డుప్లెసిస్ (సి) రింకూ సింగ్ (బి) సుయశ్ శర్మ 17; షహబాజ్ అహ్మద్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సుయశ్ శర్మ 2; మ్యాక్స్‌వెల్ (సి) నితీశ్ రాణా (బి) వరుణ్ 5; మహిపాల్ (సి) రసెల్ (బి) వరుణ్ 34; దినేశ్ కార్తీక్ (సి) రింకూ సింగ్ (బి) వరుణ్ 22; ప్రభుదేశాయ్ (రనౌట్) 10; హసరంగ (సి) అనుకూల్ రాయ్ (సబ్) (బి) రసెల్ 5; విల్లీ (నాటౌట్) 11; వైశాక్ (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం** (20 ఓవర్లలో 8 వికెట్లకు) 179. **వికెట్ల పతనం:** 1–31, 2–51, 3–58, 4–113, 5–115, 6–137, 7–152, 8–154. **బౌలింగ్:** వైభవ్ అరోరా 2–0–22–0, ఉమేశ్ యాదవ్ 1–0–19–0, సుయశ్ శర్మ 4–0–30–2, వరుణ్ చక్రవర్తి 4–0–27–3, రసెల్ 4–0–29–2, సునీల్ నరైన్ 4–0–41–0, నితీశ్ రాణా 1–0–8–0.

మా 'మన్‌కీ బాత్' వినండి!

- ప్రధానికి రెజ్లర్ల విజ్ఞప్తి
- కొనసాగుతున్న నిరసన
- రోడ్డుపైనే ప్రాక్టీస్ ప్రారంభం

న్యూఢిల్లీ: తమకు న్యాయం చేయాలంటూ దేశ రాజధానిలో నిరసన కొనసాగిస్తున్న భారత రెజ్లర్లు ఇప్పుడు ఈ విషయంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. తాము విజయం సాధించినప్పుడు ఫోటోలు దిగి ఉత్సాహపరచిన ప్రధాని తమ గోడును పట్టించుకోకపోవడంపై వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రధాని రేడియో కార్యక్రమం 'మన్‌కీ బాత్' (మనసులో మాట)ను ఉద్దేశించి రెజ్లర్లు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ప్రధాని బేటీ బచావో, బేటీ పడావో గురించి మాట్లాడుతారు. అందరి మనసులో మాటను వింటారు. కానీ మా 'మన్‌కీ బాత్'ను ఆయన వినలేరా. మేం విజయాలు సాధించినప్పుడు ఇంటికి పిలిచి గౌరవించడంతో పాటు మమ్మల్ని తన బిడ్డలంటూ చెప్పుకున్నారు. ఈ రోజు మా బాధ వినాలని ఆయనను అభ్యర్థిస్తున్నాం' అని 2016 రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మలిక్ వ్యాఖ్యానించింది. నాలుగు రోజులుగా తాము రోడ్లపై పడుకుంటున్నా కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ కనీసం పట్టించుకోవడం లేదని సాక్షి విమర్శించింది. 'బహుశా నిజం ఏమిటో ప్రధానికి తెలియకపోవచ్చు. అందుకే వ్యక్తిగతంగా కలిసి సమస్యను చెప్పాలని కోరుకుంటున్నాం. అయితే ఆయనను కలిసే మార్గం ఏమిటో మాకు తెలియడం లేదు' అని వినేశ్ ఫొగాట్ చెప్పింది. నిరసన కొనసాగిస్తున్న రెజ్లర్లు బుధవారం రోడ్డుపైనే తమ ప్రాక్టీస్‌ను ప్రారంభించారు. కోచ్ సుజీత్ మాన్ నేతృత్వంలో అక్కడే సాధన చేసిన వారు... తమకు మరో గత్యంతరం లేదని పేర్కొన్నారు. మరోవైపు బీజింగ్ ఒలింపిక్స్ స్వర్ణపతక విజేత, షూటర్ అభినవ్ బింద్రా సోషల్ మీడియా ద్వారా రెజ్లర్లకు తన మద్దతు ప్రకటించాడు. దేశానికే ప్రాతినిధ్యం వహించేందుకు ఎంతో కష్టపడే ఆటగాళ్లు ఇలా రోడ్లపై రావాల్సి రావడం చాలా బాధగా ఉందని అతను అన్నాడు.



బజరంగ్ పూనియా, సంగీత ఫొగాట్, వినేశ్ ఫొగాట్

శ్రీలంక దీటైన జవాబు

కరుణరత్నే, మదుష్కా సెంచరీలు

గాలె: ఐర్లాండ్ జట్టుతో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక జట్టు దీటైన జవాబు ఇచ్చింది. వర్షం కారణంగా మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 77 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 357 పరుగులు సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 81/0 ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక 59 ఓవర్లలో 276 పరుగులు చేసింది. ఓపెనర్లు దిముత్ కరుణరత్నే (133 బంతుల్లో 115; 15 ఫోర్లు), నిషాన్ మదుష్కా (234 బంతుల్లో 149 బ్యాటింగ్; 18 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో కదంతొక్కారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 228 పరుగులు జోడించారు. నిషాన్‌తో కలిసి ప్రస్తుతం కుశాల్ మెండిస్ (96 బంతుల్లో 83 బ్యాటింగ్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) క్రీజులో ఉన్నాడు. ఐర్లాండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 492కు శ్రీలంక మరో 135 పరుగుల దూరంలో ఉంది.



సింధు శుభారంభం

- శ్రీకాంత్, ప్రణయ్ కూడా ముందంజ
- తొలి రౌండ్‌లోనే లక్ష్య సేన్ ఓటమి

దుబాయ్: స్వర్ణ పతకమే లక్ష్యంగా ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 11వ ర్యాంకర్ సింధు 21–15, 22–20తో ప్రపంచ 17వ ర్యాంకర్ వెన్ చి సు (చైనీస్ తైపీ)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. 46 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో సింధు 11–14తో వెనుకబడింది. ఈ దశలో సింధు ఒక్కసారిగా చెలరేగి వరుసగా తొమ్మిది పాయింట్లు గెలిచి 20–14తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఒక పాయింట్ కోల్పోయిన సింధు వెంటనే మరో పాయింట్ నెగ్గి గేమ్ దక్కించుకుంది. రెండో గేమ్ హోరాహోరీగా సాగినా కీలకదశలో సింధు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో తొమ్మిదో ర్యాంకర్ హాన్ యువె (చైనా)తో సింధు ఆడుతుంది.

పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కిడాంబి శ్రీకాంత్ 21–13, 21–8తో అద్నాన్ ఇబ్రహీం (బహ్రెయిన్)పై, ప్రణయ్ 21–14, 21–9తో ఫోన్ ప్యాయె నైంగ్ (మయన్మార్)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరారు. లక్ష్య సేన్ 7–21, 21–23తో లో కీన్ యెవ్ (సింగపూర్) చేతిలో ఓటమి చవిచూశాడు.



సిక్కి–రోహన్ జోడీ విజయం

మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్) జోడీ 21–12, 21–16తో చాన్ పెంగ్ సూన్–చె యి సీ (మలేసియా) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) ద్వయం 17–21, 21–17, 21–18తో లానీ ట్రియ మాయసరి–రిబ్కా సుగియార్తో (ఇండోనేసియా) జోడీపై నెగ్గింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం 21–14, 21–17తో టాన్ కియాన్ మెంగ్–టాన్ వీ కియాంగ్ (మలేసియా) జోడీపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

సినిమా


ఎన్టీఆర్‌తో సినిమా చేయాలనుంది

- దర్శకుడు జేమ్స్ గన్

'ఆర్ఆర్ఆర్' సినిమా ఆస్కార్ అవార్డు సాధించిన నేపథ్యంలో హాలీవుడ్‌వారి దృష్టి ముఖ్యంగా ఈ చిత్రంలో నటించిన ఎన్టీఆర్, రామ్‌చరణ్‌పై పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్‌తో ఓ సినిమా చేయాలని ఉందని హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు ('గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ' ఫ్రాంచైజీ ఫేమ్) జేమ్స్ గన్ పేర్కొన్నారు ''మీ 'గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ' తదుపరి భాగాల్లోకి ఏ ఇండియన్ యాక్టర్‌ని ఆహ్వానించాలనుకుంటున్నారు? అన్న ప్రశ్నకు సమాధానంగా ఎన్టీఆర్ పేరును ప్రస్తావించారు జేమ్స్. ''ఆర్ఆర్ఆర్'లో ఎన్టీఆర్ నటన బాగుంది. ముఖ్యంగా ఇంట్రవెల్ సీన్‌లో తన నటన అద్భుతం'' అన్నారు జేమ్స్. మరి... ఈ హాలీవుడ్ దర్శకుడు, టాలీవుడ్ హీరో కాంబినేషన్‌లో సినిమా సెట్టవుతుందా అంటే... కాలమే చెప్పాలి.



● ఎన్టీఆర్



● జేమ్స్ గన్

మర్డర్ మిస్టరీ

కార్తీక్ రత్నం, గోల్డీ నిస్సీ జంటగా, రవిబాబు, సత్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఛాంగురే బంగారు రాజా'. సతీష్ వర్మ దర్శకుడు. హీరో రవితేజ ఆర్ టీ టీమ్‌వర్క్స్, ఫ్రేమ్ బై ఫ్రేమ్ పిక్చర్స్ పతాకాలపై శ్వేత కాకర్లపూడి, షాలిని నంబు ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్స్‌గా వర్క్ చేశారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా టీజర్‌ను బుధవారం రవితేజ విడుదల చేశారు. సునీల్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమయ్యే ఈ టీజర్‌లో 'నా చేతిలో డబ్బులు పడితే కానీ మీ జీపుపై నేను చేతులు పెట్టను', 'ఆ మర్డర్ చేసింది నేను కాదు' అనే డైలాగ్స్ ఉన్నాయి. ఓ కుక్క, ముగ్గురు వ్యక్తులు ఓ హత్య కేసును చేధించడంలో ఎలా భాగస్వామ్యులయ్యారు? అసలు హంతకుడు ఎవరు? అనే అంశాల నేపథ్యంలో ఈ సినిమా టీజర్ సాగుతుంది. ఈ సినిమాకు సంగీతం: కృష్ణ సౌరభ్, కెమెరా: సుందర్ ఎన్‌సి.



● కార్తీక్ రామ్, గోల్డీ, రవితేజ



● సమంత

ఆస్కార్ నైన్టీసిక్స్‌కి డేట్ ఫిక్స్

95వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరిగి నెలన్నర (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 13) అవుతోంది. అప్పుడే 96వ ఆస్కార్ అవార్డులకు సంబంధించిన ప్లాన్ మొదలుపెట్టింది కమిటీ. వచ్చే ఏడాది మార్చి 10న ఆస్కార్ వేడుక జరపనున్నట్లు ప్రకటించి, ఇందుకు సంబంధించిన కొన్ని కీలకమైన తేదీలను కూడా వెల్లడించారు నిర్వాహకులు. 96వ ఆస్కార్ అవార్డుల షార్ట్ లిస్ట్‌ను ఈ ఏడాది డిసెంబరు 21న ప్రకటిస్తారు. నామినేషన్స్‌ను వచ్చే ఏడాది జనవరి 23న వెల్లడిస్తారు. ఆస్కార్ విజేతల ఎంపికకు ఫిబ్రవరి 22న ఓటింగ్ ఆరంభించి, 27 వరకూ కొనసాగిస్తారు. అవార్డుల ప్రదానోత్సవం మార్చి 10న జరుగుతుంది. ఇక జనరల్ ఎంట్రీ కేటగిరీలో అవార్డుల దరఖాస్తుల స్వీకరణకు నవంబరు 15 చివరి తేదీగా పేర్కొంది కమిటీ. మొత్తం 23 విభాగాల్లో ఆస్కార్ అవార్డులను అందిస్తారు.



పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

- గోపీచంద్



● వివేక్ కూచిభొట్ల, గోపీచంద్, డింపుల్ హయతి, శ్రీవాస్

''శ్రీవాస్‌గారితో 'లక్ష్యం, లౌక్యం' సినిమాలు చేశాను. మూడో సినిమాగా 'రామబాణం' చేద్దామనుకున్నప్పుడు ఆ రెండు సినిమాల్లా పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చేయాలనుకున్నాం. అలాగే చేశాం. 'రామబాణం' వంటి మంచి సినిమా తీసిన విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్లగార్లకు థ్యాంక్స్. అందరికీ మా సినిమా తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అని హీరో గోపీచంద్ అన్నారు. శ్రీవాస్ దర్శకత్వంలో గోపీచంద్, డింపుల్ హయతి జంటగా నటించిన చిత్రం 'రామబాణం'. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా మే 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో శ్రీవాస్ మాట్లాడుతూ– ''రామబాణం' ఔట్‌పుట్ చూశాక నమ్మకంగా ఉన్నాం. ఇంటర్వెల్, క్లయిమాక్స్ హైలెట్ అవుతాయి. సెకండ్ హాఫ్‌లోని భావోద్వేగ సన్నివేశాలు కుటుంబ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతాయి'' అన్నారు. ''ఈ వేసవిలో ప్రతి ఫ్యామిలీ చూడదగ్గ సినిమా ఇది'' అన్నారు సహనిర్మాత వివేక్ కూచిభొట్ల.

ముప్పై ఏళ్లు వెనక్కి...

విశ్వక్ సేన్ హీరోగా నటించనున్న కొత్త చిత్రం బుధవారం ఆరంభమైంది. తొలి సీన్‌కి నిర్మాత సుధాకర్ చెరుకూరి కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత 'దిల్' రాజు క్లాప్ ఇచ్చారు. నిర్మాత వెంకట్ బోయనపల్లి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకులు వెంకీ అట్లూరి, నిర్మాత రామ్ ఆచంట స్క్రిప్ట్‌ను చిత్ర యూనిట్‌కు అందించారు. కృష్ణచైతన్య దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న చిత్రం ఇది. ''1990వ దశకంలో రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో జరిగిన కథతో ఈ చిత్రం ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా, కెమెరా: అనిత్ మధాది.



● విశ్వక్ సేన్, 'దిల్' రాజు

సమంతపై అభిమానంతో...

అభిమాన తారల కోసం కొందరు ఫ్యాన్స్ గుడి కూడా కట్టేస్తారు. అలా ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా చుండూరు మండలం ఆలపాడుకు చెందిన సమంత ఫ్యాన్ సందీప్ ఆమె కోసం గుడి కడుతున్నారు. ప్రత్యూష ఫౌండేషన్ ద్వారా చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్స్ చేయిస్తూ, ఆ చిన్నారులకు పునర్జన్మను ప్రసాదించేందుకు సమంత చూపిన చొరవే తన అభిమానానికి కారణమన్నట్లుగా సందీప్ పేర్కొన్నారు. అలాగే సమంత మయోసైటిస్ వ్యాధి నుంచి కోలుకోవాలని తిరుపతి, నాగపట్నం, చెన్నైలకు మొక్కుబడి యాత్రలు చేశారట సందీప్. ఈ నెల 28న సమంత బర్త్ డే సందర్భంగా ఈ గుడిని ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారని సమాచారం.



● సమంత విగ్రహం

డైరెక్షన్ ఆలోచన ఉంది

- నిర్మాత అనిల్ సుంకర

''ఏజెంట్' ఒక యాక్షన్ ఫిల్మ్. ముగ్గురు ఏజెంట్స్ మధ్య జరిగే కథ ఇది. కథ భిన్నంగా ఉంటుంది. భావోద్వేగాలు కూడా బలంగా ఉంటాయి. అఖిల్ కెరీర్‌లో 'ఏజెంట్'కి ముందు, 'ఏజెంట్'కి తర్వాత అనేలా ఉంటుంది. విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉంటాయి. ప్రేక్షకులకు గొప్ప అనుభూతి ఇచ్చే చిత్రం ఇది'' అని నిర్మాత అనిల్ సుంకర అన్నారు. అఖిల్ అక్కినేని, సాక్షీ వైద్య జంటగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఏజెంట్'. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, సురేందర్ 2 సినిమా పతాకాలపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా అనిల్ సుంకర మాట్లాడుతూ– ''ఇప్పుడు యంగ్ హీరోలు డూప్ లేకుండా చేయడానికి ఇష్టపడుతున్నారు. అయితే ఒక నిర్మాతగా సేఫ్టీ చూసుకోమని యాక్షన్ కొరియోగ్రాఫర్‌కి చెప్తాను. ఈ మధ్య విజయవాడలో జరిగిన ప్రమోషనల్ ఈవెంట్‌లో అఖిల్ దాదాపు 170 అడుగుల ఎత్తు నుంచి దూకాడు. రోప్స్ కట్టినప్పటికీ రిస్క్ ఎందుకని నేను వద్దన్నాను. అయితే అఖిల్ చేస్తానన్నాడు. క్రెడిట్ అంతా తనకే దక్కుతుంది. 'ఏజెంట్'లో ప్రేక్షకులు ఇలాంటి సాహసాలు చాలా చూస్తారు. ఇది భారీ స్పాన్ ఉన్న సినిమా. ఇందులో గంటన్నర కంప్యూటర్ గ్రాఫిక్స్ ఉంటాయి. అందుకే చాలా సమయం పట్టింది. 'ఏజెంట్'ని ముందు తెలుగులో రిలీజ్ చేసి, రెండో వారం నుంచి ఇతర భాషల్లో విడుదల చేసే ఆలోచనలో ఉన్నాం. హిందీలో ఇప్పటికే డబ్బింగ్ పూర్తయింది. నాకు దర్శకత్వం చేసే ఆలోచన ఉంది. నా డైరెక్షన్‌లో స్పై జోనర్‌లో సినిమా ఉంటుంది. మా 14 రీల్స్ బ్యానర్‌లో ఈ ఏడాది బిగ్గెస్ట్ అనౌన్స్‌మెంట్స్ ఉంటాయి. ప్రస్తుతం చిరంజీవిగారితో నిర్మిస్తున్న 'భోళా శంకర్' సినిమా యాక్షన్ సీన్స్ జరుగుతున్నాయి. ఆగస్ట్ 11న ఈ సినిమా విడుదలకి డేట్ ఫిక్స్ చేశాం'' అన్నారు.



నిర్మాతలను మించిన నటులు లేరు

- బెక్కెం వేణుగోపాల్

''ప్రస్తుతం తెలుగులో కథ కంటే కాంబినేషన్‌ని నమ్ముకుని ఎక్కువగా సినిమాలు చేస్తున్నారు నిర్మాతలు. దానివల్ల సినిమా సూపర్ హిట్టయినా లాభాలు రావడం లేదు. కాంబినేషన్‌ని నమ్ముకుని పారితోషికాలు పెంచడం వల్ల బడ్జెట్ ఊహించని స్థాయికి చేరుకుంటోంది'' అన్నారు నిర్మాత బెక్కెం వేణుగోపాల్. నేడు బెక్కెం వేణుగోపాల్ బర్త్ డే. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ– ''2006 అక్టోబర్ 12న నిర్మాతగా నా తొలి చిత్రం 'టాటా బిర్లా మధ్యలో లైలా' విడుదలైంది. మొదటి చిత్రంతోనే హిట్ అందుకున్నాను. ఈ 16 ఏళ్లల్లో సొంతంగా 12 సినిమాలు, వేరే బ్యానర్లతో కలిసి 4 సినిమాలు నిర్మించాను. స్టార్ హీరోలతో, భారీ బడ్జెట్ సినిమాలు తీసేందుకు రెండు కథలు సిద్ధంగా ఉన్నాయి. ఇక నిర్మాతలను మించిన నటులు ఎవరూ ఉండరు. అప్పుడప్పుడు లోపల అగ్నిపర్వతం బద్దలవుతున్నా బయటికి మాత్రం శాంతంగా ఉండాల్సిన పరిస్థితి. భవిష్యత్‌లో చిన్న చిన్న పాత్రల్లో నటించాలనుంది. కానీ, దర్శకత్వ ఆలోచన లేదు. ప్రస్తుతం కొత్తవాళ్లతో 'రోటి కపడా రొమాన్స్', సుడిగాలి సుధీర్‌తో నరేష్ దర్శకత్వంలో నిర్మాత చంద్రశేఖర్ రెడ్డితో కలిసి మరో మూవీ చేస్తున్నాను. అవికా గోర్ ప్రధాన పాత్రలో స్వరూప్ దర్శకత్వంలో ఓటీటీ కోసం ఓ మూవీ నిర్మిస్తున్నాను'' అన్నారు.



మంచి ప్రేమకథ

రోషన్ .జెడ్, ముస్తఫా అస్కరి, శ్రీనివాస్ ప్రభన్, అనిరుధ్ .టి, లయ, ఇందు, శ్రీవల్లి, విజయ, సాయిశ్రీ, జబర్దస్త్ సత్తిపండు కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'అరంగేట్రం'. శ్రీనివాస్ ప్రభన్ దర్శకత్వంలో మహేశ్వరి .కె నిర్మించిన ఈ సినిమా మే 5న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకలో శ్రీనివాస్ ప్రభన్ మాట్లాడుతూ– ''పక్కా కమర్షియల్ మూవీ 'అరంగేట్రం'. సైకో, ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్‌తో పాటు మంచి ప్రేమ కథ ఉంటుంది. ఆరుగురు అమ్మాయిలు, ముగ్గురు అబ్బాయిల మధ్య ప్రధానంగా సాగే సినిమా ఇది'' అన్నారు. ''మా 'అరంగేట్రం' చాలా బాగా వచ్చింది'' అన్నారు మహేశ్వరి. ''మంచి కాన్సెప్ట్‌తో ఈ సినిమాను నిర్మించాం'' అన్నారు సహనిర్మాత విజయలక్ష్మి.



● విజయలక్ష్మి, మహేశ్వరి, రోషన్, శ్రీనివాస్ ప్రభన్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు			విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			బులియన్ రూ.లలో ముంబై		
సెన్సెక్స్ ▲ 170 60,301	నిఫ్టీ ▲ 44 17,814		నాస్‌డాక్	11,917	▲ 118	బంగారం (24 క్యారెట్)	60,431	▲ 353
			డోజోన్స్	33,475	▽ 56	బంగారం (22 క్యారెట్)	60,189	▲ 352
			ఎఫ్‌టీఎస్ఈ 100	7,853	▽ 38	వెండి (కిలో)	74,200	▲ 125
			డాక్స్	15,796	▽ 76			
			షాంఘై	3,264	▽ 1			
			నికాయ్	28,416	▽ 204			

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

మారుతీ లాభం జూమ్

- క్యూ4లో రూ. 2,671 కోట్లు; 42 శాతం హైజంప్
- అమ్మకాలు: రూ. 32,060 కోట్లు
- షేరుకి రికార్డ్ డివిడెండ్ రూ. 90

న్యూఢిల్లీ: కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 42 శాతం జంప్‌చేసి రూ. 2,671 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది (2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 1,876 కోట్లు ఆర్జించింది. వాహన అమ్మకాలతోపాటు, ధరలు మెరుగుపడటం, ఫారెక్స్ సానుకూలతలు అధిక లాభాలకు దోహదం చేశాయి. మొత్తం అమ్మకాలు సైతం రూ. 26,749 కోట్ల నుంచి రూ. 32,060 కోట్లకు ఎగశాయి. కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా ఒక్కో షేరుకీ రూ. 90 చొప్పున వాటాదారులకు డివిడెండును ప్రకటించింది. క్యూ4లో 5 శాతంపైగా వృద్ధితో 5,14,927 వాహనాలను విక్రయించింది. వీటిలో దేశీయంగా 4,50,208 యూనిట్లు విక్రయించింది. ఇది 7 శాతం వృద్ధి. అయితే ఎగుమతులు 68,454 యూనిట్ల నుంచి 64,719కు తగ్గాయి.

పూర్తి ఏడాదిలోనూ..

మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి మారుతీ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 8,211 కోట్లకు దూసుకెళ్లింది. 2021–22లో రూ. 3,879 కోట్లు మాత్రమే ఆర్జించింది. నికర అమ్మకాలు రూ. 88,330 కోట్ల నుంచి రూ. 1,17,571 కోట్లకు జంప్ చేశాయి. ఈ కాలంలో 19 శాతం అధికంగా 19,66,164 వాహనాలను విక్రయించింది.



ఫలితాల నేపథ్యంలో మారుతీ షేరు స్వల్ప లాభంతో రూ. 8,503వద్ద ముగిసింది.

కొత్త ప్లాంట్‌కు ఓకే...

ఎగుమతులతో సహా దేశీ మార్కెట్లో డిమాండుకు అనుగుణంగా ఏడాదికి 10 లక్షల కార్ల వరకూ తయారు చేయగల అదనపు ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు మారుతీ తెలియజేసింది. ఇందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించింది. ప్రస్తుత ఏడాది (2023–24)లో రూ. 8,000 కోట్ల పెట్టుబడులను వెచ్చించనున్నట్లు పేర్కొంది. గతేడాది రూ. 6,300 కోట్లు కేటాయించింది. కంపెనీ చేతిలో మార్చికల్లా రూ. 45,000 కోట్ల నగదు నిల్వలున్నాయి. హర్యానాలోని సోనిపట్‌లో రూ. 11,000 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేస్తున్న 2.5 లక్షల యూనిట్ల (తొలిదశ) వార్షిక సామర్థ్య ప్లాంటు 2025లో ప్రారంభంకావచ్చని మారుతీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ పేర్కొన్నారు.

రూ.8 లక్షలకే ఎలక్ట్రిక్ కారు!

భారత మార్కెట్లో ఎంజీ కామెట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ ఎంజీ మోటార్ ఇండియా దేశీయ మార్కెట్లో చౌకైన ఎలక్ట్రిక్ వెహికిల్ కామెట్‌ను ప్రవేశపెట్టింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.7.98 లక్షలు. ఒకసారి చార్జింగ్‌తో 230 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. 17.3 కిలోవాట్ అవర్ లిథియం అయాన్ బ్యాటరీ పొందుపరిచారు. ఏడు గంటల్లో చార్జింగ్ పూర్తి అవుతుంది. రెండు డోర్లు, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్, రెండు ఎయిర్‌బ్యాగ్స్, రివర్స్ పార్కింగ్ కెమెరా వంటి హంగులు ఉన్నాయి. ఎలక్ట్రిక్ విభాగంలో ఎంజీ ఇప్పటికే భారత్‌లో జడ్‌ఎస్ ఈవీ మోడల్‌ను విక్రయిస్తోంది. గుజరాత్‌లోని హలోల్ ప్లాంటులో కామెట్ కార్లను తయారు చేస్తున్నారు.



ద్రవరూప డీఏపీ, యూరియా వాడండి

- ఖర్చు తక్కువ, దిగుబడి ఎక్కువ
- రైతులకు కేంద్ర మంత్రి అమిత్‌షా సూచన
- వాణిజ్య విక్రయాలు ప్రారంభం

న్యూఢిల్లీ: రైతులు సాగులో ద్రవరూప నానో డీఏపీ, యూరియాను వినియోగించాలని కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్‌షా సూచించారు. ఈ ఉత్పత్తులను విరివిగా ఉపయోగించడం ద్వారా ఎరువుల తయారీలో దేశాన్ని స్వావలంబన భారత్‌గా మార్చాలని రైతులకు పిలుపునిచ్చారు. దీని వల్ల దిగుమతులపై ఆధారపడడం తగ్గుతుందన్నారు. ఇఫ్కో నానో (ద్రవరూప) డీఏపీ వాణిజ్య విక్రయాలను మంత్రి బుధవారం ఢిల్లీలో ప్రారంభించి, మాట్లాడారు. ఇఫ్కో ద్రవరూప నానో డీఏపీ 500 ఎంఎల్ బాటిల్‌ను రూ.600కు విక్రయించనున్నారు. అదే సంప్రదాయ 50 కిలోల డీఏపీ బస్తా ధర రూ.1,350గా ఉంది. సాగులో ద్రవరూప ఉత్పత్తులను వినియోగించడం వల్ల నాణ్యతతోపాటు దిగుబడి కూడా పెరుగుతుందని మంత్రి అమిత్‌షా అన్నారు. భూసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. ద్రవరూప డీఏపీతో సాగు ఖర్చులు 6 శాతం నుంచి 20 శాతం వరకు తగ్గుతాయని చెప్పారు. అలాగే ద్రవరూప ఎరువుల రవాణా, నిల్వ కూడా సులభం. ద్రవరూప ఎరువులు భారత్‌ను స్వావలంబన దిశగా నడిపిస్తాయన్నారు. 2021–22లో 91.36 లక్షల టన్నుల యూరియా, 54.62 లక్షల టన్నుల డీఏపీ, 24.60 లక్షల టన్నుల ఎంవోపీ, 11.70 లక్షల టన్నుల ఎన్‌పీకే ఎరువులను దిగుమతి చేసుకున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇఫ్కో తయారు చేసిన నానో డీఏపీకి 20 ఏళ్ల కాలానికి పేటెంట్ వచ్చినట్టు మంత్రి అమిత్‌షా తెలిపారు.


నానో డీఏపీని విడుదల చేస్తున్న అమిత్‌షా

ప్రపంచ వ్యాప్తంగా జోస్ అలుక్కాస్ భారీ విస్తరణ

100 కొత్త షోరూమ్‌ల ఏర్పాటు లక్ష్యం



హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ రిటైల్ చైన్ జోస్ అలుక్కాస్ రూ.5,500 కోట్లతో ప్రపంచ వ్యాప్తంగా భారీ విస్తరణ ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. ప్రపంచ వ్యాప్తంగా 100 కొత్త షోరూమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. దేశంలోని ఒక జ్యువెల్లరీ రిటైల్ బ్రాండ్ రానున్న 8 సంవత్సరాల్లో చేపడుతున్న భారీ విస్తరణ కార్యక్రమం ఇదని వివరించింది. నిధులు, రియల్టీ సమకూరితే 4 సంవత్సరాల్లోనే తమ విస్తరణ కార్యక్రమం పూర్తవుతుందని వివరించింది. సంస్థ విస్తరణ ప్రణాళికకు సంబంధించి చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో జోస్ అలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు జాన్ అలుక్కా, వర్గీస్ అలుక్కా, చైర్మన్ జోస్ అలుక్కా, నటుడు ఆర్ మాధవన్, కంపెనీ ఎండీ పాల్ అలుక్కా పాల్గొన్నారు. (చిత్రంలో ఎడమ నుంచి). ప్రస్తుతం 50 స్టోర్లను కలిగిన జ్యువెల్లరీ గ్రూప్ గ్లోబల్ అంబాసిడర్‌గా నటుడు మాధవన్ ఉన్నారు. నటి కీర్తి సురేశ్‌ను కూడా సంస్థ ప్రచారకర్తగా నియమించుకుంది.

5 ఏళ్లు.. 50 బిలియన్ డాలర్లు!

- వైద్య పరికరాల రంగానికి ప్రత్యేక విధానం
- నేషనల్ మెడికల్ డివైజెస్ పాలసీ 2023కి కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- దేశీయంగా తయారీకి మరింత ఊతం

న్యూఢిల్లీ: వైద్య రంగంలో ఉపయోగించే పరికరాల కోసం దిగుమతులపై ఆధారపడకుండా దేశీయంగానే తయారీకి ఊతమివ్వడంపై కేంద్రం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా నేషనల్ మెడికల్ డివైజెస్ పాలసీ 2023కి కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసింది. వైద్య పరికరాల రంగం వచ్చే అయిదేళ్లలో 50 బిలియన్ డాలర్ల స్థాయికి (దాదాపు రూ. 4.1 లక్షల కోట్లు) చేరేందుకు ఇది తోడ్పడనుంది. భారత్‌లో వైద్య పరికరాలకు డిమాండ్ గణనీయంగా పెరుగుతుండటంతో వీటిని దేశీయంగానే ఉత్పత్తి చేయడాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని క్యాబినెట్ సమావేశం అనంతరం కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మీడియాకు తెలిపారు. ప్రపంచీకరణ నేపథ్యంలో దిగుమతులు కూడా ఉంటాయని, అయితే సాధ్యమైనంత మేరకు స్థానిక అవసరాలకు అనుగుణంగా దేశీయంగానే ఉత్పత్తిని పెంచుకోవడమే కొత్త విధానం లక్ష్యమని వివరించారు.



ఆరు వ్యూహాలు..: నేషనల్ మెడికల్ డివైజెస్ పాలసీలో ఆరు వ్యూహాలను నిర్దేశించుకున్నారు. నియంత్రణ విధానాలను క్రమబద్ధీకరించడం, మౌలిక సదుపాయాల కల్పన, పరిశోధన.. అభివృద్ధి.. ఆవిష్కరణలకు తోడ్పాటు అందించడం, పరిశ్రమలోకి పెట్టుబడులను ఆకర్షించడం, మానవ వనరుల అభివృద్ధి, మన పరిశ్రమకు బ్రాండింగ్ సాధించడం .. అవగాహన కల్పించడం వంటివి ఈ వ్యూహాల్లో ఉన్నాయి. ఇటు భారత్, అటు ప్రపంచ హెల్త్‌కేర్ అవసరాలను తీర్చే దిశగా దేశీయంగా వైద్య పరికరాల రంగం స్వయం సమృద్ధి సాధించేలా, ఒడుదుడుకులను సమర్థంగా ఎదుర్కొంటూ పటిష్టమైన పరిశ్రమగా ఎదిగేలా అవసరమైన మద్దతు కల్పించి, దిశా నిర్దేశం చేసేందుకు ఈ పాలసీ ఉపయోగపడనుంది. ప్రధానంగా పేషంట్లను దృష్టిలో ఉంచుకుని, వారి అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తులను తయారు చేస్తూ వైద్య పరికరాల రంగం వేగవంతంగా వృద్ధి చెందేలా ఊతమివ్వాలని ఇందులో నిర్దేశించుకున్నారు.

11 బిలియన్ డాలర్ల పరిశ్రమ..

దేశీయంగా వైద్య పరికరాల మార్కెట్ 2020లో 11 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 90,000 కోట్లు) స్థాయిలో ఉందని అంచనా. అంతర్జాతీయంగా మెడికల్ డివైజ్‌ల మార్కెట్లో మన వాటా దాదాపు 1.5% వైద్య పరికరాల్లో స్వయం సమృద్ధి సాధించే దిశగా కేంద్రం ఇప్పటికే ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్‌ఐ) పథకాన్ని అమలు చేస్తోంది. హిమాచల్ ప్రదేశ్, మధ్య ప్రదేశ్, తమిళనాడు, ఉత్తర్ ప్రదేశ్‌లో 4 మెడికల్ డివైజ్ పార్కుల ఏర్పాటు కోసం తోడ్పాటు అందిస్తోంది. ఈ స్కీము కింద ఇప్పటివరకు రూ. 1,206 కోట్ల విలువ చేసే పెట్టుబడులతో 26 ప్రాజెక్టులు ఆమోదం పొందాయి. 37 ఉత్పత్తులను తయారు చేసే 14 ప్రాజెక్టులు ప్రారంభమైనట్లు వివరించింది. వీటిలో లీనియర్ యాక్సిలరేటర్, ఎంఆర్‌ఐ స్కాన్, సీటీ–స్కాన్, మామోగ్రామ్, సీ–ఆర్మ్, ఎంఆర్‌ఐ కాయిల్స్, అధునాతన ఎక్స్–రే ట్యూబ్స్ మొదలైనవి ఉత్పత్తి చేస్తున్నారు.

మార్కెట్లు మళ్లీ ముందుకే..

- మూడో రోజూ కొనుగోళ్ల హవా
- సెన్సెక్స్ 170 పాయింట్లు అప్

ముంబై: దేశీ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు లాభపడ్డాయి. అయితే మరోసారి నేలచూపులతో మొదలైనప్పటికీ వెనువెంటనే పరుగందుకున్నాయి. ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 170 పాయింట్లు జమ చేసుకుని 60,301 వద్ద నిలిచింది. నిఫ్టీ 44 పాయింట్లు ఎగసి 17,814 వద్ద స్థిరపడింది. రెండు రోజులుగా ఇన్వెస్టర్లను ఆకట్టుకుంటున్న బ్యాంక్ కౌంటర్లకు డిమాండ్ కొనసాగింది. క్యూ4(జనవరి–మార్చి)లో ఎఫ్ఎంసీజీ, ఐటీ, బ్యాంకింగ్ తదితర రంగాల దిగ్గజాలు ప్రోత్సాహకర ఫలితాలు ప్రకటిస్తుండటంతో సెంటిమెంటు బలపడినట్లు మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. దీంతో గురువారం ఏప్రిల్ డెరివేటివ్ సిరీస్ ముగియనున్నప్పటికీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ఆసక్తి చూపుతున్నట్లు తెలియజేశారు. ఇంట్రాడేలో సెన్సెక్స్ 59,955 వద్ద కనిష్టాన్ని, 60,363 వద్ద గరిష్టాన్ని తాకింది. ఈ బాటలో నిఫ్టీ 17,711–17,828 పాయింట్ల మధ్య ఆటుపోట్లకు లోనయ్యింది. ఇటీవల విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలకే ప్రాధాన్యత ఇవ్వడం, ఏప్రిల్ ఎఫ్అండ్‌వో కాంట్రాక్టుల గడువు తీరనుండటం వంటి అంశాలు మార్కెట్లను కొంతమేర ఊగిసలాటకు గురిచేస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.



రూపాయి 21 పైసలు అప్

డాలర్ మారకంలో రూపాయి మారకపు విలువ బుధవారం 21 పైసలు బలపడి 81.74కు బలపడింది. విదేశీ మార్కెట్‌లో అమెరికా కరెన్సీ బలహీనత, ఆసియన్ కరెన్సీల లాభదాయకత దీనికి కారణం.

మెటల్ డౌన్...

ఎన్ఎస్ఈలో రియల్టీ, ఎఫ్ఎంసీజీ, ఆటో, ప్రభుత్వ, ప్రయివేట్ బ్యాంక్స్ 1.4–0.5% మధ్య బలపడగా.. మెటల్ 0.5% తగ్గింది. నిఫ్టీలో పవర్ గ్రిడ్, టాటా కన్జూమర్, నెస్లే, ఇండస్‌ఇండ్, ఎస్‌బీఐ లైఫ్, ఎల్అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌యూఎల్, ఎస్‌బీఐ, యాక్సిస్, టాటా మోటార్స్, ఐషర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, ఎంఅండ్ఎం 2.6–0.5% లాభపడ్డాయి. అయితే హిందాల్కో, అదానీ పోర్ట్స్, బజాజ్ ఆటో, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్‌టీపీసీ, ఆర్‌ఐఎల్, దివీస్ 1.2–0.5 శాతం మధ్య క్షీణించాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

బార్క్, ముంబైలో 4374 పోస్టులు

ముంబై ట్రాంబేలోని భారత అణుశక్తి విభాగానికి చెందిన బాబా అణు పరిశోధనా కేంద్రం(బార్క్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్/ట్రెనింగ్ స్కీమ్ ద్వారా డీఏఈ విభాగాల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 4374

ఖాళీల వివరాలు

» డైరెక్ట్ రిక్రూట్‌మెంట్: టెక్నికల్ ఆఫీసర్/సి–181, సైంటిఫిక్ అసిస్టెంట్/బి–07, టెక్నీషియన్/బి–24.
» ప్రారంభ వేతనం: నెలకు టీవో ఖాళీలకు రూ.56,100, ఎస్ఏకు రూ.35,400, టెక్నీషియన్ పోస్టులకు రూ.21,700 చెల్లిస్తారు.
» ట్రెనింగ్ స్కీమ్(స్టైపెండరీ ట్రెనీ): 4162(కేటగిరీ 1–1216, కేటగిరీ2–2946)
» స్టైపెండ్: నెలకు కేటగిరీ1కు రూ.24,000 నుంచి రూ.26,000, కేటగిరీ 2కు రూ.20,000 నుంచి రూ.22,000 వరకు ఉంటుంది.
» విభాగాలు: బయోసైన్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఆర్కిటెక్చర్, కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, డ్రిల్లింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్,మెకానికల్, మెటలర్జీ, మైనింగ్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, ఐటీఐ, డిప్లొమా, బీఈ, బీటెక్, బీఎస్సీ, ఎంఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 22.05.2023 నాటికి టెక్నికల్ ఆఫీసర్‌కు 18–35 ఏళ్లు, సైంటిఫిక్ అసిస్టెంట్‌కు 18–30 ఏళ్లు, టెక్నీషియన్‌కు 18–25 ఏళ్లు, స్టైపెండరీ ట్రెనీ కేటగిరీ1కు 19–24 ఏళ్లు, స్టైపెండరీ ట్రెనీ కేటగిరీ2కు 18–22 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: పోస్టును అనుసరించి ప్రిలిమినరీ టెస్ట్,అడ్వాన్స్‌డ్ టెస్ట్,స్కిల్ టెస్ట్,ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అమరావతి, గుంటూరు, హైదరాబాద్, కరీంనగర్, విజయవాడ, విశాఖపట్నం.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:24.04.2023.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:22.05.2023.
» వెబ్‌సైట్: www.barc.gov.in

ఈఎస్ఐసీ, హైదరాబాద్‌లో 40 మెడికల్ స్టాఫ్ పోస్టులు

హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ).. మెడికల్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 40
» పోస్టుల వివరాలు: సూపర్ స్పెషలిస్ట్, సీనియర్ కన్సల్టెంట్, సీనియర్ రెసిడెంట్ తదితరాలు.
» విభాగాలు: రేడియాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, కార్డియాలజీ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎంబీబీఎస్/పీజీ డిగ్రీ/పీజీ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 45 నుంచి 69 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.67,700 నుంచి రూ.2.4 లక్షలు చెల్లిస్తారు. » ఎంపిక విధానం: ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఇంటర్వ్యూ వేదిక: చాంబర్ ఆఫ్ మెడికల్ సూపరింటెండెంట్, ఈఎస్ఐసీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, సనత్‌నగర్, హైదరాబాద్.
» ఇంటర్వ్యూ తేది: 25.04.2023 నుంచి 28.04.2023
» వెబ్‌సైట్: www.esic.gov.in

బీఈఎంఎల్, బెంగళూరులో 69 ఉద్యోగాలు

బెంగళూరులోని బీఈఎంఎల్ లిమిటెడ్.. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 69
» పోస్టుల వివరాలు: హెడ్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్–01, స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ గ్రూప్ ఏ, గ్రూప్ బీ, గ్రూప్ సీ–68.
» దరఖాస్తు ప్రారంభతేది: 14.04.2023 నుంచి
» వెబ్‌సైట్: www.bemlindia.in

నిఫ్ట్, హైదరాబాద్‌లో 11 గ్రూప్ సీ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్).. శాశ్వత ప్రాతిపదికన గ్రూప్ సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 11
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ వార్డెన్(మహిళ)–02, నర్సు(మహిళ)–01, అసిస్టెంట్(ఫైనాన్షియల్ అండ్ అకౌంట్స్)–02, జూనియర్ అసిస్టెంట్–02, ల్యాబ్ అసిస్టెంట్–03, లైబ్రరీ అసిస్టెంట్–01.
» అర్హత: పోస్టును అనుసరించి 10+2/డిప్లొమా/ఐటీఐ/బీఎస్సీ/బ్యాచిలర్స్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» పని అనుభవం: కనీసం 6 నెలలు నుంచి 5 ఏళ్ల పని అనుభవం ఉండాలి.
» వయసు: 27 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: ప్రాక్టికల్ టెస్ట్/స్కిల్ టెస్ట్, రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తులకు చివరితేది: 30.04.2023.
» వెబ్‌సైట్: www.nift.ac.in

టీఎస్ ఎన్‌పీడీసీఎల్‌లో కొలువులు

» జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు
» 100 పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల

వరంగల్ కేంద్రంగా పనిచేస్తున్న ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీఎల్)లో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. రెగ్యులర్ ప్రాతిపదికన రిక్రూట్‌మెంట్ చేపట్టనున్నారు. ఆ వివరాలు..

ఈ సర్కిళ్లలోనే పోస్టుల భర్తీ

వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ విద్యుత్ సర్కిళ్లలో 100 పోస్టులను భర్తీ చేయనున్నారు.

అర్హతలు: బీఏ/బీఎస్సీ/బీకామ్‌తోపాటు కంప్యూటర్ అప్లికేషన్/ఆఫీస్ ఆటోమేషన్(ఎంఎస్ ఆఫీస్) సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణులైన వారు ఈ పోస్టులకు అర్హులు.

వయసు: 01.01.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ట వయసులో ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు, ఎక్స్–సర్వీస్‌మెన్‌లకు 3ఏళ్ల సడలింపు ఉంటుంది. ఇప్పటికే టీఎస్ ట్రాన్స్‌కో /టీఎస్ఎస్పీడీసీఎల్/టీఎస్ఎన్‌పీడీసీఎల్ పనిచేస్తున్న ఉద్యోగులూ దరఖాస్తు చేసుకోవచ్చు. వీరి విషయంలో ఉద్యోగంలో చేరినప్పటి వయసును పరిగణనలోకి తీసుకుంటారు. వీరు నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

ఎంపిక ఇలా: రాత పరీక్షలో సాధించిన మార్కులు, అనుభవం, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష ఇలా: ఓఎంఆర్‌షీట్ పద్ధతిలో ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్షను నిర్వహిస్తారు. దీంట్లో మొత్తం మూడు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్–ఎలో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, సెక్షన్–బిలో కంప్యూటర్ అవేర్‌నెస్‌కు చెందిన 20 ప్రశ్నలు–20 మార్కులు, సెక్షన్–సిలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ అండ్ జనరల్ నాలెడ్జ్ 20 ప్రశ్నలు–20 మార్కులుంటాయి. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్ష సమయం 2 గంటలు.

కనీస మార్కులు: బీసీలకు 35శాతం,ఎస్సీ/ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు 30% రావాలి. రాత పరీక్షను హైదరాబాద్ జీహెచ్ఎంసీ,వరంగల్ జీడబ్ల్యూఎంసీ పరిధిలోని వివిధ కేంద్రాల్లో నిర్వహిస్తారు.

సిలబస్ అంశాలు

సెక్షన్–ఎ: న్యూమరికల్ ఎబిలిటీలోని.. ఇండిసెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, ప్రాఫిట్ అండ్ లాస్, మెన్సురేషన్, ఆల్జీబ్రా, జామెట్రీ అండ్ స్టాటిస్టిక్స్ ఉంటాయి. ఇవేకాకుండా లాజికల్ రీజనింగ్ అండ్ డెసిషన్ మేకింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

సెక్షన్–బి: కంప్యూటర్ అవేర్‌నెస్‌లో.. ఎంఎస్–ఆఫీస్, బేసిక్ కాన్సెప్ట్ ఆఫ్ కంప్యూటర్స్ , కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ స్కిల్స్, అకౌంట్స్ రిలేటెడ్ సాఫ్ట్‌వేర్ అంశాలు ఉంటాయి.



సెక్షన్–సి: ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ, కాంప్రహెన్షన్ పాసేజెస్ అండ్ రీ అరెంజ్‌మెంట్ ఆఫ్ సెంటెన్సెస్, సిననిమ్స్ అండ్ యాంటనిమ్స్ ఉంటాయి.

జనరల్ నాలెడ్జ్: ఈ విభాగానికి సంబంధించి కరెంట్ అఫైర్స్, కన్స్యూమర్ రిలేషన్స్, జనరల్ సైన్స్ ఇన్ ఎవ్రీడే లైఫ్, ఎన్విరాన్‌మెంటల్ ఇష్యూస్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ ఆఫ్ ఇండియా, తెలంగాణ చరిత్ర, ఉద్యమం, తెలంగాణ సమాజం, సంస్కృతి, వారసత్వ సంపద, కళలు, సాహిత్యం తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

వెయిటేజీ ఇలా: ప్రశ్నపత్రం 80 మార్కులకు, ఇన్ సర్వీస్ వెయిటేజీ మార్కులు 20 ఉంటాయి. ఉద్యోగ ప్రకటన జారీ నాటికి టీఎస్ ట్రాన్స్‌కో/టీఎస్ఎస్పీడీసీఎల్/ టీఎస్ఎన్‌పీడీసీఎల్‌లో పనిచేస్తున్నవారికి వెయిటేజీ మార్కులు ఉంటాయి. ఆరు నెలలకు ఒక మార్కు చొప్పున ఇస్తారు. రాత పరీక్షలో సాధించిన మార్కులకు వీటిని కలుపుతారు. ఆరు నెలల కంటే తక్కువ సర్వీస్ ఉన్నవారికి వెయిటేజీ మార్కుల నిబంధన వర్తించదు. వివిధ కేటగిరిలకు చెందిన అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం–రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈడబ్ల్యూఎస్‌లకు 10శాతం, బీసీలకు–25 శాతం,ఎస్సీలకు 15 శాతం,ఎస్టీలకు 10శాతం, పీహెచ్‌లకు 4శాతం, ఎక్స్–సర్వీస్‌మెన్‌కు 2 శాతం, మహిళలకు 33 1/3 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ప్రొబేషన్: ఎంపికైన అభ్యర్థులకు రెండేళ్ల కాలానికి ట్రెనింగ్ కమ్ ప్రొబేషన్ ఉంటుంది. విధుల్లో చేరే సమయంలో ఎస్ఎస్‌సీ, డిగ్రీ, క్యాస్ట్ అండ్ స్టడీ /రెసిడెన్స్ ఒరిజినల్ సర్టిఫికేట్లను సమర్పించాల్సి ఉంటుంది. ఉద్యోగంలో చేరే సమయంలో ఐదేళ్లకు (ప్రొబేషన్‌కు అదనంగా) బాండ్ రాయాలి.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 29.04.2023
- దరఖాస్తు సవరణ తేదీలు: 2023. మే 02 –05 తేదీ వరకు
- వెబ్‌సైట్: https://tsnpdcl.cgg.gov.in

ఎయిమ్స్‌లో నర్సింగ్ ఆఫీసర్

» 3055 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

నర్సింగ్ పూర్తిచేసిన అభ్యర్థులకు దేశంలోని ప్రముఖ వైద్యసంస్థలైన ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)ల్లో సువర్ణ అవకాశం. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎయిమ్స్ సంస్థల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో భాగంగా మొత్తం 3055 నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం కోర్సులు పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా నియామకాలు ఉంటాయి. ఎయిమ్స్‌ల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల వివరాలు..

- మొత్తం పోస్టులు: నర్సింగ్ ఆఫీసర్ 3055

సంస్థల వారీగా ఖాళీల వివరాలు

ఎయిమ్స్ భటిండా–142, ఎయిమ్స్ భోపాల్–51, ఎయిమ్స్ భువనేశ్వర్–169, ఎయిమ్స్ బీబీనగర్–150, ఎయిమ్స్ బిలాస్‌పూర్–178, ఎయిమ్స్ దేవ్‌ఘర్–100, ఎయిమ్స్ గోరఖ్‌పూర్–121, ఎయిమ్స్ జోధ్‌పూర్–300, ఎయిమ్స్ కల్యాణి–24, ఎయిమ్స్ మంగళగిరి–117, ఎయిమ్స్ నాగ్‌పూర్–87, ఎయిమ్స్ రాయ్ బరేలీ–77, ఎయిమ్స్ న్యూఢిల్లీ–620, ఎయిమ్స్ పట్నా–200, ఎయిమ్స్ రాయ్‌పూర్–150, ఎయిమ్స్ రాజ్‌కోట్–100, ఎయిమ్స్ రిషికేష్–289, ఎయిమ్స్ విజయ్‌పూర్–180.

అర్హత: డిప్లొమా(జీఎన్ఎం)తోపాటు రెండేళ్ల పని అనుభవం లేదా బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్ /బీఎస్సీ నర్సింగ్/బీఎస్సీ(పోస్ట్ సర్టిఫికేట్)/పోస్ట్–బేసిక్ నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలి. స్టేట్/ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్సులుగా రిజిస్టరై ఉండాలి.

వయసు: వయసు 18–30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్లు, ఎక్స్–సర్వీస్‌మెన్‌లకు అయిదేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. **వేతనం:** నర్సింగ్ ఆఫీసర్ కొలువుకు ఎంపికైన వారికి పేస్కేల్ లెవల్ 7 ప్రకారం–వేతనాలు చెల్లిస్తారు. వీరు ప్రతి నెల రూ.44,900 మూల వేతనంగా పొందుతారు.దీనికి డీఏ,హెచ్ఆర్ఏ అదనంగా ఉంటాయి.

ఎంపిక ఇలా

నర్సింగ్ ఆఫీసర్స్ రిక్రూట్‌మెంట్ కామన్ ఎలిజిబిలిటీ టెస్టు(ఎన్ఓఆర్‌సెట్)లో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఆయా పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ పరీక్షలో సాధించిన స్కోరు ఆరు నెలలు లేదా తర్వాత పరీక్ష వరకు చెల్లుబాటు అవుతుంది. ఈ వ్యవధిలో కొత్తగా ఖాళీలు ఏర్పడితే ఈ స్కోరు ఆధారంగానే భర్తీ చేస్తారు. మొత్తం ఖాళీల్లో 80 శాతం మహిళలకు, 20 శాతం పురుషులకు కేటాయించారు. ఎన్ఓఆర్‌సెట్ అర్హత సాధించిన వారికి సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిర్వహించి అనంతరం మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం పోస్టులను భర్తీచేస్తారు. ఇలా కొలువులో చేరిన వారిని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తారు.

పరీక్ష విధానం

ఎన్ఓఆర్‌సెట్‌ను ఆబ్జెక్టివ్ విధానంలో 200 ప్రశ్నలకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. మొత్తం ప్రశ్నల్లో 180 సబ్జెక్టుకు సంబంధించినవి కాగా, మిగిలిన 20 ప్రశ్నలు జనరల్ నాలెడ్జ్, ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి వస్తాయి. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు కేటాయిస్తారు. అలాగే తప్పు సమాధానానికి మార్కులో మూడోవంతు తగ్గిస్తారు. ఈ పరీక్షలో కనీస అర్హత మార్కులు సాధించడం తప్పనిసరి.



అర్హత మార్కులు: జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 50శాతం, ఓబీసీలు–45 శాతం, ఎస్సీ/ఎస్టీలు 40శాతం అర్హత మార్కులుగా సాధించాలి. దివ్యాంగులకు వారి కేటగిరిని అనుసరించి 5 శాతం మార్కుల సడలింపు లభిస్తుంది.

సిలబస్: ఈ పరీక్షలో సబ్జెక్టు విభాగంలో అడిగే ప్రశ్నలు బీఎస్సీ నర్సింగ్ సిలబస్ నుంచే ఉంటాయి.కాబట్టి అభ్యర్థులు నాలుగేళ్ల బీఎస్సీ సిలబస్‌ను క్షుణ్నంగా చదవాలి. అలాగే గతంలో నిర్వహించిన పరీక్ష పత్రాలను,ఎమ్మెస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను సాధన చేయాలి.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 05.05.2023
- సీబీటీ పరీక్ష తేది: 03.06.2023
- వెబ్‌సైట్: https://norcet4.aiimsexams.ac.in

'ఏపీ భవన్ విభజన' వాయిదా

- అసంపూర్తిగా ఢిల్లీ సమావేశం
- వారం తర్వాత మరోసారి భేటీకి నిర్ణయం

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఏపీభవన్, తెలంగాణభవన్‌ల విభజనపై ఏర్పాటు చేసిన కీలక సమావేశం మరోసారి అసంపూర్తిగా ముగిసింది. ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వారం తర్వాత మరోసారి సమావేశం కావాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. కేంద్ర హోంశాఖ పరిధిలోని కేంద్ర రాష్ట్రాల విభాగం జాయింట్ సెక్రెటరీ సంజీవ్‌కుమార్ జిందాల్ అధ్యక్షతన బుధవారం సుమారు 30 నిమిషాలపాటు కీలక సమావేశం జరిగింది. ఏపీ ప్రభుత్వం తరఫున ఉన్నతాధికారులు ఆదిత్యనాథ్ దాస్, ప్రేమచంద్రారెడ్డి, రావత్ , హిమాన్షు కౌశిక్, తెలంగాణ ప్రభుత్వం తరఫున ఉన్నతాధికారులు రామకృష్ణారావు, గౌరవ్ ఉప్పల్ హాజరయ్యారు. ఏపీభవన్ విభజనపై అధికారులు మూడు ప్రతిపాదనలు సిద్ధం చేశారని, తాజాగా మరికొన్ని ప్రతిపాదనలు రావడంతో అధికారుల మధ్య ఏకాభిప్రాయం రాలేదని సమాచారం. ప్రస్తుతం 58:42 నిష్పత్తిలో గదుల విభజన ద్వారా తొమ్మిదేళ్లుగా ఒకే ప్రాంగణంలో ఏపీ, తెలంగాణ భవన్లు నిర్వహిస్తున్నారు. ఢిల్లీ నడిబొడ్డున ఉన్న ఇండియా గేట్ పక్కన 20 ఎకరాల్లో రెండు రాష్ట్రాలకు కలిపి ఉమ్మడిగా రూ.7 వేల కోట్ల ఆస్తి ఉండగా, విభజన చట్టం ప్రకారం ఏపీకి 58 శాతం, తెలంగాణకు 42 శాతం వాటా రావాల్సిన విషయం తెలిసిందే.

సత్వరమే కొత్త వ్యవసాయ కనెక్షన్లు

అధికారంలోకి రాగానే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై పరిమితిని ఎత్తేసిన ప్రభుత్వం

- దరఖాస్తు చేసి అంచనా వ్యయం చెల్లించిన రైతులందరికీ కొత్త కనెక్షన్లు
- ఒక్క ఏపీసీపీడీసీఎల్ పరిధిలోనే 84,085 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు
- 101 కొత్త 33/11 కేవీఏ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్ సరఫరా
- ఈ వాస్తవాలను వదిలి 'కొత్త కనెక్షన్లు గగనమే!' శీర్షికతో ఈనాడు తప్పుడు కథనం



ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: ఇది రైతు ప్రభుత్వం.. రైతే రాజనే ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు రైతుల సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్నాయి. అయితే దీన్ని తట్టుకోలేని పచ్చ పత్రిక ఈనాడు కట్టుకథ అల్లింది. వైఎస్సార్‌సీపీ 2019లో అధికారంలోకి రాగానే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై పరిమితిని ఎత్తివేసింది. ఈ నిజాన్ని దాచిపెట్టి 'కొత్త కనెక్షన్లు గగనమే' శీర్షికతో ఈనాడు దినపత్రిక బుధవారం తప్పుడు వార్తను ప్రచురించింది. ఈ వార్తలో వాస్తవం లేదని ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) సీఎండీ జె.పద్మజనార్దనరెడ్డి స్పష్టం చేశారు. సీఎండీ వెల్లడించిన వాస్తవాలిలా ఉన్నాయి..

ఆరోపణ: మైలవరం పంచాయతీకి చెందిన రైతు వెంకటరెడ్డి తన చేనుకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం మూడేళ్ల క్రితం ఒకసారి, ఆరేడు నెలల క్రితం మరోసారి దరఖాస్తు చేశాడు. అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నా చేయలేదు. ఆరు నెలలుగా ఆన్‌లైన్ సేవలను నిలిపివేశారు.

వాస్తవం: ప్రతిపాదనలు రూపొందించడంలో జాప్యం వల్ల విద్యుత్ సర్వీసు మంజూరు కాలేదన్నది పచ్చి అబద్ధం. ప్రాధాన్యతా క్రమంలో అంచనా వ్యయాన్ని రూపొందిస్తున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను కొద్ది రోజులు నిలిపేయడం సర్వసాధారణం. నిజానికి ఫిబ్రవరి వరకూ అంచనా వ్యయం చెల్లించిన వాటన్నిటికీ విద్యుత్ సర్వీసులు మంజూరు చేశారు. మరో వారంలో కొత్తగా ఆన్‌లైన్ నమోదు మళ్లీ మొదలవుతుంది. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ.

ఆరోపణ: దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ విద్యుత్ లైను, ట్రాన్స్‌ఫార్మర్లు యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు గతేడాది ప్రకటించారు. చాలావరకు గత అర్జీలను పరిష్కరించి అంతకుముందు వరకూ ఆమోదంలో ఉన్న వారికి సర్వీసులు మంజూరు చేశారు. కొత్తగా దరఖాస్తులు పెట్టుకోవచ్చని పేర్కొన్నా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

వాస్తవం: చెప్పినట్లుగానే దరఖాస్తుదారులకు సర్వీసులు మంజూరు చేశారని ఈనాడే రాసింది. 2019 వరకు ప్రతి జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పరిమితికి మించి మంజూరు చేసుకునే అవకాశం ఉండేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ పరిమితిని సవరించి దరఖాస్తుదారులందరికీ సత్వరమే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని ఆదేశించింది. కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని తదనుగుణంగా అంచనా వ్యయం చెల్లించే అవకాశం ఉంది. విద్యుత్ నియంత్రికలు, స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేసి ఎప్పటి కనెక్షన్లను అప్పుడే మంజూరు చేసి విద్యుత్ సరఫరా అందిస్తున్నారు.

ఆరోపణ: ఏడాది వయసున్న మామిడి మొక్కలను కాపాడుకోవడానికి మోటారు తప్పనిసరి కావడంతో ప్రభుత్వ దయాదాక్షిణ్యాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇది ఆ ఒక్క రైతు పరిస్థితే కాదు. జిల్లావ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్న వేలాది కర్షకుల దుస్థితి.

వాస్తవం: ఏపీసీపీడీసీఎల్ 2019లో ఏర్పాటైనప్పటికీ.. 2014 నుంచి ఇప్పటివరకు అంచనా వ్యయం చెల్లించినవారందరికీ పరిమితి లేకుండా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేసింది. ఇలా పెండింగ్‌లో ఉన్న 84,085 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను ఇచ్చింది. కనెక్షన్లకు సంబంధించి విద్యుత్ స్తంభాలు, వైర్లు, విద్యుత్ నియంత్రికలను కూడా ఏర్పాటు చేసి రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పగటిపూటే తొమ్మిది గంటలపాటు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది. దీనికి అనుగుణంగా వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు హై ఓల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం (హెచ్‌వీడీఎస్) పథకం కింద 16 కేవీఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 25 కేవీఏ సామర్థ్యం గల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తోంది. 101 కొత్త 33/11 కేవీఏ సబ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయడంతో వ్యవసాయ మోటార్లు కాలిపోవడం, రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడటం వంటివి తగ్గిపోయాయి.

వైద్య, ఆరోగ్య శాఖలో ఒక్క పోస్టు ఖాళీ ఉంచవద్దు

- డీఎంహెచ్‌వోలు, ఆర్డీలకు ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ ఆదేశాలు

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలోని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం పరిధిలోని ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండటానికి వీల్లేకుండా డీఎంహెచ్‌వోలు, రీజినల్ డైరెక్టర్‌లు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా, జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి నోటిఫికేషన్‌లు జారీ చేసి భర్తీ చేపట్టడానికి పరిపాలన అనుమతులిచ్చారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి అనుమతులు తీసుకునే పనిలేకుండా తమ స్థాయిలోనే పోస్టులను నోటిఫై చేసుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో మానవ వనరులు ఉండటం కీలకమని చెప్పారు. ఈ క్రమంలో ఏదైనా ఆస్పత్రిలో క్యాడర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లైతే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో విచారణలు చేపట్టండి

- కేంద్ర సమాచార కమిషనర్ సమారియా సూచన

సాక్షి, అమరావతి: పౌరులకు సులభతరమైన సేవలను అందించే విధంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణలు చేపట్టాలని కేంద్ర సమాచార కమిషనర్ సమారియా హీరాలాల్ అధికారులకు సూచించారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా ఏపీ సమాచార కమిషనర్ కార్యాలయాన్ని సమారియా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా విచారణలు స్వీకరించడం వల్ల అప్పీలుదారులు, ఫిర్యాదుదారులు, పీఐవోలు, ప్రథమ అప్పీలు అధికారులకు వ్యయ ప్రయాసలు తగ్గుతాయన్నారు. అలాగే ప్రభుత్వంపై భారాన్ని తగ్గించే విధంగా సొంత భవనాన్ని సమకూర్చుకోవాలని రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఆర్ఎం బాషాకు సూచించారు.

బీఏ (ఓఎల్) విద్యార్థులకు బీఈడీ అవకాశం

ఏయూ క్యాంపస్: బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఎడ్‌సెట్ 2023కు బీఏ (ఓఎల్) కోర్సు పూర్తి చేసిన వారికి సోషల్ స్టడీస్ మెథడాలజీలో అర్హత కల్పిస్తున్నట్లు ఎడ్‌సెట్ కన్వీనర్ ఆచార్య కె.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఎడ్‌సెట్ షెడ్యూల్‌లో మార్పులు చేశామని,అర్హులైనవారు మే 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రూ.1,000 అపరాధ రుసుముతో మే 22 వరకు, రూ.2,000 అపరాధ రుసుముతో మే 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులో తప్పులను మే 26 నుంచి 30 వరకు సరిచేసుకోవచ్చన్నారు. హాల్ టికెట్లను జూన్ 2 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. జూన్ 14న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ప్రణాళికాయుతంగా పోలవరం పనులు

- పీపీఏ, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులకు సీడబ్ల్యూసీ చైర్మన్ దిశానిర్దేశం
- పనుల ప్రగతిపై వర్చువల్‌గా సమీక్ష

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనులను ప్రణాళికాయుతంగా వేగంగా పూర్తిచేయాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టు పనుల ప్రగతిపై ఆయన బుధవారం పీపీఏ సీఈవో శివ్‌నందన్‌కుమార్, రాష్ట్ర జలవనరుల శాఖ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, పోలవరం సీఈ సుధాకర్‌బాబు, ఎస్ఈ నరసింహమూర్తిలతో వర్చువల్‌గా సమీక్షించారు. పనుల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈఎన్‌సీ నారాయణరెడ్డి, సీఈ సుధాకర్‌బాబు వివరించారు. షెడ్యూలు ప్రకారమే పనులు జరుగుతున్నాయని సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా సంతృప్తి వ్యక్తం చేశారు. గోదావరికి వరద వచ్చేలోగా ఎగువ కాఫర్ డ్యామ్ లీకేజీలపై మరోసారి అధ్యయనం చేసి.. పరిమితికి మించి లీకేజీలు ఉంటే అడ్డుకట్ట వేసే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో గోదావరి వరదల ఉద్ధృతికి ఏర్పడిన అగాధాలను, కోతకు గురైన ప్రాంతాలను పూడ్చటం, వైబ్రో కాంపాక్షన్ ద్వారా యథాస్థితికి తెచ్చే పనులు, డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న ప్రదేశాల్లో కొత్తగా సమాంతరంగా 'యు' ఆకారంలో డయాఫ్రమ్ వాల్ నిర్మించి పాతదానితో అనుసంధానం చేసే పనులకు రూ.2,022 కోట్లతో టెండర్ పిలిచామని ఈఎన్‌సీ నారాయణరెడ్డి వివరించారు. ఆ టెండర్‌ను త్వరితగతిన ఖరారు చేసి జూన్‌లోగా పనులు పూర్తిచేయాలని సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా ఆదేశించారు. ఇందుకు సంబంధించిన డిజైన్లను త్వరగా అందజేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులను కోరారు. పోలవరం ప్రాజెక్టును తొలిదశలో 41.15 మీటర్లు, రెండోదశలో 45.72 మీటర్లకు పూర్తిచేయడానికి ఎంతకాలం పడుతుందో వాస్తవికంగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని పీపీఏ, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులను సీడబ్ల్యూసీ చైర్మన్ ఆదేశించారు. తొలిదశ పూర్తిచేయడానికి సుమారు రూ.11,500 కోట్లు వ్యయం అవుతుందని, ఆ నిధులను త్వరితగతిన విడుదల చేస్తే సత్వరమే పోలవరాన్ని పూర్తిచేయడానికి అవకాశం ఉంటుందని ఈఎన్‌సీ నారాయణరెడ్డి చేసిన ప్రతిపాదనపై వోరా సానుకూలంగా స్పందించారు. పీపీఏ అధికారులతో చర్చించి తొలిదశ పనులు పూర్తిచేయడానికి అవసరమైన నిధులు, యాక్షన్ ప్లాన్‌పై నివేదిక ఇవ్వాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో బీసీలకు పెద్దపీట

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కృష్ణయ్య



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

పాత గుంటూరు/నరసరావుపేట: రాష్ట్రంలో బీసీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వారి సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బుధవారం స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కృష్ణయ్య మాట్లాడుతూ.. మాటలు చెప్పే నాయకుడిలా కాకుండా ఎన్నికలకు ముందుఅన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేస్తూ సీఎం జగన్ ప్రజల గుండెల్లో చొచ్చుకుపోయారన్నారు. రాష్ట్రంలో 18 మంది ఎమ్మెల్సీలు ఉంటే.. 11 ఎమ్మెల్సీలు బీసీలకు ఇచ్చారన్నారు. పార్లమెంట్‌లో మొదటిసారి బీసీ బిల్లు పెట్టిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. చంద్రబాబు, లోకేశ్ ఉనికి కోసమే సభలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఎవరు మంచి చేస్తారో వారిని అక్కున చేర్చుకుంటారని, ఆ స్థానం సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మన రాష్ట్రంలో ఉన్న పథకాలను దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అమలుచేస్తే బీసీల అభివృద్ధి బాగుంటుందని అన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఆ పథకాలను సద్వినియోగపరుచుకుని ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు నాని అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వెంగళరావు, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్, సంఘం జాతీయ కన్వీనర్ సి.రాజేందర్ పాల్గొన్నారు.

బీసీ భవన్ కోసం రూ.25 లక్షల సహాయం

నరసరావుపేటలోని కలెక్టరేట్ సమీపంలో నిర్మించే సావిత్రిబాయి మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ భవన్ నిర్మాణం కోసం రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య రూ.25 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. స్థానిక బీసీ నాయకులు కృష్ణయ్యకు బీసీ భవన్ నిర్మాణం విషయాల్ని తెలియజేయగా.. కృష్ణయ్య రూ.25 లక్షలు ప్రకటించారు. కృష్ణయ్యను కలిసిన వారిలో ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్ ఈఎం స్వామి, నరసరావుపేట పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు అచ్చి శివకోటి, మాజీ కౌన్సిలర్లు కారుమంచి మీరావలి, మాడిశెట్టి మోహనరావు, మర్రిపూడి రాంబాబు, తోట వీరయ్య ఉన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.